AduA103B105

శ్రీరస్తు.

# చాటుపద్యమణిమంజరి.

వేటూరి ప్రభాకరశాస్త్రిగారిచే సంపాదితము.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.
10569

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10569

SRI VENKATESWAR
YAN BOOK DEPOT (REGD)
House No. 5/356 Oil Street,
RAJAHMUNDRY. (ANDHR

చెన్నపురి:

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారిచేఁ

ప్రకటితము.

1924.

All Rights Reserved.

894.8271
PRA

Printed
at the 'VAVILLA' Press,
Madras—1924.

# మొదటికూర్పు.

## తొలిపలుకు.

తీరుతీయములు గల భాషావాహినియందు సుకవులకవితామృతము ప్రబంధరూపమునన కాక చాటురూపమునను జాలువాఱును. వీనులకు విందులై డెందమును దనుపార్చుచుఁ జాటురచనము లొక్కొకయెడఁ బ్రబంధరచనముల నయితము మీఱియుండునని చెప్పుట భాషావేదుల కనుభవపునరుక్తమగును. గ్రంథములుగా నేర్పడమిచేఁదొల్లింటియాంధ్రకవీశ్వరులు రచించిన చాటుపద్యము లెన్నెని యునికితప్పినవి పరంపరాగతములగుచుఁ గొన్ని పల్లెటూళ్లలో ముదుసళ్లనోళ్లయందును మఱికొన్ని పురువులకు భుక్తులువెట్టుప్రాచీనతాళపత్రసంపుటములందును జీర్ణించుచున్నవి. ఇంపారు నిట్టిపద్యముల సంపాదించి గ్రంథరూపమున వెల్వరింపఁ దలంపుగొని యెఱిఁగినవారినెల్ల నడిగియుదొరకినతాళపత్రసంపుటమెల్లఁబరిశీలించియు నానాఁటఁ గొన్నిచాటువులఁ గూర్చితిని. హైందవసారస్వతమునకు గని యనఁదగు చెన్నపురపు లిఖితపుస్తకభాండాగారము పెక్కుపద్యరత్నముల నొసఁగినది. మఱికొన్నిముద్రితగ్రంథములనుండియు సేకరించితిని. రాజులనుగూర్చి రాజమంత్రులనుగూర్చి కవీశ్వరులనుగూర్చి, నీతి శృంగార హాస్యాది విషయములం దింక ననేకవిషయములందుఁ బలుతెఱఁగుల

సమకూర్చినపద్యములలోఁ జెక్కింటి నేఁటికాలపుమర్యాద నతి క్రమింపకుండ సవరించియు వీడనాడియు రత్నములనఁ దగిన వాని కథాసందర్భములఁ జేర్చి గ్రంథరూపమునసమకూర్చితిని. శృంగారవిషయముమిక్కిలిమెలఁకువతో నిర్దుష్టపఱిచితిని.కొన్ని పద్యములు సందిగ్ధార్థములయినను జరిత్రకారులకుఁ జిక్కుకల్గు నని మార్పుసేయకయ ముద్రించితిని. నేఁటికవులచాటువులఁ జేర్చ కొనలేదు. ప్రాచీనకృతులందలిపద్యము లేవేని యిందుఁ జేరిన చో గుర్తింపలేని నాయపరిజ్ఞానమును క్షమింప వేఁడెదను. కొన్ని శతకములందలిపద్యము లిందుఁ జేర్చితిని.ప్రాచీనములగు నాశతకము లిప్పుడు కొన్ని దుర్లభములు. సహృదయులకియ్యది యింపు నింపు ననియే నాతలంపు.

---

# రెండవకూర్పు.

ఈకూర్పున నెన్నో క్రొత్తపద్యములఁ జేర్చితిని, మార్చితిని. గ్రంథముద్రణాధికారమును చెన్నపురి : వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారి కిచ్చితిని.

చెన్నపురి :
31-7-1917.

వేటూరి. ప్రభాకరశాస్త్రి.

V

# విషయసూచిక.

---


| విషయము. | | పుట. |
|---|---|---|
| శ్రీనారాయణస్తుతి | ... | 1 |
| కృష్ణస్తుతి | ... | ,, |
| త్రిమూర్తిస్తుతి | ... | ,, |
| శ్రీరంగనాథస్తుతి | ... | ,, |
| వినాయకస్తుతి | ... | 2 |
| దిక్పాలస్తుతి | ... | ,, |
| శివస్తుతి | ... | ,, |
| మృడునిఁ గనుఁగొంటి | ... | 3 |
| గునుగు సీసములు (దశావతార స్తవము) | ... | 7 |
| మత్స్యావతారము | ... | 13 |
| కూర్మావతారము | ... | ,, |
| వరాహావతారము | ... | 14 |
| నరసింహావతారము | ... | ,, |
| వామనావతారము | ... | ,, |
| పరశురామావతారము | ... | ,, |
| శ్రీరామావతారము | ... | ,, |
| బలరామావతారము | ... | 15 |
| శ్రీకృష్ణావతారము | ... | ,, |
| బౌద్ధావతారము | ... | ,, |
| కల్క్యవతారము | ... | ,, |
| షట్చక్రవర్తులు | ... | 19 |
| రణతిక్కన-నెల్లూరుపురము | ... | 22 |
| సిద్ధయ తిక్కన | ... | 27 |

| విషయము. | | పుట. |
|---|---|---|
| నెల్లూరు | ... | 28 |
| రెడ్డిరాజులు | ... | 31 |
| అనవేమనృపాలుఁడు | ... | 32 |
| కాటయ వేమన | ... | 33 |
| కోమటి వేమన | ... | ,, |
| సాళువగుండ నరసింహరాయలు | ... | 34 |
| నవరత్నములు | ... | 35 |
| రాజపద్ధతి | ... | 39 |
| కోశపద్ధతి | ... | 40 |
| రాష్ట్రపద్ధతి | ... | ,, |
| దుర్గపద్ధతి | ... | ,, |
| బలపద్ధతి | ... | 41 |
| మల్కిభరామ్ | ... | ,, |
| మైసూరి చిక్కదేవరాయలు | ... | 46 |
| కోటరాయరఘునాథరాయలు (తురంగపంచకము) | ... | 54 |
| వెలుగోటివారు | ... | 57 |
| పోలెపల్లి బుక్కరాయలు | ... | 61 |
| తంజావూరి విజయరాఘవరాయలు | ... | 63 |
| మట్లవారు | ... | 65 |
| అద్దంకి నృపాలురు | ... | ,, |
| వత్సవాయవారు | ... | 66 |
| వాసిరెడ్డి వేంకటాద్రినాయుఁడుగారు | ... | ,, |
| సి. పి. బ్రౌన్దొరగారు | ... | 69 |
| సిద్ధయామాత్యుఁడు | ... | 70 |
| ద్వాత్రింశన్మంత్రులు | ... | 71 |
| భాస్కరుఁడు | ... | 75 |
| భాస్కరనూతి కొండమంత్రి | ... | 86 |

| విషయము. | | పుట. |
|---|---|---|
| రామలింగభాస్కరుఁడు | ... | 87 |
| గోపరాజు రామప్రధానుఁడు | ... | 89 |
| ఆక్షేపము | ... | 90 |
| కరణము మల్లన | ... | 91 |
| బండారు కేతనమంత్రి | ... | 92 |
| సీదయాయాచమంత్రి | ... | ,, |
| కోటసింగరాజు | ... | ,, |
| నిట్టల హరిహరప్ప | ... | 95 |
| కొట్టరువు-ఎఱ్ఱమంత్రి | ... | ,, |
| గుండమంత్రి | ... | 96 |
| సింగనమంత్రి మాచఁడు | ... | ,, |
| సాహిణ మారన | ... | 100 |
| పెమ్మయసింగరాజు | ... | 101 |
| నందూరిగుండమంత్రి | ... | 103 |
| తిమ్మరుసు | ... | ,, |
| చేమకూర అప్పరాజు | ... | 105 |
| విట్ఠల వెఱ్ఱమంత్రి | ... | 106 |
| గుంటుపల్లి ముత్తరాజు | ... | ,, |
| గుంటుపల్లి నరసింగమంత్రి | ... | 108 |
| నంది సింగన | ... | ,, |
| కటికి కామన్నమంత్రి | ... | 109 |
| కోటిపల్లి శరభరాజు | ... | 110 |
| వేములవాడ భీమకవి | ... | ,, |
| కవిసార్వభౌముఁడు శ్రీనాథుఁడు | ... | 115 |
| బమ్మెర పోతన | ... | 139 |
| వెల్లంకితాతంభట్టు | ... | 140 |
| పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి | ... | 141 |
| తెనాలి రామకృష్ణకవి | ... | 142 |
| కృష్ణదేవరాయలు | ... | [illegible] |

| విషయము. | | పుట. |
|---|---|---|
| తురగారామకవి | ... | 163 |
| నృసింహభారతి | ... | 164 |
| పింగళిసూరకవి | ... | 165 |
| అడిదము సూరకవి | ... | ,, |
| అహోబలపండితుఁడు | ... | 173 |
| భృంగపంచకము | ... | 175 |
| కందుకూరి జనార్దనాష్టకము | ... | 177 |
| వలపు | ... | 178 |
| శృంగారము | ... | ,, |
| పొడుపుఁబద్యాలు | ... | 187 |
| సమస్య | ... | 188 |
| చలి | ... | ,, |
| వేసఁగిని మందమారుతము లేమి | ... | 189 |
| పోగాకు | ... | ,, |
| మూషకచక్రవర్తి | ... | 190 |
| మార్జాలచక్రవర్తి | ... | 193 |
| పుల్లకవి | ... | ,, |
| రాజ్యతంత్రము | ... | 196 |
| అష్టకష్టములు | ... | 198 |
| గువ్వలచెన్నని పద్యములు | ... | 200 |
| శరభాంకలింగమా | ... | 203 |
| భైరవా | ... | 204 |
| అత్తింటి కోడలు | ... | 206 |
| నియోగులు | ... | 207 |
| భారతకథనుగూర్చి చాటువులు | ... | 2 9 |
| పాండవుల వర్తనము | ... | 212 |
| ఈశ్వరాజ్ఞ | ... | 213 |
| తెలుఁగుభారతము | ... | 214 |

W

శ్రీ ర స్తు.

# చాటుపద్యమణిమంజరి.

## శ్రీనారాయణస్తుతి.

మ. ధర సింహాసనమై నభంబు గొడుగై తద్దేవతల్ భృత్యులై
పరమామ్నాయము లెల్ల వందిగణమై బ్రహ్మాండ మాగారమై
సిరి భార్యామణియై విరించి కొడుకై శ్రీగంగ సత్పుత్రియై
వరుస న్నీఘనరాజసంబు నిజమై వర్ధిల్లు నారాయణా!

## శ్రీకృష్ణస్తుతి.

గీ. చేత వెన్నముద్ద చెంగల్వపూదండ
బంగారు మొలత్రాడు పట్టుదట్టి
సందెతాయెతులును సరిమువ్వగజ్జలు
చిన్నికృష్ణ! నిన్నుఁ జేరి కొలుతు.

## త్రిమూర్తిస్తుతి.

చ. కమలజకృష్ణశంకరులు కాంచననీలపటీరవర్ణు లా
గమనగచంద్రధారు లఘకంసపురారులు హంసతార్క్ష్యగో
గమనులు జన్మపుష్టిలయకారులు వాక్కమలాంబికేశ్వరుల్
శమకరుణావిభూతిగుణశక్తులఁ బ్రోతురు మిమ్ము నెప్పుడున్.

## శ్రీరంగనాథస్తుతి.

ఉ. సింగపుమోమువాఁడు తులసీదళదామమువాఁడు కామినీ
రంగదురంబువాఁడు వలరాయనిఁ గాంచినవాఁడు భక్తికి
న్పొంగెడువాఁడు దానవులపొంక మడంచెడువాఁడు నేఁడు శ్రీ
బంగరురంగశాయి మనపాలఁ గలండు విచార మేటికిన్.

## వినాయకస్తుతి.

క. ఉండ్రాళ్లుపప్పునెయ్యని, బండ్రించినచెఱకుఁబాలుఁ బడియపుట్లున్
జుండ్రేచుపచ్చితేనియ, తండ్రీ వెనకయ్య! నీకుఁ దడయక తెత్తున్.

## దిక్పాలస్తుతి.

చ. హరిశిఖిధర్మదైత్యవరుణానిలయక్షశివుల్ గజాజకా
సరనరనక్రకైణహయశాక్వరయానులు వజ్రశక్తిము
ద్గరశరపాశకుంతసృణికార్ముకహస్తులు భోగశుద్ధిసం
గరజయశౌర్యసర్వజనకావ్యవిభూతులు మాకు నీవుతన్.

## శివస్తుతి.

చ. భసితము కన్నులం బడినఁ బాములు బుస్సనఁ గంట మంట పె
ల్లెసఁగి విధుండు గంద నొకయింత గజాసురుచర్మ మూఁగినన్
గసరుచు నల్లపెద్దపులి గాండ్రన గిత్తయుఁ దత్తరిల్లఁ జేఁ
బొసఁగినలేడి కుందువడ భూతభయంబున గౌరి లేవ న
వ్వెసఁగఁగ సంతరించుకొనునీశ్వరుఁ డిచ్చుత మీ కభీష్టముల్.

సీ. సర్వసర్వంసహాసముదయాంబు రథంబు
రథమధ్యమున నున్నరాయి విల్లు
విల్లువెంబడిఁ దిర్గు వెలుఁగులు చక్రాలు
చక్రాలకును వైరి చారునారి
నారిఁ బట్టుక తిర్గు నాగరకుఁడు గరి
గరిమీఁద విహరించుఘనుఁడు శరము
శరము నాభిక నున్నశతవృద్ధు సారథి
సారథిమాటలు సైంధవములు
గీ. గాఁగ నేగుదెంచి కణఁకతోఁ బురములు
గెలిచినట్టిఘనుఁడు గిరిజతోడఁ
గలసి యుండునట్టికరుణాసముద్రుండు
నిష్టసిద్ధులొసఁగు నెలమి మనకు.

## మృడునిఁ గనుఁగొంటి.

సీ. అర్ధంబు సత్పురుషాకృతిగాంచిన
వెండిచాయలపెద్దకొండఁ గంటి
ఆకొండపార్శ్వమం దంటి పాయఁగలేక
సగమైన యొకమహాశక్తిఁ గంటి
ఆశక్తికుడివంక నద్రిశృంగముమీఁద
నద్భుతం బైనకాఱడవిఁ గంటి
అక్కానలోఁ గంటి నరుదైనయొకయేఱు
నయ్యేటిదరులయం దమృత మొలుక
గీ. పాఱి తడుపారు నొకపాలపాఁపఁ గంటి
యదియు నదియును నదియును నదియు నదియు
హరశిరోజూటగంగాబ్జు లగుట గంటి
మృడునిఁగనుఁగొంటి నంతట మేలుకొంటి.
సీ. శీతాద్రియామ్యదిక్సీమభూములు గంటిఁ
జెలువైనకేదారశిఖరిఁ గంటి
ఉగ్రునినిజకాంత నుమఁ జెంతఁ గనుఁగొంటి
మధుమాధవుని దైత్యమథనుఁ గంటి
కంటి విఘ్నేశ్వరు గణనాథుఁ గనుఁగొంటిఁ
జండభైరవుని గోస్వామిఁ గంటి
ఉత్తమసంస్తుత్యు నుత్తరార్కునిఁ గంటి
గాలభైరవు ఘన్నఘుంటఁ గంటి
గీ. కంటి వటవృక్ష మాదిమగంగఁ గంటిఁ
గంటిఁ గేదారకుండోదకములు గ్రోలి
మహితవృషరాజు నెక్కినమహిమవాని
మృడునిఁ గనుఁగొంటి నంతట మేలుకొంటి.

సీ. ఆలపోతుల జేని నాతనిపగవానిఁ
బెంపంగఁ జంపంగఁ బెంపు గలిగి
హాలాహలపుమందు హల్లకములవిందుఁ
గుడుపంగ ముడుపంగఁ గోర్కి గల్గి
ఎడమదిక్కువధూటి జడలమక్కువబోటిఁ
బొలపింప వలపింపఁ బొందు గలిగి
పచ్చియేనికతోలు ప్రాఁతకంగటికాలు
కట్టంగఁ బట్టంగఁ గణఁకగల్గి
గీ. ఎసఁగి లోకంబు లీరేడు నేలువాని
మిగులఁ బొడవైన తెల్లనిమేనువాని
మహితవృషరాజు నెక్కినమహిమవాని
మృడునిఁ గనుఁగొంటి నంతట మేలుకొంటి.

సీ. తారకాసురభుజాదర్పంబు దెగటార్చు
ఘనుఁ గన్నతండ్రి మాయనుఁగు వేల్పు
కుండలిజ్యావల్లి కొండవింటను గూర్చు
విలుకాండ్రమేటి మాకులగురుండు
తలిరాకుబాకు గద్దరివజీరుని క్రొవ్వు
మట్టుపెట్టినదిట్ట మాకుఁ బ్రాపు
హత్తితెల్లనిగిత్తకత్తలాణము నెక్కి
మహి మించునెఱకాఁడు మాధనంబు
గీ. జాటజూటాగ్రవీథిని జహ్నుకన్య
మమత నిడుకొన్న ఐగకాఁడు మాబలంబు
పార్వతీసాధ్వి సామేనఁ బాదుకొల్పి
వెలయుపటుశీలి మాపాలివేల్పు మొదవు.

# దేవతాస్తుతి.

సీ. సుర లర్థిఁ గల్పప్రసూనముల్ వర్షింప
　　　　　　　నప్సరోవనితలు నాట్యమాడ
దుందుభిధ్వానముల్ తుములంబులై మ్రోయఁ
　　　　　　　దూర్యఘోషంబులు తోంగలింపఁ
జేరి వసిష్ఠుఁ డాశీర్వాద మొనరింప
　　　　　　　నలయరుంధతి శోభనంబు పాడ
వరగుణంబులనెల్ల వాల్మీకి నుతియింప
　　　　　　　నారదమౌని గానం బొనర్పఁ

గీ. జెలఁగి సింహాసనంబున సీతతోడ
రమణఁ గూర్చుండి రాజ్యపాలనము సేయు
నట్టియాయోధ్యరాము నే నాత్మలోన
మెలఁగఁ గలగంటి నంతట మేలుకొంటి.

సీ. సౌమిత్త్రి వేడుక ఛత్త్రంబు దాల్పంగఁ
　　　　　　　బాదుకల్ భరతుండు భక్తి నిడఁగ
శత్త్రుఘ్నుఁ డంతలోఁ జామరంబును వీవ
　　　　　　　సుగ్రీవుఁ డర్థితో సురఁటివీవ
అంగదుం డంతంత నడపంబు పట్టంగ
　　　　　　　సరస ఖడ్గము విభీషణుఁడు తాల్ప
హనుమారి మతిమీఱి సన్నుతిఁ గావింప
　　　　　　　జాంబవంతుండు హెచ్చరిక దెల్ప

గీ. అవనిజనుగూడి భద్రసింహాసనమున
రమణఁ గూర్చుండి రాజ్యపాలనముసేయు
నట్టికోదండరాము నే నాత్మలోన
మెలఁగఁ గలగంటి నంతట మేలుకొంటి.

సీ. సీతావధూమణి మాతల్లి భృగురామ
　　　　　　　గర్వాపహారి మాకన్నతండ్రి

దశరథాత్మజుఁడు మాదాత విశ్వామిత్ర
మఖరక్షణచణుండు మాకుఁ గర్త
మారీచదమనుండు మాయిలువేలుపు
కోదండపాణి మాకులగురుండు
జనకజానేత మాసెనరైనచుట్టంబు
రావణహంత మాజీవధనము
గీ. కైకయీప్సితకారుండు మాకు హితుఁడు
హేమమృగచర్మశాయి మాస్వామి జలధి
బంధనుఁడు మాకు సంసారభారవహుఁడు
రామచంద్రుండు మాకు సర్వస్వ మరయ.
సీ. వనరాశిఁ దనయంపమొనకుఁ దెప్పించిన
కోదండధరుఁడు మాకులగురుండు
తారకబ్రహ్మవిద్యాస్వరూపం బైన
వేదవేద్యుండు మావిమలవిద్య
దండకాంతరమౌనిమండలిఁ గాచిన
మనువంశతిలకుండు మాకుఁ బ్రాపు
పగవానితమ్మునిఁ బట్టంబు గట్టిన
కరుణాపయోధి మాపరమదాత
గీ. శబరి యొసఁగినఫలములు చవులుగొన్న
భక్తిమాత్రైకదర్శి మాపాలివిందు
కఠినదశకంఠభుజగర్వగౌరవంబు
మట్టుపెట్టినవిలుకాఁడు మాబలంబు.
సీ. నాలుగుమోములబాలునితోఁ దన
బొడ్డున బాలెంతపూవుదనర
అడుగుఁగెందామరఁ బొడమినతేనియ
ముల్లోకములమీఁద వెల్లిగొలుప

ఉరమున నున్నయిందిరచేతికమలంబు
మెలఁగుచున్మెదల కామెతలు గొలుపఁ
గరమున నొకమనోహరతరశంఖంబు
పాలివోనినిండువెన్నెలలు గాయఁ
గీ. బాలమున్నీటికరడు లుయ్యాలలూఁప
ముదురునాగువుపైఁ గనుమోడ్చియున్న
వాని లోకంబు లేలెడువరుసవాని
మెలఁత! కలగంటి నంతట మేలుకొంటి.

---

# దశావతార స్తవము.

## గునుగు సీసములు.

ఈపద్యములు సత్యవోలు భగవత్కవి రచించినవియట.
రక్షణపరాయణుండ! నారాయణుండ!

సీ. ఐదనభుజోరోంఘ్రివలన విప్రక్షత్రి
వైశ్యశూద్రులు మదివలనఁ జంద్రు
ముఁడుఁజూపువలన సూర్యుఁడు మోమువలన మ
రుత్పతి వీతిహోత్రులును బ్రాణ
మువలన వాయువు బొడ్డువలన నాక
సము శిరమువలన స్వర్గము పద
మువలన భువి చెవులవలన దిశలును
నుదరమువలన హేమోదరాండ
తే. చయము జని వృద్ధి లయ మంద సలుపునీవు
నాహృదయపీఠి నుండు మామ్నాయసుప్ర

సిద్ధ ! వైకుంఠనాథ ! లక్ష్మీసనాథ
రక్షణపరాయణుండ! నారాయణుండ.

సీ. విరజానదీపరివృతసప్తసాలావృ
తపరమభాగవతసదనపద
వైకుంఠభువనభవనసదనానుకృ
తసవీనపవనాదతల్పమున జ
గత్కల్పనాకల్పకల్పుండవై కుడి
కాలు వంచి యెడమకాలు సాఁచి
కుడిచే యనంతునియొడలిపై నెడమచే
యిని జానువందున నిడి వెనుకటి
గీ. కరయుగంబుల శంఖచక్రములు మెఱయ
సిరియు భువి నీళ గొలువ భాసిల్లు నిను భ
జింతు వైకుంఠనాథ ! లక్ష్మీసనాథ !
రక్షణపరాయణుండ ! నారాయణుండ !

సీ. శ్రీదేవి భూదేవి సేవింపఁ గస్తూరి
తిలకము మాణిక్యములుఁ గిరీట
ము మకరకుండలములుఁ గౌస్తుభమణి తా
ళీలు లక్ష్మీకుచాలేపము వన
మాల శ్రీవత్సము మంచి సాలు భుజకీ
ర్తులు బాజుబందులు గొలుసులు మురు
గులు బటువులు ముద్రికలు శంఖచక్రాది
పంచాయుధములు సుభద్రసూత్ర
గీ. కలితపీతాంబరంబు గజ్జెలు వెలుంగ
నాహ్లాదయపీఠి నుండు మామ్నాయసుప్ర
సిద్ధ వైకుంఠనాథ! లక్ష్మీసనాథ... ... ...

సీ. మత్స్యకూర్మవరాహనరసింహ
వామనభృగురామరామరామ

బుద్ధకల్కిరూపములు నారదకపిల
వ్యాసదత్తాత్రేయు లాదిగా న
నంతరూపము లయ్యు "నత్యతిష్ఠద్దశాం
గుల" మని బ్రహ్మాండకోటి యేక
పాద్విభూతి త్రిపాద్విభూతిగను పరమ
పదముగ నీస్వరూపము దెలిసిన
గీ. తత్త్వవేత్తలు పురుషసూక్తమున నిన్నుఁ
బొగడ నెగడితి వో విరాట్పురుష! సుప్ర
సిద్ధవై కుంఠనాథ! ... ... ...

సీ. మొగము శంఖము మీసము ల్గదాఖడ్గము
లొప్పలను చక్రము వాలమును సుశార్ఙ్గ
మునుబూని మగమీనమూర్తివై మెఱసి పా
తాళ మొఱసి తటస్థలి దొఱసి య
రసి "స్వయంతీర్ణః పరాం స్తారయతి" యను
నోజ గా నీతి "యత్వ్యభ్రియః ప
తన హేతు" వనిసోమకునకుఁ దెల్ప గుభాల్గు
భాల్గుభాల్మ నెగసి పడుచుఁ గడలిఁ
గీ. గ్రచ్చుకొని వచ్చుముచ్చుపై ప్రచ్చి శ్రుతులు
దెచ్చి విధి కిచ్చినట్టినీ హెచ్చువినుతి
సేతు వై కుంఠనాథ! ... ... ...

సీ. అమృతవారాశి ఘటము మందరముఁ గవ్వ
ము ఫణి రజ్జువుఁ జేసి పూర్వదేవ
తలు దేవతలుఁ బట్టి దరువఁగా ఘుమఘుమ
ధ్వనుల బ్రహ్మాండము తల్లడపడ
నపుడు "పరోపకారార్థ మిదం శరీ
ర" మని కూర్మావతారమునఁ గ్రుంగి

నగరిక్రింద నిలిచి "నానోదకసమం
దాన" మని సురలకమృతమిచ్చి (?)

గీ. నిరుపమానలక్ష్మీరమణీమణీమ
ణులు గొలువ విలసిల్లితౌ వలఘు దాన
శీల ! వైకుంఠనాథ ! ... ... ...

సీ. హిమగిరిఁ గేరుదేహము వజ్రములతీరు
రోమములఁ బ్రళయార్కులసరి కను
గవయు బ్రహ్మాండముఁ గబళించుముట్టె పా
తాళముఁ బెకలించుదంష్ట్రి యొప్పఁ
గ వరాహమూర్తివై కదిసి హిరణ్యాక్షు
గర్భనిర్భేదివై భూర్భువస్సు
వర్భయచ్ఛేదివై వారాశిమగ్నభు
గ్నవసుంధరోద్ధరణప్రమోది

గీ. వై జగతి "యతో ధర్మ స్తతో జయ" యను
వచనము నిజముఁ జేసినవర్ధమాన
కీర్తి వైకుంఠనాథ ! ............

సీ. ఎంతఁ జదివిన రవంత కులాచార
ధర్మమెఱుంగడ తనకుమార
కుఁడయిన ప్రహ్లాదు నొడిసి పట్టి నలుక
రహి వచ్చినట్టిహిరణ్యకశిపు
కట్టెదుట నినుపకంబము పటపటఁ
బగులఁ బొగ లెగయ భగభగ మను
పెనుమంటఁ జిటజిట మనుమిడుఁగురులు బ్ర
హ్మాండము నిండ బ్రహ్మాదులు గడ

గీ. గడ వడఁక వల్గడ లడల వెడలి కెవ్వ
నార్చి రిపు చేర్చి వటు నేలినట్టి శ్రీనృ
సింహ! వైకుంఠనాథ !............

సీ. అదితికశ్యపునకు "నంగుష్ఠమాత్రః పు
రుష" యనువచనము రూఢిసేయ
వామనమూర్తి నవతరించి వడుగవై
గొడుగు జందెముఁ బచ్చగోఁచిపంచె
పంచశిఖలు మౌంజి పాలాశదండము
కృష్ణాజినము చెంబు నిట్టివేష
మమర "నణోరణీయా న్మహతో మహీ
యా" నన్న వేదవాక్యము ప్రసిద్ధి
గీ. వడ బలికడను బుడమి మూఁ డడుగు లడిగి
త్రిభువనము లాక్రమించువర్ధిష్ణు వని భ
జింతు వైకుంఠనాథ!..........

సీ. జమదగ్నిగర్భవాసమునఁ బుట్టి వివిధ
విద్యాతపోధనుర్విద్య లధిక
పతివై ప్రబలి "ఇదం బ్రాహ్మ మిదం క్షాత్ర"
మని మునిరాజచిహ్నముల శాప
చాపనైపుణిఁ జూపి పాపభూపతుల శ
తారికఠోరకుఠారధార
సహస్రధారాప్రవాహములు గా శతధా స
హస్రధా ఖండించి యానదులను
గీ. దర్పణము భూమిదేవతాతర్పణముగఁ
జేసినపరశురామవేషి వని నిను భ
జింతు వైకుంఠనాథ! ..........

సీ. సూర్యవంశము పరిశుద్ధ మని దశర
థుఁడునతులమనోరథుఁ డని భరత
లక్ష్మణశత్రుఘ్నులకు నన్నవై పుట్టి
సౌందర్యచాతుర్యసౌమ్యమార్య

శౌర్యధైర్యౌదార్యవీర్యసత్యౌచిత్య
గాంభీర్యకర్తమకర్తమన్య
ధాకర్త మతిసమర్థత్వసత్వాఘట
ఘటనాపటీయ స్త్వఘన యశ స్స్వ
గీ. సౌఖ్యసఖ్యదయాముఖ్యశాలి వైన
రాముని సరాముని దయాభిరాము నిను భ
జింతు వైకుంఠనాథ! ...........

సీ. బ్రహ్మము గన్నపరబ్రహ్మమూర్తివై
యాద్యంతశూన్యుండ వయ్యు "ధర్మ
సంస్థాపనార్థాయ సంభవామి యుగే యు
గే" యటంచును దేవకీతనయుఁడ
వయి బలరామసహాయుఁడవై శిష్ట
రక్షణమును దుష్టశిక్షణమును
సలుపుచు రుక్మిణి సత్యభామ సుదంతి
భద్ర కాళింది జాంబవతి మిత్ర
గీ. వింద లక్షణయును బదార్వేలనూర్వు
రంగనలు గొల్వ వెలయుకృష్ణాహ్వయప్ర
సిద్ధ! వైకుంఠనాథ! ...........

సీ. త్రిపురదైత్యులను మిత్తికి బుత్తిఁ జేయఁ ద
లఁచి తదీయాంగనల యతిజృంభ
కుచకుంభపరిరంభగుంభనరంభాత
రు స్తంభకుంభదూరుఘనజఘన
బింబబింబాధరపీడనతాడన
దంతక్షతనఖక్షతప్రముఖర
తుల నతులగతులఁ గలసి మెలసివిల
సితతద్వ్రతక్షతిఁ జేసి చేసి

గీ. కంటిగొంటమ్ము వైమింట గంటకత్తి
పురచరులఁ గాల్చి కాల్చినబుద్ధ! గుణస
మృద్ధ! వైకుంఠనాథ !........

సీ. కలియుగాంతమున దుష్కరముష్కరతురుష్క
చండాలపతితపాషండమండ
లీమండితాఖండభూమండలముఁ జూచి
కమ్రామ్రపర్ణార్ణతామ్రపర్ణి
తటమున బ్రహ్మవిద్బ్రాహ్మణునకుఁ బట్టి
వై పుట్టి యుత్తమాశ్వాధిరూఢుఁ
డవయి జోడుఁ దొడిగి డాలు కత్తికమానుఁ
బూని పూనిక మీఱఁ బుడమిఁ బుట్టి

గీ. నట్టిదుష్టులఁ బుడమిఁ జెండాడ నున్న
కలికిమూర్తి! గుణస్ఫూర్తి! కలితశౌర్య
కీర్తి! వైకుంఠనాథ! లక్ష్మీసనాథ !
రక్షణపరాయణుండ! నారాయణుండ.

---

ఈ క్రిందిపద్యము లెలకూచి బాలసరస్వతీమహోపాధ్యాయుఁడు రచియించెను.

## ౧. మత్స్యావతారము.

శా. సాధీయోముఖపూరితోద్వమితతాసత్యోర్ధ్వగోదన్వద
ర్ణోధారాంతరటత్తిమింగిలగిలప్రోద్ధానవిధ్యానల
బాధీశప్రభుతాస్వభాగహరణార్థాయాయినాథానుజ
ప్రాధాన్యాంకవిలోలవాగ్ధృగబటబ్రహ్మాంస్తుమ స్త్వా మనుః.

## ౨. కూర్మావతారము.

శా. క్ష్మ్యాత్తంభద్గిరికల్పితావతరణద్యోర్వాహినీసంగమో
పాత్తేందూదయనిష్పితల్పాణజలధిప్రారబ్ధపుత్రోత్సవో

దాత్తత్వాత్తగజాశ్వవస్యశనకన్యాగోమణీదానసం
పత్తిప్రీణితదేవభూద్యధిపతిబ్రహ్మాంస్తుమ స్త్వా మనుజ.

### 3. వరాహావతారము.

శా. ఆద్యాలోకనభక్తిసంభ్రమదశేషాఃపూరుషత్యక్తస
త్వాద్యాంభస్తులసీభ్రమప్రదఖురప్రత్యాశానామాత్రజా
గ్రద్దోర్యగాంబుధిదంష్ట్రికాగ్రరిపుహృత్కాలామిషప్రాయశుం
భద్యాదోనిధిసక్తిసలికిటిబ్రహ్మాం స్తుమ స్త్వామనుజ.

### ౪. నరసింహావతారము.

శా. డింభద్రోహివధోత్కటోత్కరిమణరుష్టక్లిష్టతారోమకూ
పాంభోజప్రభవాండభాండదళనోద్యద్ధ్వానధిక్కృత్సభా
స్తంభాంతస్ఫుటనాస్ఫురత్స్ఫుటపటధ్వన్యాస్తని శ్చేష్టని
ర్దంభోదోర్యగదిశావశాపన్నృహరిబ్రహ్మాం స్తుమ స్త్వా మనుజ.

### ౫. వామనావతారము.

మ. స్వతలస్వచ్ఛతరారుణత్వరచితస్వస్త్రీగపరేడ్భ్రాంతివా
క్ప్రీతికూలత్వదశానుకారిగళగాఢద్వ్యక్షమాంభోజభూ
నుతిహాసన్నఖరోర్ధ్వసారితపదాఙ్గోరుడ్జగంగాసవ
ప్రతిమాళీశకపర్దమండలవటుబ్రహ్మాం స్తుమ స్త్వా మనుజ.

### ౬. పరశురామావతారము.

శా. ఆజిప్రౌఢిమదుర్జయార్జునగళోద్యగ్రాసృగాస్వాదన
వ్యాజాపోశనభాక్తదస్వపహృతి ప్రాణాహుతిప్రస్ఫుర
ద్రాజాళీదివసావసానవిఘసప్రాయేందువేలాయితా
భ్రాజాద్యత్క్షుకుఠారధారిభృగురాడ్బ్రహ్మాం స్తుమ స్త్వా మనుజ.

### ౭. శ్రీరామావతారము.

శా. చాపచ్ఛాత్రనిషంగభంగకుపితక్ష్మాభృద్ధనుఃపంచవ
క్త్రీపంచాళికదృజ్నియుక్తహుతభుగ్గీర్వాద్వయీపంచక

వ్యాపారభ్రమకారిపంక్తిగళగళ్యాఖండనాఖండదో
ర్నైపుణ్యప్రదరాఘురాఘవపరం బ్రహ్మం స్తుమ స్త్వామనుః.

## ౮. బలరామావతారము.

మ. కరిపూరుద్ధరణోద్ధలాంగలవిభగ్నత్క్ష్మాభరాదక్షుది
క్కరిపాదప్రహతిస్ఫుటస్ఫుటితభాగవ్యాపృతగ్రీవనూ
కరపీఠీకృతపృష్ఠతాహితమహాగాఢాధికూర్మాధిగా
ట్పరిక్లిప్తప్రళయాంబుగాహనహలి బ్రహ్మంస్తుమ స్త్వా మనుః,

## ౯. శ్రీకృష్ణావతారము.

మ. అతిదోఃపీడనకర్కరీఫలితకంఠాభత్వదుత్తర్తుభూ
ర్తతృణావర్తదృఢాంగపాతహతగోత్రాభర్తృకోత్పాదిత
క్రతుభుగ్రాడ్గిరిహాగ్రహోన్ముఖశతారధ్వస్తమైనాకని
ష్పతనభ్రాంతికనందగోపకసుతబ్రహ్మంస్తుమ స్త్వా మనుః.

## ౧౦. బౌద్ధావతారము.

మ. గిరియుష్మద్ధనురస్త్రతాప్రభృతిమోఘీకృద్వధూశీలవి
స్ఫురణావర్మభిదాఢ్యదార్ఢ్యసఫలీభూతత్రిపూతత్రిపూ
ర్వరదైతేయజిఘాంసుశాసనపరోగ్రప్రాప్యసారూప్యని
ర్భరదైతేయతథాగతాంగకపరబ్రహ్మం స్తుమ స్త్వా మనుః.

## ౧౧. కల్క్యవతారము.

మ. స్వమహాబాహుకృపాణకృత్తగళశత్రుచ్ఛన్నమ్లేచ్ఛవీరచ్ఛటో
త్క్రమదాపాదితపద్మినీరమణమధ్యచ్ఛిద్రఖస్వామికా
గమనానాస్రప్రయఃపరాగమథితక్ష్మాసారగంగానదీ
భ్రమకృత్కీర్తిక కల్కిమూర్తిక పరబ్రహ్మం స్తుమ స్త్వా మనుః.

---

## సంకీర్ణపద్యములు.

గీ. అక్షరంబు వలయుఁ గుక్షిజీవనులకు
నక్షరంబు జిహ్వ కిక్షురసము
అక్షరంబు తన్ను రక్షించుఁ గావున
నక్షరంబు లోకరక్షితంబు.

క. సరి నక్షరములె మంత్రం
బరయఁగఁ దరుమూల మెల్ల నౌషధచయమే
ధర యొల్ల ఫలనిదానమె
నరు లాస్థితి యెఱిఁగి క్రియల నడపిరయేనిన్.

శా. ఆలస్యంబును గామినీజనరతాత్యాసక్తియున్ జన్మభూ
లోలత్వంబును రోగపుంభయము దుర్లోభంబు సంతోషమున్
బోలంగా నివి యాఱు నెప్పుడు జగత్పూజ్యప్రతాపోదయ
శ్రీలం జెందఁగ విఘ్నకారణములై చెల్లున్ ధరామండలిన్.

ఆ. దేవునావ మున్ను దేశాన కొకరుండ
నిప్పు డూరనూర నింటనింట
నేవు రార్వు రేడ్వు రెనమండ్రు తొమ్మండ్రు
పదువురైరి కవులు పద్మనాభ!.

చ. అవనిపుఁ డాదరించినభటాళిభటత్వము వైద్యువైద్యమున్
గవికవితామహత్త్వమును గాయకుగానము కోటిసేయు న
య్యవనిపుఁ డాదరింపనిభటాళిభటత్వము వైద్యువైద్యమున్
గవికవితామహత్త్వమును గాయకుగానము గవ్వసేయునే?.

మ. నయనానందకరం బనిందితము నానాసద్ద్విజశ్రేణి కా
శ్రయ మశ్వత్థమహీజ మంచు నలు లాసం జెంది యాస్వాదన
క్రియకుం బుష్పచయంబు గోరి చనుమాడ్కిన్ సుందరాకారు ని
ర్దయు నాసింతురుగా కెఱుంగుదురె యంతస్సారనిస్సారతల్?.

చ. సరసులు గానివారియెడఁ జాలఁ గవిత్వరసప్రసంగముల్
కలుపుట కంఠశోషణమె కాక రసజ్ఞత గూర్ప నేర్చునే ?

స్మరశరజాలవేదనకుఁ జాలక భ్రాంతిని రాతిబొమ్మతో
మఱఁగి రమింపఁగాఁ దివురుమానవుఁ డేమి సుఖింపఁ గల్గెడిన్?

సీ. నిపుణత రాజ్యవినీతుఁడు గాఁ డేని
నేల యేలెడువాఁడు నేలకాఁడె
సంగీతసాహిత్యసరసుఁడు గాఁ డేని
కృతి సెప్పువాఁడు దుష్కృతుఁడు కాఁడె
కుశలత సతిమతివిశదుఁడు గాఁ డేని
విటుఁడగువాఁడు దుర్విటుఁడు గాఁడె
మాధవశ్రీపాదమగ్నుండు కాఁ డేని
మోక్షార్థి యనువాఁడు మొప్పెగాఁడె

గీ. అతులరాజ్యనీతి యమలకావ్యసుశక్తి
యంగనానురక్తి యచలభక్తి
రతుఁడు గానివాఁడు పతిగాఁడు కృతిగాఁడు
కామిగాఁడు మోక్షకామి గాఁడు.

గీ. ఆఢ్యుఁ డున్నయప్పు డందఱుఁ బూజ్యులె
లెక్కమీఁద సున్న లెక్కి నట్లు
అతఁడు పోవువెనుక నందఱు నపూజ్యులే
లెక్క లేక సున్న లేఁగినట్లు.

క. సామర్థ్య మున్నవేళల
నేమనుజునకేని నింద యొ ట్లొదవుఁ? గుసుం
బామేల్మిచీర దాల్చిన
భామ చెఱఁగుమాయుఁగాక బయలంబడునే?

క. చేతనగువాఁడు కార్యము
కై తగ్గను వంగుఁగాక యల్పుం డగునా?
యేతముచడి దా వంగును
బాతాళమునీరు దెచ్చి బయలంజల్లన్.

చ. పరఁగఁగ నాల్గుపాదములు బాగగుతుండము ఘీంకృతంబు మా
కిరువురకున్ సమంబె మఱి యొక్కఁడయొక్కటి పక్షయుగ్మ ఖే
చరుఁడను నాకు సామ్య మెఱకసామజమా? యని దోమ పల్కఁన
ట్లరయ మహానుభావులను నల్పుఁడు నోరికొలందు లాడెడిన్.

మ. సకలస్థాణుశిరః ప్రవర్తి నురుపక్షద్వంద్వశాక్యాభిరం
జనుఁడన్ సర్వదిగంతగామి నసకృత్సంసేవ్యమానుండ నై
ష్ఠికుఁడన్ గావున మత్సమానుఁడగునే శీతాంశుఁ? డం చెప్పుడున్
బక మిందుం బ్రహసించురీతి సుజనుం బల్కుం దురాత్ముం డిలన్.

క. కవితాలక్షణ మెఱుఁగని
యవివేకికిఁ బద్య మిచ్చి యడుగుటకంటెన్
చవిలెఁగొని దండెఁగొనుకొని
భువిలో హరిదాసుఁ డైనఁ బుణ్యమె దక్కున్.

క. పదపద్యంబులుచదివిన
విదలించుకలేచిపోక వేడుకతోడన్
దుదరమ్మని యిప్పించినఁ
బదివే లొకపోకపక్క భట్టరుచిక్కా!

ఈభట్టరుచిక్కాచార్యులు, తెనాలిరామకృష్ణప్రభృతులకు గురువనంబడు.

క. నక్కలు బొక్కలు వెతకును
నక్కలతో నూరఁబంది యగడిత వెదకున్
గుక్కలు చెప్పులు వెదకును
దక్కిడినాలంజెకొడుకు తప్పే వెదకున్.

గీ. తప్పు గుఱుతించివ్రాయు టుత్తమము; లేక
ప్రతిసమానముగా వ్రాయు టతిముదంబు

రెండు విడనాడి వ్రాసెడిలేఖకుండు
కలుగు టరయుంగఁ గవి యభాగ్యంబకాదె?

చ. వెనుకకుఁ బోక హుమ్మనక వేసట పొందక బంతిబంతిలోఁ
బెనుపక లోపలం బ్రమసి బెగ్గిల కంతయు మున్నె సూచుచున్
గనుఁగొను నక్షరక్రమముకందువ దప్పక యేకచిత్తుఁడై
యనుపమభక్తితోఁ జదువునాతని వాచకుఁ డంద్రు సద్బుధుల్.

---

## షట్చక్రవర్తులు.

శ్లో. హరిశ్చంద్రో నలో రాజా పురుకుత్సః పురూరవాః,
సగరః కార్తవీర్యశ్చ షడేతే చక్రవర్తినః.

జిగిబిగియును, రుచియును గల యీక్రిందిపద్యరాజములు యత్కర్తృకములో తెలిసినదికాదు.

సీ. హరిహరబ్రహ్మాదు లద్భుతం బందంగ
నెగడె సత్యవ్రతనిష్ఠ కలిమి
నాలుగుయుగముల నోలిని బదునాల్గు
వరుసల వర్తిల్లి వసుధ యేలె
సప్తపాథోధిసంగుప్తసప్తద్వీప
సంధుల జయశిలాస్తంభవితతి
నిలిపె నాఖండలాదులు పంపు సేయంగ
రాజసూయమహాధ్వరం బొనర్చె

గీ. వతలవితలరసాతలాద్యఖిలదనుజ
లోకగంధర్వలోకాహిలోకనాక
లోకగోలోకకమలజలోకభరిత
సాంద్రయశుఁ జెప్పఁ దగు హరిశ్చంద్రవిభుని.

సీ. చంద్రకందర్పాతిసౌందర్యవంతులు
తనుఁజూచి సిగ్గునఁ దనరఁ దనరె
త్రైలోక్యసుందరి దమయంతి తనయందు
బద్ధానురాగగాఁ బరఁగఁ బరఁగె
అర్థికిఁ బ్రాణంబు నర్థంబు నిచ్చుట
నెట్టన బిరుదుగా నెగడ నెగడె
అమరులు దనమనోవిమలత కిచ్చమై
మెచ్చి నెచ్చెలులుగా మెఱయ మెఱసె

గీ. మహితకర్కోటకాహీంద్రమైత్రిపరుఁడు
పుణ్యఋతుపర్ణవర్ణితాగణ్యగుణుఁడు
వితతకలిదోషసంహారవిమలయశుఁడు
నలుని గీర్తింప నఘములు దొలఁగు టరుదె?

సీ, చంద్రనందనునకు సాధ్వియిలాకన్య
యం దుద్భవించెఁ బుణ్యములతోడ
శ్రీమత్సురాంగనాసీమంతమణియైన
యూర్వశి పత్నిగా నుర్వి యేలె
వితతభాండాగారవిపులగోష్ఠాగార
తతి విప్రహస్తసంగతిగ నిచ్చె
ఆయుర్దృఢాయుస్సుఖాయుర్ముఖుల దేవ
పతి చూచి వెఱఁగంద సుతులఁ బడసె

గీ. సుజనముచికుందభూపాలసోదరత్వ
మేరుమందరధృతియశోమేదురత్వ
సకలగుణరత్నభూషణసాగరత్వ
ధను నఘుచ్యుతుఁ బురుకుత్సుఁ జను నుతింప.

సీ. మహి యెల్ల యెడ నేలుమాంధాతృనకుఁ బుట్టి
యాదిగర్భేశ్వరుం డనఁగఁ బరఁగె

బ్రాహ్మణభక్తిసంపన్నసౌజన్యత
విప్రపక్షం డన వినుతి కెక్కె
ఇరువేలవర్షముల్ గుఱుతుగా నొకదినం
బాదిగాఁ గలయధ్వరాళిఁ జేసె
త్రిభువనప్రీతిగా దివ్యకోదండుఁ డై
బహుకోటిదనుజుల బల మడంచె

గీ. ప్రకటశాస్త్రవిభంజనభైరవుండు
పాత్రికాయత్తకౌరవపౌరవుండు
హర్షితానేకజనవినుతారవుండు
గౌరవోన్నతి నొప్పెఁ బురూరవుండు.

సీ. పటుశక్తిశౌర్యు లర్వదివేవు రాత్మజుల్
పని సేయ నిమ్మహీభరము దాల్చె
ఒక్కొక్కసుతుపేర నొక్కొక్కపట్టణం
బిలయొల్ల గల్పించె నలఘుమహిమ
అన్నిపట్టణముల నఖిలమహారత్న
చయములు గల్గ రాజ్యంబు చేసె
పుత్రమోహభ్రాంతి పొందక మర్యాద
తొలఁగినసుతుల నిల్ తొలఁగఁ ద్రోలె

గీ. చెప్ప నొప్పదె నిజపాత్రిచిత్రఘోర
తమతపోలబ్ధగంగాంబుతరళసలిల
వీచికానూనసోపానవితతయాన
నవనివాసత వైకుంఠనగరు సగరు.

సీ. హైహయవంశధాత్రీశాబ్ధిచంద్రుఁడై
జనియించి విశ్వభూచక్ర మేలె
అచ్యుతమూర్తి దత్తాత్రేయయోగీంద్రు
చేత జగజ్జైత్రసిద్ధి వడసె

ఏతప్పు నెన్నఁడు నెవ్వరు నెవ్వోటఁ
దలఁప రాకుండంగ నిలిపె నాజ్ఞ
ఏడుదీవులయందు నెన్నాఱు హయమేధ
యాగంబు లొనరించె నలఘుమహిమ

గీ. అతులతరదీర్ఘసత్త్వసహస్రబాహుఁ
డహిగణాధిపఫణగణాయత్తభూరి
భూభరముఁ దాల్చె నవలీలఁ బొగడఁ దగదె
కార్తవీర్యార్జు నాహ్వయక్ష్మాతలేంద్రు?.

సీ. ఒగిఁ జతుర్దశమహాయుగములు భువిఁ దాల్చె
సత్యవ్రతము హరిశ్చంద్రవిభుఁడు
జంభారివరుణాదిసంభావితులలోన
దమయంతి వరియించెఁ దనర నలుఁడు
అదిగర్భేశ్వరుం డైవిప్రదాసుఁడై
చరియించెఁ బురుకుత్సజనవిభుండు
బ్రాహ్మణహస్తంబు భండార మనియె కో
శాగంబుఁ జేసెఁ బురూరవుండు

గీ. సాగరము పేర్మి నిర్మించె సగరనృపతి
కార్తవీర్యుండు మహి జైత్రవర్తనుండు
వీరలార్గురుఁ దలపోయ విష్ణునిభులు
చక్రవర్తులు నిత్యనిర్వక్రయశులు.

---

## రణతిక్కన - నెల్లూరుపురము.

విరాటపర్వముఁ దొట్టి తుదముట్ట నాంధ్రమహాభారత
మును రచియించిన తిక్కనసోమయాజి కీర్తఁడు పెద్దతండ్రి కుమా

రుఁడు. పదుమూఁడవ శతాబ్దియందు విక్రమసింహపురమున రాజ్యమేలిన మనుమసిద్ధిరాజునొద్ద సేనాని.

సీ. వీరవివాదంబు వేదనినాదంబు
పాయక యేప్రొద్దు మ్రోయుచుండు
భూసురప్రకరంబు సేసలు చల్లఁగఁ
బాయ కన్నియొ కుటుంబములు బ్రదుకు
బ్రాహ్మణావళికి ధారలుపోసినజలంబు
సతతంబు ముంగిట జాలువాఱు
రిపుల కోసఁగిన పత్రికలపుత్త్రికలను
బాయక కరణముల్ వ్రాయుచుంద్రు

గీ. మానఘనుఁ డైనతిక్కనమంత్రియింట
మదనసముఁ డైనతిక్కనమంత్రియింట
మహితయశుఁ డైనతిక్కనమంత్రియింట
మంత్రిమణి యైనతిక్కనమంత్రియింట.

మనుమసిద్ధిరాజునకును నెఱగడ్డపాటియేలికయగు కాటమ రాజునకును జరిగినసంగ్రామమున నీధన్యచరిత్రుఁడు కీర్తిశేషుఁ డయ్యెను. పుల్లరియిచ్చు నొడంబడికపైఁ గాటమరాజుతనపసుల మనుమసిద్ధిరాజు మేఁతబీళ్లలో మేపుకొనియెక్కడఁదనకో డెదూడలలో నేదో నష్టము సంభవించిన దన్న కారణమునఁ బుల్లరి నెగఁగొట్టెను. దానిపై మనుమసిద్ధిరాజుపసులబోఁనీయఁడయ్యె. పరస్పరయుద్ధమున కిది కారణము. ఈయుద్ధచరిత్రము "కాటమ రాజుకథ" యనుపేర గ్రంథరూపమున వెలసినది. మనుమసిద్ధి పక్షమునఁ గొంతసేనతో ఖడ్గతిక్కనకాటమరాజు సేన నెదుర్కొ ని కొంత పోరాడి తన బలము చెల్లాచెదరు కాఁగా నిలువరాక తిరిగి యింటికి వచ్చెను. నాఁడు స్నానము చేయఁబోఁగా స్త్రీలు

జలకమాడు మఱుఁగుపట్టున భార్య నులుకమంచ మడ్డు సేసి పసవుటుండ దాని పైనుంచి నీళ్లబిందెఁ దెచ్చిపెట్టెనఁట! ఇదియేమని వ్యసనపడి యడుగ—

క. పగఱకు వెన్నిచ్చినచో
నగరే నిను మగతనంపు నాయకు లెందున్?
ముగు రాఁడువార మైతిమి
వగ పేటికి జలకమాడ వచ్చినచోటన్?

అని యవమానకరముగా సైతము పల్కెనట! తర్వాతఁ దల్లి యన్నములో విఱిగినపాలుపోసెను. తిక్కన తల్లి నిదియేమని యడిగెను. తల్లి "నాయనా! నీవు పోయినచోటికే పసలును మేఁతకుఁబోయెను. అవియును విఱిగివచ్చినవి. పాలును విఱిగెను" అనెనఁట.!

క. అసదృశముగ నరివీరుల
మసిపుచ్చక విఱిగివచ్చుమగపంద క్రియన్
గసవున్ మేయఁగఁ బోయిన
పసులున్ విఱిగినవి తిక్క! పాలున్ విఱిగెన్.

అంతట నన్నము విడిచి లేచి యుద్ధసన్నద్ధుఁడై పోయి పగఱ నెదుర్కొని వీరస్వర్గమునందినట్లు నాఁటికవుల వర్ణనము.

చ. పదఁటున వాజిరాహుతులపై దుమికించుచుఁ దిక్కఁ డార్చినన్
బెదిరి పరిభ్రమించి కడుఁ బిమ్మిట వీరులు భీతచిత్తులై
యదె యిదె వాలు వాల్మెఱుఁగు లల్లవె యల్లదె యాతఁడం చనన్
గొదుకక యాజిఁజేసె రిపుకోటుల కందఱ కన్నిరూపులై.

ఉ. చిక్కక మన్మసిద్ధివిభుచే మును గొన్న ఋణంబు దీర్చి మా
తిక్కనమంత్రి సోమశిల దేవరసాక్షిగఁ బెన్నసాక్షిగా

నెక్కినవాజి సాక్షిగ మహి న్నుతి కెక్కినకీర్తిసాక్షిగా
స్రుక్కక మారుకొన్నరణశూరులు సాక్షిగఁ గొండసాక్షిగన్.

సీ. *రణరంగమున మోహరంబులఁ బొడగని
ప్రాణంబు వాసినపందగజము!
విజయాధిపుని దాడి వెనుకొని తగులంగ
దెసదప్పి పాఱినదిగ్గజంబ!
చేరఁ జాలక తిర్గి చేమడ మళ్లించి
మంచాన కందనిమదగజంబ!
బెనుతుల్లి చెఱువులోఁ బిరుదు లన్నియు రొంపిఁ
గ్రుంగంగఁ ద్రొక్కినకుంజరంబ!
గీ. నేఁడు మొదలుగాఁగ నెల్లూరివీథిలోఁ
బొగడుతనము సేయుమగలతలలు
పూరిగఱచి తిక్క! భూతమై సోఁకుము
యూరివారిసోఁకు గారుసేసి.

---

*పాఠాంతరము.

సీ. విజయాధిపునిదాడి వెనువెంటఁ దగిలినఁ
బ్రాణముల్ దాచిన పందగజము!
పెనుజల్లెపల్లెలో బిరుదు లన్నియు వైచి
పరుగెత్తి వచ్చినపాఱుఁబోత!
దురములోఁ జావక దొరలెల్లహసియింప
మంచానకొరిగిన కొంచెకాఁడ
చతురంగబలముతో సమరంబు సేయక
మానంబు విడచిన మందబుద్ధి
గీ. యనుచు నార్వేలవారు ని న్నపహసింప
ధరణి నెల్లూరిలో నెట్లు తిరుగ గలవు?
వైరులను గెల్చి సత్కీర్తి వరలు మయ్య!
మంత్రికులహేళి? తిక్కనామాత్యమౌళి!.

సీ. ధైర్యంబు నీమేనఁ దగిలి యుండుటఁ జేసి
చలియించి మందరాచలము తిరిగె
గాంభీర్య మెల్ల నీకడన యుండుటఁజేసి
కౌస్తుభుచే వార్ధి కట్టువడియె
జయలక్ష్మి నీయురస్థలిన యుండుటఁజేసి
హరి పోయి బలి దాన మడుగుకొనియె
ఆకారమెల్ల నీయంద యుండుటఁజేసి
మరుఁడు చిచ్చునఁ బడి మడిసి చనియె
గీ. దిక్కదండనాథ! దేవేంద్రపురికి నీ
వరుగు టెఱిఁగి నగము తిరుగు టుడుగు
నబ్ధి కట్టువిడుచు నచ్యుతుకొద మాను
మరుఁడు మరలఁ గలుగు మగలరాజ!

సీ. నందిని బుత్తెంచె నిందుశేఖరుఁడు నీ
వన్న! యేతెమ్ము తారాద్రికడకు
గరుడునిఁ బుత్తెంచె నరహరి రావయ్య
వడి సిద్ధతిక్క! కైవల్యమునకు
హంసను బుత్తెంచె నజుఁడు నీకడకు సు
భయకులమిత్ర! రా బ్రహ్మసభకు
ఐరావతముఁ బంపె నమరేంద్రుఁ డిప్పుడు
దివమున కేతెమ్ము తిక్కయోధ!
గీ. యనుచు వేఱువేఱ నర్థితోఁ బిలువంగ
వారువీరుఁ గూడ వచ్చివచ్చి
దివ్యయోగి యైనతిక్కనామాత్యుండు
సూర్యమండలంబు సొచ్చి చనియె.

ఉ. వెన్నెలలేనిరాత్రియు రవిప్రభలేనిదివంబు నీరులే
కున్నసరోవరంబు కడునొప్పగుదీపములేనియిల్లు నై

ఖిన్నఁదనంబు నొందె మనవిక్రమసింహపురంబు చూడఁగాఁ
బున్నమచంద్రుఁ బోలు మనపోలమతిక్కఁడు లేమి నక్కటా!

---

## సిద్ధయ తిక్కన.

ఈతిక్కన రణనిహతుఁ డయినపిదప వేములవాడభీమకవి యాతనియింటి కేఁగి యాతనిభార్యను "దీర్ఘసుమంగలీభవ" యని యాశీర్వదించెనట! ఆమె భర్తృవియోగవార్త తెలిపి శోకింపఁగా నాతఁడు—

క. గుణములనిధాన మగుమన
రణతిక్కన తాఁ గళేబరంబును శిరమున్
గణఁకమెయిఁ గలయ బ్రదుకును
బ్రణుతాఖిలసై రిపుకుటభాసితపదుఁడై.

అని పద్యముచెప్పిరణతిక్కన నుజీవింపఁ జేసెనట! ఇదికట్టుకత.
రణతిక్కననుగూర్చి చెప్పఁబడినపద్య మిదియొకటి—

ఉ. ఏమితపంబు చేసి పరమేశ్వరు నేమిటఁ బూజచేసిరో
రామునితల్లియుం బరశురామునితల్లియు భీముతల్లియున్
గామునికన్నతల్లియును గంజదళాక్షుననుంగుఁ దల్లియున్
శ్రీమహితప్రతాపుఁ డగుసిద్ధనతిక్కనకన్నతల్లియున్.

ఉ. శ్రీయలరార శత్రువులఁ జెందితి వార్యులు మంత్రివర్యులా
ర్యేలఘునుల్ నుతించి రలవేల్పుదొరల్ ముదమంది మెచ్చిరో
లాలితశౌర్యధైర్య జయలక్ష్మి ప్రియంబున నిన్వరించె నీ
లీలలు హెచ్చెఁ దిక్కనికళేబరమా! యిఁక నిల్చియాడుమా!

*నెల్లూరుప్రాంతమునఁగల పట్టుపురాయిగ్రామానకుఁ దూర్పుభాగమునఁబినాకినీనదీతీరమునఁ దిక్కనపాడనుస్థలము గలదు. ఆస్థలమందు గుట్టమీఁద రాతను జెక్కినశిల యొకటి నేఁటికిని గలదు. అది తిక్కనప్రతిమ యని స్థలజ్ఞులు చెప్పుదురు.

---

## నెల్లూరు.

సీ. ధీరుఁడై ధరయేలెఁ దిరుకాళదేవుండు
తిక్కనాయకుఁ డేలెఁ దేజ మెసఁగ
మన్మసిద్ధన యేలె మహిమతో దీపించి
దాదినాగన యేలె ధర్మరీతి
మనుగండగోపాలమనుజాధిపతి యేలె
స్వర్ణదేవుం డతిప్రభగ నేలె
గోపినాథుం డేలె గుణపయోరాశియై
రమణతో శ్రీరంగరమణుఁ డేలె

గీ. తిక్కనయు మఱియొక కొన్నిదినములేలె
నేలె మీతండ్రి మర్యాద లెల్లఁ గలుగఁ
గడఁక నీ వేలి తండ్రులకంటె మించి
శరధిగంభీర! సంగమక్ష్మాతలేంద్ర!

సీ. పాలించు నేవీట బ్రహ్మాదివంద్యుండు
లీల మూలస్థానలింగగురుఁడు
దీపించు నేవీట దేవాలయంబులు
ధావళ్య వసుధాధౌతములయి

---

* ఈవిషయము ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమందలి చారిత్రకసంపుటములందున్నది.

ప్రవహించు నేపీట బ్రహ్మాండకర్పరం
బొరసి మిన్నులుముట్ట నున్న పెన్న
చెలు వందు నేపీటఁ జిరకాలజీవన
స్వర్ణాలచెఱువు సంపూర్ణమగుచు
గీ. ప్రజలకును మన్కి సకలసంపదలకున్కి
భోగములవీడు సురపతిపురికి నీడు
నమ్మికలటెంకి వైరులఁ జిమ్ముకొంకి
భాగ్యనికరంబు నెల్లూరుపట్టణంబు.
సీ. ఏపట్టనంబున నెన్నంగ మున్నూట
యఱువది దేవాలయంబులుండు
ఏపట్టనంబున రూపింపనన్నియు
నీరేడుబావు లింపారుచుండు
ఏపట్టనంబున నెల్లమానవులఁ బ్ర
శస్తిగాంచిరి నెఱజాణలనఁగ
ఏపట్టనంబున నేకాలమును బెన్న
కాల్వలచేత ముక్కాలుఁ బండు
గీ. శివునికృపఁ బుట్టె వేమాలసెట్టి బావి
పరఁగ జగ మెల్ల నెఱుఁగ నేపట్టనమున
నట్టిపట్టన మిలను సౌఖ్యములకునికి
పట్టనందగు నెల్లూరుపట్టనంబు.
సీ. చరియించితిని గాని జగము మూలస్థాన
పరమేశ్వరునివంటిభక్తవరదు
విహరించితిని గాని వివిధభూములు * పల్లి
కొండనాథునివంటికూర్చువేల్పు

* పల్లికొండనాథుఁడు, శయనించినస్వామి, రంగనాథుఁడు.

పరికించితిని గాని బహుదేశము లనంత
పద్మనాభునివంటిభవ్యమూర్తి
వీక్షించితిని గాని విశ్వ మంతయుఁ బెన్న
నదివంటిదివ్యపుణ్యస్రవంతి
గీ. అరిగితిని గాని దేశదేశాంతరముల
వేదగిరివంటిపావనోర్వీధరంబుఁ
గాన మిన్ని విశేషముల్ గలిగి ధరఁ బ్ర
సిద్ధికెక్కెఁ ద్రివిక్రమసింహపురము.

సీ. ఆపట్టనంబున నమరంగఁ దూర్పున
మాకందచందనమహితవనము
ఆనగరంబున కటు దక్షిణంబునఁ
జెలువారు వేమాలసెట్టిబావి
ఆయూరిపడమట నంభోజరాజిచేఁ
బ్రాకటంబైనతటాక మమరు
ఒప్పారునవ్వీటియుత్తరదిక్కున
మున్నీటి కెదురైన పెన్న దనరు!
గీ. కలిమి నారాజధాని మార్గంబు సెన్న
బహుళగంధర్వసింధురబంధురంబు
రతనపుంబొమ్మ లప్పురిరమణు లనఁగ
వినుతి కెక్కెను నెల్లూరి విభవమహిమ.

శా. మల్లెల్ మొల్లలు సేమమా? శుభములా మాకందముల్ జాజులున్
మొల్లం బారక యుండునా? సుదతులున్ మోదంబు వాటింతురా?
విల్లుం గోలయుఁ (యేమకూఁడమరునా?) వేమాలనూయున్నదా
నెల్లూరన్? బెదసోమపీథిన కదా నీరాక జైవాతృకా!

---

## రెడ్డిరాజులు.

కాకతీయులయొద్దఁ దొలుత దండనాథులుగానుండి తత్సామ్రాజ్యము సన్నగిల్లినతర్వాతఁ బద్మనాయకులవలెనే వీరును స్వతంత్రరాజులైరి. తొలుత వీరిరాజధాని యద్దంకి. తర్వాతఁ గొండవీడు, రాజమహేంద్రవరము, కందుకూరు. వీరు మహాదాతలు. పదుమూఁడవశతాబ్దినుండి వీరిపాలనము పెంపొందెను. నూఱుసంవత్సరములకంటె వీరిరాజ్యము మహోచ్ఛ్రియమున లేదు. వెల్గోటివెలమరాజులును, ఒడ్డెరాజులును ప్రబలశత్రువులై యీరాజ్య మంతరింపఁ జేసిరి. ఈరెడ్లపరిపాలనక్రమమునుగూర్చి యీక్రిందిసీసపద్యము వాడుకలో గలదు. శాసనములఁబట్టి పరిశీలించిననిది మిక్కిలి యక్రమమగుచున్నది.

సీ. పోలయవేమన్న పాలుపారఁ బండ్రెండు
వత్సరంబులు గాచె వసుధయెల్ల
అటవెన్క ముప్పది యనపోతవేమన్న
వన్నెవాసికి నెక్క వసుధ యేలె
ధర్మాత్ముఁ డనవేమధరణీకళత్రుండు
పదియు నేనిట భూమిపదిలపఱిచె
ప్రజల కుబ్బసముగఁ బదునాలుగేఁడులు
కొమరగి రేలెను సమయుదాఁక

గీ. ఏలెఁ గోమటివేమన యిరువదేడు
రాచవేమన్న నాల్గు వర్షములనేలె
మించి కట్టిరి గృహరాజుమేడ కొండ
వీట నూరేండ్లు రెడ్లు భూవిదితయశులు.

## అనవేమనృపాలుఁడు.

క. కవితాకన్యకు నలుగురు
కవి జనకుఁడు భట్టు దాది గణుతింపంగా
నవరసరసికుఁడె పెనిమిటి
యవివేకియె తోఁడఁబుట్టు వనవేమనృపా!

క. కొంచెపుజగములలోపల
నంచితముగ నీదుకీర్తి యనవేమనృపా!
మించెను గరి మకరంబునఁ
బంచాక్షరిలోన శివుఁడు బలసినభంగిన్.

గీ. పందికొమ్మెక్కి పెనుపాముపడగలెక్కి
మేటితామేటివీఁ పెక్కి మెట్టలెక్కి
విసివి వేసారి యనవేమవిభునిఁ జేరి
రాణివాసంబుగతి మించె రత్నగర్భ.

క. రాకున్నఁ బిలువఁ డేనియు
రాకకు ముద మంది చేర రమ్మనఁ డేనిన్
ఆఁకొన్న నీయఁడేనియు
నాకొలు వటు కాల్పవలయు ననవేమనృపా!

శ్లో. అనవేమమహీపాల స్వస్త్యస్తు తవ బాహవే,
ఆహవే రిపుదోర్దండచంద్రమండలరాహవే!

ఈశ్లోకము ననవేమనృపాలునిపై నొకకవిచెప్పఁగా నంత
సించి రాజు మూఁడువేలుపారితోషికమొసఁగెనట. కవి నేను
నాల్గువేలు (వే అను నక్షరములు) ఒసఁగిన మీరు మూఁడువే
లిచ్చెదరా యనెను. రాజు నాల్గువే లొసఁగితి ననెను. కవి

మే మొసఁగినదే తిరిగి మాకొసఁగి పంపెదరా యనెను. రాజయిదు వేలు కొమ్మనెను. కవి (ఆర్వేలనియోగి) కులమును గుంచించెదరా యనెను రాజు ఆఱువే లిచ్చితి ననెను కవి నేనుపుట్టువుతోడనే యార్వేలవాడ ననెను. రాజు చాతుర్యమునకు మెచ్చి యేడు వేలు కొనుమనెను. కవిసంఖ్య మంచిది కాదనెను. రాజెనిమిది వేలిచ్చి పుచ్చెను.

---

## కాటయ వేమన.

క. వెలయాలు శిశువు నల్లుఁడు
నిలయేలిక యాచకుండు నేగురు ధరలో
గలిమియు లేమియుఁ దలఁపరు
కలియుగమునఁ గీర్తి కామ! కాటయవేమా!

---

## కోమటి వేమన.

ఈతని యాస్థానమున శ్రీనాథకవిసార్వభౌముఁడు విద్యాధికారి. అమరుశతకవ్యాఖ్యాత. వేమభూపాలచరిత సాహిత్యచింతామణ్యాదికృతులకు నాయకుఁడు.

క. ఈరేడుజగము లనఁ జె
న్నారెడు పదునాల్గు గ్రుడ్ల ననిశము నెక్కల్
సారించి పొదుగుచున్నది
కోరిక నీకీర్తిహంసి కోమటివేమా?

సీ. శాత్రవరాజన్యవృక్షమ్ములఁ బడమొత్తి
దుశ్శత్రుపురముల దుక్కిదున్ని

చెనటివిరోధులశ ... ... ...
... ... ... ... ...
వైరికాంతానేత్రవర్షంబు గురిపించి
పగతులయొమ్ములు పంట చేసి
గీ. పదరుమన్నీలగుంపుల మొదలు గోసి
యొసఁగ నూర్పించి తూర్పెత్తి యేకరాశి
ఖలను గావించె నీకత్తికాఁపుఁగుఱ్ఱఁ
డతులబలభీమ! శ్రీకోమటన్నవేమ!

ఈకోమటి వేమారెడ్డియాస్థానమున మామిడిసింగనాదులు మంత్రులు. తురగారామన యనుమంత్రి దుష్టుఁడట! ఒకకవి వానిఁ బేర్కొనెను.

క. కోమటి వేమనత్యాగము
భూమిఁ బ్రసిద్ధంబు కల్పభూజము చేతన్
బామున్నపగిదిఁ దురగా
రాముం డున్నాఁడు చేరరా దెవ్వరికిన్.

---

## సాళువగుండ నరసింహరాయలు.

ప్రౌఢదేవరాయలయనంతర మీతఁడు కర్ణాటరాజ్యమాక్రమించుకొని పరిపాలించెను. క్రీ 1430 ప్రాంతములం దీరాజరత్నము కలఁడు. డిండిమభట్టారకుఁ డనుసంస్కృతకవి యీతని దిగ్విజయాదికమును వర్ణించుచుసాళ్వాభ్యుదయమనుపదునాల్గు సర్గముల మహాకావ్యమును రచించెను. పిల్లలమఱ్ఱి పినవీరభద్ర

కవి యాతని కంకితముగా జైమినిభారతము రచియించెను. ఈతనిపేర "నవరత్న" పద్యములును "సప్తాంగపద్ధతి" పద్యములును రచింపఁబడినవి. వీనికిఁ గర్త పినవీరభద్రుఁడు కాఁదగును.

## నవరత్నములు.

సీ. దినదినంబును నెల్లదివిజులఁ బోషించుఁ
గైరవబంధుఁ డేకార్యకాంక్ష?
అప్పటప్పటికి లోకాంధకారము మాన్చు
నినుఁ డేమిలాభంబు నిచ్చగించి?
సచరాచరం బైనజగతియెల్ల ధరించు
ఫణిపతి యేఫలప్రాప్తిఁ జూచి?
అదనున వర్షించి యఖిలజీవులఁ బ్రోచు
జలధరం బే ప్రయోజనము గోరి?
గీ. పరహితం బాత్మహిత మని పరమపుణ్యు
లన్యు లొనరించుమేలు తా రాసపడరు
సకలభాగ్యోదయ! కఠారిసాళువాంక!
గుండభూపాలునరసింహమండలేంద్ర!
సీ. ఆకారసంపద ననుకరించినవిద్య
విద్యకుఁ దోడైనవినయగుణము
వినయగర్భిత మైనవిక్రమారంభంబు
విక్రమార్జిత మైనవిభవగుణము
విభవానుగుణ మైనవితరణోన్మేషంబు
వితరణోపేత మై వెలయుప్రియము
ప్రియవచోనిరత మై పెంపొందు సత్కృతి
సత్కృతిఁ జేకొన్నచారుకీర్తి

గీ. చారుకీర్తికి నెలవైనపౌరుషంబు
పౌరుషంబున వర్తించు భాగ్యభూమి
భూమి పాలించునృపతికి భూషణములు
గుండభూపాలునరసింహమండలేంద్ర !

సీ. సర్వజ్ఞుఁ డగుమంత్రి సవదరించినరాజు
కార్యఖడ్గమ్ములక్రమ మెఱుంగు
కార్యఖడ్గమ్ములక్రమ మెఱింగినరాజు
బహువిధంబుల మూలబలముఁ గూర్చు
బహువిధంబుల మూలబలము గూర్చినరాజు
శత్రుల నవలీల సంహరించు
శత్రుల నవలీల సంహరించినరాజు
ధరణి యేకాతపత్రముగ నేలు

గీ. కావున మహాప్రధానాగ్రగణ్యబుద్ధి
యధిపుసామ్రాజ్యమునకు సర్వాంగరక్ష
రాయమలవరగండ ! వీరప్రచండ
గుండభూపాలు నరసింహమండలేంద్ర !

సీ. సంగీతధర్మంబు సాహిత్యధర్మంబు
తెలియనేర్చుట ప్రజ్ఞగలఫలంబు
వితరణప్రౌఢియు వినయసంరూఢియుఁ
గైకొంట సంపద గలఫలంబు
కుజనశిక్షణమును సుజనరక్షణమును
గల్గుట నిజశక్తిగలఫలంబు
బ్రాహ్మణభక్తియుఁ బరహితశక్తియుఁ
గావింపు విభవంబుగలఫలంబు

గీ. బట్టువిప్రుండు విద్యార్థి పరఁగ దాత
కిదియ లక్షణ మెన్నంగ నెలమి నెపుడు

సాళువక్షోణిపతివంశజలధిచంద్ర !
గుండభూపాలునరసింహమండలేంద్ర !

సీ. బంగారునకు సౌరభము జనించినయట్లు
కులజుఁ డుత్తమగుణకలితుఁడేని
కస్తూరి నికరంపుఁ గాంతిఁ జెందినయట్లు
ఉత్తమోత్తముఁడు శ్రీనొందెనేని
భావింపఁ జెఱకునఁ బండు పండినయట్లు
నెఱదాత ప్రియవచోనిరతుఁడేని
అలరుగందపుమ్రాన నలరు పూచినయట్లు
శ్రీమంతునకుఁ గీర్తి చెందెనేని

గీ. భవ్యగుణసాంద్ర ! సకలవైభవసురేంద్ర !
సహజదానశిబీంద్ర! భాషాఫణీంద్ర !
సాళువక్షోణిపతివంశజలధిచంద్ర !
గుండభూపాలునరసింహమండలేంద్ర!

సీ. వాహ్యాళిచో మత్తవారణసూకరా
శ్వములఁ గన్గొనుచోట సాముచోట
ఆరగించెడిచోట నౌషధంబులచోట
నిద్రవోయెడిచోట నెలఁతచోట
వేట వెళ్ళెడిచోట విందుచెప్పినచోట
నాటపాటల వేడ్క నలరుచోట
వైద్యుచే......నిఖకటం బైనట్టి
తెరువున నని మొనల్ దీర్చుచోట

గీ. దైవతస్థానవైభవతతులచోటఁ
గ్రొత్తవారలఁ గాన్పించుకొనెడుచోట
నాత్మరక్ష యేమఱకుండునతఁడె రాజు
గుండభూపాలునరసింహ మండలేంద్ర !

సీ. ప్రియముతో నిజమాతృ పితృభక్తి యొనరించు
ధర్మాత్ములకు వేఱె దైవ మేల?
మమతమై సర్వభూతములందు దయగల్గు
ధన్యులకును వేఱె తపములేల?
సరససత్కవికావ్య సరణివినోదించు
వరపుణ్యులకు వేఱె యమృత మేల?
సతతంబు సత్యభాషానిష్ఠ విడలని
కృతకృత్యులకు వేఱె క్రతువు లేల?
గీ. ప్రాణపద మైనలలితాంగిఁ బాయకుండు
పురుషులకు వేఱె దేవేంద్రపురమదేల
రాయచౌహత్తమల్ల ధరావరాహ!
గుండభూపాలునరసింహమండలేంద్ర!

సీ. ధనికులఁ గావింపఁదగదు సోదర్యుల
బడవాలుఁ జేయఁ జొప్పడదు కుటిలు
తగదు దుర్గాధిపత్యము జ్ఞాతి కొసఁగంగ
ధనము కావలిఁ బెట్టఁదగదు ఖలుని
దేశాధికారిఁగా ద్రిప్ప నొప్పదు క్రూరుఁ
జనవు ప్రమాదంబు సాహసునకు
కాదు భీరుఁ దలారికము ప్రతిష్ఠింపంగఁ
గీడు వంచకుని వాకిటను నిల్ప
గీ. నమ్మ ననుమాన మగువాని నమ్మఁదగదు
నమ్మియుండినచోట ప్రాణంబు గనిన
ప్రాణమునకుఁ దగఁజేయంగ వలెఁ జికిత్సఁ
గుండభూపాలునరసింహమండలేంద్ర!

సీ. మంత్రాధిపునితోడ మర్మజ్ఞుతో రాజ
హితునితోడను నిగ్రహింపఁజనదు

అతిమదాంధునితోడ నంగనాశక్తుతోఁ
జెడుగుతోఁ దనయాత్మ చెప్పఁదగదు
నిందితుతోఁ బరనిందాభిలాషితోఁ
గ్రూరకర్మునితోడ గూడఁ జనదు
రాజవిద్వేషితో భూజనద్రోహితో
వంచకుతోఁ బొత్తు వలదు సేయ
గీ. పరఁగ నీరీతిఁ జరియించునరవరునకు
నూరకెవ్వారు మూర్ఖులై వైరులగుచు
నడచిరేని యైశ్వర్యంబు చెడకపోదు
గుండభూపాలునరసింహమండలేంద్ర!

సప్తాంగపద్ధతి యను పేరిపద్యము లేడును జేకుఱినవి కావు. చేకుఱినమట్టున కుదాహరింపఁ బడుచున్నవి.

---

## రాజపద్ధతి.

సీ. ఉత్తమకులజుఁడై యుద్యోగశీలుఁడై
భాషలలిపు లెల్లఁ బరికళించి
వాక్పటుత్వము గల్గి వ్యసనము మాని య
ర్థము గూర్ప దక్షుఁడై శ్రమము దెలిసి
ప్రజలకుఁ జల్లనై బలములఁ బోషించి
సుకృతియై శూరుఁడై శుద్ధిమెఱసి
రాజదోషములు భూరమణుఁ బొందఁగనీక
పరమర్మ భేదియై వెర వెఱింగి
గీ. గుప్తమంత్రుఁడై కుశలుఁడై కొలు వెఱింగి
చారచక్షుఁడై దేశవిచార మరయు
నట్టిసన్మంత్రి గలిగిన యతఁడు రాజు
గుండభూపాలునరసింహమండలేంద్ర!

---

## కోశపద్ధతి.

గీ. తనభుజార్జిత మైనయర్థంబు దెచ్చి
యాయ మెఱిఁగి వ్రయించుచు ననుదినంబు
నరసి భండార మొడఁగూర్చునతఁడు రాజు
గుండభూపాలు నరసింహమండలేంద్ర!

---

## రాష్ట్రపద్ధతి.

సీ. వర్ణాశ్రమంబుల వరుసదప్పఁగనీక
జారచోరాదులపే రడంచి
దేవభూదేవతాస్థితులు పాలించుచు
నల్పవిన్నపమైన నాదరించి
అబలుని బలవంతు లడరి త్రోవఁగనీక
వ్యవహారధర్మముల్ తివిరినడపి
కొలువుమన్నీలలోపలిపోరు లడఁగించు
గళ్ల కూళ్లకు నలజళ్లు మాన్పి
గీ. నిఖిలదేశంబులను జక్క నిజగృహంబు
లరయువిధమున దివ్యాజ్ఞ లనువుపఱిచి
యప్రమత్తుఁడై ధరయేలునతఁడు రాజు
గుండభూపాలునరసింహమండలేంద్ర!

---

## దుర్గపద్ధతి.

సీ. తృణకాష్ఠజలసమృద్ధిని బ్రధానంబుగాఁ
గలకాలమును సమగ్రంబుసేసి
కోట యాళ్వరి కొమ్మ క్రొత్తళంబు లగడ్త
లట్టళ్లు యంత్రంబు లనువుపఱిచి

ధాన్యంబు లాదిగాఁ దగుసవరణ లెల్ల
నొకటియుఁ గొదవ లేకుండ నునిచి
నీతిమార్గంబున నెవరైన దొరలను
బలసి పాళెములందుఁ గొలువునిలిపి
గీ. నగరికావలి సావధానముగ నునిచి
చోద్య మిది యెట్టివారి కభేద్య మనెడు
నట్టు దుర్గంబులం దుండునతఁడు రాజు
గుండభూపాలు నరసింహమండలేంద్ర!

---

## బల పద్ధతి.

సీ. జేడు పైతరువులు పెట్టక చేజేత
తవణదప్పక యి జీతంబు లిచ్చి?
చేరువదొర లిచ్చుజీతంబు వచ్చుట
రాకయుండుట విచారంబు చేసి
యగుపలై తల.........తగ్గినసైనను
గట్టకుండిన వారకముగ నిచ్చి
రణరంగమునఁ గానరా మెలంగినచోట
నుచితంబు లొసఁగుచు నుపచరించి
గీ. ప్రాఁతవారిని గొల్వాస పడనివారి
మూలబలముల మన్నిల మొనలకంటె
నంగళంబుగ నేలినయతఁడు రాజు
గుండభూపాలునరసింహమండలేంద్ర!

---

## మల్కి భరామ్.

ఈతురుష్క ప్రభువు క్రైస్తవ సం. 1550 తరువాత నాంధ్రదేశము నాక్రమించుకొని పరిపాలన మొనర్చినవాఁడు. ఈతనివిజయముల నీచాటువు చాటుచున్నది.

ఉ. ధాటిగ నేఁగియుద్దగిరిఁ దార్కొని వేంకటరాజుఁ దోలి ముం
గోటల లగ్గపట్టి వినుకొండయు బెల్లముకొండ తంగెడల్
పాటిమెయిన్ హరించి మఱి బల్మిని గైకొనెఁ గొండవీడుఁ గ
ర్ణాటకరాజధాని యిభరాముఁడు బాహుబలంబు మీఱఁగన్.

ఈతనిపేర "ఇభరాంపట్టణ" మని నేఁటికిని బుర మొకటి కలదు. తురుష్కుఁడై నను నీతఁ డాంధ్రభాషయం దత్యం తాదరము కలవాఁడై యనేకాంధ్రకవుల నాదరించి ధన మొసఁగి మిక్కిలి విఖ్యాతి నెందెను. పొన్నిగంటి తెలగనార్యుఁ డనుకవి యయాతిచరిత్ర మను నచ్చతెల్గుప్రబంధమును, అద్దంకి గంగాధరకవి తపతీసంవరణోపాఖ్యానమును, నీతని ప్రాపున రచించిరి. కవీశ్వరులగోష్ఠియం దీతనికిఁ గుతూహలము మెండు. ఒకప్పుడు మల్కిభరామ్ ప్రభువు తనయాస్థానమునకుఁ బెమ్మసాని తిమ్మానాయని, ఆనంతపురపు హండెయప్పను, మట్ల అనంతరాజును, బంగారేచమనాయని, పేర మల్లారెడ్డిని, వారి వారి కవీశ్వరులతోఁ బిలిపించి, వారిని బొగడిన పొగడ్తలువిని పింప నాయాకవీశ్వరులఁగోరెనట! ఆకవీశ్వరులు చదివినపొగడ్త పద్యము లివి—

ఉ. చాలు గుఱాలు మాగడినిసంగడిరాజులు గొల్వరం డహో
హాలహలోగ్రఖేలదహనాత్ముని యంతటిధాటివాఁడు నా
యేలిక వేంకటాద్రిధరణీశునితిమ్మఁడు పెమ్మసానిభూ
పాలుఁడు హెచ్చుధాత్రిఁ గలపార్థివు లెల్లరు లొచ్చువానికిన్.

ఉ. మట్టకరాఁడు బెట్టుఱికి మన్నెకుమారులసీమ ధూళిగాఁ
గొట్టక మానఁడేకద యశంతికసింహడలాటరాయఁ డీ
పెట్టినదండుఁ దీఁడు రణభీష్ముఁడు హండియయప్పశౌరికిన్
బెట్టుఁడు వేగ దండములు బింకము లేటికి శత్రుభూపతుల్!

ఉ. కొద్దినిరాఁడు దిం డుటికి కోటలుకొమ్మలు గొన్నశూరుఁ డా
గద్దఱిగప్పిరాచపులి గండరచాలుఁడు మ ట్లనంతుఁ డే
ప్రొద్దును వైరిభూభుజులపొంక మడంపనె పుట్టినాఁడు మీ
పెద్దఱికాలు సాగ విఁకఁ బ్రేలకుఁడీ కుడిమన్నెభూపతుల్ !

ఉ. టెక్కునఁ గొండతోఁ దగరు ఢీకొని తాఁకినజోకగాక యీ
బిక్కపకీరుమన్నెసరిబేసిదొరల్ మొనలందు నిల్వనా!
నిక్కము బంగరేచనృప! నీవు రణస్థలి మోహరించినన్
బక్కున లోకముల్ పగిలి పాఱవె కూలవె దిగ్గజంబులున్?.

చ బలరిపుభోగ కృష్ణనరపాలునిపేరకుమారమల్ల! మీ
కలితయశఃప్రభావములు కన్గొనలే కలకట్టుమన్నెమూఁ
కలు తల లొల్లరో బిరుదు గద్దియముల్ చదివించుకొందు రా
కొలఁది యెఱుంగనేర కలుకక్కలు మక్కలఁ జూచి హాయవే.

పేరమల్లారెడ్డిపొగడ్తకుఁ దక్కినరాజు లెల్లరు నాగ్రహభరితులై యుద్ధసన్నద్ధు లయిరట! అంతట మల్కిభరామ్ ప్రభువు "ఈపొగడ్తవలనఁ బొగడినవారికి న్యూనత యేర్పడును గాని మీ కేమియుఁ గొఱతకల్గ"దని చెప్పి వారిని శాంతింపఁ జేసెనట!

ఈతనిపైఁ జెప్పఁబడిన చాటువులు.—

సీ. నవ్వెనా సంగీతనాదభేదవిధిజ్ఞ
ధీరాత్ములకుఁ బదినూఱులిచ్చు
రమ్మనెనా సభాప్రౌఢసత్కవివర
జాలములకుఁ బదివేలు నిచ్చు
కూర్చుండు మనియెనా గురుతరశాస్త్రజ్ఞ
లక్షణవిదులకు లక్షయిచ్చు

సాహెబానురా యన్న సకలాశ్రితానేక
కోవిదులకు మెచ్చి కోటియిచ్చు

గీ. బళిర! చతురబ్ధిమేఖలాకలితధాత్రి
చక్రనిర్వక్రపాలనాచారుకీర్తి
రమ్యముక్తాతపత్రరారాజితుండు
చారుతరమూర్తి! యిభరాముచక్రవర్తి?

సీ. కర్ణాటకాధీశుకంఠమాలికమీఁదఁ
గురురాజుముత్యాలగొడుగుమీఁద
వింధ్యదేశాధీశువెల్లవల్వలమీఁద
గౌళేశువజ్రాలగద్దెమీఁద
పాంచాలభూమీశుపట్టుపల్లముమీఁదఁ
బాండ్యభూపతివెండిబరణిమీఁద
బంగాళజననాథుపాంచజన్యముమీఁదఁ
గుకురేంద్రుధవళగోళకముమీఁద

గీ. ఆడిపాడించు నటియించు నవఘళించు
మెచ్చికుప్పించు గెరలించు మేబళించు
సంతసంబున నీకీర్తి జలజనేత్ర
మానవోపేంద్ర! యిభరాము మండలేంద్ర!

ఉ. రా యిటు భట్ట! యేమికవిరత్నము! పిల్చితి; వీవి పద్యముల్
ఏయవనీశుపై?; నృపకులేశ్వరుఁడౌ నిభరాముశాహిపై;
నాయతపుణ్యమూర్తి యతఁ డర్థులు వేఁడిన నిచ్చు; నిచ్చునా
వేయును రెండువేలు పదివేలును! లక్షలుఁ గోట్లు నిచ్చు; నౌ!

కవిత్వము నేర్చినవారికేఁ గాని మల్కిభరామ్ ప్రభువు సమ్మానము మెండుగాఁ గావించుచుండెడివాఁడు కాఁడట! ఒకప్పుడు కవిత్వము నేరని చతురు లిరువురు "కరయుగమును"

"యరలవమదనస" యనుకందపద్యములను దలలు మార్చి మల్కిభరాము ప్రభువున కన్వయించునట్లు చదివి పెద్దగా సమ్మానింపఁబడిరట.

క. కరయుగమును జరణంబులు
నురము లలాటస్థలంబు నున్నతభుజముల్
సరి ధరణి మోపి మ్రొక్కిరి
మఱిమఱి నీశత్రులెల్ల మల్కిభరామా!

క. యరలవమదనస యనుచును
బరువడి నీయక్షరములు భయనయతతులన్
నిరతమును వ్రాయ నేర్చిరి
మఱిమఱి నీపుత్త్రులెల్ల మల్కిభరామా!

ఉ. ఏడు కులాద్రులెక్కి వెస నేడు పయోధులు దాఁటి లీలమై
నేడవు దీవులం దిరిగి యేడుగడన్ విహరించి కీర్తి యీ
రేడు జగమ్ములన్ వెలయ నేచినమల్కిభరాముచంద్రుఁడే
యేడవచక్రవర్తి యను నేడవరాజు ధరాతలమ్మునన్.

ఉ. రాజును రాజుగాఁ డతఁడు రాహుముఖంబునఁ జిక్కె, వాహినీ
రాజును రాజుగాఁ డతఁడు రామశరాహతిఁ దూలె, దేవతా
రాజును రాజుగాఁ డతఁడు రావణసూతికినోడె, నాజిలో
రాజనరాజుమల్కి యిభరాముఁడె రాజు ధరాతలంబునన్.

ఉ. రాముఁడు దుక్కిముచ్చు, రఘురాముఁడు క్రోఁతులరాజు, రేణుకా
రాముఁడు పోటుబంటు, పటురాగసమంచితుఁ డైనగోపికా
రాముఁడు వెట్టిగొల్లఁ డిఁక రాష్ట్రములందు సమానులేరయా
రాముల నెంచిచూడ నిభరామ మహీధవ భవ్యవైభవా!

చ. మలికిభరామభూప! మహిమండలరాజకులప్రదీప! నీ
పలుకు శిలాక్షరం బితరపార్థివకోటులపల్కు లన్నియున్

జలలిపు లెండమావులు (......) బూడిదపాల్లునీరబు
గ్గలు పడగల్లు (......) శారదమేఘజాలముల్!

ఉ. రార విధాత! యోరి వినరా! తగురా! తలకొట్లమారి! ని
ష్కారపులోభిరాజులను జంపక మల్కిభరామభూవరున్
జారుయశోధనున్ సుగుణిఁజంపితి వర్థుల కేమి దిక్కురా
చేరిన నింతరాజును సృజింపఁగ నీతరమా వసుంధరన్?

---

## మైసూరి చిక్కదేవరాయలు.

ఈతఁడు పదునేడవశతాబ్దియందు మైసూరుప్రభువై పేరెన్నిక గన్నవాఁడు. ఈతనిపేర సంస్కృతాంధ్రకర్ణాట భాషలలోఁ గొన్ని గ్రంథములు రచింపఁబడినవి.

సీ. స్వస్త్యస్తు విశ్వవిశ్వంభరాభరణైక
దక్షదక్షిణభుజాస్తంభ! నీకు
విజయోస్తు నిర్వక్రవిక్రమక్రమకళా
పరిభూతవిద్విషత్పటల! నీకు
మహనీయతాస్తు సామంతచూడారత్న
రుచిరదాంగదస్ఫారచరణ! నీకు
హర్షోఽస్తు పృథుశాశ్వతైశ్వర్యధూర్ధుర్య
సౌందర్యధుర్యతాశ్చర్య! నీకు

గీ. వివిధవిభవోఽస్తు సత్కీర్తివిజితరజత
తారకాదారతారకాదారవార
హారనీహారదివిషదాహారరుచిర
హార! మైసూరిచిక దేవధీర! నీకు.

సీ. శ్రీమించు జడదారి చికిలి డెందపు టాట
పట్టువాఁ డపరంజి పట్టువాఁడు
తనభక్తులగువారి తప్పు లన్నియును మ
న్నించువాఁ డనుకంప నించువాఁడు
తలఁచినఁ జాలుఁ బాతకము లన్నియు రాచు
పేరువాఁ డరదంపుఁ బేరువాఁడు
తఱచు లెవ్వియులేక తానయై త్రైలోక్య
మేలువాఁ డిందిర మేలువాఁడు

గీ. రంగరమణుఁ డభంగసామ్రాజ్యలక్ష్మి
నోసఁగుఁ గాత నిజాంఘ్రిసారసముదాళి
పటలదరిపీఠమకుటాగ్రఘటితదివిజ
రాజమణికిని జిక దేవరాజమణికి.

సీ. జంగమార్చనము భూషాయమాణమహాభు
జంగమార్చనము నేజాణ సేయు
చారదర్శనము సజ్జనశుద్ధమగు శివా
చార దర్శనము నే సరసుఁ డెఱుఁగు
దేవమాన్యములు సంభావితాభోగ భూ
దేవ మాన్యములు నేధీరుఁ డొసఁగు
రణపరాక్రమము దుర్ధర ధరాధరవిదా
రణపరాక్రమము నేరాజు గాంచు

గీ. అతఁడు పొగడొందు నెందు సుదగ్రనిజభు
జాగ్రజాగ్రన్మహామండలాగ్రఖండి
తాగ్రహగ్రహదుర్నిగ్రహారిహారి
పాలనవిహారి చిక్కభూపాలశౌరి.

సీ. సిరి మించు.........
పఱపువాఁ డొకఁడు నీ యొఱపువాఁడు

కళుకు బంగరుపట్టు గరుల సింగిణి కోపుఁ
బఱపువాఁడొకఁడు నీయొఱపువాఁడు
కడలిరాయలతరంగముల చిందులు పొందు
పఱపువాఁ డొకఁడు నీయొఱపువాఁడు
నునుఁబూల రెండు నొండుగ నేయు విలువిద్య
పఱపు వాఁ డొకఁడు నీ యొఱపువాఁడు
గీ. విక్రమవిభూతి గానవాగ్విలసనముల
నౌర! యాహవధీర! సాహసకుమార!
కోవిదవిధేయ! హగలుగగ్గోలురాయ!
రాజదేవేంద్ర! చికదేవరాజచంద్ర!
సీ. కడఁగి వీరాధివీరుఁడు వచ్చె నని పురి
గలచువారును దారి మఱచువారు
హగలుగగ్గోలురాయఁడు వచ్చె నని చెట్లఁ
దారువారును గట్లఁ జేరువారు
గడిమన్నెదొరలగండఁడు వచ్చె నని కూలి
పొరలువారలు జాలినొరలువారు
ఘోరాజివిక్రమార్కుఁడు వచ్చె నని నీళ్ళ
చొచ్చువారును గాళ్ళ చచ్చువారు
గీ. నగుచుఁ దారెలగోల్ హళాహాళికి నళికి
పఱచునిజబల మాజికిఁ బఱపలేక
పఱచె నిక్కేరిశివ్వభూవరుఁ డయారె
రాజదేవేంద్ర శ్రీదేవరాయచంద్ర!
సీ. డాసి ఢిల్లీకవాటములు వాటములయ్యె
గోలకొండకుఁ గొత్తళాలు బలిసె
తగవిజాపురి నగడ్తలు పొగడ్తలు గాంచెఁ
గటకార్గళములు మిక్కుటము లయ్యె

ప్రబలి కల్బరిగవప్రములు దీప్రములయ్యె
నాగడా నుక్కడా లతిశయిల్లె
కొల్లూరు పలుదెఱంగులపిరంగులఁ బొల్చె
బెడదకోటకు రస్తు బెడిద మయ్యె
గీ. ఔర తొల్జగడాన నీ ఐతిమి తతిమి
నిక్కు నిక్కేరిశివ్వప నేని సరగ
విఱుగఁ బొడిచినయావార్త విన్నవాఁడె
యాహవోపేంద్ర! దేవరాయక్షితీంద్ర!
మ. కడిమిన్ మైసురిదేవరాయలకు రంగస్వామివెన్నాసగా
నడువన్ దండి నఖండచండిమపుఖండాల్వాని చాముండి యొ
ల్లెడలన్ దోడును నీడ యై నడువఁగా నిక్కేరిలండీలవం
గడపుం బ్రాపయి నిల్చె నంతకుఁ డహంకారంబు దా నెట్టిదో.
సీ. చూచినఁ జాలదా సుల్తానహమ్మదు
పాదుసాయెదఁ దాకు నీదుబాకు
ఎవిరినఁ జాలదా యిక్కేరిశివ్వప
నేనిపాలిటిమిత్తి నీదుకత్తి
కవిసినఁ జాలదా రవణించురాయదు
నేదారులకుమారి నీదుచూరి
మలసినఁ జాలదా మధురతంజాపురీ
నేతలపై దూఱు నీదుబారు
గీ. పరనృపతు లెంత నీ కెంత దొరకు రాయ
భేరికాభూరికాహళాభీలమకర
మర్తుబాంకుశదోనేజమహితబిరుద
రాజదేవేంద్ర! శ్రీదేవరాయచంద్ర!
ఉ. మీజముదాడివాఁడి కడిమిం గడి మించినదుండగీలఁ జెం
డేజముదాడి యొక్కరవడిన్ రవడిం డెడు మీకడింది ఖం

డాజగడంబు కవ్వడి కడంగడు పెన్ జగడం బయారె నీ
తేజులు దేవరాయనృపతీ! జగతీతరుణీపురందరా!.

మ. కడిమిన్ మైసురి దేవరాయమణి ఖడ్గాఖడ్గిచేఁ బోరుపా
రిడినన్ డీకొని నిల్వలేక యిహిహీ యుక్కేరి శివప్పనా
యఁడు దానూడనిఁ బాడెఁగాక కళ్యాణాగడాబాగడా
గడవై రాగడశాగడా శహగడాఖానుల్ మదింగుందఁగన్.

మహాస్రగ్ధర. గడిసీమల్ దేవరాయాగ్రణిఁగని బెగడుల్ గాంచుటేవింతవై రా
గడరాడాలాహురాంబాగడశహగడమక్కామహల్గోలకొండా
గడఢిల్లీమాహురాసాగరకలుబరగీఖానవర్గంబు కేడా
క్కడమాత్కారం బటంచున్ గడగడ వడఁకున్ గర్జ విన్నప్పు డెల్లన్.

మ. కలకాలం బరిదైన శివ్వవసుధాకాంతుండు శ్రీరంగరా
యలఁ జేపట్టుక నేఁము తా గెలుచునో యాచంద్రతారార్క మా
జలజాతప్రభవాభవాదిసురపూజల్ గాంచు శ్రీరంగరా
యలు చేపట్టిన దేవరాయల కసాధ్యం బెద్దియుం గల్గునో!.

మ.గడిసీమల్ బెగడక్ విజాపురము వేఁగన్ గోలకొండన్ హడా
హడి పుట్టక్ గటకంబు డంబుచెడి ప్రయ్యక్ జెంజితంపూపురుల్
వడఁ కందన్ మధురక్ మహాభయము పర్వ న్నీ బలం బాజికిన్
వెడలున్ డీకొనువార లేరి యిఁక నుర్విన్ దేవరాయాగ్రణీ!.

చ. గడగడ వన్యభూమి వడఁకక్ గడకన్నులఁ గెంపునింపు న
ల్లడగడిరాజు లెల్ల నళుకందళుకన్ జిగివాలుఁ బూని పే
రడవులరాతికోటు లరయన్ నెరయందవుఁదేజి నెక్కి నీ
పుడమిని దేవరాయనృపపుంగవుఁ డీఘనుఘాకరొట్టిదో!

శా. కట్టున్ మట్టును మీఱు నగ్గలికలగ్గల్ పట్టి యారోడ్డు తాఁ
గట్టల్కం జలపట్టి కట్టుకొని యక్కా రెడ్డిఁ జేపట్టు గాఁ
పట్టెన్ బట్టినమాత్రమా కరుణచేఁ బాలించి లాలించి చే
పట్టెన్ మాయురె చిక్క దేవధరణీపాలుండు సామాన్యుఁడే?.

మ. ధరణీచక్రము వక్రవిక్రమముచేతన్ నేనె సాధించి భూ
సురులం బ్రోవనె పుట్టినాఁడ నిదె యంచున్ వామపాదంబునం
బిరుదుం బెండెము పెట్టినాఁడవట యెంతే మమ్ముఁ బోషింప నీ
కరుదే మైసురిదేవరాయనృపచంద్రా! సాంద్ర తేజోనిధీ!.

మ. శ్రీరంగైకవిహారి శౌరి భువనక్షేమంకరప్రాభవో
దారస్ఫారకృపాకటాక్షములచేత న్విశ్వవిశ్వంభరా
ధౌరంధర్యకళావిశేషవిలసద్బాహార్గళుం డైన మై
సూరి శ్రీచికదేవరాయలకు నిచ్చున్ శాశ్వతైశ్వర్యముల్

సీ. కురు విరాట వరాట కరహాటనృపజూట
తటకిరీటములపైఁ దాఁగి తాఁగి
చోళ నేపాళ పాంచాల భూపాలవి
స్ఫాలఫాలములపై వ్రాలి వ్రాలి
యంగ గౌళ కళింగ వంగ బంగాళరా
డుత్తమాంగములపై నుఱికి యుఱికి
కుకుర కాశ కరూశ కోసలక్ష్మాధీశ
మాంసలాంసములపై మలసి మలసి

గీ. యొవ్వనిభుజాసి జయలక్ష్మి నెసఁగి యుండు
నతఁడు పొగడొందు నెందును నసమసమర
విస్ఫురచమూసమూహ సాహసధురాప
రాజితనతారి చికదేవరాయశౌరి.

సీ. కడఁగి వైరాగడాగడగడాగడపడం
తులపాపటలకు సిందూరరజము
గోలకొండ బెడందకోట విజాపుర
స్త్రీలచన్నులకుఁ గాశ్మీరరసము
కటకకళ్యాణమక్షావధూకబరీభ
రములకుఁ జంపకప్రసవసమితి

అనుదానగరఢిల్లీ మాహురాపురాం
గనలమోవులకు లాక్షాద్రవంబు
గీ. తానయై యుండు నేయశోధనుని తేజ
మతఁడు పొగడొందు నెందును నసమసమర
సాహసకళావిహారి దుస్సహవిరోధి
రాణ్మదవిదారి చికదేవరాయశౌరి.

సీ. గడిదొరల్ గడగడ వడఁక నీరోడుపై
గగ్గోలుపడి కోట గట్టుకొనియె
దిక్కుదిక్కులవార్త కెక్కునక్కారెడ్డి
నట్టిట్టుచేసి చేపట్టుపట్టె
తోడ్తోడ గంధసింధుర సైంధవవ్రాత
ముడివోనికడిమిచే నొడిసి తెచ్చె
శ్రీదేవితో జయశ్రీ లెదుర్కొనుచు రాఁ
గీర్తిప్రతాపవిస్ఫూర్తిఁ గాంచె
గీ. ఔర కేతనపటపటాత్కారధీర
కరటిఘీంకారపటహభాంకారవీర
వారహుంకారచాపటంకారఘోర
రణవిఘటితారి చికదేవరాయశౌరి.

గీ. పంజరమున నుంచి పండ్లు చక్కెర లిచ్చి
మాట నేర్చి చిలుక మనుపువట్లు
నిండ్లొసంగి ధనము లిచ్చి విద్యలు నేర్పి
ప్రోవు బుధులఁ జిక్కదేవవిభుఁడు.

లయ. లిబ్బివిరిబోణిదయ గుబ్బతిలుసంపదల
నుబ్బుచికదేవవిభునిబ్బరపుఁదేజం
బబ్బురము లైనతరిమబ్బులనపైఁబడదు
గబ్బితనపుందురుక బెబ్బులులబిబ్బి

గుబ్బెతలతండములసిబ్బెపుమిటారివగ
లబ్బుబిగిగుబ్బచనుగుబ్బలులమీఁదన్
జొబ్బిలుమృగీమదపుగబ్బులు వెసం దొలఁగ
గ్రొబ్బుచు దిగంతముల గెబ్బుచు మెలంగున్.

చ. ఒకచెలి యొక్కచే వెనుక నుంచి కనుంగవ మూసిపట్టి వే
ఱొకకర మెత్తికొ మ్మనుచు నొక్కతెకుం గనుసన్నచేసిన
న్నొకపరి ముద్దు వెట్టుకొన నొక్కతె వెంటనె వచ్చి మెచ్చె దా
నికిఁ జికదేవరాయ లొకనేర్పున వంచనసేయకుండు నే?

సీ. సెనరుఁజూపులు వాఁడిఁ దనరుతూపులు భక్తి
పరులపై నరులపైఁ బఱపువాఁడు
చుట్టుకెదువుఁ దమ్మిఁ బుట్టునెదువు సైజ
కరమున నురమునఁ గలుగువాఁడు
చందుఁ గేరెడుతమ్మివిందుమీఅడుశంఖ
రాజంబు తేజంబు గ్రాలువాఁడు
కెంపుపావలు విడియంపుశేవలు నాత్మ
పదముల రదములఁ బరఁగువాఁడు

గీ. రంగరమణుఁ డభంగసామ్రాజ్యలక్ష్మి
నొసఁగుఁగాత నిజాంఘ్రిసారసమదాళి
పటలదరివీరమకుటాగ్రఘటితదివిజ
రాజమణికిని జికదేవరాజమణికి.

సీ. అరికాంతలమునుంగు తెరలఁదెంపరలాడి
కడుఁ బొగడొందుజిష్ణుఁడవు నీవు
కళలచే విబుధలోకముల కెంతయుఁ బ్రీతి
నెఱపఁ జాలినకళానిధివి నీవు
సర్వసర్వంసహాచక్రంబు జీవనా
కలనచే నలరించుఘనుఁడ వీవు

మహనీయముగ సర్వమంగళావాప్తిచేఁ
గర మొప్పురాజశేఖరుఁడ వీవు

గీ. అవుర! నృపమాత్రుఁడవె మహోదగ్రనిజభు
జాగ్రజాగ్రదనర్గళోగ్రాసిజప్ర
తాపతపనప్రతాపితోద్దండరిపునృ
పాళి శ్రీచిక్కదేవభూపాలమౌళి.

మ. అమృతం బానకయున్నఁ దద్రుచులపై నాసక్తియే కల్గదా
యమృతం బానినమీఁద మానవశమా? యాహా! భవద్విస్ఫుర
త్కమనీయోక్తులు నట్లగాదె? యిఁకమీఁదన్ గ్రోలకెట్లుందు నే
నిమిషంబేనియుఁ జిక్కదేవనృపతీ! నిస్తంద్రసాంద్రద్యుతీ!

---

## కోటి రాయరఘునాథరాయలు.

ఈతఁడు పుదుకోట ప్రభువు. పదునేడవశతాబ్దివాఁడు. ఆంధ్రభాషార్ణవకర్త నుదురుపాటి వెంగన యీతనియాస్థానకవి.

---

### తురంగ పంచకము.

సీ. ఆస్కందితాశుప్రహసితాశుగోద్యత్త
రంగమం బగు నీతురంగమంబు
ఘోరితకత్వరోద్ధతిధుతస్థావర
జంగమం బగు నీతురంగమంబు
రచితోద్వేగాధరీకృతహరిభృద్వి
హంగమం బగు నీతురంగమంబు
వల్గితస్యదవినిర్భగ్నఫణాద్యభు
జంగమం బగు నీతురంగమంబు

గీ. ప్లుతజవవినిర్జితసురాశ్వవితతగమన
చంగమం బగు నీదుతురంగమంబు
కలితగుణపేటి! కవికోటికల్పవాటి
రాయరఘునాథ పంచణ ప్రభుకిరీటి!

సీ. పుటములు ద్రొక్కెనా కుటిలారిరాజన్య
కోటికోటీరముల్ కుదియఁబడును
జోడెనల్ చూపెనా శూరవీరకఠోర
గంధాంధసింధురఘటలు చదియు
చౌ దాఁట్లు దాఁటెనా సామంతభూపాల
జవనకంఖాణముల్ ప్రగ్గి మ్రొగ్గు
వేడెముల్ తిరిగెనా విమతులపురములు
గాలిచక్రములకరణిఁ దిరుగు

గీ. బళిర రవగాలు ఘటియింప భండనమున
వెడఁదయురములు బరులును విఱిగివిఱిగి
దొరఁగు రిపుకోటి నీదెరా బిరుదు కోటి
రాయరఘునాథ పంచణ ప్రభుకిరీటి!.

సీ. కదలిక చూపెనా కక్కసంపదు వేల
గుండెలు కలఁగు గగ్గోలుగాను
దులదుల నడచెనా దుర్దాంతసామంత
బలములగముల గర్భములు గలఁగు
పరువులు వాఱెనా పరిపంధినరపాల
చిత్తముల్ మెత్తనై తత్తళించు
కరికరి నెదిరెనా గర్వితారాతిరాట్
ప్రాణంబు లటునిటు పఱచి వెఱచు

గీ. దూఱి రణమున హాదలికల్ మీఱఁగాను
ఖురపుటోద్ధతు లడరంగఁ గొట్టి మెట్టఁ

దొరఁగ రిపుకోటి నీదెరా బిరుదు కోటి
రాయరఘునాథ పంచణ ప్రభుకిరీటి.

సీ. సమరాన శాత్రవసమితిశిరోజముల్
గసకస ఘాసమ్ముకరణి నవలి
కదనాన విమతులకండలు గుండెలు
ఝుళఝుళ కబళమ్ముసరణి మెసఁగి
ప్రధనాన మార్తుఱప్రక్కలు డొక్కలు
కరకర ఖాణంబువరుస మెక్కి
బవరానఁ బరరాజవరులరక్తంబులు
గళగళ జలములగతిని గ్రోలి

గీ. మొట్టి మర్దించి చుట్టుక మెదలనీక
గొట్టి గోరింప రణమున గుండె లవిసి
తొరఁగ రిపుకోటి నీదెరా బిరుదు కోటి
రాయరఘునాథ పంచన ప్రభుకిరీటి!

సీ. గర్వాంధపరిపంథిగంధసింధురముల
కొమ్ముకత్తుల మొనల్ కొట్టి కొట్టి
చెనఁటిదునేదార్ల శిరముల గొగ్గిల
గొలుసులు వీడంగఁ గూల్చి కూల్చి
మూర్ఖారివీరులౌ ముసలమానులమోము
ముక్కుదూలము లూడ మోఁది మోఁది
ఘోరవజీమోటుజీరాలయుంగరాల్
చెదరి ఝల్లన రాలఁ జెండి చెండి

గీ. చీతి తూఱుచు ఖురములఁ జించి చించి
పేరెములు వార బారువ వెంట లగుచుఁ
దొరఁగ రిపుకోటి నీదెరా బిరుదు కోటి
రాయరఘునాథ పంచణ ప్రభుకిరీటి.

---

## వెలుగోటివారు.

వీరిచాటుపద్యములు పరశ్శతముగా నున్నవి. మచ్చునకుఁ గొన్నిమాత్ర ముదాహరించెదను. వేంకటగిరిప్రభువులు వాని నన్నిటిని ముద్రింతురుగాక!

చ. కదనమె బొమ్మరిల్లు చెలికత్తెలు వీరజయాంగనామణుల్
మదకరిమస్తకుంభముల మాటికి దొంతులు సంగరస్థలిన్
గుదిగొని పక్షరాహుతుల క్రొవ్వులు గుజ్జనగూళ్ళు బాపురే
పొదలెడు రాయరావు ననపోతయ ధర్మని ఖడ్గపుత్రికిన్.

ఉ. మత్తుఁడు కూర్మరాజు విషమత్తుఁడు నాగవిభుండు మిక్కిలిన్
మత్తుఁడు సూకరాధిపుఁడు మత్తగజంబులు తిండిపోతు లీ
తొత్తడికాఁపురంబు తులఁదూఁగ దటంచును రత్నగర్భ నీ
పొత్తుల నీభుజాబలము పొందెనహో యనపోతభూవరా!.

శా. ఏమీ శేషుఁడ? ఏమినారద; ముదంబేపారునా! తోంటి వి
శ్రామంబేమియులే; దదేమి? ససిమీ అన్ రావుసింగాంకుఁ డు
ద్దామప్రౌఢి జయింప సోమకులగోత్రాధీశ్వరుల్ జోగులై
భామల్ దామును బాములన్ వెదకఁగా బాతాళముల్ దూఱితిన్.

చ. కుదురుగ మిమ్ముఁ గొల్చి వెలుగోటిపురీంద్ర! కొమారతిమ్మ! నిన్
గదియఁగ నగ్రహారములు కైకొనఁజాతురు భూసురోత్తముల్
బెదరక నీకరాసిహతిఁ బెల్కురి వైరులు బోయి యూర్వశిన్
గదిసి కుచాగ్రహారములు కైకొనఁ జాతు రదేమిచిత్రమో!

ఉ. రంగపనేనియబ్బనృపరత్నము గోపనృపాలుధాటికిన్
సంగరరంగభూములను శాత్రవకోటులు నిల్వలేక సా
రంగముఖీలలామలను రాజ్యతురంగకవీంద్రసంపదల్
సంగతి నప్పనం బొఁసగి శైలములన్ విహరింతు రెప్పుడున్.

మ. తలఁపెల్లన్ హరిభక్తియుక్తి దినకృత్యం బెల్ల ధర్మక్రియల్
నిలువెల్లన్ దయ రూపమెల్ల యొడలన్ నిర్గర్వ మశ్రాంతమున్
కొలువెల్లన్ గవిగాయకాళి యితరక్షోణీశ్వరుల్ సాటియే
వెలుగోట్యన్వయనారసింహ సకలోర్వీనాథ రాయన్నకున్?.

ఉ. ఆలములోన సింగవసుధాధిపనందన! యన్నపోతభూ
పాలక! నీకు నోడి యనిఁ బాఱినవైరుల నాలభంగి నే
తోలుదుగాని చంపనటు దోస మటంచును నౌర! గాయగో
వాళుఁడ వైననీకుఁ బశువర్గముఁ గాచుట నైజమే గదా!

క. ఇనువెనుకయ గ్రహచక్రము
వినుతామరవర్గమెల్ల వెనకయ వెనుకే
జనపతులు సాహసంబున
ననపోలనృపాల! నీకు నందఱు వెనుకే.

చ. అగణితకీర్తిలోల! సుగుణాకర! దాచయవెన్నభూప! నీ
పగతులు కొండలెక్కఁ దమభామలకోమలదేహదీధితుల్
జిగిగొని నిండినన్ గుహలఁ జీఁకటివాసినఁ దమ్ముఁ గాంతురన్
దిగులునఁ గస్తురిన్ వెదకి తెత్తురు మేనుల మెత్త న త్తఱిన్.

ఉ. బల్లరగండ లింగవిభుపాదమునందుఁ బసిండియందె తా
ఘల్లురుఘల్లుఘల్లురని ఘల్లని మ్రోయఁగ భీతి గుండియల్
ఝల్లురు ఝల్లుఝల్లరని ఝల్లున నల్లలనాడుచుందురా
యల్లయరెడ్డివేముఁడును నాతనితమ్ముఁడు వీరభద్రుఁడున్.

క. తమ్మ తమకెంతప్రియమో
తమ్మకుఁ జెయిసాఁచి రిపులు తలక్రిందై నీ
తమ్మపడి గాన నుందురు
బొమ్మలక్రియ రావుదాచభూవరుసింగా!

ఉ. ఈక్షితిఁ గాశికానగరి నీల్గినమాత్రఁ లభించు నెంచఁగాన్
భిక్షువుఁగాఁడు యాచధరణీతలనాథవతంసు ఖడ్గధా

రాక్షతి మేనుఫీడిన యరాతికిఁ గల్గు సుధారసంబు త
దై భక్షము మంచిదో యమృతపానము మంచిదొ యెంచిచూడఁగన్.

మ. అరుదౌనీబిరుదప్రతాపములు కల్యాణాద్రిపై నుండి కి
న్నరగంధర్వసతుల్ సదా శ్రుతిపుటానందంబుగాఁ బాడఁగా
నరరే బాపు బళీ సెబా! సహహా యౌరా! మే! లహో! యందు ర
య్యరివీరుల్ వెలుగోటి యాచవిభురంగా! సంగరత్నార్జునా!

ఉ. అంచితరాయరావుబిరుదాంకమురాజులఁ గొట్టి యందెఁ గీ
లించినమాదభూవిభునిలింగనృపాలున కొప్పఁగాక గ
ర్వించిన నీకుఁ జొప్పడునె వేమఅవల్ల యవేమరెడ్డి! పో
కొంచపుఁ దమ్మిండితినుకూళకు సింహతలాట మేటికిన్?.

ఈవంశమున సర్వజ్ఞసింగభూపాలుఁడు, విద్వత్కుమార యాచమనాయఁడు మొదలగు విద్వత్ప్రభువులు వెలసినారు. విద్వత్కుమార యాచమనాయని వైదుష్యదాతృత్వములకు ద్యోతకముగా నీక్రిందివిధమున నొక కథ యున్నది.

"విద్వత్కుమార యాచమనాయఁడు. ప్రభుత్వము చేస్తుండగా, ఒక విద్వాంసుఁడు ఆస్థానముకు వచ్చి శాస్త్రప్రసంగము చేసి సంస్థానపండితులను వోడగొట్టెను కుమారయాచమనీడు మిక్కిలి సంతోషించి ఏమి కావలెనో కోరుకొండని పండితునిఅడిగెను.ఆయన దేవరసంస్థానములోనామనోవృత్తికి చాలినంత భూమి దయచేసి, నానిత్యకర్మానుష్ఠానములు చక్కగా జరిగేటట్టు, అనుగ్రహించవలసినదనికోరెను. ఏవూళ్ళో ఏపొలముకావలెనో, మీరే సస్యగర్భముగా చూచుకొని వచ్చి చెప్పితే సర్వమాన్యముగా దానపత్రము వ్రాయించి యిప్పిస్తున్నామని రాజుగారుసెలవిచ్చిరి ఆపండితుఁడు వారితాలూకాలో తీర్థం

పాడనే వూరికిపోయి అక్కడ జలసమృద్ధి, స్థలసమృద్ధి చూచుకొని తనస్నానసంధ్యాద్యనుష్ఠానములకు, అనుకూలంగా ఉన్నదనుకొన్నాఁడు. ఆవూరిచెఱువుకు దక్షిణపుతట్టుపొలం తనకు వనరుగా భావించెను. రాజుగారి దగ్గరకువచ్చి, ఆసంగతి విన్నవించి అక్కడిఆచెఱువుదక్షిణపుచేనుకు దానపత్రంపుట్టించుకొనెను. ఆవూరికి బోయి గ్రామస్థులతో మాట్లాడి గ్రామకరణమును సంతోషపెట్టి తనదానపత్రము చూపించెను. "ఆయ్యో బ్రాహ్మడా! చెఱువుకు ఉత్తరపుచేను సుక్షేత్రమై వుండగా వట్టిచౌటిపఱ్ఱ, దక్షిణపుచేను కోరుకొన్నావేమిటి? మాతో చెప్పక వెఱ్ఱిపనిచేస్తివి" అని కరణంచెప్పేటప్పటికి, ఆపండితుఁడు "సరి కుదురుతుందిలే" అని లోలోపల నరిచూచుకొని, "అయ్యా! నేను కోరినదిన్నీ అదేనండీ! అట్లాగేవ్రాయించినా"నని ఆయనకేదో చెప్పి లోబరుచుకొని, చెఱువుకువుత్తరపుచేనే విడుదలపెట్టించుకొన్నాఁడు. దాన్ని సాగుబడిచేసేకైతును వెళ్లగొట్టి తనసేద్యగాళ్లను చొప్పించి తగవుసాగించినాఁడు. అంతట ఆభూమికాపు రాజుగారిదగ్గిర ఫిర్యాదుచేసుకొనెను. పిలిపించి, "యిదేమిటి? మీ రిట్లాచేయవచ్చునా?" అని రాజుగారు పండితుణ్ణి అడిగిరి. "తమరు దానపత్రంలో వ్రాయించినప్రకారం చెఱువువుత్తరపు చేనే నేను లోబరుచుకొన్నాను. నాతప్పేమి?" అనిపండితుఁడనెను. స్వయముపండితుఁడు గనుక ఆరాజు, "ఓహో! చెఱువువుత్తరపుచేననగా ఏచేనుకు చెఱువు వుత్తరముగావున్నదో ఆచేనని అర్థముచేసినాడుసుమా" అని గ్రహించి, "బహువ్రీహిచేస్తిరా?" అనెను. "దేవరవారు దయచేసినభూమి బహువ్రీహిగాకఅల్పవ్రీహికావచ్చునా" అని ఆపండితుఁడుచమత్కరించెను.

బహువ్రీహి అనగా హెచ్చుధాన్యము కలది - బహువ్రీహి అనే సమాసమున్న అర్థము. విద్వత్కుమార యాచమనాయనివారు పరమానందముచెంది, "మునుపు యిచ్చినది అబద్ధము ఇప్పుడు ఇచ్చినది నిబద్ధి" అని మెచ్చి అట్లాగే మార్చియిచ్చి సంసారినిన్ని సమాధానపరిచి పంపెను."

---

## పోలెపల్లి బుక్కరాయలు.

సీ. కొలువులో మీసాలు కొనలు దిద్దఁగవచ్చుఁ
జికిలిసేనాకత్తి చిమ్మవచ్చు
మేలైనయంగీలు మెఱచి తొడ్గగవచ్చు
సతులు చూడఁగ నెమ్మె సలుపవచ్చు
గరడిసాదనఁజూచి ఘాతసేయఁగవచ్చు
బిరుదులు చదువంగ బిగియవచ్చు

* * *

గీ. కాక యరి నని ప్రేయ సత్కవుల కీయ
నీవె నేర్తువు ధరలోన నేర్పుమెఱయఁ
బరమకళ్యాణ! నూతనపంచబాణ!
భూనుతాటోప! తిమ్మయబుక్కభూప!

సీ. కలగుండ్లుపడుబారు కన్పించు దుర్గాలు
కడఁగి భగ్గన విచ్చు గండవిండ్లు
పెందూళిపైఁ గప్పి భీతిల్లుఁ గోటలు
కమలి భస్మంబు లౌఁ గానవములు
చీకాకుపడు దొడ్డసింహాసనంబులు
హల్లకల్లోలమౌ నష్టదిశలు

గగ్గులకాడౌను గడిమన్నెభూములు
పంచబంగాళవూఁ పట్టణములు
గీ. గర్వదుర్వారభూపసంఘములలోన
నుట్టిపడ్డట్లు నీదాటి పుట్టినపుడె
మన్నెశార్దూల! రిపుమన్నెమత్తజాల
భూనుతాటోప! తిమ్మయబుక్కభూప!.

సీ. మత్తారిరాజన్యమకుటంబులనె కాని
పాదంబు చాఁపఁడు బలిమి మెఱసి
బిరుదాడురాజులపేరురమ్మునె కాని
మన్నెబెబ్బులిబాకు మహినిడండు
పచరించురిపురాజపట్టణంబునె కాని
వాజినెక్కఁడండు రాజసమున
కపటరాజకఠోరకంఠరక్తమె కాని
యడిదంబు కడుగఁ డాహవమునందు
గీ. మన్నెమాత్రుండె బద్దరిమన్నెమావు
మలయుబిత్తరిమన్నీల మగలమగఁడు
దండిమన్నీలవలపులమిండగీఁడు
భోగసురరాజు తిమ్మయ బుక్కరాజు.

సీ. అనిలో విఱిగివచ్చి యందలమెక్కనే
ముక్కుసెవుల్లేని మొండిగాక
పోరిలో గుఱ్ఱంబు పాలియించి వచ్చునే
గుఱిచెడ్డగుఱ్ఱాలగోవుగాక
బవరంబునకుఁబోయి పతినివంచనచేసి
తోలఁగునే బణ్ణంగిదూఁబగాక
ఏలినపతిసొమ్ము నెల్లకాలము దిని
పాఱిపోనెంచునే పందగాక

గీ. సమరతలమునఁ దమ ప్రాణసతినిదలఁచి
సుఖము గోరునె జోగులసుతుఁడుగాక
యనుచు గెల్వంగ నేర్తువా నాహవమున
భూనుతాటోప! తిమ్మయ బుక్కభూప!

---

## తంజావూరి విజయరాఘవరాయలు.

ఈతఁడు తంజాపురము నేలినయాంధ్ర నాయక రాజు. రఘునాథరాయలకుమారుఁడు. మహారసికుఁడు. మహాదాత. రాజులచరిత్రమూలమున నెఱుఁగ నగును.

లయ. తావిజగడంపునిగ పూవులసరుల్ తళుకు
మావిపలు గెలపు బురుసావలువుసొంపుల్
శీవిగులకింపునొక తావిచఱుకు న్మరుతు
మావుపయి నెక్కిపురిలో వెడలి రాఁగా
నీవగలు చూచి చెలి రేవగలు సొక్కుచును
పూవుజము దాడిదొరహావళికిఁ జిక్కెన్
మావెలఁది నేలుకొన రావలదె నీవు దయ
తో విజయరాఘవమహీవర! పరాకా!

క. భూతలమున శిబికర్ణులు
దాత లనేసుద్ది సుద్దదబ్బర నిన్నేం
చేతటి వదాన్యుఁ డెవ్వఁడు
రా? తంజావూరి విజయరాఘవనృపతీ!.

ఈయనయాస్థానమునరంగాజి,కృష్ణాజి మొదలగు వారాంగనలు. సరసకవిత నేర్చినవా రుండెడువారు. అందు రంగాజి

'మన్నారుదాసవిలాస' మనుపేర నీయనశ్శృంగారచరిత్రమునే గ్రంథముగా రచించినది. ఆపె. యూరాజేద్రునిచేఁ గనకాభిషేక సత్కారమును వడసినది. ఆయనవలపు నెలఁత. ఎల్లవేళలందును వెల్లాటకత్తెతో నానందించు నీనృపాలుని మహిషి తనయాగ్రహము నాపుఁకొనఁజాలక యొకనాఁ డావారాంగనకు దూషణోక్తులతో నొక దూతికమూలమున వార్త నంపెనట! విదుషీమణి యగు నావారాంగన యాదూతి కీపద్యమునురచించిచెప్పి పుచ్చెనట—

ఉ. ఏవనితల్ మముం దలఁప నేమిపనో? తమ రాఁడువారు గా
రో? వలపించు నేర్పెఱుఁగరో? తమకౌఁగిటిలోన నుంచఁగా
రా ఇదియేమిరా విజయరామ! యటం చిలు దూతి బల్మిచేఁ
దీవరకత్తెనై పెనఁగి తీసుకవచ్చితినా! తలోదరీ!

ఉ. రాజనిభాననా! సరసురాలవు జబ్బుగ నల్లినా ఇదే
మే జడ? యింతకంటె వలెనే? ఇలనొప్ప బిగించి యల్లవే
యోజవరాల! వేఱె పనియున్నది; దోసమె దోసమే మహా
రా జగునట్టియవ్విజయరాఘవు పైఁ జిగురాకె కోమలీ!

చ. కులికెద వేటికే చెలియ! కుంచెఁడు మానెఁడు గాను నెల్లవా
రలు వినినారులే; విజయరాఘవరాయఁడు నిన్నుఁ గూడుటల్
ఇలవులె చాటుచున్నవి జవాదియు నల్దవు విఱ్ఱవీఁగఁగా
ఇలెనటె మాచియోర్తురటె ఇంతులు జంతులవేటియుష్మిలే?.

క. ఇంతీ! పానుపుపైనిదె
కంతుఁడు కూర్చున్నవాఁడు కనుఁగొను మహాహా!
కంతుఁ డనంగుఁడు నీ తెలి
వింతేనా విజయరాఘవేంద్రుఁడె చెలియా!.

## మట్లవారు.

ఉ. అక్కజ మొప్పఁగా భుజపరాక్రమశక్తుల నెంచిచూచినన్
దిక్కులలోనఁబోలిపలి తిమ్మయ బుక్కఁడురాజు నాఁటికిన్
మక్కువ దోర్బలంబులను మానవనాథులలోన నంతకు
న్నెక్కువమట్లకోనధరణీశ్వరు నెల్లమరాజు నేఁటికిన్.

ఉ. మాయురె! సద్గుణాభరణ మల్లకుమార యనంతశౌర్యధౌ
రేయుని నన్నునాజి నెదిరింపను శక్తులుగాక కైదువుల్
వేయనిరాజులున్ శరణువేఁడనిమన్నెకొమాళ్లు కానికల్
సేయనిశూర్లు మ్రొక్కనివజీర్లును లేరు వసుంధరాస్థలిన్.

ఉ. వెండియు మట్లరాజు తిరువేంగళనాథుఁడు కందనోలికా
భండనభూమిలోఁ దురకబాధులపైఁబడి సంహరింపఁగాఁ
గండలు కొండలయ్యె నెముకల్ ధరణీజములయ్యె నెత్తురుల్
గందపుశేఱు లయ్యెఁ దలకాయలు తారకలయ్యెఁ జూడఁగన్.

---

## అద్దంకి నృపాలురు.

మ. పదవే రంభ! సురేంద్రుకొల్వునకు నప్పా! నాకు రాఁ దీరదే;
యదియేమే; ధర మందపాటి రఘునాథాధీశుబాహాసిచేఁ
గదనక్షోణిని నీల్గినట్టిరిపుసంఘాతంబు వే వచ్చెడున్
బదులు నూఱులు వేలు లక్షలు గణింపన్ శక్యమే చెల్లెలా.

ఉ. ఇంద్రుని సన్నిధానమున కేఁగె రణోజ్జ్వలవిక్రమక్రియా
సాంద్రుఁడు మందపాటికులసాగరచంద్రుఁడు రామభద్రరా
జేంద్రుఁడు పార్థివాబ్దమున నేకతఁ గార్తికశుద్ధపూర్ణిమా
చంద్రదినాంతమందు రవి జారినకైవడి మారుతాత్మజా!.

## వత్సవాయవారు.

ఉ. తీరుగ వత్సవాయకులతిమ్మజగత్పతికీర్తిహార మా
హారశరద్ద్విజన్మకులిశాయుధజాతుల మించె శౌర్యమా
హారశరద్ద్విజన్మకులిశాయుధజాతుల మించె రూపమా
హారశరద్ద్విజన్మకులిశాయుధజాతుల మించె నిద్ధరన్.

ఉ. రాజులరాజు లోభి యొకరాజులరా జతిమూర్ఖుఁ డష్టది
గ్రాజులరాజు చోరుఁడు విరాజులరా జొక పక్షి తారకా
రాజులరాజు దోషి ఫణిరాజులరా జొకవక్రగామి యీ
రాజులు రాజులా సుగుణరాజులరాజవు నీవుగాక యో
రాజవతంస ! వత్సవయ రాజమహీపతి ? తిమ్మభూపతీ!

ఉ. రాజు కళంకమూర్తి రతిరాజు శరీరవిహీనుఁ డంబికా
రాజు దిగంబరుండు మృగరాజు గుహాంతరసీమ నుండు వి
భ్రాజితపూసపాడ్విజయరామనృపాలుఁడు రాజుగాని యీ
రాజులు రాజులా పెనుతరాజులు గాక ధరాతలంబునన్.

---

## వాసిరెడ్డి వేంకటాద్రినాయఁడుగారు

ఈకమ్మప్రభువు పదునాఱవశతాబ్దితర్వాతఁ గృష్ణాతీర మండలి యమరావతి రాజధానిగాఁ గొంత తెల్గు దేశ మేలిన వాఁడు. మహాదాత. శూరుఁడు. "అటునుండి కొట్టుకు రమ్మన్నారు" అను సామెత కీతఁడే జననకారణము. ఆకాలమునందు దారి దోఁపుడుగాండ్రు మెండుగా నుండిరట ! అనేకుల ప్రాణధన

ములఁ గొనుచుఁ బ్రజలకు మిక్కిలి పీడ గల్గించుచున్న యా పచ్చెపుదొంగలలో బహుప్రయత్నమున వేంకటాద్రినాయఁడు నూర్గురను బట్టించి వరుసగా నిల్వఁబెట్టి తలలు నఱకఁ దలారుల కనుజ్ఞ నొసఁగెనట! ఒకకొననుండి నఱకఁ బ్రారంభింపఁ బోఁగా నచ్చటివాండ్రు, అటునుండి కొట్టుకొనుచు రమ్మని కోరిరట! (కొందఱ నఱికినతర్వాత నేని జాలి వొడమక పోదని) నాయఁడుగారును నట్లే రెండవప్రక్కనుండి యారంభింపఁజేసి నిశ్శేషముగనే సంహరింపించి ప్రజలకుఁ జోరభీతి మాన్పిరట!

మ. వరహా లక్కలభంగి సాలువులు కంబళ్ళట్లు రూపాయలున్
మఱి గవ్వల్వలెఁ గంకణమ్ములుఁ దృణప్రాయమ్ముగా నిచ్చి బం
గరుపళ్లెంబులఁ బాయసాన్నములు లక్షబ్రాహ్మణాపోశనం
బర లేకిత్తువు వాసిరెడ్డి కులదీపా! వేంకటాద్రీశ్వరా!.

ఒకప్పుడు, వాసిరెడ్డి వేంకటాద్రినాయఁడును నర్సారావుపేట మల్రాజు గుండారాయఁడును, నూజవీటి యప్పారావును, చల్లపల్లియంకినేఁడును, మొదలుగాఁ గొందఱు జమీందారులుకూడి యిష్టగోష్ఠివినోదముసల్పుకొనుసందర్భమున హాస్యచతురుఁడగు గుండారాయఁడు "మనజీవితములు గడచినతర్వాత లోకము మనల నెట్లు ప్రశంసించునో తలఁచిచూచుకొందమా" యనెనట! అందఱు నంగీకరించి రట! ఇట్లు పేర్కొనెనట! నూజవీటి యప్పారాయఁడు చనిపోయెనా బైరాగులందఱును బలవించెదరు. తాను చనిపోయితినా వేశ్యలందఱును విలపించెదరు. వేంకటాద్రినాయఁడు చనిపోయెనా యందఱును నల్లో యని

దుఃఖించెదరు. అంకినేఁడు చనిపోయెనా యందఱు నాహా యని సంతోషించెద" రనియెనట!

అమరావతిలో నీ వేంకటాద్రినాయని శిలావిగ్రహ మున్నది.

దరిద్రుఁడగు నొకకవి యావాసిరెడ్డి వేంకటాద్రినాయని దాతృత్వము విని యాతనిదర్శింపఁ బల్నాడుప్రాంతమునుండి యరుదెంచుచు గుంటూరుచేరునప్పటి కాభూపతి పరలోక యాత్రగావించినట్లు తెలియరాఁగా నీక్రిందిపద్యమును జెప్పె నందురు.

చ. నలువ! ఛిఛీ? నినుం దలఁప న్యాయముగా దిఁక వేంకటాద్రిభూ
తిలకునిఁ జంపి యర్థులకు దిక్కు మఱే మొనరించినావు? నీ
విలఁ దలకొట్లమారితన మెన్నటికిన్ విడవై తివౌర! భూ
తలమున నిట్టిరాజును యథావిధి నీతరమా సృజింపఁగన్?.

వేంకటాద్రినాయఁడు "వారికి వారికిన్ మఱియు వారికి వారికి వారివారికిన్" అను సమస్యనీయఁగా వక్కొం విరూపాక్ష శాస్త్రులను కవి యిట్లు పూరించెనట.

ఉ. భూరమణీమనఃకుముదపుంజసుధాంశుని వేంకటాద్రిల
క్ష్మీరమణావతారుని భజింతురు రాజులుఁ దత్సుతుల్ హితుల్
సూరిజనుల్ దదీయులును సొంపుగ నాప్రభు విచ్చు గోరికల్
వారికి వారికిన్ మఱియు వారికి వారికి వారివారికిన్.

## సి. పి. బ్రౌన్ దొరగారు.

క్రై 1770 తరువాత 1820 వరకు నీమహాశయుఁ డాంధ్ర భాషకై యతిప్రయాసపడి మహోపకృతిసల్పినవాఁడు. బందరు మొదలగు పట్టణములం దీతఁడుజిల్లాజడ్జీయుద్యోగముసల్పుచు ననేకసంస్కృతాంధ్రగ్రంథములను బహుధనవ్యయమున సేకరించెను. తెల్గునకు నిఘంటువులు నిర్మించెను. జూలూరి అప్పయ్య పండితుఁడు, గురుమూర్తిశాస్త్రి, వాసుదేవపరబ్రహ్మశాస్త్రులు, మొదలగు ననేకపండితుల నాదరించి విరివిగాధనమొసంగెను. ఆంధ్రభాషయం దీఘనున కత్యంతాభిమానముకలదు. ఇప్పుడు ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారముననున్నసంస్కృతాంధ్రగ్రంథములం దనేకము లిమ్మహనీయుఁ డార్జించినవే. ఈతని యాంధ్రభాషాభిమానమును బుద్ధివైభవమును దద్భాండాగారమునఁగలగ్రంథములఁబట్టి గుర్తింపనగును.

కం. నూర్లార్లు లెక్క సేయక
పేర్లందినవిబుధవరులఁ బిలిపించుచు వే
మార్లర్థ మిచ్చువితరణి
చార్లెసు ఫీలిప్పుబ్రౌనుసాహెబు కరుణన్.

బీదఱికమును గుడుచుచున్న యొకయాంధ్రపండితుఁడు సి. పి. బ్రౌన్ దొరగారికి భాగవతమందలి యీక్రిందిపద్యమును వ్రాసి తనకు ద్రవ్యసాహాయ్యము వేఁడుకొనుచు నొకయర్జీపంపికొనెనఁట! ఆపద్యము.

ఉ. లా వొక్కింతయులేదు ధైర్యము విలోలంబయ్యెఁ బ్రాణంబులా
ఠావుల్దప్పెను మూర్ఛవచ్చెఁ దనువుల్ డస్సెన్ శ్రమం బయ్యెడిన్
నీవే తప్ప నితఃపరం బెఱుఁగ మన్నింపందగుం దీనునిన్
రావే యీశ్వర! కావవే వరద! సంరక్షించు భద్రాత్మకా!

బ్రౌన్ దొరగారికిట్లు మనుష్యునొరుని స్తుతించుటయందు రోఁత. (వారిస్వహస్తముతో నొకచోట "ఈ దేశపుజనులు కార్యార్థమై నీవే తండ్రివి, నీవే దైవమవు, అని నరునొరుని స్తుతింతురు; అట్లు స్తుతించుట తల్లిని దండ్రిని దైవమును వంచించుట యగును ఆంగ్లేయు లిది యేవగొందురు" అనునర్థము వచ్చునట్లు తెల్గున నే కొంతవ్రాసియున్నారు.) ఆయర్జీని జూచి దొరగారు తిరిగి భాగవతములోనిదే యగు నీక్రిందిపద్యముఁ బ్రత్యుత్తరముగాఁ బంపిరట.

ఉ. ఏను మృతుండ నౌదునని యింతభయంబు మనంబులోపలన్
మానుము సంభవంబు గల మానవకోట్లకుఁ జావు నిక్కమౌఁ
గాన హరిం దలంపు మికఁ గల్గదు జన్మము నీకు ధాత్రిపై
మానవనాథ! పొందెదవు మాధవలోకనివాససౌఖ్యముల్.

---

## సిద్ధయామాత్యుఁడు.

సీ. శేషాహి భాషావిశేషుఁ డింతే కాని
యొలమిఁ గర్ణునిరీతి నీయలేఁడు
ఎలమిఁ గర్ణుఁడు దానమీయనింతే కాని
పుడమి నింద్రునివంటిభోగి గాఁడు
పుడమి నింద్రుఁడు కడుభోగి......నకుఁ గాని
ధర్మనందనువంటిశాల్మి లేదు

ధర్మనందనుఁ డెంత తాల్మి దాల్చినఁ గాని
పార్ధునా గాంభీర్యపరుఁడు గాఁడు
గీ. గాక యిటువంటిగుణములు గలిగె నీకు
శత్రునిశ్శంక ! ఉటుకూరుశాసనాంక !
భాగ్యగంభీరవేంగయప్రభుకుమార !
మహితమందార! సిద్ధయామాత్యధీర!

---

## ద్వాత్రింశన్మంత్రులు.

ముప్పది యిద్దఱు మంత్రులను దెలుపునీసీసమాలికకట్టు కతలనుబట్టి యొకబట్టుకవిచేఁ గూర్పఁబడినది. పేర్కొనఁబడిన మంత్రులక్రమము కాలక్రమమునకు ననుకూలింపదు. చరిత్ర కారులు దీనినిఁ బరమప్రమాణముగాఁ దీసికొనరాదు.

1\. సీ. కవులిచ్చి భూపతి గాసి పెట్టఁగఁ జచ్చెఁ
బ్రజలకై రాయనభాస్కరుండు.

2\. వరదాతయై మణివలయముల్ కవికిచ్చె
దండిభాస్కరసూతి కొండమంత్రి

3\. భాస్కరువలెఁ గీర్తిపడసెఁ తత్పౌత్రుఁడా
ఘనరామలింగభాస్కరుఁ డొకండు.

4\. గణకనిర్వాహంబు గల్గించె నూరూర
మహి గోపరాజు రామప్రధాని.

5\. దుర్గమియ్యక శత్రువర్గంబుతోఁ బోరెఁ
బెల్లుగాఁ గరణము మల్లమంత్రి.

6\. ఆత్మీయతపముచే నర్థి నాలుకమడ్డు
కేడించి బండారు కేతమంత్రి.

7. కవిపాముచేఁ జావఁగనునాయువాతని
కై యిచ్చె సీదయ యాచఘనుఁడు.

8. వేఁటాలుతునియల విమతులఁజెండాడె
నాజిలో నాదెండ్ల యయ్యలయ్య.

9. పోరిలో నసహాయశూరుఁడై తెగివెన్క
బ్రతికె సిద్ధయ తిక్కఁ డతులితముగ

10. పట్టిసపురవీరభద్రుని ప్రేమచేఁ
జెన్నొందె శ్రీకోటసింగరాజు

11. ఇలుచూఱయాచకావలికి దాతలదాత
రై యిచ్చె నిట్టల హారిహరప్ప.

12. తనదుమీసముదీసి తాకట్టుగానుంచి
కొట్టరెడ్డిం డర్థి కోర్కి తీర్చె.

13. గణపతిదేవునికరుణ భట్టుకు మణి
యడపంబొసంగె గుండార్యవరుఁడు.

14. అష్టసహస్రంబు లర్థికిచ్చిసుకీర్తి
మహినిసంగనమంత్రి మాచఁడందె.

15. కొనియెభాస్కరునిచేఁ దనుఁగురామాయణం
బారూఢి సాహిణిమారమంత్రి.

16. ఆంధ్రనైషధకావ్యమందె శ్రీనాథుచే
మామిడిసింగనామాత్యమౌళి.

17. ఘనదానకర్ణుఁడైగండపెండెముదాల్చెఁ
గొలివి యన్నామాత్యకుంజరుండు.

18. పగతుఁజుట్టమటంచుఁ బల్కఁగా ధనమిచ్చి
చేపట్టెఁ బెమ్మయసింగరాజు.

19. గురుజగత్త్రయదానగురుమూర్తియై మించె
నండూరిభీమనగుండమంత్రి.

20. ప్రాణికోటికి నెల్ల బహుభక్ష్యభోజ్యాన్న
సత్త్రముల్ పెట్టె విస్సప్రధాని

21. భట్టుమూర్తికిఁ గిన్క రెట్టింపఁ బచ్చల
హార మర్పించెఁ దిమ్మరసమౌళి

22. ఘనద్వైతంబు దాక్షారామభీమేశుఁ
డని కొల్చె బెండపూఁ డన్నమంత్రి

23. నీడ ద్రొక్కెడు వేళ నెటి నర్థి కభిమతం
బిప్పించెఁ జేమకూ రప్పరాజు

24. ఘనసప్తసంతతు లొనరించి సత్కీర్తి
వెలయించె విఠ్ఠల వెజ్జుమంత్రి

25. అమితశత్రులఁ గెల్చి యవని పాలనచేసె
రహి గుంటుపలి ముత్తరాజమంత్రి

26. తనునేలు నృపతిచేత నె మేటికృతి గాంచె
శ్రీగుంటుపలి నరసింగమంత్రి

27. ఘనభట్టుసుకవికి మణికుండల మొసంగి
నందితిమ్మకవీంద్రుఁ డందెఁ గృతుల

28. కవులకర్థ మొసంగి ఘనకీర్తివహియించె
రహిఁ గూరగాయల రామమంత్రి

29. వాకిటి కావలి జోఁకతో నొనరించి
దివ్యకీర్తి వహించెఁ దిమ్మమంత్రి

30. రిపు గెల్వ నృపుఁడిమ్ము విపులార్థముల నర్థి
కర్పించెఁ గటికి కామన్నమంత్రి

31. కవిబుధావళి నేలి ఘనకీర్తిని వహించె
వరకోటిపల్లి శ్రీశరభమంత్రి

32. నిరతాన్నదాతయై నిత్యకీర్తి వహించెఁ
గాశి బందా పరదేశిమంత్రి

ఒకానొకబట్టు రాజీక్రిందివిధమునద్వాత్రింశన్మంత్రుల సీసమాలికను జదువఁజాగెను; గాని, కడముట్టింపఁజాలఁడయ్యె. అందినంతవట్టు—

సీ. బళిర! రామయమంత్రి భాస్కరామాత్యుండు
నిండారునందూరి గుండమంత్రి
శివపాదభక్తుండు శ్రీకంఠవెంగన్న
శ్రీనిధి యాకోటసింగరాజు
వేమభూపతిమంత్రి మామిడిసింగన్న
యెన్న నౌ బెండపూఁడన్నమంత్రి
మేలైనకొచ్చెర్లకోటకర్ణుమల్లు
స్తుతికెక్కువాడలతుక్కమంత్రి
ప్రియమాడునెఱజాణ పెమ్మయసింగన
మహితుండు సింగనమంత్రిమాచ
సర్వజ్ఞుఁడైనట్టిసర్వయచిక్కన
యధికుండు నెల్లూరియాదరాజు
ధీరుండు సాళువతిమ్మనరేంద్రుండు
గురిజాలనాదిండ్లగోపమంత్రి
ప్రథితి కెక్కుచునుండు భాస్కరామాత్యుండు
మాన్యుండు కొండపర్తి మాదిరాజు
ఇలఁ గొండవీటిలో వెలయుప్రధానుండు
భవ్యుండు బలభద్రపాత్రఘనుఁడు
కుల ముద్ధరించిన గోపయారామన
పేరిమి తిరువెళ్ళ పెమ్మరాజు
విస్తారసత్కీర్తి విలసిల్లి వర్ధిల్లు
విదితుండు సంధూరివెంగళయ్య

కేవలపుణ్యుండు కేసయరామన
సుజనుండు శ్రీపతిసోమరాజు.

పైసీసమాలికయందుఁ బేర్కొనఁబడినవారిలోఁ గొందఱి పైఁ జెప్పఁబడినచాటుపద్యములు చేకుఱినవి. అవి యీక్రింద వివరింపఁబడు చున్నవి.

---

## భాస్కరుఁడు.

ఈనామముగల ప్రఖ్యాతపురుషుల నేకులుగలరు. తిక్కన పితామహాదులటుండ రాజమంత్రులునుదాతృత్వమునఁ బ్రఖ్యాతులును సంకవరీకులునునగు భాస్కరు లేనల్వ్రైదుగురు గన్పట్టుచున్నారు. రామయభాస్కరు లిరువురు. పదునాల్గవశతాబ్ది యందుఁ బ్రఖ్యాతకవీశ్వరుఁడుగానున్న రావిపాటి త్రిపురాంతకుని చే—

మ. సరిబేసై రిపు డేల భాస్కరులు! భాషానాథ! పుత్రా! విసుం
ధరనుం దొక్కఁడు మంత్రియయ్యె; వినుకొండన్ రామయామాత్యభా
స్కరుఁడో; యౌ; నయినన్ సహస్రకరశాఖల్లేవవే యున్నవే
తిరమైదానము సేయుచో రిపుల హేతిన్ వ్రేయుచో వ్రాయుచోన్.

అని పొగడఁబడినవాఁడొకఁడు.

సీ. నిర్మించె నేమంత్రి నిరుపమప్రాకార
నవకంబుగా గోపినాథపురము
గెలిచినాఁ డేమంత్రి లలితవిక్రమమునఁ
బ్రబలుఁడై యవనుల బలము నెల్ల
నిలిపినాఁ డేమంత్రి నియతవై భవమున
గోపికావల్లభుఁ గూర్మి వెలయ

పాలించె నేమంత్రి ప్రకటధర్మఖ్యాతి
మహిమ మీఱఁగ నాంధ్రమండలంబు
గీ. అతఁడు భూపాలమంత్రీంద్ర సతతవినుత
ధీవిశారదుఁ డచ్యుతదేవరాయ
మాన్యహితవర్తనుఁడు శౌర్యమహితయశుఁడు
భానుతేజుండు రాయభాస్కరుండు.

కొండవీటిగోపీనాథపురవుగోపీనాథస్వామియాలయము ముఖద్వారశాఖయందువ్రాయఁబడినయీపద్యమువలనయచ్యుతదేవరాయలనాఁడు వేఱొక రాయభాస్కరుఁ డున్నట్లు ధ్రువపడుచున్నది. ఇంక రాయనభాస్కరులుకూడ ననేకు లున్నట్టుస్పష్టపడుచున్నది మనలోఁ దండ్రిపేరు కుమారునకుఁ బెట్టెడు నాచారము కలదుగదా! దానివలననే యేకనామ మనేకులకుఁ బొసఁగియుండె నని తలఁపఁదగి యున్నది.

చ. కలయఁబసిండిగంటమునఁ గాటయవేమసమక్షమందు స
త్ఫలముగ రాయనప్రభుని బాచఁడు వ్రాసిన వ్రాలమ్రోఁతలన్
గలుగలు గల్లుగల్లు రనఁ గంటకమంత్రుల గుండెలన్నియున్
జలుజలు జల్లు జల్లురనె సత్కవివర్యులు మేలుమే లనన్.

అనుచాటుపద్యమువలనఁ గాటయవేముని కాలమున క్రీ. 1400న నొక రాయనభాస్కరుఁ డుండిన ట్లేర్పడుచున్నది.

శ్లో. శాకాబ్దే వసువహ్ని వేదధరణీగణ్యే చ ధాత్రబ్దకే
వైశాఖే వినుకొండసీమని సుధీ ర్నా దెళ్ల యప్పప్రభుః
వాసిష్ఠాయచభర్తపూండి మఖిలంగ్రామం స్వనామాంకితం
ప్రాదా ద్రాయనిభాస్కరాయ విదుషే హ్యైశ్వర్యభోగాన్వితమ్.

అను శాసనమువలన క్రీ ॥ 1500 తర్వాత నొక రాయన భాస్కరుఁ డుండిన ట్లేర్పడుచున్నది. ముప్పదియిద్దఱు మంత్రుల

సీసమాలికలోఁ బేర్కొనఁబడిన రాయనభాస్కరుఁడు ప్రాచీనుఁడుగాఁ నూహింపఁదగియున్నాఁడు. ఆతఁడు మహాదాత. ఆరాయని భాస్కరునిఁ గూర్చి చెప్పఁబడిన చాటుపద్యము లనేకములు గలవు.

క. పన్నిద్దఱు భాస్కరులని
యెన్నిక సేయుటదికల్ల యిద్దఱు గాదా
మిన్నున నొకభాస్కరుఁడును
బన్నుగ వినుకొండనున్న భాస్కరుఁ డొకఁడున్.

క. పసముత్య మొకటిచాలును
గస వూడ్చిన చింపిరాలు గంపెం డేలా?
రసికుం డొక్కఁడె చాలును
రసహీనులు పదువురేల రాయనిబాచా!.

క. చేకొని రాయని బాచఁడు
కాకాలు గుణించు పిదపకాలము నాఁడే
లాకేత్వ మియ్య నేరఁడు
దాకును గొమ్మియ్యఁ డిట్టి ధన్యులుగలరే?

క. ఏవ్రాలైనను వ్రాయును
నా వ్రాయఁడు వ్రాసెనేని నవ్వుచునైనన్
సీవ్రాసి తాపడియ్యఁడు
భావజ్ఞుఁడు రాయనార్య భాస్కరుఁ డెలమిన్.

క. పగమాన్పి యర్థి కియ్యని
మగముండకు మీసమేల మఱిమూతిపయిం
దెగగొఱుగఁ డాఱె మంగలి
తగడందున గీర్తిదోఁచ రాయనిబాచా!.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No. 10569

ఉ. ఒక్కఁడు మాంసమిచ్చె మఱియొక్కఁడు చర్మముఁ గోసి యిచ్చె, వే
ఱొక్కరుఁ డస్థినిచ్చె నిఁకనొక్కఁడు ప్రాణములిచ్చె వీరిలో
నొక్కకపట్టునన్ బ్రతుకనోపక యిచ్చిరొ కీర్తి కిచ్చిరో
చక్కఁగఁ జూడు మంత్రికులసంభవ! రాయనమంత్రిభాస్కరా!

ఉ. రాజితకీర్తిశాలి యగురాయనిబాచ! భవద్యశంబు ది
క్పూజితమౌచు మించె సురభూధరభూధరభూధరేంద్రకాం
తాజనుగోత్రరుగ్విధు రథాంగరథాంగరథాంగశేషభా
షాజలజాహితాహితతుషారతుషారతుషారధాములన్.

ఉ. ఏమినిలింపశాఖి? పనియేమిసురేశ్వర! యీవి నిన్నుఁజిం
తామణి మీఱినాఁడటకదా మనరాయనబాచకోవిద
గ్రామణి; యౌన యింతటనె కాదుచుమీ విభవంబునందు ని
న్నోమతియందు నీగురువునో సుకుమారత నీకుమారునో.

మ. అయలక్ష్మీనిధి రాయనప్రభుని బాచామాత్యుఁ డశ్రాంతమున్
నియతిన్ బ్రాహ్మణపూజసేయు టభివర్ణింపంగ శక్యంబె త
త్ప్రియగేహంబున హేమపంజరమునన్ బె 'ల్లర్చత ప్రార్చత
ప్రియమేధా' యనుచుం బఠించు శుకశారీకిన్నరీద్వంద్వముల్.

ఉ. అన్నరొ కొండపల్లి సచివాగ్రణి రాయనమంత్రిపట్టి బా
చన్న జలాన్నసత్రి మెడపైన పథంబునఁ బెట్టు నెయ్యిగా
జొన్నము లొల్పఁబప్పు పదియాఱు తెఱంగులకూరగాయలున్
వెన్నెలగుజ్జుఁబోలుదధి వేసవికాల మహారితంబుగన్.

క. ముసలాపెప్రేలుఁజన్నుల
పసవంటిది లోభివాని బ్రదుకు ధరిత్రిన్
బసిబాలవయసువంటిది
రసికునిజీవనము మంత్రిరాయనిబాచా!.

సీ. ఫణిరాజు తనశిరోమణు లర్థి కిచ్చునో
యనుచు విష్ణువు క్రింద వణఁగియుండె
కైలాసకుధర మెక్కడ నిచ్చునో యని
యుగ్రుఁ డక్కడఁ గావ లుండఁబూనె
తనయందు మణుల నేతటి నిచ్చునో యని
వనధిసంతతమును వణఁకుచుండె
సురధరాధరము నెవ్వరి కిచ్చునో యని
తరణి యగ్గిరిచుట్టుఁ దిరుగుచుండె
గీ. ఔర! నీదానవిఖ్యాతి యఖిలదిశల
మించివర్తించె నీకీర్తి నెంచఁదరమె
గాఢదారిద్ర్య యామినీకాంతిచంద్ర
భాగ్యదేవేంద్ర! రాయన భాస్కరేంద్ర!

సీ. నీపంక్తినొకనాఁడు నెఱి భుజించినవిప్రుఁ
డమృతాన్నమైనను నరుచిసేయు
నీసభాస్థలి నొక్కనిముసమున్నజనుండు
తల్పశేషునినైనఁ దప్పుపట్టు
నీరూపమొకనాఁడు తేఱిచూచినభామ
కందర్పునైన డాకాలఁ దన్ను
నీచేతిదానమ్ము నెమ్మినమ్మినయర్థి
యేమేఘనాథిపు బొమ్మబెట్టు
గీ. నీవె నినుఁ బోలుదువుగాక నిన్ను నెన్ని
యున్నమంత్రుల నెన్నుట పిన్నతనమె
బాలికాప్రాణ నూతన పంచబాణ!
భాస్కరేంద్రుని రాయనభాస్కరేంద్ర!

సీ. అక్షరాభ్యాసంబు శిక్షచేసెదునాఁడె
యోవ్రాసి నా వ్రాయకుండినావు

గణితవేళలయందుఁ గోరి లాకేత్వంబు
దాకఁ గొమ్మియ్యక తర్లినావు
ఒకటి పక్తికి నివ్రాయ నూహ నేర్చిననాఁడె
సున్న చుట్టక వ్రేలు చూపినావు
గణితవేళలనాఁడె ఘనయుక్తిగా నేర్పు
గురుకీర్తికిని జాలుఁగూర్చినావు
తే. నిజకులాచారధర్మంబు నిర్వహించి
హెచ్చు గలయట్టిదాతవై హెచ్చినావు
సరసహృదయుండ! వినుకొండశాసనుండ!
భవ్యభరతుండ! రాయన భాస్కరుండ!

సీ. సంగీతసాహిత్యసరసవిద్యల కిచ్చు
బహురూపులకు నిచ్చుఁ బట్టుకిచ్చు
పెండ్లిపేదలకిచ్చుఁ బేదవిప్రులకిచ్చు
బీదసాదులకెల్లఁ బిలిచియిచ్చు
తిట్టవచ్చిననిచ్చు దీవించఁగానిచ్చుఁ
గొట్టవచ్చిననిచ్చుఁ గొంటెకిచ్చు
బాచన్న! యననిచ్చు భాస్కరా! యననిచ్చు
దేవబాచాయన్నఁ దిరిగియిచ్చు
గీ. మెచ్చి తగనిచ్చు మెచ్చులు మెచ్చి యిచ్చు
వీఁడువాఁ డనకయె సొమ్ము వేఁడనిచ్చు
మంత్రిరాయని భాస్కరామాత్యుఁబోలఁ
గలరె దాతలు మూఁడులోకములయందు?

సీ. కదలియి ల్వెడలంగఁ గడప కాల్ దాఁకినఁ
దలపాగ పందిటఁ దగులుకొన్న
ఎందుఁబోయెద వన్న నేకవిప్రునిఁ గన్న
నొంటిరోదన మన్న నుండుమన్న

తగినచోఁ దుమ్మినఁ దంబళియొదురైన
వీడినతలవాని వీథిఁగన్న
ఒళిమిడిమిక్కిలి యొంటికొమ్మెక్కినఁ
బులుఁగుపీచినఁ బోడపురుషుఁగన్న

గీ. మానకే తెంచు నర్థిసమాజములకు
నిచ్చు నిష్టార్థవస్తువు లెలమితోడ
సరసహృదయుండు వినుకొండశాసనుండు
భవ్యభరతుండు రాయనభాస్కరుండు.

ఈ క్రిందిపద్యమున భార్యనిచ్చె, ననఁగా వివాహముచేసె నని యే యర్థము నిర్ధారించుకొందము.

సీ. అవుపాడ్చినయర్థి లేవకుండఁగనిచ్చె
పలవేసి తీసిన వాని కిచ్చె
గుడివ్రాసియాఁగినఁ గొలికొఅపడ కిచ్చె
బ్రార్థించిబుజ మెక్క బట్టు కిచ్చె
మొంగసాలఁజిచ్చిడ్డ తగవరిఁ బిలిచిచ్చె
నిలుచూఅవేఁడినఁ సెసఁగనిచ్చె
ప్రాణముల్ వేఁడినఁ బ్రాభవంబుగనిచ్చె
భార్యను వేఁడినఁ బరఁగనిచ్చె

గీ. పల్ల మడిగినఁబదటులోఁబల్లమవక
భట్టుగొంపోయి మున్నుతాకట్టు పెట్ట
ముచ్చవెంగనఁ జేపట్టి మెచ్చియిచ్చె
భవ్యభరతుండు రాయనభాస్కరుండు.

ఈయన దాతృత్వపుఁబిచ్చిని వినుఁడు! విటగ్రామణులకుఁ గామసత్రము పెట్టించినాఁడట!

సీ. అతిథికోట్లకు నిల నమృతాన్నసత్త్రంబు
నంబలిసత్త్రంబు నాతురులకు
ఆచార్యులిండ్ల రామానుజసత్త్రంబు
నూనెసత్త్రము శిరస్స్నానమునకు
బాలకులకును నేర్పడఁ బాలసత్త్రము
కామసత్త్రము విటగ్రామణులకు
జలకమాడుట కింట జలసృష్టి సత్త్రంబు
తాంబూలసత్త్రంబు ధన్యులకును
గీ. కట్టడలు చేసె వినుకొండ పట్టణమున
సర్వకాలము సత్కారపూర్వకముగ
మంత్రిరాయనభాస్కరామాత్యుఁ బోల
గలరె దాతలు మూఁడులోకములయందు?

మఱియు:—

సీ. బట్టు దీవించుచు బాసికంబును జూప
వెలయఁ బెండిలిచేసి వేడ్కఁ బంపెఁ
జొప్పకట్టలమీఁద సోలియుండఁగఁ జూచి
పట్టెమంచెము పాన్పు బట్టు కిచ్చె
వెల్తాడుఁ జూపినఁ జెలఁగి యెద్దు నొసంగెఁ
బలుపుఁ జూచినఁ బాడిపసువు నిచ్చెఁ
గళ్లెంబుఁ జూపిన ఘనత గుఱ్ఱము నిచ్చె
జుట్టుఁ జూపిన దాసిసుదతి నిచ్చె
గీ. స్నానమాడంగఁ గడియంబు జారఁ గడమ
కడియమును వేయ శాంభవి కరము మాపె
వెలయ రాయల కుంగ్రమ్ము వేసిచూపె
సరసహృదయుండు వినుకొండశాసనుండు
భవ్యభరతుండు రాయనభాస్కరుండు.

సీ. నిత్యసత్యత్యాగనీతిలో శిబిఁ జెప్పి
నినుఁ జెప్పి మఱియునునిన్నుఁ జెప్పి
బహుపరాక్రమమునఁ బరశురామునిఁ జెప్పి
నినుఁ జెప్పి మఱియును నిన్నుఁ జెప్పి
రఘుకులోత్తముఁ డైన రామచంద్రునిఁ జెప్పి
నినుఁ జెప్పి మఱియును నిన్నుఁ జెప్పి
సుకుమారతను సరి సురరాజసుతుఁ జెప్పి
నినుఁ జెప్పి మఱియును నిన్నుఁ జెప్పి

గీ. చెప్పఁ దగుఁగాక యితరులఁ జెప్పఁదగునె?
కలియుగంబున నీవంటిఘనుఁడు కలఁడె?
అమితగుణసాంద్ర! మానినీకుముదచంద్ర!
భాగ్యదేవేంద్ర! రాయనిభాస్కరేంద్ర!

ఉ. సన్నుతలీలఁ బాండవులసంతతిఁ గర్ణుఁడు దాత గాక వా
రన్నలు దమ్ములందు నొక రైన వదాన్యులు గారు; కీర్తిసం
పన్నునిరాయనప్రభుని భాస్కరుసంతతి నెంచి చూడ వా
రన్నలు దమ్ము లింటఁ గలయందఱు దాతలు భూతలమ్మునన్.

సీ. ఏవేళఁ జూచిన నిందిరానంద మై
యందమై చెలఁగు నీమందిరంబు
ఏపాళఁ జూచిన గోపాలసత్కథా
లిందమై చెలఁగు నీమందిరంబు
ఏజాముఁ జూచిన నిష్టాన్నభోజనా
లిందమై చెలఁగునీమందిరంబు
ఏప్రక్కఁ జూచిన సుప్రజానాయకా
లిందమై చెలఁగు నీమందిరంబు

గీ. గాక తక్కినమంత్రివర్గములయిండ్లు
మేక మెడచండ్లు గిజిగాండ్ల మెఱుగుగూండ్లు
పూవుఁబోఁడులు నిర్మించుబొమ్మరిండ్లు
భవ్యవిభవేంద్ర! రాయనిభాస్కరేంద్ర!

సీ. రంగత్కృపాదృష్టి గంగాభవానికి
మణికంకణంబు లేమంత్రియొసఁగె
భిక్షార్థి యీయఁగా నక్షయంబగువట్లు
మార్తాండుఁ డర్ధ మేమంత్రికొసఁగెఁ
దగ వేఁడినంతలో జగతిపై నర్థికి
మానంబు ప్రాణ మేమంత్రియొసఁగె
మీసంబు తాకట్టువేసి పదార్థంబు
మహిమచే నర్థి కేమంత్రియొసఁగె

గీ. అతఁడు నందవరీకవరాన్వయుండు
దుర్ఘటుండు వసిష్ఠగోత్రోద్భవుండు
శత్రుమథనుండు వినుకొండశాసనుండు
భవ్యభరతుండు రాయనిభాస్కరుండు.

క. వసుధేశుఁ గొల్వరాదో
వసగలమణియంబు చేసి బ్రదుకఁగరాదో
రససిద్ధిఁ బడయరాదో
రసికుఁడు కారాదు గాక రాయనబాచా!

క. మీఁగాళ్ల బంటినీళ్లకు
వీఁగుచు రమ్మక్క యనుచు వెరపున వనితల్
చాఁగి పయోధులు దాఁటెను
రాఁగై నీకీర్తికాంత రాయనిబాచా!

సీ. ఉత్తుంగభుజనూనుద త్తనందాపురీ
పుణ్యాగ్రహారాంశభోక్తయితఁడె

ఆజన్మసంసిద్ధభూజనప్రఖ్యాత
దానసింహాసనాధ్యాసియితఁడె
కొండపల్లీరాజ్యమండలాఖిలమహా
గణకసందోహాగ్రగణ్యుఁడితఁడె
నైకసంతతీర్థనిర్వాణసంయమికృపా
సంవర్ధితాఖిలైశ్వర్యుఁ డితఁడె

గీ. కొండవీ డుద్దగిరి పెనుగొండ గుత్తి
పానుగ ల్విజయనగరపట్టనముల
యర్థులకునిచ్చు నితఁడె యిష్టార్థ మనుచు
జగమురాయనభాస్కరుఁ బ్రెగడఁబొగడు.

ఉ. రాజతకీర్తిశాలి యగు రాయనిభాస్కరు వేఁడఁబోవఁగా
నాజికి నిల్లనున్ బరుని యాలికి నిట్లను నర్థికిట్లనున్
దేజము పెంపులేని యతిదీనునిహీనుని వేఁడఁబోవఁగా
నాజికి నిట్లనున్ బరునియాలికినిట్లను నర్థికిట్లనున్.

శ్లో. కృతేయుగేబలిర్దాతా త్రేతాయాంరఘునందనః,
ద్వాపరేసూర్యపుత్రిశ్చ కలౌరాయనభాస్కరః.

గీ. పరఁగరాయనికులబాచనిధనమెల్ల
భటులపాలు కవులపాలు దలఁప
ధరను లోభివాని ధనము దాయాదుల
పాలు జారకాంతపాలు వేమ.

ఈపద్యమువలనఁ వేమనపద్యకర్తయగు వేమనరాయని భాస్కరుని కాలపువాఁడని తేలుచున్నది. వేమాభిధాను లగు నప్పటి కొండవీటి రెడ్డిరాజులసంతతిలోనివాఁడైయుండును. ఈయుదాహరింపఁబడు పద్య మాతనిరీతిఁ దెలుపును.

క. కాదనఁ డెవ్వరి నేనియు
వాదులసంబోఁడు వెఱ్ఱివానివలెనె తా
భేదాభేదము లెఱుఁగఁడు
వేదాంతరహస్య మెల్ల వేమన యెఱుఁగున్.

ఈ పద్య మాభాస్కరుని ర్యాణముఁ గూర్చి చెప్పఁబడినది.

చ. సహజకళంకమూర్తులు కుజాతులు గూఢతరోదయప్రభా
మహితులు గోత్రవిద్విషదమాత్యులు రాత్రిచరానుకూలధీ
సహితులు మందవర్తనులు సర్వసమానులు రాజసేవక
గ్రహములు కానవయ్యె నల రాయనిభాస్కరుఁ డస్తమించినన్.

---

## భాస్కరసూతి కొండమంత్రి.

శా. కాండావిర్భవభాండభూపరివృఢగ్రైవేయశైలేయసూ
కాండాటాధిపకేతుమాతులబలాకాశస్రవంతీమరు
త్కాండాఖండలతుండిపాండురయశఃకదూర్వదపేటీభవ
త్కాండా! రాయనమంత్రి భాస్కరునికొండా! దండనాథాగ్రణీ!

శా. రెండా నాల్కలు సాంప్రదాయికునకున్ లెక్కింపఁగా నొక్కటే
గండాగొండిశిఖండిబండనికి లెక్కల్లేని నాల్కల్గదా
చండారాతికులాటవీదహనదేజస్సాన్ఫురధాటీలస
త్కాండా! రాయనమంత్రి భాస్కరునికొండా! దండనాథాగ్రణీ!

క. పద్యము చెప్పిన సుకవికి
హృద్యముగా నియ్యనట్టి హీనాత్మునియా
పద్యము పామైకలచును
ప్రద్యోతితకీర్తి కొండ! భాస్కరుకొండా!

గీ. పడుచునిడినవానిఁ బద్యమిచ్చినవానిఁ
గడుపు కిడినవాని నడుపఖలయు
నడుపలేనివాని నయవిదు లెంతురా
భువిని భాస్కరేంద్రపుత్రి కొండ !

---

## రామలింగ భాస్కరుఁడు.

రామలింగభాస్కరుఁడు చిఱుతనాఁడు విద్యాభ్యాసము చేయుచుండఁగా నొక బట్టువాఁడు—

క. రాయని భాస్కరుతోనే
పోయెనుమీకీర్తికాంత—

అనెనట ! తోడనే యాతఁడు తనకరమునను మణికంకణమును వానికొసంగి—పోదె—అనెనట ! అచ్చట మఱియొకఁడు మఱేదీ—అనెనట: అంతటనాభట్టుకవిపూరించెను.

ఆయనమనుమఁడు చతురో
పాయుండగు రామలింగ భాస్కరుఁజేరెన్.

సీ. ఏమంత్రిసత్కీర్తి హిమసేతుపర్యంత
మవనిమండలము ముత్యాలశాల
ఏమంత్రిమొగసాల యేప్రొద్దు చూచిన
సంగీతసాహిత్యసరసగోష్ఠి
ఏమంత్రియిలవేలు పిందురేఖామౌళి
చాడేశ్వరీమహాశంభుశక్తి
ఏమంత్రిసౌందర్య మిందీవరాక్షుల
వాలారుఁజూపుల వలపుముద్దు

గీ. అతఁడు హరిదాసవంశాబ్ధి కబ్జభవుఁడు
అర్థిదారిద్ర్యగాఢతమోర్కుఁ డతఁడు
దానధర్మపరోపకారానుకూలి
భాస్కరుని రామలింగన్న భాస్కరుండు.

సీ. నీదేవదేవుండు నిజభక్తరక్షాప
రాయణుం డాదినారాయణుండు
నీతాత జగదేకదాత రాయనమంత్రి
భాస్కరాన్వయుఁడైన భాస్కరుండు
నీతండ్రి వితరణఖ్యాతినిఁ గలియుగ
కర్ణుండు రామలింగప్రధాని
నీతల్లి పతిహితనీతి నరుంధతీ
దేవితోఁ బ్రతిఁబచ్చు తిరుమలాంబ

గీ. తనర వెలసితి వత్యంతవినయవిభవ
గురుతరైశ్వర్య మహనీయగుణగణాఢ్య!
భవ్యభరతుండ! వినుకొండ పాలకుండ!
భాస్కరుని రామలింగయ్య భాస్కరుండ!.

సీ. కడఁగి మేఘుం డేకకాలంబున నెకాని
కోమరొప్పనే వేళఁ గురియఁగలఁడె
కల్పభూరుహ మొక్కకాలంబున నెకాని
గరిమ నేవేళలఁ గాయఁగలదె
కమలారి తా నొక్కకాలంబున నెకాని
యే వేళ నమృతంబు నీయగలఁడె
కామధేనువు నేకకాలంబున నెకాని
పెంపొంద నే వేళఁ బిదుకఁబడునె

గీ. పలుచనై పోక యాకులపాటు లేక
పట్టిపోవక చిల్లరపంక లేక

మనుదినం బర్థు ... గు దొర! భువిని
ఘనసుగుణసాంద్ర! రామలింగయ్యచంద్ర!

---

## గోపరాజు రామప్రధానుఁడు.

శ్లో. శ్రీమాన్ గణపతి ర్భూపో గజపత్యన్వయోద్భవః,
అస్మిన్ భూమండలే తస్య బహవ స్సంతి మంత్రిణః.
గోపరాజాన్వయోఽమాత్యో రామాఖ్యో గణకాగ్రణీః,
గణకానాం హితార్థాయ సద్వృత్తి స్థాపనాయచ.
తిష్ఠత శ్శశిమార్తాండౌ యావత్తావ...
గోత్రశాస్త్రాంబరేందూనాం సంఖ్యాబ్దే శాలివాహనే,
రక్తాక్ష్యబ్దే భాద్రదర్శే అర్కగ్రహణకాలికే,
తేన రాజ్ఞా గ్రహీ ద్దానం కృష్ణవేణ్ణాతటే తథా.
ధర్మ మేత త్కలౌ యేన చాక్షిప్తంచ దురాత్మనా,
షష్టివర్ష సహస్రాణి జాయతేఖరయోనిషు.

ప్రాచీన లేఖనములం దీశ్లోకము లగపడుచున్నవి. శా. ౧౦౬౭ మున గజపత్యన్వయుఁడగు గణపతి కలఁడో యని విచారింప వలసియున్నది. లేక, పైశ్లోకములందు 'గణపత్యన్వయోద్భవః' అని యగునో! ఈ రామప్రధానుఁడు కమసాలులపరము యియుండు కరణికవృత్తులను నియోగిబ్రాహ్మణుల కిప్పించెనట! గృష్ణవేణ్ణానదీతీరమున భూదానప్రతిగ్రహ మొనర్చి సజాతీయులభరించెనట! దానికి వైదికు లెవరో యాక్షేపింపఁగా నియోగు లెవరో బదులుచెప్పిరి—

## ఆక్షేపము.

చ. అంగతశబ్దశాస్త్రనిచయు లైనమహాత్ములు పండితోత్తముల్
భువనతలంబునం దధికపూజ్యులు వార లటుండఁ గూటికై
నవనవకల్పనావిధిచణత్వము తోఁప నబద్ధమాడు నీ
కవులిల దానపాత్రులయి గౌరవమందుట చూవెచిత్రముల్!

ఉ. మానఘనుండు బ్రహ్మకులమండనమూర్తి పరోపకారి దు
ర్దానదురన్నముల్ గొనఁడు తప్పఁడు స్వామిహితోపకారముల్
దీనులఁ బ్రోచు బాంధవవిధేయుఁడు డస్సియు వేఁడఁ బోఁడు తా
నూనినవేడ్కతోఁడుత నియోగికి నిచ్చినదాన మల్పమే?

ఉ. వ్రాయుట చిత్రమా వికృతపైదికమా నిజదారరక్షణో
పాయముకై నియోగి యిలఁ బార్థివసేవ యొనర్చినంతనే
పాయునె వంశశీలములు పాయక యెప్పుడు చిత్రగుప్తులుఁ
వ్రాయరె యెల్లలోకములవారలుఁ జేసినపుణ్యపాపముల్.

చ. కవి కమలాసనుండు త్రిజగత్పతి యైనపినాకపాణియుం
గవియె తలంపఁగాఁ గవులు కారె పరాశరబాదరాయణుల్
కవికృతపుస్తకగ్రహణగర్వితు లల్పులె పూజ లందఁ గా
గవు లట! దానపాత్రు లఁట! కారఁట! యిట్టివిపో విచిత్రముల్.

## ఆతనిప్రశస్తి.

సీ. తనకీర్తి యాచంద్రతారార్కముగ మంత్రి
కులులకుఁ గరణికముల నొసంగ
నతిథిసంతర్పణ మనుదినంబు నొనర్చి
ఖ్యాతిగా హరిహరప్రీతిఁ జేసె
వర్ణాశ్రమాచారనిర్ణయంబుల నెల్ల
వేదోక్తరీతిగా వెలయఁ జేసె

ఘనవిప్రవందిమాగధకవీంద్రుల నెల్ల
నగ్రహారము లిచ్చి యాదరించె
గీ. నతఁడు శ్రీగోపరాజాన్వయాబ్ధిచంద్రుఁ
డనఁగ విలసిల్లెఁ దనసాటిఘనులుపొగడ
మంత్రిదేవేంద్రుఁ డనఁగ స్వతంత్రలీల
మంత్రికులహేళి రామయామాత్యమౌళి.
సీ. వీఁడెపో! దుష్టారి వీరమంత్రి కఠోర
భూధరంబులకు దంభోళిధార
వీఁడెపో కవిరాజగాఢదారిద్ర్యాంధ
కారంబు లడఁగించుకమలహితుఁడు
వీఁడెపో బహునీతివిద్యానిరూఢిచే
సురగురుఁ గెల్చినశుభకరుండు
వీడెపో చతురబ్ధివేష్టితావనిఁ గల్గు
బహుమంత్రికులసార్వభౌమమూర్తి
గీ. ఈతఁడేసర్వదేవతాప్రీతికరుఁడు
ఈతఁడే గోపరాట్కులశీతభానుఁ
డని కవీంద్రులు పొగడంగ నతిశయిల్లె
మంత్రి జంభారిరామయామాత్యశౌరి.

---

## కరణము మల్లన.

క. గంటము ఖడ్గముతోడుత
నంటినఁ బగ దీర్పవలయు నవసర మైనన్
గంటము శంతముకో అకా
కంటకరిపుహృదయ భల్ల! కరణముమల్లా.

క. ఎంచింపఁ జనదుమంత్రికి
ఎంచించినఁ గీర్తి గలదె వసుమతిలోనన్
బెంచవిసినఖంగను నా
కంచవిసిన నసును గాక కరణముమల్లా!

క. కరణము గ్రామాభరణము
కరణము తమవంకవారి కాభరణంబౌ
కరణము నృపునుపకరణము
కరణము కులవార్ధిచంద్ర కరణముమల్లా!!.

---

## బండారు కేతమంత్రి.

ఉ. ఆలములోన నోడమికి నన్యవధూటులదిక్కు వోమికిన్
మేలిమి కైనబొంకమికి మెచ్చినచో వృథ గామికిన్ మహీ
పాలనకీర్తిలోలుఁ డగుబండరుకేతననీతిసాటికిన్
నాలుక నడ్డుపట్టెద మనంబున రాముని నిల్పి వేడుకన్.

---

## సీదయయాచమంత్రి.

ఉ. మీఁదవెలుంగు పూర్ణశశిమేనికళంకముకప్పుఁ గ్రిందటల్
రోఁదుచునున్న శేషఫణరోచులకప్పు సుధాపయోధిలో
నీఁదెడుకృష్ణుకప్పుఁ బరమేశ్వరుకంఠముకప్పుఁ గప్పి మా
సీదయయాచకీర్తి విలసిల్లెను దిక్కులఁ బిక్కటిల్లుచున్.

---

## కోటసింగరాజు.

ఈతఁడు విద్యానగరప్రభువును శ్రీకృష్ణదేవరాయల తండ్రియు నగువీరనరసింహరాయలకాలమున నున్నవాఁడు. రాజ

శేఖరచరిత్రమును రచియించిన మల్లయకవితండ్రి మాదయ మైరావణచరిత్రమున వెంజెర్ల గోపమంత్రి తన్నిట్లు ప్రశంసించి నట్లు చెప్పుకొన్నాఁడు.

సీ. మెప్పించినాఁడవు మెఱపడిఁ గర్ణాట
  నరనాయకుని వీరనారసింహు
ధట్టించినాఁడవు తస్కరక విరాజిఁ
  గోటసింగయ మంత్రి కొలువులోన
కాంచినాఁడవు కనత్కాంచనాభరణంబు
  లేపార నందాపురీశు చేత
అందినాఁడవు నుత్తమాశ్వద్వయంబును
  గిమిడిభూమండలరమణు చేత
గీ. నతిమతిస్ఫూర్తిఁ గ్రీడించినాఁడ వఖిల
కావ్యలక్షణలక్ష్యసాగరము నెఱయ
నిన్నుఁ బేర్వేర వర్ణింపనింక నేల
ప్రోడవన్నింట సర్వయమాదసుకవి!

---

## కోటసింగరాజు నిరతాన్నదాత.

సీ. పాయసాన్నప్రౌఢిపరిపాకమే చాలు
  పిండివంటలరుచుల్ మెండు మేలు
ఆజ్యప్రవాహంబు రాజ్యమేమని చెప్పఁ
  బల్చని పెసరొల్పుఁ బప్పు తెప్ప
మెత్తనై స్వచ్ఛమై మెదవెడు రాజాన్న
  మెన్నఁ గైకొంటి మోయన్న! నిన్న
బహువిధశాకప్రపంచంబు తుదిముట్ట
  నూరుఁగాయలరుచు లూరవులుట్ట

గీ. అనుచునీపంక్తి భుజియింతు రనుదినంబు
భూసురశ్రేష్ఠు లెలమి నుపాంగి పొంగి
మహితచారిత్ర కొండయామాత్యపుత్ర
కుటిలదుర్మంత్రిమదభంగ! కోటసింగ!

సీ. రావూరుపురిఢిల్లిరాజ్యంబులందుండి
సింధుబర్బరమధ్యసీమనుండి
పాంచాలమాళవపాండ్యభూములనుండి
కుటకకల్యాచలగయలనుండి
ఘోట్టాణకొంకణఘూర్జరోర్వులనుండి
మళయాళకేరళమహలనుండి
భోజకర్ణాటకాంభోజభూములనుండి
సాల్వాంధ్రముఖ్యదేశములనుండి

గీ. చాలనేతెంచు సద్ద్విజసంఘములకు
నన్నదానంబు గావించుచున్నదొరవు
భవ్యచారిత్ర! కొండయప్రభునుపుత్రి!
కుటిలదుర్మంత్రిమదభంగ! కోటసింగ!.

క. నరజన్మంబునఁ బుట్టిన
గరణీకమె యుత్తమంబు కరణంబైనన్
పురుషార్థపరుఁడు గావలె
శిర సెత్తినఫలము కోటసింగనవర్యా!

చ. గడుసరి లోభియర్థ మది కన్నపుదొంగలబందిపోటుకున్
బుడమిని వారకాంతలకు భూపతికిం జనుఁ గోటసింగ! నీ
పడసినయర్థ మార్తులకు బాంధవకోటికి యాచకాళికిన్
గుడికిని సత్రశాలకును గూపతటాకవనప్రతిష్ఠకున్.

గీ. కోటసింగరాజు మాటవాసియె కాని
గంగమాంబవలన ఘనత కెక్కె

గంగమాంబ జగతి గయ్యాళిదైనను
సింగరా జేఁకేమి సేయఁగలఁడు.

---

## నిట్టల హరిహరప్ప.

క. నిజమా రాజ్యసుఖంబులు
నిజమా తరుణీవిలాసనిరుపమలీలల్
నిజమా సంపచ్చ్యయములు
నిజమా యీజీవనంబు నిట్టలహరియా!

క. ధీరోదారగుణంబులు
కారణజన్ముఁనకు వే ఱె కలుపఁగవలెనా
ధారుణిలోఁ డెంకాయకు
నీరెవ్వరు పోసి రయ్య నిట్టలహరియా!

క. నిట్టలహరియుండయి యిలఁ
బుట్టెను సురధేనుకల్పభూరుహములు దా
మట్టులు గాకుండినచో
నెట్టుల నిడు నర్థికోటి కీప్సితఫలముల్.

క. దాతలదాతవు గదరా
భూతలమున నెట్టిసుకృతముంజేసిరో కో
ఖ్యాతిగలనిన్నుఁ గనుటకు
నీతలిదండ్రులు గడంగి నిట్టలహరియా!

---

## కొట్టరువు - ఎల్లమంత్రి.

ఉ. వీనులు సంతసిల్లు నిను విన్నఁ గనుంగవనిండువారు నీ
మానితమూర్తిఁ గన్న; నిను మంత్రిశిఖామణి వన్ననాలుకం

దేనియ లొల్కఁ; నీవొసఁగు దివ్యవిభూషణచందనాదులన్
మేనును నాసికేంద్రియము మెచ్చుర కొట్టరువెజ్జధీనిధీ!

## గుండమంత్రి.

క. నెట్టన గజపతిదేవుని
పట్టణమునఁ గల్గువీరభటసామంతుల్
చుట్టములు దాతవే బళి!
గట్టిగ గుండన్న కరుణగల్గినకతనన్.

---

## సింగనమంత్రి మాచఁడు.

సీ. కులమును రూపును గుణమును గల్గిన
యింతి నిల్లాలుగా నేలవలయు
వీర్యంబు హితమును వెరపును గల్గిన
పురుషుని బంటుగాఁ బ్రోవవలయు
స్త్రీ పెంపు వాటింప నోపక కలిమిమై
నిలయేలురాజును గొలువవలయు
అఖిలంబు నెఱిఁగి దయాళుఁడై పెంపొందు
మూర్తి సద్గురుఁ డంచు మ్రొక్కవలయు
గీ. కాన నిన్నిగుణంబులు గల్గెనేని
ఆలియొడఁ బుత్త్రునందు భూపాలువలన
గురునిపట్టున సౌఖ్యంబు గూడుటరుదె
మనుజమందార! సింగనమంత్రిమాచ!
సీ. న్యాయంబుదప్పనినరపతి నరపతి
నరపతిపాలించునాడు నాడు

నా డెఱింగినవారలపోఁడిమి పోఁడిమి
పోఁడిమి సొబగైనబుధులు బుధులు
బుధులు సంభావించుపురుషుండు పురుషుండు
పురుషోత్తమునిమీఁదిబుద్ధి బుద్ధి
బుద్ధిమంతున కైనపుణ్యంబు పుణ్యంబు
పుణ్యలక్షణ మైనపొలఁతి పొలఁతి

గీ. పొలఁతి యట్టిద కలవానికలిమి కలిమి
కలిమి చల మరి తెలిసినతెలివి తెలివి
భానునిభతేజ! లక్కమాంబాతనూజ!
మనుజమందార! సింగనమంత్రిమాచ!.

సీ. అర్థులయెడలఁ బ్రత్యర్థులయెడలను
వెలి పెఱుంగనివాఁడె వీరవరుఁడు
సతులసన్నిధి మహీపతులసన్నిధియందుఁ
దత్తఱింపనివాఁడె ధైర్యపరుఁడు
ధన మగ్గలంబైనఁ జన మగ్గలంబైన
గర్వ మెఱ్గనివాఁడె కార్యపరుఁడు
శివుమీఁద నైనఁ గేశవుమీఁద నైనను
దలఁపు నిల్పినవాఁడె తత్త్వఘనుఁడు

గీ. కాన నిట్టివివేకంబు గలిగి మెలఁగు
పురుషు లిహపరసౌఖ్యముల్ పొందువారు
భానునిభతేజ! లక్కమాంబాతనూజ!
మనుజమందార! సింగనమంత్రిమాచ!.

సీ. ఈలోకపుసుఖంబు నాలోకపుసుఖంబు
సతిచేత సుతుచేతఁ జాలఁ బడసి
మేనిరోగంబును లోనిరోగంబును
వెజ్జుచే వేల్పుచే నుజ్జగించి

సురతర్పణంబు భూసురతర్పణంబును
భక్తిచే శక్తిచేఁ బరఁగఁజేసి
అతిసుకృతంబును నభినుతార్థంబును
నీతిధైర్యంబుల నెఱయఁజేసి
గీ. తొల్లిచన్న మహాత్ములత్రోవ దెలిసి
తప్పకుండ మెలఁగువారు తత్త్వఘనులు
భానునిభతేజ! లక్ష్మమాంబాతనూజ!
మనుజమందార! సింగనమంత్రిమాచ!.

సీ తల్లిదండ్రులఁ బ్రోచుతనయుండు తనయుండు
తగురాజుచేపడ్డధరణి ధరణి
అభిమానవతి యైన యంగన యంగన
యక్కఱకొదవిన యర్థ మర్థ
మొరుకాంతఁగోరని పురుషుండు పురుషుండు
వేఁడనియాతనివిద్య విద్య
సంగరాంగణమునఁ జచ్చుట చచ్చుట
పవసించి సల్పెడు వ్రతము వ్రతము
గీ. ఎదుర తన్నెఱిఁగినయట్టి యెఱుక యెఱుక
ప్రజలు మెచ్చఁగఁ జెప్పెడిపాటి పాటి
పగయె లేకుండ బ్రదికిన బ్రదుకు బ్రదుకు
మనుజమందార! సింగనమంత్రిమాచ!.

సీ. ఎరువుశృంగారంబు నరవుసంభోగంబుఁ
జేయుటయెల్లను సిగ్గుగాదె
విప్పనిపువ్వును నొప్పనికాంతను
ననుభవించుట యొల్ల నధమవృత్తి
తన్నెఱుంగక యున్న మన్నింపులేకున్నఁ
గాఁపురం బుండుట కష్టతరము

తరమెఱుంగనిరాజు పరమీనిధైవంబుఁ
గొల్చుటయెల్లను గూళతనము
గీ. గాన నెప్పుడుఁ జతురుఁడై ఘనత మెఱసి
ప్రజలు మెచ్చంగ సుఖలీల బ్రదుకవలదె
భానునిభతేజ! లక్కమాంబాతనూజ!
మనుజమందార! సింగనమంత్రిమాచ!.

సీ. ఉద్యోగహీనుఁడై యుండెడుమనుజునిఁ
బ్రోవంగఁ జాలఁడే దేవుఁడైన
ధరఁగృతఘ్నుండైననరునివర్తన చూచి
క్రక్కదే పుచ్చినకుక్కయైన
అత్యంతధనలోభి యగువాని యొడరోసి
నవసి వర్తిలవె ప్రాణంబులైన
అఖిలజగద్ద్రోహి యగువాని కలుగరే
కృప చాలఁ గల్గినతపసులైన
గీ. గాన నుద్యోగియై కృతఘ్నతకుఁ బాసి
వెలయ లోభంబు విడిచి జీవులకు నెగ్గు
సేయకుండెడువాఁడు విశిష్టుఁ డండ్రు
మనుజమందార! సింగనమంత్రిమాచ!.

సీ. సంపద్ఘ్నునిఁ జేయఁజనదు కృతఘ్నుని
సైన్యాధిపతిఁ జేయఁజనదు భీతు
కపటాత్ము నాత్మీయుఁగా జేయ వలవదు
సన్మంత్ర మెఱిఁగింపఁజనదు సభల
కార్యంబు లూహింపఁ గా దవివేకితోఁ
గాదు వంచకుఁ గార్యకర్తఁ జేయ
పాపాత్ముఁ బరమిత్రు భక్తివిహీనుని
వలవదు పరిచరవర్తిఁ జేయ

గీ. అనృతభాషణుచేత దుర్వ్యసనిచేత
లోలమతిచేత నత్యంతలోభిచేత
వినినకార్యంబు వలవదు విశ్వసింప
మనుజమందార! సింగనమంత్రిమాచ!.

సీ. కులమున నధికుఁడై గుణవంతుఁ డయ్యెనా
యాకారహీనుఁడై యలరుచుండు
నాకారలక్షణం బంతయుఁ గల్గెనా
యోగ్యత లన్నియు నొప్పకుండు
యోగ్యత లన్నియు నొప్పుచు నుండెనా
గర్వాంధకారంబు గప్పి యుండు
గర్వాంధకారంబు గప్పక యుండెనా
యనుకూలసతి లేక యలయుచుండు
గీ కొమ్మ గలిగిన సంతతికొలఁది నగను
పుత్త్రసంతతి మొదలుగాఁ బొందె నిన్ను
భానునిభతేజ! లక్కమాంబాతనూజ!
మనుజమందార! సింగనమంత్రిమాచ!.

---

సాహిణి మారన.

ముప్పదియిద్దఱుమంత్రుల సీసమాలిక యీసాహిణిమారుని నియోగిని జేసినది. ఈతఁడు బ్రాహ్మణుఁడుగాఁ దోఁచఁడు.

క. అప్పు లిడునతఁడు ఘనుఁడా
అప్పు డొసఁగి మఱలఁ గాంచునాతఁడు రాజా
చెప్పఁగవలె సాహిణిమా
రప్పను దానమున ఘనుఁడు రాజు నటంచున్.

క. మాటాడరాదు సభలన్
మాటాడినఁ దప్పరాదు మగసింగములన్
మాటే మానము గాదా
సాటువగలవారికెల్ల సాహిణిమారా!

క. ఇంతులమనముల నరిసా
మంతులమనములను బుద్ధిమంతులమదిలోఁ
జింతింపని బ్రదు కేటికి
సంతతసత్కీర్తిహార! సాహిణిమారా!

శ్లో. అజాగళస్థ స్తన ముష్టిస్పృష్టం
నాసాంతరే కేశ మథాండయుగ్మమ్,
వృథా సృజం త్సాహిణిమారభూపం
పూజాం నలేభే భువి పద్మయోనిః.

---

## పెమ్మయ సింగరాజు.

"పెమ్మయసింగధీమణీ" యనుమకుటముతో నొక శతకమే రచింపఁబడె నేమో! ప్రయోగరత్నాకరమున "జక్కన చెప్పిన పెమ్మయధీమణిశతకము" అని యుదాహరింపఁబడెను. కాన నీసింగరాజు, ప్రౌఢదేవరాయలనాఁటివాఁ డగును. కొన్ని పద్యములు.—

చ. మిరియములేని కూరయును మెచ్చు నెఱుంగనివారియీవియున్
గరగరగానిభోజనము కన్నులపండువుగాని రూపమున్
మురిపములేనియౌవనము మోహములేనిలతాంగికూటమిన్
సరసుల కింపుగావు సుగుణాకర! పెమ్మయసింగధీమణీ!.

పోర్చుకీసువారు (బుడతకీచులు) మన దేశమునకు రాక పూర్వ మిక్కడ మిర్యపుఁగాయలు లేవు కారమునకు మిరియములే యుపయోగించెడివారు. ఆ దేశమునుండి పోర్చుకీసువారే తొలుత వీనిని మన దేశమునకుఁ దెచ్చిరి. కావుననే నేఁటికిని గొందఱు వైదికకృత్యములందుఁ గారమునకుఁ మిర్యములనే యుపయోగింతురు. మిరియములకు బదులుగా నేర్పడినవిగాన వీనిని మనవారు మిర్యపుఁగాయ లనిరి.

ఉ. మచ్చికలేనిచోట ననుమానము వచ్చినచోట మెండుగాఁ
గుచ్చితులున్నచోట గుణకోవిదు లుండనిచోట విద్యకున్
మెచ్చనిచోట రాజుకరుణించనిచోట వివేకులుండిరే
నచ్చట మోసమందు్రు సుగుణాకర! పెమ్మయసింగధీమణీ!

ఉ. వాసనలేనిపువ్వు బుధవర్గములేనిపురంబు నిత్యవి
శ్వాసము లేనిభార్య గుణవంతుఁడుగానికుమారుఁడున్ సద
భ్యాసములేనివిద్య పరిహాసప్రసంగములేని వాక్యమున్
గ్రాసములేనికొల్వు కొఱగానివి పెమ్మయసింగధీమణీ!.

ఉ. ఆడిక కోడఁ డేని యుచితానుచితంబు లెఱుంగఁ డేని ము
న్నాడినమాట తాఁ దిరుగనాడక యుండఁడ యేని ప్రల్లదం
బాడెన యేని సిగ్గువినయంబునయంబును వీడె నేని వాఁ
డేప నియోగి యయ్యెడు మహీస్థలిఁ బెమ్మయసింగధీమణీ.

ఉ. మాడలమీఁద నాస గలమానిసి కెక్కడికీర్తి కీర్తిపై
వేడుక గల్గునాతనికి విత్తముమీఁద మనెక్క డాస యీ
రేడుజగంబులందు వెల హెచ్చినకీర్తిధనంబు గాంచి స
త్ప్రౌఢయశంబుఁ జేకొనియె బమ్మయసింగఁడు దానకర్ణుఁ డై.

ఉ. పెట్టక కీర్తిరాదు వలపింపక యింతికి నింపు లేదు తాఁ
దిట్టక వాదులేదు కడు ధీరత వైరుల సంగరంబులోఁ

గొట్టక వాడలేదు కొడుకు కొక్కఁడు పుట్టక ముక్తి రాదయా
పట్టపురాజుకైన నిది పద్ధతి పెమ్మయసింగధీమణీ!

---

## నందూరిగుండమంత్రి.

కేయూరబాహుచరిత్రకృతిపతి యీతఁడు.

మ. ధరణిం దానగురుండ వీ వని కవీంద్రశ్రేణి వర్ణింపఁగా
బిరుదుల్ నిండినగుండయేంద్రునకు గంభీర ప్రభావోన్నతిం
దొరకుం గా కతిలుబ్ధులైన గణకస్తోమంబుకుం గల్గినన్
గిరికిం బెట్టినచందమా నితరులన్ గీర్తింపఁగా నేటికిన్.

---

## తిమ్మరుసు.

ఈతఁడు కృష్ణరాయలయొద్ద ముఖ్యమంత్రి. రాయలకుఁ బితృసముఁడు. కృష్ణరాయ లీతని 'నప్పాజీ' యనిపిల్చువాఁడు. ఒకప్పు డీతనియెడ భట్టుమూర్తికవి కడుఁగుపితుఁడై యీక్రింద నుదాహరింపఁబడు నుత్పలమాలికాదులను జెప్పెనట.

ఉ. లొట్టయి దేటిమాట పెనులోభులతో మొగమోట మేల తాఁ
గుట్టకయున్న వృశ్చికముఁ గుమ్మరపుర్వని యందురే కదా
పట్టపురాజుపట్టి సరిపల్లెసరాసరియీ యకున్న నేఁ
దిట్టకమాన నామతము తీవ్రమహోగ్రభయంకరంబు గాఁ
దిట్టితినా మహోగ్రహమతిన్ మరకగ్రహజర్జరీభటా
పట్టపుదట్టఘాలఫణిభర్త్రబహూకృతపర్జటస్ఫుటా
ఘట్టనదట్టణాలకవిఘట్టనిరర్గళరాజభృత్యకీ
చట్టచటార్భటీనయనజర్జరకీలలు రాలఁగావలెన్

జొట్టతికంబునం బొగడఁ జూచితినా రజతాద్ర్యధిత్యకా
పట్టణమధ్యరంగగతభవ్యవధూవదనానుషంగసం
హట్టశిరస్స్థగాంగఝురహల్లకజాలసుధాతరంగముల్
చుట్టుకొనన్వలెన్ భువనచోద్యముగా పయుదంబుగా మఱిన్
తిట్టితినా సభాభవనధింకృతభీమనృసింహరాడ్ధ్వజా
తాట్టమహాట్టహాసచతురాస్యసముద్భ్రుకుటీతటీనటీ
కోట్టణరోషజాలహృతకుంతలకంఠగభీరనాదసం
ఘట్టవిజృంభమాణగతి గావలె, దీవనపద్య మిచ్చి చే
పట్టితినా మణీకనకభాజనభూషణభాసురాంబరా
రట్టతురంగగంధగజరాజదమూల్యఘనాతపత్రభూ
పట్టణభర్మహర్మ్యఫలపఙ్క్తిచిరాయురనామయంబునై
గట్టిగఁ దోడుతో వెలయఁగావలె నెక్కువతీవిఁ జూడుఁ డీ
యట్టిటు మందెమేలముల నందఱనుం బలెఁ జుల్కఁజూచి యే
పట్టున నైనఁ గేరడము పల్కకుఁడీ పయి పెచ్చునందులన్
గొట్టుదు దుష్కవిద్విరదకోటులఁ బంచముఖోద్భటాకృతిన్
బెట్టుదు దండముల్ సుకవిబృందము కే నతిభక్తి సారెకున్
గట్టితి ముల్లె లేఁబదియుఁ గాఁగలనూటపదాఱు లెయ్యెడన్
రట్టడిభట్టుమూర్తికవిరాయనిమార్గ మెఱుంగఁ జెప్పితిన్.

గీ. ముందు నిప్పుడు నిఁకమీఁద మోద మలరఁ
బద్యదండంబు చేఁబూని పార్థివులను
జంపుచున్నాఁడు చంపును జంపఁగలఁడు
పరుషవాక్యత సమవర్తి భట్టుమూర్తి.

శా. గుత్తిం బుల్లెలు కట్టి చంద్రగిరిలోఁ గూడెత్తి పెన్గొండలో
హత్తిన్ సత్రమునందు వేఁడి బలుదుర్గాధీశుతాంబూలపుం
దిత్తు ల్మోసి పదస్థులైనఘనులన్ దీవింప—

అనునంతవఱకుఁ జెప్పునప్పటికిఁ దిమ్మరుసు దుష్కీర్తికి భయపడి పచ్చలహారము మెడనుండి తీసి భట్టుమూర్తికి సమర్పింపఁగా నాతఁడు ప్రహృష్టుఁడై పూరించెను.

దీవించెదర్.

మత్తారాతిగజయాతి నాగమసుతుర్ మంత్రీశ్వరుర్ దిమ్మరుర్.

క. అయ్యా యనిపించుకొంటివి
నెయ్యంబునఁ గృష్ణరాయనృపపుంగవుచే
నయ్యా! నీసరి యేరీ?
తియ్యనివిలుకాఁడవయ్య! తిమ్మరుసయ్యా!

గురువై మహారాజ్యప్రదాపయితయై తన్ను సర్వవిధముల సంరక్షించిన తిమ్మరుసుమంత్రిని శ్రీకృష్ణరాయలు కడకాలమున విద్వేషించెను. ఆయన రెండుగ్రుడ్లును దోడించెను. తనయశశ్చంద్రున కిట్లపయశఃకళంకమును గూర్చుకొనెను.

——

## చేమకూర అప్పరాజు.

సీ. దాతతో నర్థులతారతమ్యముఁ జెప్పి
యిప్పింప నేర్చుఁ దా నీయ నేర్చు
నవరసాలంకారనయకవిత్వప్రౌఢిఁ
దెలియ నేర్చును నన్యుఁ దెలుప నేర్చు
భట్టవాగ్ఘట్టసంఘట్టకవిత్వంబు
చదువఁగా విన నేర్చుఁ జదువ నేర్చు
మానవోత్తము లైనమహితలాధీశుల
మెప్పింప నేర్చుఁ దా మెచ్చ నేర్చు

గీ. దాత కవి భట్టురాజును దానయనుచు
మహిమ నుతి కెక్క ధారుణీమండలమున
వీరరిపుదంతిమదవకంఠీరవుండు
రమ్య శ్రీ చేమకూరప్పరాజుమంత్రి !
క. అనుదినము నీడ ద్రొక్కఁగ
నొనరఁగ సురభూజ మీయ దొకకాసైనన్
దినదినము సుకవిజనులకు
ననయము శ్రీ చేమకూరయప్పనయిచ్చున్.

---

## విట్టలవెజ్జ మంత్రి.

క. తనపేరు తల్లిపేరును
తనుగాంచినతండ్రిపేరు దైవముపేరున్
తనయున్నయూరుపేరును
వినుకలిగా బ్రతుకవలయు విట్టలవెజ్జా.
ఉ. శ్రీగలవేళ నాశ్రితుల శిష్టజనంబుల భూసురాళి న
భ్యాగతులన్ కవీశ్వరుల బాంధవులన్ దగ నాదరించి మే
ల్త్యాగము సేయుసర్వధన ధర్మవిధిజ్ఞులఁ జెందుకీర్తి బ
ల్రాగపు యుక్తిమంత్రులకు రాదు గదా యిలవెజ్జధీమణీ!

---

## గుంటుపల్లి ముత్తరాజు.

ఉ. అద్దిర! వీరముత్తఁ డభియాతిహరుండు కఠోరశాత్రవో
ద్యద్దళనప్రచండకరుఁ డాజిభయంకరుఁ డబ్బ! వానితో
వద్దు విరోధ మెంత బలవంతులకైనను నిన్నఁ బంపఁడే
గద్దరివైరిరాచతలకాయలు నాలుగు గోలకొండకున్.
మ. అని నీవైరులమంత్రు లిట్లనిన నిన్నార్యుల్ కవుల్ పండితుల్
ఘనదానంబున మేఘునిన్ శిభిఘనుం గంధీశ్వరుం కర్ణునిం

జనులెల్లన్ వినుతింప గెల్చె నని విశ్వాసంబుగాఁ బల్కితా
మను నీచేయుతపంబు గుంటుపలిశ్రీముత్తప్రధానాగ్రణీ!.

క. పదివేలమాడ లిచ్చిన, నిదిగొమ్మని యగ్రహార మిచ్చినఁగానీ
తుద ప్రియము చెప్పకుండిన,ముదుగుసుమీ గుంటుపల్లి ముత్తయమంత్రీ!

మ. అనఘప్రాభవ! గుంటుపల్లిసచివేంద్రా! ముత్తియామాత్య! నీ
ఘనహస్తాబ్జనవీనహాసన పదంగవ్యాప్త మైనప్పుడే
కనుఁగొంటిన్ జతురంతయానపదముల్ గైకొంటి మేల్వస్తువుల్
గనకస్నానము లబ్బె మాకు సెలవా కర్ణాటకక్షోణికిన్.

ఉ. వార్తల శత్రురాజుల నవశ్యము గెల్చె నటన్న మేటిస
ద్వార్తలు బ్రహ్మచారులు వివాహము సేయుదు రన్నవార్తలుం
నూఘర్తిగ షడ్రసాన్నములు భూసురకోటి కొసంగువార్తలుం
గీర్తివిభూష గుంటుపలిఖేలన! వీరయమంత్రిముత్త! నీ
వార్తలె కాని యెన్న నిఁక వార్తలు లేవు ధరాతలంబునన్.

ఉ. సంతత మారగించు నెడ సజ్జనకోటులఁ బూజసేయుశ్రీ
మంతుఁడు గుంటుపల్లికులమంత్రిశిఖామణి ముత్తమంత్రి దొ
బంతియె బంతిగాక కడుపందగులాముల బంతులెల్ల నూ
ల్బంతులు దుక్కిటెడ్ల మెడబంతులు విప్రవినోదిగారడీ
బంతులు దొంగవాండ్రములుబంతులు సుమ్ము ధరాతలంబునన్.

సీ. దుష్టుధూళిగఁ జేసి తూర్పారఁ బట్టఁడే
కోపాగ్నిచే బొమ్మలాపురంబు
నుగ్గునూచంబుగా నూర్పిడి సేయఁడే
ధాటి మీఱఁగ నెల్లపాటి కోట
కండతుండెములుగాఁ జెండి చక్కాడఁడే
దండిబోయలపేట జుండికోట

కుటిలవైరులఁ ద్రుంచి కొల్లఁ బట్టింపఁడే
శ్రీలు మీఱఁగ బోర లోలకోట
పాదుపాద త్తఘనరాజ్య పదనిరూఢి
జెందె శ్రీగుంటుపలికులశేఖరుం డ
టంచు నీవైరిమంత్రు లిట్లందురి భువిని
మంత్రికులహేళి ముత్తయామాత్యమాళి.

---

## గుంటుపల్లి నరసింగమంత్రి.

క. యాచకసంరక్షణకై
భూచక్రమునన్ జనింపఁ బొమ్మని నిన్నా
వాచస్పతి పంపెనటే
నాచక్కని గుంటుపల్లి నరసింగన్నా!.

గీ. గురుయశశ్శాలి యగునట్టి గుంటుపల్లి
మంత్రి నరసింగరాయసన్మందిరమున
నొక్కనాఁటివ్యయంబగుఁ దక్కినట్టి
దేశపాండ్యాలయొకయేఁటిప్రాశనంబు.

మ. వరగంభీరతసింధురాజు కళలన్ వారాశిపుత్త్రిందు సుం
దరభావంబున మన్మథుండు కరుణ న్నార్ష్యశ్రీధ్వజుం డార్యస
ద్గురువిప్రావనదానకర్ణుఁ డఖిలక్షోణీస్థలిన్ మంత్రిశే
ఖరుఁ డీశ్రీకరగుంటుపల్లినరసింగామాత్యుఁ డెన్నందగున్.

---

## నంది సింగన.

పారిజాతాపహరణమురచించిన నందితిమ్మనకు ముక్కు పొడుగుగా నుండుటచే ముక్కుతిమ్మన్న యనియుఁ బేరుకల్గెను.

పారిజాతాపహరణము కృతినందినప్పుడుకృష్ణరాయ లీతనికిరత్న కుండలముల నొసఁగెను. ఒకనాఁ డీకవి కుండలములధరించి తన యింటియరుఁగుపైఁ గూర్చుండియుండఁగాభట్టుకవి త్రోవ నరుగుచు నీకందపద్యముఁ జెప్పెను—

క. మాకొలఁది జానపదులకె
నీకవనపురీవి యబ్బునే కూపనట
ద్భేకములకు? గగనధునీ
శీకరములచెమ్మ నందిసింగయతిమ్మా.

ఆనందించి తిమ్మకవిచేత నేమియు లేకపోవుటచేఁగర్ణమున నున్న కుండల మొకటి తీసి యాతని కొసఁగెనట ! తర్వాత రాయలయాస్థానమునకు నొంటికుండలముతోఁదిమ్మకవియు భట్టుకవియు వచ్చిరట! ప్రస్తావవశమున నీవృత్తాంతము రాజువిని 'గగన'యనుచో'నాక'యనిమార్చిపద్యముమిసమిసలార్చెనట.

క. మాకొలఁదిజానపదులకె
నీకవనపురీవి: యబ్బునే కూపనట
ద్భేకములకు నాకధునీ
శీకరములచెమ్మ! నందిసింగయతిమ్మా!.

తిమ్మకవియు భట్టుమూర్తికవియు రెండుకుండలములను రాజునకు సమర్పించిరట? రాయలు వారిసరసతకు మెచ్చి హెచ్చు బహుమతు లిచ్చెనట!

---

## కటికి కామన్నమంత్రి.

క. తననుడిపడి గలదినములు
కని మనవలె నరుఁడు కటికికామనవలెనే

తనువులు ధనములు రాజుల
చనవులు నెన్నాళ్లు నమ్మ సాళువతిమ్మా!.

---

## కోటిపల్లి శరభరాజు.

గీ. నీతిదానహీనుని నియోగి నెవ్వరు
కరణ మనరు వానికరుణ మనరు
జాణ కోటిపల్లి శరభన్న నందఱు
కరణ మనిరి వానికరుణ మనిరి.

---

## వేములవాడ భీమకవి.

ఈతఁడు పండ్రెండవశతాబ్ద్యారంభమున నున్నవాఁడందురు. 'వేములవాడభీమకవి' యనుపేరు కొన్నిపద్యముల యతిస్థానస్థాపితమై కలదు. ఆతఁడు నీతఁడును వేఱో! ఒక్కరో! ఈతఁ డాంధ్రకర్ణాటభాషలలో గొప్పకవి.

సీ. గడియలోపలఁ దాడి కడఁగి ముత్తునియగాఁ
దిట్టిన మేధావిభట్టుకంటె
రెండుగడెల బ్రహ్మదండిమూండ్లన్నియు
డుల్లఁ దిట్టినకవిమల్లుకంటె
మూఁడుగడెలకుఁ దా మొనసి యత్తినగండి
పగులఁ దిట్టినకవిభానుకంటె
అఱజాములోపలఁ జెఱువునీ ళ్వింకంగఁ
దిట్టినబడబాగ్నిభట్టుకంటె
గీ. ఉగ్రకోపి నేను నోపుదు శపియింపఁ
గ్రమ్మఱింపశక్తి గలదు నాకు

వట్టిమానఁ జిగురు పుట్టింప గిట్టింప
బిరుదువేములాడ భీమకవిని.

ఈతఁడు శైవుఁడు. పాల్కురికిసోమనాథుఁ డాంధ్రమున రచియించినబసవపురాణము నీతఁడు కన్నడించెను. "సోమగురువాక్యములు సొన్పి భీమసుకవి, గరిమబసవపురాణంబు కన్నడించె"— తెలుఁగున నృసింహపురాణమును రచియించె నట! కవిజనాశ్రయముకూడ నీతనిదే యందురు. ఈతనినివాసము దాక్షారామముగాక నైజాంరాష్ట్రమందలి వేములవాడ గ్రామమని కొందఱందురు. అది చింత్యము. నృసింహపురాణమందలి దని యీపద్యము లక్షణగ్రంథములం దుదాహరింపఁబడెను.

క. ఈక్షితికి నచ్చి ముందుగ
దాక్షారామమున వారతరుణులనృత్యం
బీక్షించి యంతకంటెను
దక్షిణమున నేర్చి రంభతగ వేర్పఱఁగన్.

నృసింహపురాణమున—

క. కెంజిగురునకుం గఠినత
పంజకుఁబాల్ పిచ్చుగుంటువానికిఁ బరువుల్
నంజుడుకుఁ గమ్మఁ దావియు
లంజెకు మే లెందు లేదురా విటరాయా?

కోమట్ల నీతఁడు తిట్టెను.

చ. గొనకొని మర్త్యలోకమునఁ గోమటి పుట్టఁగఁ బుట్టెఁ దోన బొం
కును గపటంబు లాలనయుఁ గుచ్ఛితబుద్ధియు రిత్తభక్తియున్
ననువరిమాటలున్ బరధనంబును గ్రక్కున మెక్కఁ జూచుటల్
కొనుటలు నమ్ముటల్ మిగులఁ గొంటుఁదనంబును మూర్ఖవాదమున్.

ఉ. కోమటికొక్క టిచ్చి పది గొన్నను దోసము లేద;యింటికిన్
నేమ మెఱింగి చిచ్చిడినఁ జెందద పాపము; వాని నెప్పుడే
నేమరుపాటున న్మతియు నేమియొనర్చిన లేద దోస మా
భీముని లింగమాన! కవిభీమునిపల్కులు నమ్మి యుండుఁడీ!

ఉ. వేములవాడభీమ! భళిరే! కవిశేఖరసార్వభౌమ! నీ
వేమనియానతిచ్చితివి యిమ్ములఁ గోమటిపక్షపాతివై
కోమటికొక్కటిచ్చిపదిగొన్ననుదోసములేదటంటివా
కోమటికొక్కటీక పదిగొన్ననుధర్మము ధర్మపద్ధతిన్.

భీమకవి యొకప్పుడు గుడిమెట్టయనుగ్రామమున కరిగె నట! సాగి పోతురా జనురా జాతనిగుఱ్ఱము నక్కడిఁ దనసాహిణమునఁ గట్టిపెట్టించి యాతఁడు వేఁడినను విడిపింపఁ డయ్యె నట! దానిపైఁ గోపించి భీమకవి చెప్పిన పద్యము—

చ. హయ మది సీత పోతవసుధాధిపుఁ డారయ రావణుండు, ని
శ్చయముగ నేను రాఘవుఁడ, సహ్యజ వారిధి మారుఁ డంజనా
ప్రియతనయుండు లచ్చన విభీషణుఁ డాగుడిమెట్ట లంక నా
జయమును బోతరక్కసునిచావును నేడవనాఁడు చూడుఁడీ!

సాహిణిమారుఁ డనుదండనాథుఁడు చాళుక్యచొక్క భూపతి నెదిరించెనట! భీమకవి యామారుని శపించి చొక్క భూపతికే జయము చేకూర్చెనట—

ఉ. చక్కఁదనంబుదీవి యగుసాహిణిమారుఁడు మారుకైవడిన్
బొక్కిపడంగలండు చలమున్ బలమున్ గలయాచళుక్యపుం
జొక్కనృపాలుఁ డుగ్రుఁడయి చూడ్కులమంటలు రాలఁ జూచినన్
మిక్కిలి రాజశేఖరునిమీఁదికి వచ్చిన రిత్తవోవునే.

చాళుక్యచోక్కభూపాలుఁ డొకప్పుడు భీమకవిమాహాత్మ్యమును బ్రత్యక్షముగా నెఱుఁగఁగోరి "స్వామీ! మీరాడినదియాట పాడినదిపాట యగునందురు. వినోదార్థము కొంచెంటి ప్రదర్శింప వేఁడెదను" అనఁగా భీమకవి నీయభీష్ట మేమనియడిగి తెలిసికొని యచ్చటి మల్లెసాలనున్న స్తంభము చివుళ్లతో జొంపములతో వృక్ష మగున ట్లీక్రిందిపద్యము చెప్పెను.

శా. ఆనీతాభ్యుపదానశృంఖళకరాభ్యాలంబిత స్తంభమా!
నేనే వేములవాడభీమకవి నేనిన్ జిత్రకూటంబులో
భూనవ్యాపృతపల్లవోపలతికాపుష్పగుచ్ఛంబులన్
నానాపుష్పఫలప్రదాయివగుమా నాకల్పవృక్షాకృతిన్.

అట్లే యా స్తంభము పుష్పఫలభరితమగువృక్ష మయ్యెనట! మరల దానినీక్రిందిపద్యముఁ జెప్పి తొంటిరీతికిఁ దెచ్చెనట!

ఉ. శంభువరప్రసాది కవిజాలవరేణ్యుఁడనైన నావచో
గుంభన మాలకించి యనుకూలత నొంది తనూనభావనన్
గుంభినిఁ జోక్కనామనృపకుంజరుపందిటిమల్లెసాలకున్
స్తంభమురీతి నీతనువు దాలిచి యెప్పటియట్ల యుండుమా!

భీమకవి తెలుంగాధీశునిఁ (కళింగాధీశుఁడని కొన్నిప్రతులు,) గస్తూరి యాచించుచుఁ జెప్పిన పద్యము—

మ. ఘనుఁడన్ వేములవాడవంశజుఁడ దాక్షారామభీమేశనం
దనుఁడన్ దివ్యవిషామృతప్రకటనానాకావ్యధుర్యుండ భీ
మన నాపేరు వినంగఁజెప్పితిఁ దెలుం(గతిం)గాధీశ! కస్తూరికా
ఘనసారాదిసుగంధవస్తువులు వేగం దెచ్చి లాలింపురా?

చోడగంగుపైఁ జెప్పిన పద్యములు—

చ. అని మొనఁ జోడగంగఁడు మురారి బకారి నరుండు మాద్రిజుం
డన ఘనచక్రతోమరశరాసనకుంతము లల్కఁ బూని ద్రే

యను వడి డాయ నేయఁ బోడువన్ గళమస్తకవత్సమర్మముల్
తునియవె నుగ్గుగావె రొదఁ దూలవె నాటవె వైరివీరులన్.

ఉ. భోజుఁడు మంకు ధర్మజుఁడు బొంకు శచీపతి రంకు కల్పభూ
రాజు కళంకు దైవతధరాజము డొంకు పయోధి యింకు నం
భోజభవుండు పంకు ఫణిభూషణదేవుఁడు సంకు పద్మినీ
రాజహితుండు క్రుంకు సరి రారు గుణంబుల నీకు ధారుణిన్.

భీమకవి మైలమభీమునిమీఁదఁ జెప్పిన పద్యములు—

చ. గరళపుముద్ద లోహ మవగాఢమహాశనికోట్లు సమ్మెటల్
హరునయనాగ్ని కొల్మి యురగాధిపుకోఱలు పట్టుకార్లు ది
క్కరటిశిరంబు డాయ లయకాలుఁడు కమ్మరి వైరివీరసం
హరణగుణాభిరాముఁ డగు మైలమభీముని ఖడ్గసృష్టికిన్.

ఉ. ఏఱువభీమ! నీపగతు లెక్కనికొండలు చంచలాత్ములై
దూఱనియట్టిఘోరవనదుర్గములున్ వనితావియోగులై
పాఱనితోవలుం దిననిపండ్లును నాఁకటఁ గూర లుప్పగా
నేఱనికట్టెలుం గలవె యీలవణాంబుధివేష్టితావనిన్?.

కళింగగంగునాస్థానమునకు భీమకవి యరుగఁగా నాతఁ డనాదరమున నిది సమయముకాదు పొమ్మనెనట! దానిపై భీమన కోపించి శాప మిట్లొసఁగెను—

ఉ. వేములవాడభీమకవి వేగమె చూచి కళింగగంగు దా
సామము మాని కోపమున సందడిదీఱిన రమ్ము పొమ్మనెన్
మోమును జూడ దోస మిఁక ముప్పదిరెండుదినంబులావలన్
జామున కర్ధమం దతనిసంపద శత్రులపాలు గావుతన్.

శాపము ఫలించెను. రాజకళింగగంగు గర్భదరిద్రుఁడై పరుల కెఱుకపడకుండఁ బ్రచ్ఛన్నవేషముదాల్చి తిరిపమెత్తుచుఁ

బొట్టగడవుకొనుచుండెను. భీమకవి యొకనాఁడు రాత్రి పల్లకి నెక్కి దివటీలతో నెక్కడకో పోవుచుండఁగా నాతఁడు త్రోవ నేఁగుచుఁ జీకటిలో నొకగోఁతఁ గూలి 'అయ్యో! కాలిదివటీలైన లేదయ్యెఁగదా' యనుకొని చింతిలెనట! అది భీమకవి విని నీ వెవ్వండవని యడుగ 'భీమకవిగారిచే జోగిచేయఁబడిన వాఁడ' ననెనట! భీమకవి 'రాజకళింగగంగవా' యనఁగా నాతఁడు కేల్మోడ్చి రక్షింపుఁ డనెనట! అంతట—

ఉ. వేయుగజంబు లుండఁ బదివేలు తురంగములుండ నాజిలో
రాయల గెల్చి సజ్జనగరంబునఁ బట్టముగట్టుకో నిడిన్
రాయకళింగగంగు గవిరాజ భయంకరమూర్తిఁ జూడఁగాఁ
బోయెను మీనమాసమునఁ బున్నమపోయినషష్ఠినాఁటికిన్.

అని యాశీర్వదించి తిరిగి లబ్ధరాజ్యునిఁ జేసెనట!

ఉ. రామునమోఘబాణమును రాజశిఖామణికంటిమంటయున్
భీముగదావిజృంభణముపేంద్రునివజ్రము చక్రిచక్రమున్
దామరచూలివ్రాఁతయును దారకవిద్విషుఘోరశక్తియున్
(వే)లేములవాడభీమకవివీరుని తిట్టును రిత్తపోవునే!

---

## కవిసార్వభౌముఁడు శ్రీనాథుఁడు.

క్రీ 9 1580 ప్రాంతమున జనియించి 1450 తర్వాతవఱకు జీవించి పూర్ణపురుషాయుషజీవియై యనేక సుకవిరాజసమ్మానములఁ గాంచి యాంధ్రకవిమండలియం దనన్యసామాన్యమైన సుప్రతిష్ఠసంది మహాభోగముల ననుభవించుటయ కాక తుదకుఁ గష్టములఁగూడఁ జవిసూచిబృహస్పతికి సయితముగుండియలు

దిగ్గురనునట్లు స్వర్గమునకరిగిన యీయుద్దండపండితకవిని దెల్గు దేశమున మాతృభాషాభిమానులలో నెఱుంగనివా రుండరు. ఈమహాకవిచే శృంగారనైషధాదులగు ప్రబంధములే కాక యింక ననేకము లగుచాటుపద్యములునురచియింపఁబడినవి. అందు రసోత్తరము లిం దుదాహరింపఁబడును.

శ్రీనాథుఁడుకర్ణాటాంధ్రరాజ్యాధీశ్వరుఁడగుసంబుపరాయని తెలుంగురాయలయొద్ద కరిగి యాతని నాశీర్వదించినది.

శా. ధాటీఘోటకరత్నఘట్టనమిళద్ధాత్రీఘిష్ఠకళ్యాణఘం
టాటంకారవిలుంఠలుంఠితమహోన్మత్తాహితక్షోణిభృ
త్కోటీరాంకితకుంభినీధరసముత్కూటాటవీఝాటక
ర్ణాటాంధ్రాధిప! సాంపరాయని తెలుంగా! నీకు బ్రహ్మాయువౌ.

ఆనృపాలునిఁ గస్తూరి యాచించుచుఁ జెప్పిన పద్యము—

శా. అక్షయ్యంబుగ సాంపరాయని తెలుంగాధీశ! కస్తూరికా
భిక్షాదానము సేయురా సుకవిరాడ్బృందారకశ్రేణికిన్
దాక్షారామచళుక్యభీమవరగంధర్వాప్సరోభామినీ
వక్షోజద్వయకుంభికుంభములపై వాసించుఁ దద్వాసనల్.

వెల్లోటిరాజునుపండితకవియునగు సర్వజ్ఞసింగభూపాలునాస్థానమునకుఁ బోయి యానృపాలుని కొలువుకూటమునకు ముందుఁ బూజింపఁబడుచుండెడు శారదావిగ్రహమును గాంచి యాతఁడు చెప్పినపద్యము—

సీ. దీనారటంకాలఁ దీర్థమాడించితి
దక్షిణాధీశుముత్యాలశాల
పలుకుఁదోడైతాంధ్రభాషామహాకావ్య
నైషధగ్రంథసందర్భమునకు

పగులఁగొట్టించి తుద్భటవివాదప్రౌఢి
గౌడడిండిమభట్టుకంచుఢక్క
చంద్రభూషక్రియాశక్తి రాయలయొద్దఁ
పాదుకొల్పితి సార్వభౌమబిరుద

సీ. మెటులు మెప్పించెదో నన్నునింకమీఁద
రావుసింగమహీపాలు ధీవిశాలు
నిండుకొలువున నెలకొనియుండినీవు
సరససద్గుణనికురంబ! శారదాంబ!.

సింగభూపాలుపైఁ జెప్పినది—

క. సర్వజ్ఞ నామధేయము
శర్వునకే రావుసింగజనపాలునకే
యుర్విం జెల్లును దక్కొరు
సర్వజ్ఞుం డనుట కుక్క సామజమనుటే.

ఆయాస్థానమున నొకబట్టుకవి యిచ్చిన సమస్య— "కుక్కవో నక్కవో ఫణివో క్రోతివో పిల్లివో బూతపిల్లివో" కవి సార్వభౌముని పూరణము—

ఉ. తక్కిన రావుసింగవసుధావరుఁ డర్థుల కర్థ మిచ్చుచో
దిక్కులలేనికర్ణుని దధీచిని ఖేచరు వేల్పుమ్రానుఁ బెం
పెక్కినకామధేనువు శిబీంద్రుని నెన్నెదు భట్ట! దిట్టవై
కుక్కవో! నక్కవో! ఫణివో! క్రోఁతివో! పిల్లివో! బూతపిల్లివో!.

శ్రీనాథుఁడు రెండ్లయాస్థానకవి. రెడ్లకు వెల్గోటివారికి వైరము. ఈతఁడు తిరిగి రెడ్లయాస్థానమునకుఁ బోఁగాఁ దమ శత్రువగు సింగమనేని నట్లు పొగడినందుకు వారు కుపితులై యిచ్చకాలమారివని చుల్కనచేసి పల్కిరట! నేనాపద్య మున నాతనిగూఢముగా వెక్కిరించితినేగాని పొగడలేదని

శ్రీనాథుఁడిట్లా పద్యమునకన్వయము చెప్పెనట? "సర్వజ్ఞ నామధే
యము శర్వునకే. రావు సింగజనపాలున కేయుర్విం జెల్లును ?
(శివునిఁగాక) తక్కొరు సర్వజ్ఞుండనుట కుక్కసామజమను ఛే.

వేఱొకప్పుడు వెల్గోటి మాదయలింగమనేఁడు రెడ్లకఠారిని గైకొనఁగా నాకఠారిని దిరిగి రెడ్లకడకుఁ జేర్చుటకై శ్రీనాథుఁ డాతనికడ కరిగి పొగడిన పొగడ్త—

సీ. జగనొబ్బగండాంక సంగ్రామనిశ్శంక
జగతీశ రాయ వేశ్యాభుజంగ
అఖిలకోటలగొంగ యరిరాయమదభంగ
మే లందు ధరణీశమీనజాల
మూరురాయరగండ ముఱియురాజులమిండ
యభివృద్ధి మీరు చౌహత్తమల్ల
ఘనగాయగోవాళ కామినీపాంచాల
బ్రహ్మాయు శశివంశపరశురామ

గీ. దండిబిరుదులసురతాణిగుండెదిగుల
బళిరయల్లయ వేముని పగరమిండ
రమణమించిన మేదినిరావుబిరుద
సంగరాటోప! మాదయలింగభూప!

కర్ణాటరాజ్యమున కరిగినప్పు డారాజు మీవాసస్థల మెట్టిదనఁగాఁ జెప్పినది—

సీ. పరరాజ్య పరదుర్గ పరవైభవశ్రీలఁ
గొనకొని విడనాడు కొండవీడు
పరిపంథిరాజన్యబలములబంధించు
కొమరు మించినబోడు కొండవీడు
ముగురు రాజులకును మోహంబు పుట్టించు
గుఱుతైన యుఱిత్రాడు కొండవీడు

చటులవిక్రమకళాసాహసం బొనరించు
కుటిలాత్ములకు గాదు కొండవీడు

.. జవనఘోటకసామంతసరసవీర
భటనటానేకహాటకప్రకటగంధ
సింధురారవమోహనశ్రీలఁ దనరు
కూర్మి నమరావతికి జోడు కొండవీడు.

అక్కడ రాజసమ్మానమునకుఁ గాలయాపనము కొంత సంభవింపఁగా నా దేశవు విధము తనకు సరిపడక కర్ణాటరాజ్యలక్ష్మిం బ్రార్థించుచుఁ జెప్పినపద్యము—

శా. కుల్లాయుంచితిఁ గోఁకసుట్టితి మహాకూర్పాసముం దొడ్గితిన్
వెల్లుల్లిం దిలపిష్టముల్ మెసవితిన్ విశ్వస్త వడ్డింపఁగా
సల్లా నంబలి ద్రావితిన్ రుచులు దోసంబంచుఁ బోనాడితిం
దల్లీ! కన్నడరాజ్యలక్ష్మి! దయలేదా నేను శ్రీనాథుఁడన్.

తొలుత నీతఁడు కొండవీటి రెడ్లయాస్థానకవి. ఆరాజ్య మంతరించినతర్వాత రాజమహేంద్రవరమున రాజ్య మేలు నల్లయ వేమ వీరభద్రారెడ్లయొద్దఁ జేరెను. వేముని వర్ణించినవర్ణనము—

సీ. రాజనందనరాజరాజాత్మజులు సాటి
తలఁప నల్లయవేమధరణిపతికి
రాజనందనరాజరాజాత్మజులు సాటి
తలఁప నల్లయవేమధరణిపతికి
రాజనందనరాజరాజాత్మజులు సాటి
తలఁప నల్లయవేమధరణిపతికి
రాజనందనరాజరాజాత్మజులు సాటి
తలఁప నల్లయవేమధరణిపతికి

గీ. భావభవభోగసత్కళాభావములను
భావభవభోగసత్కళాభావములను

భావభవభోగ సత్కళాభావములను
భావభవభోగ సత్కళాభావములను.

ఉ. వీరరసాతిరేక రణవిశ్రుత వేమనరేంద్ర! నీయశం
బారభమానతారకరహారవిలాసము నీభుజామహం
బా రభమానతారకరహారవిలాసము నీపరాక్రమం
బా రభమానతారకరహారవిలాసము చిత్రమారయన్.

వేమవీరభద్రారెడ్లుప్రతివర్షమునుసింహాచలపునృసింహస్వామికి దిరునాళ్లు జరిపించుచుండెడివారు శ్రీనాథుఁడును వారితోనచ్చటికరిగెడివాఁడు. ఆపర్వతముమీఁదికియాత్రార్థము వచ్చునానాస్త్రీలను జూచి యాతఁడు వర్ణించిన వర్ణనము—

సీ. హరినీలములకప్పు లణఁగించునునుగొప్పు
విడఁ బువ్వుఁదండ తా వీడఁ బాఱ
కోటిచందురుడాలు గోటమీటఁగఁజాలు
మొగముఁగుంకుముచుక్క సొగసుగుల్క
అలజక్కవలజిక్కు లణఁగఁద్రొక్కఁగ నిక్కు
పాలిండ్లపై నాఁచుపైఁట జాఱ
ఇసుకదిన్నెలమెట్టు పసిఁడిచెంపలఁగొట్టు
పిఱుఁదుపై మొలనూలు బెళుకుదేర
గీ. చిగురుఁగెమ్మోవిఁబగడంపుజిగియు మెఱయ
మాట లాడఁగఁ గనుదోయి తేట లమరఁ
జెమట లూరంగ సింహాద్రి చేరవచ్చె
భోగగుణధామ యాంధ్రనియోగిభామ.

సీ. విడినకొప్పున జాజివిరు లొప్పుగా రాలఁ
జిట్టికుంకుముచుక్కబొట్టు చెదర
చక్కఁగాఁ బటువారుసందెడుకుచ్చెళ్లు
చెలఁగు మెట్టియలపైఁ జిందులాడ

కొదమగుబ్బలఁ బైఁటకొంగు పయ్యెద జాఱ
ముక్కునత్తొకవింతముగ్ధ గుల్కు
మొలగంట లిమ్ముగ మ్రోఁతతో రంజిల్లఁ
గనకంపుటందియల్ ఘల్లు రనఁగఁ
గీ. బొసఁగఁ గ ప్రంపుపీడెముల్ పొందుపఱిచి
యనుఁగుజేడెలతో ముచ్చటాడికొనుచు
నలరుసింహాద్రిపై కెక్కు హర్షమునను
వచ్చెఁ గలకంఠి వేపారిమచ్చెకంటి.

శా. రా పాడంగలగుబ్బచన్నుఁగవతో రాకేందుబింబంబుపైఁ
దూ పేయంగలముగ్ధనెమ్మొగముతోఁ దోరంపుమైచాయతోఁ
జూపుల్ ముగ్ధుల బాలసంఘములతో సొంపారులేనవ్వుతో
వేపార్యంగన వచ్చెఁ గాసెబిగితో వేణీభరచ్ఛాయతోఁ.

సీ. పలుతెఱంగులరంగు పద్మరాగలవీణె
చకచకత్ప్రభల సాక్షాత్కరింప
సొంపుతో రవచెక్కడంపుముంగరచాయ
పగడంపుమోవిపైఁ బరిఢవిల్ల
విరిసి రొమ్ముసరిలి క్రిక్కిఱిసినచనుదోయి
బిగువున నెఱపైఁటిక పిక్కటిల్ల
ఒసపరియొయ్యారిమునుఁగులో నెఱివేణి
కొమరాలిమూపున గునిసియాడ
గీ. విరులతావియు నెమ్మేనివెనుకకచ్చ
పెళపెళక్కనుచిఱుదొడ్డల్ బెళుకునడుము
వలుదపిఱుఁదులు కలికిచూపులబెడంగు
లొలయఁ గన్గొంటి వేపారికలువకంటి.

క. రంభా స్తంభము లూరువు
లంభోరుహనిభము లతుల లతనుళరంబుల్

జంభాసురారిమదగజ
కుంభము లీనంబివారికోడలికుచముల్.

క. అద్దిర! కులుకులు బెలుకులు
నిద్దంపు మెఱుంగుఁదొడలనీటులు గంకే
దిద్దుకొనియేలవచ్చును
ముద్దియ యీనంబిపడుచు ముచ్చట దీఱన్?

సీ. పాలుపొందగఁ విభూతిబొట్టు నెన్నొసలిపైఁ
దళుకొత్తుచెమట కు త్తలపడంగ
సొగసుగాఁ బూదండజోఁపినకీల్గొప్పు
జాఱఁగా నొకచేత సరుదుకొనుచు
బిగిచన్నుఁగవమీఁద బిరుసుఁబయ్యెదచెంగు
దిగజాఱి శివసూత్రమగపడంగ
ముక్కున హొరుమంజిముత్యాలముంగర
కమ్మవాతెఱమీఁద గంతులిడఁగ

గీ. కాను జవ్వాడ మట్టియల్ గదిసి మ్రోయఁ
గమ్మవిలుకాని జాళువాబొమ్మయనఁగ
మెల్ల మెల్లన సింహాద్రిమీఁది కేఁగెఁ
గన్నెపూఁబోఁడి యగసాలివన్నెలాఁడి.

అక్కడఁ దంబురా చేతఁబూని గానముసేయుచు వచ్చు సాతానివెలఁదిపైఁ జెప్పినది.—

సీ. మీఁగాళ్ల జీరాడు మేలైనకుచ్చెళ్ల
తీరున మడిచీర తీర్చి కట్టి
బిగువుగుబ్బలమీఁద నిగనిగ లొలుకొత్తు
నొరపయ్యెదకొంగు జాఱవైచి
వలపల కొకవింత గలుగఁగా గొప్పలా
కురులు నున్నగ దువ్వి కొప్పువెట్టి

నెలవంక నామంబు సలలితంబుగ నుంచి
 తిరుచూర్ణ మామీఁదఁ దీర్పుచేసి
గీ. ఓరమాపుల విటులఁ దా నూరడించి
గిల్కుమెట్టెలరవల్ గుల్కరింపఁ
జికిలిచేసినతామ్రంపుఁజెంబు పూని
వీథి నేతెంచె సాతానివేడ్కలాఁడి.

అట దుకాణమునఁ దమలపాకులు కొనఁబోయి చెప్పినది.—

చ. తొలకరిమించుఁదీఁగతి తోఁప దుకాణముమీఁద నున్నయ
య్యలికులవేణితోఁ దములపాకులబేరము లాడఁబోయి నే
వలచుట కేమి శంకరునివంటిమహాత్ముఁడు లింగరూపియై
పలికెడుదానిగబ్బిచనుగుబ్బలసందున నాట్య మాడఁగన్?.

ఉ. అంగడివీథిఁ బల్లవుల కాసగ మామిడిపండు లమ్ముచున్
జంగమువారిచిన్నది పిసాళితనంబునఁ జూచెఁబో నిశా
తాంగజబాణకైరవసితాంబుజమత్తచకోరబాలసా
రంగతటిన్నికాయముల రంతులు సేసెడు వాఁడిచూపులన్.

సీ. బాలేందురేఖసంపద మించి విల్లసిల్లు
 నొసటితళ్కులనీటు నూలు సేయు
భ్రమరికాహరినీలచమరవాలములఁ బోల్
 వేణీభరముచాయ చేయుసేయు
దర్పణద్విజరాజధాళధళ్యప్రభ
 లపనబింబస్ఫూర్తి లక్షసేయు
కోకహాటకశైలకుంభికుంభారాతి
 కుచకుంభయుగళంబు కోటిసేయు
గీ. జఘనసీమకు విలువ లెంచంగ వశమె
దీనిసౌందర్యమహిమంబు దేవుఁ డెఱుఁగు
నహహ! యొబ్బంగి సాటిసేయంగవచ్చు
భావజునికొల్వు జంగముభామచెల్వు.

మ. విమలాంభోరుహపత్త్రజైత్త్రములుగాఁ బెంపారునేత్త్రమ్ములన్
గమనీయంబగుకజ్జలం బునిచి రేఖాసౌష్ఠవం బొప్ప నా
గముతోఁ జేసినసిందురంబు నుదుటం గాన్పింపఁ బయ్యెంటయున్
యమునాఐకయు దాఁటి పూఁపచను లొయ్యారంబు నూపన్ దుకా
ణముపై బొందిలి దోర్తు నిల్చె ముఖచంద్రస్ఫూర్తి శోభిల్లఁగన్.

నీలాటిరేవున స్నానమునకై యరిగి యచ్చటనున్న నానావనితలఁ జూచి చెప్పిన పద్యములు—

ఉ. వీసపుముక్కునత్తు నరవీసపుమంగళసూత్ర మమ్మినన్
గాసునురానికమ్మ లరకాసునుగానివి పచ్చపూసలున్
మాసినచీర గట్టి యవమాన మెసంగఁగ నేఁడు రాఁగ నా
కాసలనాటివారికనకాంగిని జూచితి నీళ్లరేవునన్.

క. పూజారివారికోడలు
తా జాఱఁగ బిందె జారి దబ్బునఁబడియెన్
మైజాఱుకొంగు దడిసిన
బాజారే తిరిగి చూచి పక్కున నవ్వెన్.

శా. పొచ్చెం బింతయు లేనిహంసనడతోఁ బొల్పొందులేనవ్వుతోఁ
బచ్చల్దాపినకుల్కుముంగరలతో బాగైనకమ్మావితో
నచ్చంబైనముసుంగువెట్టి చెలితో నామాటలే యాడుచున్
వచ్చెంబో కుచకుంభముల్ గదలఁగా వామాక్షి తా నీళ్లకున్.

ఉ. శ్రీకరభూషణంబులును సిబ్బెపుగుబ్బలు ముద్దుఁజెక్కులున్
గోకిలవంటిపల్కులును గొల్చినఁ జేఱలఁ గేరుకన్నులున్
బ్రాకటదేహకాంతియును బంగరుబొమ్మకు హెచ్చు వచ్చు నీ
చాకలవారిజవ్వనికి సాటికిరా రిఁకఁ దొంటిజవ్వనుల్.

క. నీలాటిరేవులోపల
మేలిమితోఁ దీర్చినట్టు మెఱసి నిలుచుచున్

దాలిమిని వాలుఁజూపుల
బాలామణి గుట్టు బైటఁబడఁగాఁ జూచెన్.

కొండవీట నున్నప్పు డెడనెడఁ బల్నాటిసీమకు శ్రీనాథుఁడు పోవుచుండెడివాఁడు. పల్నాటిసీమపై నీతనికిఁగల యనాదరము ననేకపద్యములఁ బట్టి తెలిసికొననగు. పల్నాటివారికిఁ గారెమపూఁడి కాశియట.

ఉ. వీరులు దివ్యలింగములు విష్ణువు చెన్నుఁడు కల్లి పోతురా
జారయఁ గాలభైరవుఁడు నంకమశక్తియ యన్నపూర్ణయున్
గేరెడుగంగధారమడుఁగే మణికర్ణిక గాఁ దెలంగు నీ
కారెమపూఁడిపట్టణము కాశిగదా పలినాటివారికిన్.

పల్నాటిసీమపై నీతనికిఁ గలయనాదరము—

క. రసికుఁడు పోనఁడు పల్నా
డెసఁగంగా రంభయైన నేకులె విడుకున్
వసుధేశుఁడైన దున్నును
గుసుమాస్త్రుండైన జొన్నకూడే కుడుచున్.

పల్నాటిసీమలో నెంతలోఁతు త్రవ్వినఁగాని నీళ్లూరవు. అక్కడి చేఁత్రాళ్లు కొండవీటిచేఁత్రాళ్లకుద్విగుణితములై యుండవలయును. అంతలోఁతు త్రవ్వినను గొన్నిచోట్ల నీరూరక రాతిచట్టు వచ్చును; కాన నీళ్లకై యెంతోసొమ్ము భంగపడవలసి వచ్చుచుండును. ఈవిషయమునఁ జెప్పినపద్యము—

ఉ. అంగడి యూరలేదు వరియన్నములేదు శుచిత్వమేమిలే
దంగన లింపులేరు ప్రియమైనవనంబులులేవు నీటికై
భంగపడంగఁ బాల్పడుకృపాపరు లెవ్వరులేరు దాత లె
న్నంగను సున్న గాన పలినాటికిఁ బోటికిఁ బోవ నేటికిన్?.

పల్నాటిప్రాంతములందు గ్రామమున కెవ్వరేని పెద్దలు వచ్చిన గ్రామపురోహితునింట విడిదలసేయింతురు. శ్రీనాథుఁ డొకపురోహితు నింట విడిసి యచ్చటి రోఁత నిట్లు వర్ణించె. (ఆవైపులఁ బురోహితు లూరిలోని తమయాశ్రితులయిండ్ల కనుదినమును విస్తళ్లుకుట్టియిచ్చుచుండవలెనఁట! దానికై నిల్వ చేసి యుంచుకొన్న విస్తరాకులు గలవు.)

ఉ. దోసెఁడుకొంపలోఁ బసులత్రొక్కిడి మంచము దూడరేణముం
బాసినవంటకంబు పసిబాలురశౌచము విస్తరాకులుం
మాసినగుడ్డలుం దలకుమాసినముండలు వంటకుండలుం
రాసెడుకట్టెలుం దలఁపరాదు పురోహితు లింటికృత్యముల్.

గీ. చిన్న చిన్నరాళ్లు చిల్లరదేవళ్లు
నాగులేటినీళ్లు నాఁపరాళ్లు
సజ్జజొన్నకూళ్లు సర్పంబులును దేళ్లు
పల్లెనాటిసీమ పల్లెటూళ్లు.

క. జొన్నకలి జొన్నయంబలి
జొన్నన్నము జొన్నపిసరు జొన్నలె తప్పన్
సన్నన్నము సున్నసుమీ
పన్నగఁ బల్నాటిసీమప్రజ లందఱకున్.

త్రోవను మంచినీరు దొరకక చెప్పినది:—

క. సిరిగలవానికిఁ జెల్లును
దరుణులు పదియాఱువేలఁ దగఁ బెండ్లాడన్
దిరిపెమున కిద్దరాండ్రా
పరమేశా! గంగ విడుము పార్వతి చాలున్.

ఒకప్పుఁ ...ల్నాటిలో నొకరింట నీతనికి జొన్నకూడును, జింతచిగురును బచ్చలియాకును గల్పి వండినయుడుకుఁగూర యు, వడ్డింపఁగాఁ జెప్పినపద్యము—

ఉ. ఫుల్లసరోజనేత్ర! యలపూతనచన్నులచేఁదు ద్రావి నాఁ
డల్ల దవాగ్ని మ్రింగితి వటంచును నిక్కడ వేల? తింత్రిణీ
పల్లవయుక్తమా నుడుకుబచ్చలిశాకము జొన్నకూటితో
మెల్లనయొక్కముద్ద దిగ మ్రింగుము! నీపస కానవచ్చెడిన్.

గురిజాల సీమను గల పులిపాడనుగ్రామమునకు శ్రీనాథుఁడు పోఁగా నాతనియెడ నచ్చటి శేషయ్యయనుకరణమును హానుమయ్య యనుకాఁపును పుల్లయ్య యను రెడ్డియును ననాదరముచూపిరట! దానిపై నాతఁడు చెప్పినపద్యము—

గీ. ఊరు వ్యాఘ్రనగర మురగంబు కరణంబు
కాఁపు కపివరుండు కసవు రేఁడు
గుంపు గాఁగ నిచట గురిజాలసీమలో
నోగు లెల్లఁ గూడి రొక్కచోట!

నెమలిపురిపైఁ జెప్పినది—

క నెమలిపురి యమపురముగా
యముఁ డాయెను బసివిరెడ్డి యంతకు మిగులన్
యమదూతలైరి కాఁపులు
క్రమ మెఱుఁగని దున్నలైరి కరణా లెల్లన్!

అడిగొప్పులపైఁ జెప్పినది—

క. గుడిమీఁదిక్రోఁతితోడను
గుడిలోపలినంబివారికోడలితోడన్
నడివీథిలంజెతోడను
నడిగొప్పులమోరుగాలి నడిగితి ననుమీ!

### మసర? రాజ్యముపైఁ జెప్పిన పద్యములు—

ఉ. గొంగడి మేలుపచ్చడము కుంపటి నల్లులు నుక్కిమంచమున్
జెంగట వాయుతైలము లజీర్ణపుమందులు నుల్లిపాయలున్
ముంగిట నంటకట్టియలమోపులు దోమలు చీఱపోతులున్
రంగ! వివేకికీమసరరాజ్యముకాఁపుర మెంతరోఁతరా!

ఉ. వంకరపాగలున్ నడుమువంగినకత్తులు మైలకోఁకలున్
సంకటిముద్దలుం జనుపశాకములుం బలుపచ్చడంబులుం
దెంకగునోరచూపులును దేఁకువదప్పినయేసబాసలున్
అంకుల బ్రహ్మ యీమసరరాజ్యము నెట్లు సృజించె? నక్కటా!

ఉ. ఆదరణంబు సున్న వినయంబు హితంబును బొంకు సత్యమా
లేదు దయారసం బది హుళిక్కి పసాపడువేళ పక్కిలో
ఖేదపుఁబెట్టు దిట్టబలిభిక్షముఁ....................త
త్వాదులఁ బుట్టఁజేసినవిధాత ప్రజాపతి గాకయుండునే!

### రేనాటినిగూర్చి—

క. గరళము మ్రింగితి నంచుం
బురహర! గర్వింపఁబోకు పో! పో! పో! నీ
బిరు దింకఁ గానవచ్చెడి
మెఱపెడిరేనాటిజొన్న మెదుకులు తినుమీ!

### పడమటిసీమ వ్యాపారులపైఁ జెప్పినపద్యము—

శా. వస్త్రాలున్ మసిబుఱ్ఱలుం గలములుం దారొక్కన్నచింతంబళుల్
పుస్తుల్ గారెడుదుస్తులుం జెమటకంపుం గొట్టునీర్కావులుం
అస్తవ్యస్తపుఁగన్నడంబును భయంబై తోఁచుగడ్డంబులున్
'వస్తా చూస్తిమి రోస్తిమిన్' బడమటన్ వ్యాపారులం గ్రూరులన్.

శబరకాంతలు: —

క. గిటగిటనగు సెన్నడుములు
పుటపుటనగుచన్నుఁగవలు పున్నమ నెలతో
జిటపొటలాడెడు మొగములు
కటితటములకొ మరు శబరకాంతలకమరున్.

గీ. వీనులకు విందులై తేనెసోన లెనయ
ముందురాగంబునను జగన్మోహనముగ
పాడె నొకజాలరిమిటారి యీడులేని
కాకలీనాదమున నోడగడపుపాట !

ఒకప్పుడు ధనలబ్ధి తనకు లేకపోఁగాఁ జెప్పినది:—

మ. కవితల్ సెప్పినఁ బాడనేర్చిన వృథాకష్టంబె యీబోగపుం
జవరాంద్రేకద భాగ్యశాలినులు పుంస్త్వంబేల పో పోఁచకా
సవరంగా సొగసిచ్చి మేల్ యువతివేషం బిచ్చి పుట్టింతువే
నెవరుక్ మెచ్చి ధనంబు లిచ్చెదరుగాదే పాపపుందైవమా !

రాజమహేంద్రవరమున శాస్త్రపండితులతో వివాద
పడిచెప్పినపద్యములలో నొకటి---

మ. శ్రుతిశాస్త్రస్మృతు లభ్యసించుకొని విప్రుం డంత నానాధ్వర
వ్రతుఁడై పోయి కనుక్ బురందరపురారామద్రుమానల్పక
ల్పతరుప్రాంతలతాకుడుంగసుఖసుప్తప్రాప్తరంభాంగనా
ప్రతి...ంకురపాటనక్రమకళాపాండిత్యశౌండీర్యముల్.

ఒకనాఁ డొకవనిత తన్నుఁ గికురింపఁగాఁ జెప్పినది.—

ఉ. హాజలజాక్షి! హా కిసలయాధర ! హా హరిమధ్య! హా శర
ద్రాజనిభాస్య! హా ప్రమదతంత్రకళానిధి! యెందుఁ బోయితే

రాజమహేంద్రవీథిఁ గవిరాజు ననుం గికురించి భర్గకం
ఠాజితకాలకూటఘుటికాంచిత మైనయమాసచీఁకటిన్?.

కడిదిపురమున కరిగి చెప్పినవి:—

క. ముదివిటులు విధవలం జెలు
పదకవితలు మాఱుబాసబాఁపనవారల్
చదువనిపండితపర్యులు
కదనాస్థిరవీరవరులు కడిదిపురమునన్.

ఉ. చీరయు ముక్కుముంగరయుఁ జెంపలగంధముఁ జొక్కబొట్టు మం
జీరఝుణంఝుణారవముఁ జేతుల్కఁ గంకణనిక్వణంబు నొ
య్యారపుజాఱుకొప్పును గయాళితనంబును గాని లోన శృం
గార మొకింతలే దనుట గంటిని యీపురివారకాంతలన్.

రాచవీటి కరిగినప్పుడు చెప్పికొన్నపద్యము:—

చ. పసగలముగ్గుమోవి బిగివట్రువగుబ్బలు మందహాసమున్
నొసటవిభూతిరేఖయుఁ బునుంగునతావి మిటారిచూపులున్
రసికులు మేలు మేలు బళిరా యని మెచ్చఁగ రాచవీటిలోఁ
బసిఁడిసలాకవంటి యొకబల్జవధూటిని గంటి వేడుకన్.

దక్షిణదేశమున కరిగినప్పుడు చెప్పినవి:—

గీ. మేఁతఁ గరిపిల్ల పోరున మేఁకపిల్ల
పారుఁబోతుతనంబునఁ బందిపిల్ల
ఎల్లపనులను జెఱుపంగఁ బిల్లిపిల్ల
అందమునఁ గ్రోఁతిపిల్ల యీయాఱవపిల్ల.

సీ. కూడు తలఁపఁ జొళ్లు కూర కారామళ్లు
చెవులంత వ్రేలాళ్లు చేలు మళ్లు

దుత్తఁడే నాగళ్లు దున్నపోతులయేళ్లు
కలవు మాపటివేళ గంజినీళ్లు
మాటమాటకు ముళ్లు మఱి దొంగదేవళ్లు
చేఁదైనపచ్చళ్లు చెఱకునీళ్లు
వంటపిడ్కలదాళ్లు వాడనూతులనీళ్లు
విన విరుద్ధపుఁ బేళ్లు వెడఁదనోళ్లు
సఖులచన్నులబైళ్లు చల్లనిమామిళ్లు
పరుపైనవావిళ్లు పచ్చపళ్లు

గీ. దళమయినయట్టికంబళ్లు తలలుబోళ్లు
పయిఁడికిని జూడఁ బయిఁడెత్తు ప్రత్తివిళ్లు
చలముకొని వెదకిన లేవు చల్లనీళ్లు
చూడవలసెను ద్రావిళ్లకీడు మేళ్లు.

సీ. తొలుతనే వడ్డింత్రు దొడ్డమిర్యపుఁజారు
చెవులలోఁ బొగవెళ్లి చిమ్మిరేఁగఁ
పలుతెఱంగులతోడఁ బచ్చళ్లుచవిగొన్న
బ్రహ్మరంధ్రముదాఁకఁ బారు నావ
యవిసాకు వేఁచిన నార్నెల్లు పసిలేదు
పరిమళ మెంచినఁ బండ్లుసొగచు
వేపాకునెండించి వేసినపొళ్లను
గంచానఁగాంచినఁ గ్రక్కువచ్చు

గీ. నఱవవారింటివిం దెల్లనాగడంబు
చెప్పవత్తురు తమతీరు సిగ్గులేక
* *
చూడవలసెను ద్రావిళ్లకీడు మేళ్లు.

శ్రీరంగక్షేత్రమున కరిగియచ్చట నొకబిత్తరిపైఁ జెప్పినది:-

సీ. ఒకచెంప కొరగా నొనగూర్చి దిద్దిన
తులుమునసుండి క్రొవ్విరులు రాల
రాతిరి నిదురఁ గూరమిఁ జేసి మడివడు
బడలిక నడుగులు తడఁబడంగ
వింతవారలఁ జూచి వెసనవ్వు నెడఁ గప్పు
గలదంతములకాంతి వెలికిఁ బాఱ
చిడిముడినడచుటఁ జెలరేఁగి గుబ్బల
పైఁ దాఁకియొక్కింతపైఁట జాఱ

గీ. చెమటచేఁ దిరునామంబు చెమ్మగిల్ల
హాళి డాచేత విడియంబు గీలుకొల్పి
రంగపురిరాజవీథిఁ గానంగనయ్యె
నాదుమదిఁ గోర్కులూర వైష్ణవవధూటి.

మారెళ్లసీమ కరిగినప్పుడు చెప్పినవానిలో నొకటి:—

సీ. నడివీథిలో రాళ్లు నాగులే దేవళ్లు
పరగటఁ సావిళ్లు పాడుగుళ్ళు
ఐదువన్నెలకూళ్ళు నంబటికావిళ్ళు
నూరూర జిల్లేళ్లు నూటనీళ్ళు
నడుమను వడదోళ్లు నడువీథి కల్‌రోళ్లు
కరణాలవడిసెళ్లు కాఁపుముళ్లు
* * * * * *
* * * *

గీ. * * * నేరెళ్లవాగునీళ్లు
సిరులఁ జెలువొందు మారెళ్ల సీమయందు.

రెడ్లప్రాచీనరాజధానియగు నద్దంకి కరిగినప్పుడు చెప్పినది.

సీ. తళ్కుతళ్కనుకాంతి బెళ్కు కెంపులముంగ
రందమై కెమ్మోవియందుఁ గుల్క

ధగధగద్ధగలచేఁ దనరారుబంగారు
గొలుసులింగపుఁగాయ కొమరుమిగుల
నిగనిగన్నిగలచే నెగడుచెల్వపుగుబ్బ
దోయి యొండొంటితో రాయిడింప
రాజహంసవిలాసరాజితం బగుయాన
మందు మెట్టెలు రెండు సందడింప
గీ. సరసదృక్కుల విటులను గరఁగఁ జూచి
పొంది కైవట్టిమోమున భూతిరేఖ
రాజకళ లొప్ప నద్దంకిరాజవీథిఁ
పొలిచె నొకకొమ్మ గాజులముద్దుగుమ్మ.
ఉ. గండముదప్పె నాంధ్రకవిగానికి నిన్నటిరేయిఁబుష్పకో
దండుని గారవింపకయ తద్దయు నిల్చితిఁగానియయ్యయో!
బండరువారిపాపికిని బైటిపసారమె యట్టె! మైమయిం
బుండయియొల్లఁ బంకఁ జెడిపోవుదుగా! యటువోయియుండినన్.

మఱికొన్ని పద్యములు—

ఉ. వాలుగుకన్నుదోయి బిగివట్రువగుబ్బలు కాఱుచీఁకటిం
జాలహసించుకొప్పు వాజిగి పొరసము న్నగుమోము గల్గు నా
బాలికఁ గూలి కమ్మకొన బట్టలు నేసెడుసాని కిచ్చె హా
సాలెత గాదురా కుసుమసాయకుపట్టపుదంతి! యింతియే!
ఉ. కుమ్మరవారిబాలిక చకోరవిలోచన ముద్దుగుమ్మ యా
వమ్ముదరిన్ రసామలినవస్త్రము చుంగులుజాఱఁ గట్టి తాఁ
గమ్మనిమ్రోఁతతోఁ గరనఖమ్ముల భాండము లంగజాస్త్రపా
తమ్మునఁ బ్రోవు దీసె విటతండము గుండియ లార విచ్చఁగన్.
క. అకదురునఁ బికరవముల్
అకదురున భృంగరవము నాత్మరవంబుల్

ఏకీకృతముగ నేకు ల
నేకులు విన ఖడికె మదిర యేకులముదిరా!

ఉ. గుబ్బలగుమ్మ లేఁజిగురుఁగొమ్మ సువర్ణపుఁగీలుబొమ్మ బల్
గబ్బిమిటారిచూపులడి కాఁపుది దానికి నేల యొక్కనిం
బెబ్బులి వంటఁగట్టితివి పెద్దవు నిన్ననరాదు కోరి దా
నబ్బ! పయోజగర్భ! మగవానికి నింతవిలాసమేటికిన్?.

శా. దాయాదుల్వలె గుబ్బచన్నులొఱయన్ ధావళ్యనేత్రాంబుజ
చ్ఛాయల్ తాండవమాడఁ గేరి పురుషస్వాంతమ్మునన్ మన్మథుం
డేయం జంగమువారిచంద్రముఖి విశ్వేశార్చనావేళలన్
వాయించెం గిరిగిండ్లు బాహుకుశలవ్యాపారపారీణతన్.

ఉ. పువ్వులు కొప్పునం దురిమి ముందుగఁ గావసియాడుచుండఁగా
జెవ్వునఁజంగసాఁచి యొకచేతను రోఁకలిఁబూని యొయ్యనన్
నవ్వుముఖంబుతోడఁ దననందనుఁ బాడుచు నాథుఁజూచుచున్
సువ్వి యసువ్వియంచు నొకసుందరి బియ్యముదంచెముంగిటన్.

సీ. బొమవింటఁ దొడిగినపూవింటి దొరముల్కి
పోల్కిఁ గస్తురి సోఁగబొట్టు దిద్ది
చకచకలీనుతారకలరేకలువోలెఁ
గొలుకులు వెడలఁ గజ్జలము దీర్చి
పొడుపుగుబ్బలిమీఁద బొడముసీరెండ నా
రంగుచందురుకావి రైక దొడిగి
పిలుఁదు పొక్కిలి యను మెఱికపల్లము గప్పఁ
బాలవెల్లువవంటిచేల గట్టి

గీ. అంచకొదమలగమి బెదరించుపోల్కి
నందెచప్పుళ్ళు ఘల్లు ఘల్లనుచు మొరయ
నడుము జవజవలాడఁ గీల్జడ ఘటించి
వచ్చె ముక్కంటిసేవకు మచ్చెకంటి.

సీ. తాటంకయుగధగద్ధగిత కాంతిచ్ఛటల్
చెక్కుటద్దములపై జీరువార
నిటలేందుహరినీల కుటిలకుంతలములు
చిన్నారిమోమునఁ జిందుద్రొక్క
బంధురమౌక్తిక ప్రకటహారావళుల్
గుబ్బచన్నులమీఁద గునిసియాడ
కరకంకణక్వణక్వణనిక్వణంబులు
పలుమాఱు రాత్రిపైఁ బరిఢవిల్ల
గీ. ఓరచూపుల విటచిత్త మూఁగులాడ
బాహుకుశలతఁ జక్కని మోహనాంగి
పాటఁ బాడుచుఁ గూర్చుండి రోటిమీఁదఁ
బిండిరుబ్బంగఁ గన్నులపండు వయ్యె.

సీ. శ్రీరస్తు భవదంఘ్రి చికురంబులకు మహా
భూర్యబ్దములు సితాంభోజనయన!
వరకాంతిరస్తు తావకముఖనఖముల
కాచంద్రతారకం బబ్జవదన !
మహిమాస్తు నీకటిమధ్యంబులకు మన్న
మిన్నుగలన్నాళ్ళు మించుబోఁడి !
విజయోస్తు నీగానవీక్షల కానీల
కంఠహరిస్థాయిగా లతాంగి !
గీ. కుశల మస్తు లసచ్ఛాతకుంభకుంభ
జంభభిత్కుంభికుంభాభిజృంభమాణ
భూరిభవదీయవక్షోజములకు మేరు
మందరము లుండుపర్యంత మిందువదన !

సీ. చక్కని నీముఖచంద్రబింబమునకుఁ
గళ్యాణమస్తు బంగారుబొమ్మ!

నిద్దంపునీచెక్కుటద్దంపురేకకు
నైశ్వర్య మస్తు నెయ్యంపుదీవి!
మీఁటినఁ బగులు నీమెఱుఁగుఁబాలిండ్లకు
సౌభాగ్య మస్తు భద్రేభయాన
వలపులు గులుకునీ వాలుఁగన్నులకు న
త్యధికభోగోస్తు పద్మాయతాక్షి!

గీ. మధురిమము లొల్కునీముద్దుమాటలకును
వైభవోన్నతి రస్తు లావణ్యసీమ!
వన్నెచిన్నెలుగల్గు నీమన్ననలకు
శాశ్వతస్థితిరస్తు యోషాలలామ!

సీ. సొగసుకీల్జడదాన! సోగకన్నులదాన!
వజ్రాలవంటిపల్వరుసదాన!
బంగారుజిగిదాన! పటువుగుబ్బలదాన!
నయమైనయొయ్యారి నడలదాన!
తోరంపుఁగటిదాన! తొడలనిగ్గులదాన
పిడికిటనడఁగు నెన్నడుముదాన!
తళుకుఁజెక్కులదాన! బెళుకుముక్కరదాన
సింగాణికనుబొమ చెలువుదాన!

గీ. మేలిమిపసిండిరవకడియాలదాన!
మించిపోనేల రత్నాలమించుదాన!
తిరిగిచూడవె ముత్యాలసరులదాన!
చేరి మాటాడు చెంగావిచీరదాన!

క. కుంకుమ లేదో మృగమద
పంకములేదో పటీరపాంసువులేదో
సంకుమదములేదో యళు
భంకరమగుభస్మమేల బాలా! నీకున్.

శ్రీనాథుని బావమఱఁది రామయమంత్రి యనునతఁడు మంచిభోజనపుష్టి గలవాఁడట! అతఁ డొకయూరికరణము. పాఁడిపంటలుగల సంసారి. ఒకసారి బంతిని గలసి భుజించుచు శ్రీనాథుఁ డాతని నీపద్యము చెప్పి గేలిగొనెను.

ఉ. గ్రామము చేతనుండి పరికల్పితధాన్యము నింటనుండి శ్రీ
రామకటాక్షవీక్షణపరంపరచేఁ గడతేఱెఁ గాక మా
రామయమంత్రిభోజనపరాక్రమ మేమని చెప్పవచ్చు? నా
స్వామి యెఱుంగుఁ దత్కబళచాతురి తాళఫలప్రమాణముల్.

వేఱొక బంధుజనునిపైఁ జెప్పినది.

ఉ. మా కలిదిండికామయకుమారుకుఁ డన్నిటఁ దండ్రివైఖరే
కాక తదన్యుఁ డెట్లగును? గాడిదకుం దురగంబు పుట్టునే?
చేకొని కొంకినక్కకును సింగము పుట్టునె? మాలకాకికిం
గోకిల పుట్టునే? చిఱుతకుక్కకు మత్తగజంబు పుట్టునే?

తనయెడ నత్యంతాదరము నూపిన రాజులును, రాజమంత్రులును, స్వర్గస్థులైరి. కడుపు కక్కుర్తిచేఁ గృష్ణాతీరమున బొడ్డుపల్లెనుగుత్తకుఁగొని శ్రీనాథుఁడుకృషి చేయమొదలిడెను. కృష్ణవరదవలనఁబైరు మునిఁగి పోయినది. అప్పుడు తన్నాదరించిన రెడ్డిరాజులకు గర్భశత్రువులగు నొడ్డెరాజులు రాజ్యమేలుచుండిరి. విద్యాగౌరవములేక యాయొడ్డెరాజులు శ్రీనాథునిఁ బలుసిలుఁగులకుఁబాల్పఱచిరి. శ్రీనాథకవిసార్వభౌముఁడీక్రింది పద్యమును జెప్పియాంధ్ర వాఙ్మయ మున్నంతకాలమునుశాశ్వతమగున ట్లారాజుల కపకీర్తిని నెలకొల్పెను.

సీ. కవిరాజుకంఠంబు కౌఁగిలించెను గదా
పురవీథి నెదురెండ పొగడదండ

ఆంధ్రనైషధకర్త యంఘ్రియుగ్మంబునఁ
　　దగిలియుండెనుగదా నిగళయుగము
వీరభద్రారెడ్డివిద్వాంసుముంజేత
　　వియ్యమందెనుగదా వెదురుగొడియ
సార్వభౌమునిభుజాస్తంభ మెక్కెనుగదా
　　నగరివాకిటనుండు నల్లగుండు
గీ. కృష్ణవేణమ్మ గొనిపోయె నింతఫలము
బిలబిలాక్షులు తినిపోయెఁ దిలలుపెసలు
బొడ్డుపల్లెను గొడ్డేఱి మోసపోతి
నెట్లు చెల్లింతుఁ దంకంబు లేడునూర్లు.

అవసానకాలమున శ్రీనాథమహాకవిసార్వభౌముఁడు చెప్పికొన్నపద్యము—

సీ. కాశికావిశ్వేశుఁ గలిసె వీరారెడ్డి
　　రత్నాంబరంబు లేరాయఁ డిచ్చు?
రంభఁగూడెఁ దెనుంగురాయరాహుత్తుండు
　　కస్తూరి కేరాజుఁ బ్రస్తుతింతు?
స్వర్గస్థుఁ డయ్యె విస్సనమంత్రి మఱి హేమ
　　పాత్రాన్న మెవ్వనిపంక్తిఁ గలదు?
కైలాసగిరిఁ బండె మైలారువిభుఁ డేఁగి
　　దినవెచ్చ మేరాజు దీర్పఁగలఁడు?
గీ. భాస్కరుఁడు మున్నె దేవునిపాలి కరిగెఁ
గలియుగంబున నిఁక నుండఁ గష్ట మనుచు
దివిజకవివరుగుండియల్ దిగ్గు రనఁగ
నరుగుచున్నాఁడు శ్రీనాథుఁ డమరపురికి.

139

## బమ్మెర పోతన.

ఈతఁడు క్రీ 1400, ప్రాంతముల నున్నవాఁడు. శ్రీనాథునకు బావమఱఁది యందురు. శ్రీభాగవతము, భోగినీదండకము, వీరభద్రవిజయము నీతనికృతులు. కొందఱు, భోగినీదండకవీరభద్రవిజయములకుఁ బోతనకర్తృత్వమునెడ సంశయపడెదరు. ఈపవిత్రకవి వైషయికేచ్ఛావైముఖ్యమును బ్రశంసించుకట్టుకతలు కొన్నికలవు. వానిని విడచి యాప్రసక్తిలోనిపద్యము లుదాహరించెదను.

ఉ. కాటుకకంటినీరు చనుకట్టుపయింబడ నేలయేడ్చెదో
కైటభదైత్యమర్దనుని గాదిలికోడల! యోమదంబ! యో
హాటకగర్భురాణి! నిను నాఁకటికై కొనిపోయి యల్లక
ర్ణాటకిరాటకీచకుల కమ్మఁ ద్రిశుద్ధిగ నమ్ము భారతీ!.

శ్రీనాథకవీశ్వరుఁడు, పోతనామాత్యునితో నిట్లనియె నట!

క. కమ్మనిగ్రంథం బొక్కటి!
యిమ్ముగ నేనృపతి కైనఁ గృతియిచ్చినఁ గై
కొమ్మని యీయరె యర్థం
బిమ్మహి నున్నంగ నేల యిట్టిమహాత్మల్?.

నందిమల్లయ ఘంటసింగయలు, శృంగారషష్ఠ మను పేర భాగవతషష్ఠస్కంధమునే తెలిఁగించినారు. దానిఁ గూర్చి—

శా. చండాంశుప్రభవీక్షు! తిమ్మయతనూజా! తిమ్మ! విధ్వస్తపా
షండంబై నత్రిలింగభాగవతషష్ఠస్కంధభాగంబు నీ
కుం డక్కెం జతురాననత్వగుణయుక్తుల్ మీఱ వాణీమనో
భండారోద్ధతి చూఱకారబిరుదప్రఖ్యాతి సార్థంబుగన్.

## వెల్లంకి తాతంభట్టు.

కవిలోకచింతామణి యను పేరి లక్షణగ్రంథమును రచియించిన యీకవీశ్వరుఁడు పదునైదవశతాబ్దిలో నున్నవాఁడు. ఈ క్రిందిపద్యము తాతనిప్రశస్తిని దెలుపుచున్నవి.—

సీ. ఏకవి నిర్మించె నీశబ్దశాస్త్రప
దతి యెల్ల సుకవిచింతామణి యన
ఏకవి చెప్పె న నేక పుణ్యానల్ప
బంధురసంక్షేపభాగవతము
ఏకవి పఠియించె నెల్లభాషలు నతి
ప్రకటనిర్భరమతి ప్రౌఢి మెఱసి
ఏకవి తెచ్చె మహీశసంఘము చేత
వారణాశ్వాదిసువస్తుచయము
గీ. అతఁడు వెల్లంకితాతమహాయశోగ్ర
గణ్యుఁ డుత్తమసుకవిముఖ్యాధినాథుఁ
డంబరాశావకాశవిఖ్యాతచక్ర
వాళశైలాంతరావాప్తఖేలయశుఁడు.

సీ. 'కర్ణాటకటకభూకాంతసభాంతప్ర
గల్భకవీశ్వరకమలహేళి
గజపతిసంసదఖర్వవిద్యాగర్వ
తార్కికకుముదసుధామయూఖ.
అశ్వసాధనమహీంద్రాస్థానశాబ్దిక
పర్యచూతద్రుమవనవసంత!
మాళవేశ్వరసదోమధ్యమస్థాయికా
లంకారికమయూరలలితమేఘ!'

గీ. యనుచు నిన్నవనీపతు లహరహంబు
సరగ గంభీరవాక్ప్రౌఢి సన్నుతింతు
రబ్జధీమణితనయ ! శబ్దార్థనిలయ
తాస్థిరాత్మక ! వెల్లంకితాతసుకవి !

---

## పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి.

ఈమేటికవి క్రీ 1480 ప్రాంతమున నాంధ్రదేశమునఁ బ్రఖ్యాతికెక్కినవాఁడు. శృంగారశాకుంతలము, జైమినిభారతము నను రెండుకృతులు మాత్ర మీతనివి లభించుచున్నవి. విద్యానగరమును బరిపాలించిన సాళ్వగుండ నరసింహారాజునకు జైమినిభారతము కృతిగా నొసఁగఁబడినది. నరసింహారాజునకు కృతి రచించికొనివచ్చుట కేర్పఱిచిన గడువునాఁటివఱకు నీతఁడు గ్రంథరచనమారంభింపనే లేదనియు నాఁడు తద్బంధుజనులు కృతి రచింపవైతివి రాజువలనఁ జిక్కు వచ్చు నని మొఱపెట్టఁగా నారాత్రి యింటిలో నొకగది యలికించి ముగ్గువెట్టించి తాటియాకులును గంటమును గొని తానొక్కరుఁడ యందుఁ బ్రవేశించి సరస్వతీసాహాయ్యమునఁ దెల్లవారువఱకుఁ గృతిని సమకూర్చి మఱునాఁడు రాజాస్థానమున వినిపించి 'వాణి నారాణి' యనెననియు నొకకట్టుకథ కలదు. అంత శీఘ్రకాలములో నతిరసవంతమగు నాకృతి నాతఁడు రచించుట సత్యమయి యుండును. పైకథకు దోడుగా నీపద్య మొకటి కలదు—

క. పిల్లలమఱిపినవీరన
కిల్లా లట వాణి యట్టులే కా కున్నన్

దెల్లముగ నొక్కరాతిరి
తెల్లగఁ దెలవారువఱకుఁ దేఁగలఁడె కృతిన్.

---

## తెనాలి రామకృష్ణకవి.

ఆంధ్రకవులలోఁ దెనాలిరామకృష్ణకవి మిక్కిలి పరిహాస చతురుఁడు; ప్రౌఢకవితాధురీణుఁడు. శ్రీకృష్ణదేవరాయలవారి యాస్థానకవులలో నొక్కఁడని కొందఱు; తర్వాతివాఁడని మఱికొందఱు. రాయల యాస్థానకవి యనుటకును నాధారము లుకలవు. పాండురంగమాహాత్మ్యము, ఘటికాచలమాహాత్మ్యము నీతనికృతులు. ఈతనికి వికటకవి యని పేరు. ఈతని యశస్సును గూర్చి యితరకవిచేఁ జెప్పఁబడినపద్యము—

రామకృష్ణుఁడు వేఱు, రామలింగఁడు వేఱుగాఁగూడఁ దెలియవచ్చుచున్నది. ఉద్భటారాధ్యచరిత్రాదులు రామలింగ కృతులట ! విచారింపవలసియున్నది.

ఉ. లింగనిషిద్ధుఁ గల్వలచెలిం గని మేచకకంధరుం ద్రిశూ
లిం గని సంగతాళి లవలిం గని కర్దమదూషిత న్మృణా
ళిం గని కృష్ణచేలుని హలిం గని నీలకచన్ విధాతృనా
లిం గని రామకృష్ణకవిలింగనికీర్తి హసించు దిక్కులన్.

రాయలయాస్థానకవులలో నగ్రగణ్యుఁడగు పెద్దనామాత్యుని మనుచరిత్రమున "అమవసనిసికిన్" అనుపదప్రయోగమును విని రామకృష్ణుఁడు.—

క. ఎమి తిని సెపితివి కపితము
బ్రమపడి వెఱిపుచ్చకాయ వడిఁ దిని సెపితో

యుమెతకయ తిని సెపితివో
యమవసనిసి యనెడిమాట యలసనిపెదనా !

అని యాక్షేపించె నందురు. ఈ యాక్షేపము నొకవేళఁ బరిహాసమునకై పెద్దనామాత్యునిఁ గూర్చి రామకృష్ణుఁడు చేసియుండు నేమో! ఈతనికిఁ బెద్దనపై నపరిమితగౌరవము కలదు. పెద్దన్న కెంతో యుత్కృష్టత వెట్టి దన కెంతయు నికృష్టతను బద్యమునఁ జెప్పుకొనెను. చూడుఁడు—

క. కవి యల్లసాని పెద్దన
కవి తిక్కనసోమయాజి గణుతింపంగాఁ
గవి నేను రామకృష్ణుఁడఁ
గవి యనునామంబు నీరుకాకికి లేదే ?

అల్లసాని పెద్దన్నకవి, తిక్కనసోమయాజికవి, రామకృష్ణుఁడను నేనుకవిని, ఇంకను గొందఱకుఁ గవియను పేరుగలదు; నీరుకాకికిని గలదు; అనికూడ నర్థము చూచుకొన నగును.

నందితిమ్మన యొకనాఁడు తనయింట నుయ్యెలలో నూఁగుచుఁ గవిత్వము రచించుకొనుచుండఁగా నీకొంటెకోణంగి రామకృష్ణుఁ డక్కడ కరిగి తాతా ! ఊఁతునా యని యడిగెనట ! తిమ్మకవి యంగీకృతి సూచింపఁగా రామకృష్ణుఁడు తుబుక్కన మొగమున నుమిసి, నీకి దేమిచేటుఁగాలమన,'నూఁతునా' యనిగదా నేనడిగినది; దాని కంగీకరించితిరి గావున నట్లు చేసితి ననెనట! కోప మాపఁజాలక తిమ్మకవి యెదురనున్న యాతని నుయ్యెలపైనుండి యెడమకాలితో మొగమునఁ దన్నెనట ! పాపము పల్లూడెను. చప్పున నింటికరిగి దుప్పిగొమ్ము నరుగఁదీసి

పల్లుగా నదుకుకొనెను. మఱునాఁడు రాయలసభకు వచ్చినప్పు డెట్లోయీవార్త రాయలకుఁ దెలిసి యాస్థానకవుల కిట్లు సమస్య నొసఁగెను— "రవిగాననిచోఁ గవి గాంచునే గదా" ఏకవి యోగాని సరిగా నిట్లు పూరించెను—

ఉ. ఆరవి వీరభద్రు చరణాహతి డుల్లినబోసినోటికిన్
నేరఁడు రామకృష్ణకవి నేరిచెఁబో మనముక్కుతిమ్మరాట్
క్రూరపదాహతిం దెగినకొక్కెరపంటికి దుప్పికొమ్ము ప
ల్గా రచియించె నౌర! రవి గాననిచోఁ గవి గాంచునే కదా!

ప్రెగడరాజునరసరాజనుకవియొకఁడు పెద్దనాదికవీశ్వరుల నరకుగొనక వారికవిత్వములందు దోషములు గలవని యందందు వదరులాడుచుండెడివాఁడట! ఆతఁడునుస్వతస్సమర్థుఁడే. ఒకప్పుడాతఁడు కృష్ణరాయల యాస్థానమునకు వచ్చి పెద్దనాదులకంటె హెచ్చుగా నాశువుగాఁ గవిత్వము రచింతును; సభకూర్పింపుమనికోరెను. రాయలు మఱుదినము సభగూర్ప నంగీకరించెను. పెద్దనాదులు కొంకఁదొడఁగిరి. రామకృష్ణుఁడు "నేనాకవి నడఁగఁ ద్రొక్కెద" నని పెద్దనాదులకు ధైర్యము చెప్పెను. మఱునాఁడు సభకు నరసరాజు వచ్చి గంటకుఁ గొన్నివందలు పద్యములు చెప్పెదననెను. రామకృష్ణుఁడు కొన్నివేలుచెప్పెదననెను. వారిరువురకు స్పర్ధయేర్పడెను. నీ కవిత్వమునఁ దప్పు లుండునని నరసరాజు రామకృష్ణు నాక్షేపించెను. ఉండునేమో! నేను కవిత్వము చెప్పెదను; చూపు మనెను. నరసరాజునకు వ్రాయసమునఁ దనయంతవాఁడు లేఁడనియు గర్వముగలదు. గావునఁ దానే వ్రాసెదననియుఁ గల మాఁగనీయనంత వడిగాఁ జెప్పవలయు ననియుఁ దప్పులుచెప్పిన

దిద్దెద ననియుఁ బ్రతినబూనెను. రామకృష్ణుఁడు చిత్రోచ్చారణముతో నొకపద్యమును జదివెను. నరసరాజు వ్రాయలేక గింజులాడుకొని యెట్టకేల కిట్లు వ్రాసెను—

క. తృవ్వట బాబా తలపైఁ
బువ్వట జాబిల్లి వల్వ బూచట చేదే
బువ్వట చూడఁగను హుళు
క్కవ్వట తలఁపంగ నిట్టిహరునకు జేజే!

ఇది వ్రాయుటకు రామకృష్ణకవి పద్యముచదివి కొంతసేపూరకుండ వలసివచ్చెను. నరసరాజునకు వ్రాఁతబిరుదు పోయినది. రెండవపద్య మిట్లు చెప్పెను—

మ. గవనీహారగు రామపద్మధళరంగత్కీర్తి చానూరవు
ర్ధన శుక్రాక్షికశేఖరాణ్మృగపతీ త్రైలోక్యధామోదరా
యనఁగా శంకరవాంఛితార్థకృపదివ్యాస్త్రోకపాణీ జనా
ర్ధనవానేకపవైరివిగ్రహ ముకుంధా మిత్రవింధాధిపా!

నరసరాజు తననేర్పు వెల్లడి యగునట్లుగా ననేకదోషములను సంస్కరించి రామకృష్ణుని గేలిసేసెను. నిజముగా రామకృష్ణునియుచ్చారణప్రకార మాపద్యమున కర్థము కలదు. అందుదోషములు లేవు. సామాన్యబుద్ధికి దోషములుగాఁ గన్పట్టునట్లు రామకృష్ణుఁడు రచించెను. నరసరాజట్లే పొరఁబడెను. అంతట రామకృష్ణుఁడు లేచి యీక్రింది పద్యములఁ జెప్పి గెల్పుకొని నరసరాజును వంచించి పంపెను.

చ. ఒకనికవిత్వమం దెనయు నొప్పులు తప్పులు నాకవిత్వమం
దొకనికిఁ దప్పుపట్టఁ బని యుండదు కాదని తప్పుపట్టినన్

మొక మట్టుక్రిందుగాఁ దివిచి ముక్కులుపోవ నినుంపకత్తితో
సిక మొదలంటఁ గోయుదును జెప్పవెఁ గొట్టుదు మోము దన్నుదుఁన్.

చ. తెలియనివన్ని తప్పులని దిట్టతనాన సభాంతరంబునం
బలుకఁగ రాదురోరి పలుమాఱుఁ బిశాచపుఁబాడెకట్ట! *నీ
పలికిననోట దుమ్ముపడ! భావ్య మెఱుంగవు పెద్దలైనవా
రల నిరసింతురా! ప్రగడరాణ్ణరసా! విరసా తుసా! బుసా!

రాయల యాస్థానమున నప్పలాచార్యులను పండితకవి యొకఁడు కలఁడట! ఆతనిఁగూర్చియొకరు—

శ్లో. అపశబ్దభయం నాస్తి అప్పలాచార్యసన్నిధౌ,

రామకృష్ణుఁ డుత్తరార్థమును వెంటనే యిట్లు పూరించె—

శ్లో. అనాచారభయం నాస్తి తిప్పన్నామాత్రస్య సన్నిధౌ.

రాయలయాస్థానముననే యొకనాఁడు భట్టుమూర్తికవి "కుంజరయూథంబు దోమ కుత్తుకసొచ్చెన్" అన్న సమస్యఁ జెప్పి దీనిఁబూరింపుఁ డని తక్కినకవుల నడిగెనట! రామకృష్ణుఁడు—

క. గంజాయిత్రాగి తురకల
సంజాతులఁగూడి కల్లుచవిగొన్నావా?
లంజెలకొడుకా యెక్కడ
కుంజరయూథంబు దోమకుత్తుకసొచ్చెన్?

రాయలు కోపించి యిదియా పూరణ మనెను. రామకృష్ణుఁడు "దేవా! పెద్దనాదిమహాకవులకీ భట్టుకవియా సమస్యనొసఁగువాఁడు! అతని కిట్టిపూరణమే పోలు" ననెను. రాయలు 'నేనొసఁగితిని పూరింపు' మని యాగ్రహముతోనే పల్కెను. వెంటనే—

---

* ప్రయోగవైచిత్రి.

క. రంజన చెడి పాండవు లరి
భంజనులై విరటుఁ గొల్వఁ జొల్పడి రకటా!
సంజయ! యేమని చెప్పుదుఁ
గుంజరయూథంబు దోమకుత్తుక సొచ్చెన్.

అని పూరించెను. రాయలు పరమానందభరితుఁ డయ్యెను.

పెద్దన్నమనుచరిత్రము, తిమ్మన్న పారిజాతాపహరణము, బట్టుమూర్తివసుచరిత్రము, రాయలు మిక్కిలి మెచ్చుకొనుచుండువాఁడట! ఒకనాఁడు సభలో మూఁడు గ్రంథములనుండియుఁ దుల్యసందర్భముగల వగుమూఁడు పద్యములఁ జూపి వానిని విమర్శింప సభ్యులను గోరెనట! ఆపద్యము లివి—

ఉ. పాటున కింతులోర్తురె! కృపారహితాత్మక! నీవు ద్రోవ ని
చ్చోట భవన్నఖాంకురము సోఁకెఁ గనుంగొను మంచుఁ జూపి య
ప్పాటలగంధి వేదన నెపంబిడి యేడ్చెఁ గలస్వనంబుతో
మీటిన విచ్చుగబ్బిచనుమిట్టల నశ్రులు చిందువందుగన్. (మను.)

ఉ. ఈసునఁ బుట్టి డెందమున హెచ్చినకోపదవానలంబుచే
గాసిలి యేడ్చెఁ బ్రాణవిభుకట్టెదురన్ లలితాంగి పంకజ
శ్రీసఖమైన మోముపయిఁ జేలచెఱంగిడి బాలపల్లవ
గ్రాసకషాయకంఠకలకంఠవధూకలకాకలీధ్వనిన్. (పారి)

శా. ఆజాబిల్లి వెలుంగువెల్లికల డాయన్ లేక రాకానిశా
రాజశ్రీసఖమైనమోమునఁ బటాగ్రంబొత్తి యెల్గెత్తియా
రాజీవానన యేడ్చెఁ గిన్నరవధూరాజత్కరాంభోజ కాం
భోజీమేళవిపంచికారవసుధాపూరంబు తోరంబుగాన్. (వసు.)

రామకృష్ణుఁ డీపద్యములపై నిట్టు లభిప్రాయ మొసఁగెనట! అల్లసానిపెద్దన అటునిటు నేడ్చెను.—ముక్కుతిమ్మన్న ముద్దు

ముద్దుగా నేడ్చెను;—బట్టుమూర్తి బావు రని యేడ్చెను;—భట్టుమూర్తికిని రామలింగనికిని ఘోరవైరము. ఆబట్టుకవితను గూర్చి రామలింగకవి యిట్లధిక్షేపించెను.

క. చీఁపర పాఁపరతీఁగలఁ
జేఁపలబు ట్టల్లినట్లు చెప్పెడునీయా
కాఁపుఁగవిత్వపుఁగూఁతలు
బాఁపనకవివరునిచెవికిఁ బ్రమదం బిడునే!.

శా. అద్రిస్నిగ్ధతలంబు బుద్బుదము లుద్యద్దారుభూషావళుల్
క్షుద్రోదుంబరపాకపక్వఫలముల్ శుక్త్యంతరాకాశముల్
రుద్రాక్షాక్షరపంక్తివిభ్రమము లీరూఢి న్నిరూపింప నీ
శూద్రప్రజ్ఞలు విప్రసత్కవివచస్స్ఫూర్తి న్విడంబించునే!.

క. కెంగేల రామకృష్ణుని
బంగరుకడియంబు లుండఁ బండితుఁ డగునా
జంగులు జల్లులు గల్గిన
సింగారపుటూరఁగుక్క సింగంబగునా!

కవీశ్వరులస్తోత్ర పాఠములకును నతిశయోక్తులకును నేవ గొని తిరుమలరాయ లొకనాఁడు స్వభావోక్తిమధురముగా నే తన్నువర్ణింపుఁడని వారి కాజ్ఞాపించెనట! ఆతని కొంటికంటిగ్రుడ్డి కలదు. రామలింగకవివర్ణించిన వర్ణనము.

క. అన్నాతిఁ గూడ హరుఁడగు
నన్నాతిని గూడకున్న నసురగురుండౌ
నన్నా! తిరుమలరాయఁడు
కన్నొక్కటి లేదుగాని కంతుఁడుకాఁడే.

## రామకృష్ణుని యితరచాటువులు—

గీ. అతివ కచ నాభి జఘన దేహాననము త
మీనదరసాలతోరాజపానిరాక
రణ ఘనంత మనాది నేత్ర గళ భుజన
ఖోష్ఠ కుచ వచో దంతము లుభయగతుల.

గీ. అధరముఖవర్ణ శూన్యంబు లతివకుచము
లాననాకారరహిత మబ్జాక్షి మేను
అజజఘనమండలము లంచయానకురులు
చరమబాధితకరములు చామతొడలు.

గీ. ఆననాధరగళమూర్తు లతివ కజుఁడు
చంద్రకురువిందశంఖచంచలలఁ జేసి
చెలఁగి తచ్చిహ్నకాఠిన్యసితచలతలు
సొరిదిఁ గచ కుచ హాస దృష్టులఁగఁజేసె.

సీ. నడచెనా గంధగండకబంధధుర్యవే
దండతండము నటుండుండు మనుసు
పలికెనా వల్లకీకలకంఠకలరవ
మండితధ్వని నటుండుండు మనుసు
నవ్వెనా మల్లికానవహీరచంద్రికా
డిండీరముల నటుండుండు మనుసు
చూచెనా పుష్పనారాచజాతస్ఫుర
త్కాండద్యుతుల నటుండుండు మనుసు

గీ. ఏమిచెప్పుదు నాయింతి కేవ్వ రీడు?
అహహా! రతివలె నది నీకు నబ్బెఁగాక
పరమభాగ్యైకశాలి యోపాండురంగ
విట్ఠలేశ! యనంతరవిప్రకాశ!.

చ. అల ఘనచంద్రబింబసము మైఁ దనరారెడు వక్త్రి మందులోఁ
గలిగిన నామభేదములకై పడి నొప్పెడిఁ గప్పుకొప్పు చె
క్కులు రదనాంశుకంబు లవి గుబ్బలకున్ సరిరాక పోయెఁ జే
తులు సమలయ్యె దానివలె నున్నది. పొంకపుటారు బోటికిన్.

చ. దరభుజగైణసింహములఁ దద్గతవేణ్యవలోకనద్వయో
దరముల కోడి వారిధిపదంబులఁ బుట్టలఁ బూరులన్ గుహాం
తరములఁ బూన నిక్కఁ దిన డాఁగ స్రవింపఁగ నూర్పులార్ప స
త్వరముగ నేఁగి నీడగని తత్తఱమందఁగ జేసి తౌ చెలీ !

మ. వరబింబాధరమున్ బయోధరములున్ వక్త్రాలకంబుల్ మనో
హరలోలాక్షులుఁ జూప కవ్వలిమొగం బైనంత నేమాయె నీ
గురుభాస్వజ్జఘనంబుఁ గ్రొమ్ముడియు మాకుం జాలవే ? గంగ క
ద్దరిమే లిద్దరికీడునుం గలవె యుద్య ద్రాజబింబాననా!.

---

## కృష్ణదేవరాయలు.

బళ్లారిమండలములోని యానెగొందికి సమీపముననుండిన విద్యానగర మనుపట్టణరాజము రాజధానిగా దక్షిణహిందూదేశమున కెల్ల నేకచ్ఛత్రాధిపత్యమును నిర్వహించినయీనృపాలరత్నము క్రీ 1509 మొదలు 1530 వఱకు రాజ్యము వహించినట్లు తెలియుచున్నది. కృష్ణరాయలు బహువారములుదండయాత్రలుచేసి నానారాజుల జయించి తురుష్కులముష్కరకృత్యముల సాగనీయక రాష్ట్రములనాక్రమించుకొని మహారాజ్యవైభవ మనుభవించినవాఁ డగుటయకాక సరసకవితావిలాసలాలసుఁ డై పెద్దనాదిసుకవీంద్రుల పల్కుఁదేనియలఁ

జాణలఁగొని సంస్కృతాంధ్రములందు మేలయిన కవనము సెప్పనేర్చినసుకవిరాజశిఖామణి. ఆంధ్రమునవిష్ణుచిత్తీయమును సంస్కృతమునమదాలసాచరిత్రాదికములునీతనికృతులు. ఆంధ్ర వాఙ్మయమున కీమహారాజుకాలమున నింతంతనరానిమహోన్నతి చేకూఱెను. పెద్దనాదికవిశ్రేష్ఠు లీతని యాస్థానమునఁ గవీశ్వరులు. మనుచరిత్రము పారిజాతాపహరణము మొదలగు కృతులకీతఁడుకృతిపతి పెద్దనామాత్యునకతఁడాంధ్రకవితాపితామహుఁ డన్నబిరుద మొసఁగెను. విద్యావిషయమున నీమహారాజు నాస్థానమునందు జరిగినవృత్తాంతములువింతవింతలుగాఁ జెప్పుకొనఁబడుచున్నవి. కొన్నిమాత్ర మిందుఁ దెల్పఁ బడును.

ఒకప్పుడు కృష్ణరాయలు పసిఁడిపల్లెరమునఁ గవిగండపెండేరమును గొనివచ్చి సభాస్థానముననిడిసంస్కృతాంధ్రములందు సమముగాఁ గవనముసెప్ప నేర్చినవా రిద్దానిఁ గైకొన నర్హులనఁగా సభ్యులు మిన్నకుండిరనియు దానిపై నాతఁడే-

ఉ. ముద్దుగ గండపెండియరము౯ గొనుఁడంచు బహూకరింపఁగా
నొద్దిక నాకొసంగు మని యొక్కరుఁ గోరఁగలేరు లేరొకో—

అని సగముపద్యముఁ జదివినఁ బెద్దనామాత్యుఁడు లేచి—

పెద్దనబోలుపండితులు పృథ్విని లే రని నీ వెఱుంగవే
పెద్దన కీఁదలంచినను బేరిమి నా కిడు కృష్ణరాణ్ణృపా!

అని పూరించి యీమాలిక నాశువుగా రచించి చదివె నట!!

ఉ. పూఁతమెఱుంగులుం బసరుపూఁపబెడంగులుఁ జూపునట్టివా
కైతలు? జగ్గు నిగు నెనగావలెఁ గమ్మనగమ్మనవ్వలె౯

రాతిరియున్ బవల్ మఱపురానిహోయల్ చెలి యారజంపు ని
ద్దాతరితీపులో యనఁగఁ దారసిలన్వలె లోఁ దలంచినన్
బాఁతిగఁ బై కొనన్వలెను బైదలిపుత్తుకలోనిపల్లటీ
కూఁతలనన్వలెన్ సొగసుకోర్కులు రావలె నాలకించినన్
జేతికొలందిఁ గాఁగిటను జేర్చినకన్నియచిన్నిపొన్నిమే
ల్మూఁతలచన్నుదోయివలె ముచ్చటగావలెఁ బట్టిజూచినన్
దాతొడనున్న మిన్నులమిటారపుముగ్ధఁగుమ్మ కమ్మనౌ
వాతెఱదొండపండువలె వాచవిగావలెఁ బంటనూదినన్
గాతలఁ దమ్మిచూలిదొర క్రైవసపుంజవరాలిసిబ్బెపు
న్మే తెలియబ్బురంపుజిగి నిబ్బర పుబ్బుగబ్బిగుబ్బపొం
బూఁతలనూనెకాయసరిపోడిమి కిన్నెరమేలుబంతి సం
గాతపు సన్నతంతి బయకారపుఁ గన్నడగౌళపంతుకా
సాతతతానతానలపసన్ దివుటాడెడుగోటమీటుబల్
మ్రోఁతలనుంబలెన్ హరువు మొల్లముగావలె నచ్చతెన్గు లీ
రీతిగ సంస్కృతం బుపచరించెడుపట్టున భారతీవధూ
టీతపనీయగర్భనికటీభవదానసపర్వసాహితీ
ఘాతికనాటకప్రకరభారతభారతసమ్మతప్రభా
పాతసుధాప్రపూరబహుభంగఘుమంఘుమఘుంఘుమార్భటీ
జాతకతాళయుగ్మలయసంగతిచుంచువిపంచికామృదం
గాతతతేహితత్తహితహాధితధంధణుధాణుధింధిమి
వ్రాతనయానుకూలపదవారకుహూద్వహాహారికింకిణీ
నూతనఘల్ఘలాచరణనూపురఝూళఝళీమరందసం
ఘాతవియద్ధునీచకచకద్వికచోత్పలసారసంగ్రహా
యాతకుమారగంధవహహారిసుగంధవిలాసయుక్తమై

యాతకుమారగంధవహాహారిసుగంధవిలాసయుక్తమై
చేతము చల్లఁజేయవలె జిల్లనఁ జల్లనలేక మనోహర
ద్యోతకగోస్తనీఫలమధుద్రవగోఘృతపాయసప్రసా
రాతిరసప్రసారరుచిరప్రసరంబుగ సారసారెకున్.

రాయ లంతటఁ గవిగండపెండేరమును దానై యాతని పాదమునఁ దొడిగెనఁట! రాయలు వేఱొకప్పు డేదో యాశువుగా రచింపుమనఁ బెద్దనగారు చెప్పినది—

చ. నిరుపహతిస్థలంబు రమణీప్రియదూతిక తెచ్చియిచ్చు క
ప్పురవిడె మాత్మకింపయినభోజన ముయ్యెలమంచ మొప్పు త
ప్పరయురసజ్ఞు లూహ తెలియంగలలేఖకపాఠకోత్తముల్
దొరకినఁగాక యూరక కృతుల్ రచియింపు మనంగ శక్యమే!

కృష్ణరాయ లొకనాఁ డాస్థానమునఁ గవీశ్వరుల కీసమస్య నొసఁగెనట! "వి! స్ఫురితఫణామణిద్యుతులఁ బొల్పగు నాగకుమారుఁడో యనన్"—పెద్దన్నగారి పూరణము—

చ. వరు కు చెఱంగు పట్టినను వల్వతొలంగినశేమ సిగ్గుప
ట్టురుతరరత్నముద్రికల నొప్పగుడాపలికేల మూయఁగాఁ
గర మమరెం గరం బపుడు కామవిధానముఁ గాచియున్నవి
స్ఫురితఫణామణిద్యుతులఁ బొల్పగు నాగకుమారుఁడోఁ యనన్.

నగరు, తగరు, తొగరు, పగరు. అనుపదములు ప్రాసస్థానమున నెలకొల్పి, రామాయణ, భారత, భాగవత పరములుగాఁ గృష్ణరాయనియాస్థానమున రాధామాధవకవిచేఁ జెప్పఁబడిన పద్యములు—

చ. నగరుపగాఱు నింక విపినంబులకేఁగుఁడు రాజ్యకాంక్షకుం
దగరు కుమారులార! యని తల్లి పగ ల్చిగులంగఁ దోపఁగాఁ

దొగరున రక్తుగట్టి మదిఁదోఁపక గద్గదభిన్న కంఠయై
పగరుచుచున్నఁ జూచి రఘువంశవరేణ్యుఁడు తల్లి కిట్లనున్.

చ. తొగరుచి కన్నుదోయిఁ గడుఁ దోపఁగఁ గర్ణుఁడు భీమసేనపైఁ
నగరుధరాధరంబునను దాఁకినభంగిని దాఁకి నొచ్చి తా
పగరుచుచున్ వెసన్ బరుగువాఱిన నచ్చటిరాజలోకముల్
నగరు సుయోధనాజ్ఞ మదినాటుటఁజేసి ధరాతలేశ్వరా.

చ. పగరుపుమాత్రమే పరుఁడు వశ్యుఁడు గాఁడు సఖీసఖత్వ మె
న్న గరుడవాహనుండు మము నాఁడటు డించుటయెల్ల నుద్ధవా
తగ రని కాక మోహపులతాతను లైన విడంగఁ జూతురే
తొగరుచి యోషధీశునకుఁ దోపఁగఁజేయునె వీడనాడఁగన్?.

కృష్ణరాయలు ధూర్జటికవి కవనశక్తినిగూర్చి పద్యరూపమునఁ బ్రశ్నింపఁగా నొక కవి పూరించిన పూరణము—

చ. స్తుతిమతియైన యంధ్రకవిధూర్జటిపల్కుల కేల కల్గెనో
యతులితమాధురీమహిమ;—హా తెలిసెన్ జగదేకమోహనో
ద్ధతసుకుమారవారవనితా జనతా ఘనతాపహారిసం
తతమధురాధరోదితసుధారసధారలఁ గ్రోలుటం జుమీ.

రాయలకోరికపై నీక్రింది మూఁడుపద్యములును బెద్దన తిమ్మన భట్టుమూర్తి కవులచే రచింపఁబడినవి—

శా. రంతుల్ మానుము కుక్కుటాధమ దరిద్రక్షుద్రశూద్రాంగణ
ప్రాంతో లూఖలమూలతండులకణగ్రాసంబుచేఁ గ్రొవ్వి దు
ర్దాంతాభీలవిశేషభీషణఫణాంతర్మాంససంతోషిత
స్వాంతుండైన ఖగేంద్రుకట్టెదుర నీజంజాటముల్ సాగునే?.

ఉ. స్థానవిశేషమాత్రమునఁ దామరసాకున నీటిబొట్టు! నిన్
బూనికమౌక్తికంబనుచుఁ బోల్చినమాత్రన యింతగర్వమా

మానవతీశిరోమణులమాలికలందును గూర్పవత్తువో
కానుక లియ్యవత్తువో వికాసము నిత్తువో విల్వ దెత్తువో.

ఉ. తక్కక నేలనుక్కైగొని త్రివ్వఁగ నేర్తు నటంచుఁ దాకుతా
వొక్కట జాతి యంచు ముదమొందకు బుద్ధిని వెఱ్ఱిపంది! నీ
వెక్కడ? యాదిఘోణియన నెక్కడ! యద్రిసముద్రదుర్గభూ
ర్భ్యాక్కతిలంబు నొక్కయరపంటనె మింటికి నెత్తనేర్తువే.

రాయలయాస్థానమున నొక సంస్కృత కవి యరుదెంచి పెద్దనాద్యాంధ్రకవీశ్వరుల యెడ నీసడింపుతో నిట్లు పల్కెనట—

శ్లో. ఆంధ్రీభాషామయం కావ్య మయోమయవిభూషణమ్,

వెనువెంటనే పెద్దనామాత్యుఁడు చెంపపెట్టు పెట్టినట్లు పూరించె!

శ్లో. సంస్కృతారణ్యసంచారి విద్వన్మత్తేభశృంఖలమ్.

రాయలకుఁ జదరంగపుటెత్తులు వేయుటయం దత్యంతాసక్తి యుండెడిదట! బొడ్డుచర్ల చినతిమ్మనయను కొప్పోలు కరణము కవీశ్వరదిగ్దంతియను ప్రతిష్ఠగలవాఁడై శ్రీకృష్ణరాయలతోఁ జదరంగమాడుచుండెడువాఁడు. శ్రీకృష్ణరాయలపక్షమున నెంద ఱాలోచించి యెత్తువేయుచున్నను నీతఁ డొక్కఁడే యెదు రెత్తు వేసి యాటగెల్చుచు వేయార్లు పందెముగొనుచుండెడివాఁడట! ఆతనిశక్తికి సంతోషించి కొప్పోలు గ్రామమునకుఁ గృష్ణారాయపురమను నామ మేర్పఱిచి రాయలు సర్వాగ్రహారముగా నాతనికి ధారవోసెను.

క. శతసంఖ్య లొక్కమైనను
సతతము శ్రీకృష్ణరాయజగతీపతితోఁ

జతురంగ మాడి గెల్చును
ధృతిమంతుఁడు బొడ్డుచర్ల తిమ్మన బళిరే!

ఉ. ధీరుఁడు బొడ్డుచెర్లచినతిమ్మనమంత్రికుమారుఁ డంచితా
కారుఁడు సత్కళావిదుఁడు కౌశికగోత్రుఁడు పద్మనేత్రసే
వారతబుద్ధి నందవరవంశ్యుఁడు సత్కవిలోకనాథుఁ డా
చారసమగ్రవర్తనుఁడు చారువచస్స్థితినొప్పు వాఁ డొగిన్.

రాయలు కళింగదేశవిజిగీషామనీషదండెత్తిపోవుచు బెజవాడలో విడిసి హరివాసరోపవాసవ్రతమును గృష్ణాతీరమున నున్నశ్రీకాకుళపుణ్యక్షేత్రమునఁ గావించుటకై పెద్దనాదివిద్వత్కవులతో నరిగెను అప్పుడే యక్కడ వెలసియున్న యాంధ్ర నాయకస్వామి కృష్ణరాయల స్వప్నమున నాముక్తమాల్యద రచింప నాదేశించినట్లాముక్తమాల్యదయందుఁ జెప్పఁబడి యున్నది. అక్కడ నేకాదశినాఁడు పండితమండలితోఁ బుణ్యకథాగోష్ఠి సలుపుచుఁ గృష్ణరాయలు దాశరథు లెక్కువవారా? పాండవులెక్కువవారా!అని ప్రశ్నించెనట. పెద్దనాదులుతమకుఁ దోఁచినరీతినిబలుదెఱఁగులఁ జెప్పిరట.దాశరథులు ఈశ్వరాంశమున జన్మించినవారుగావున వారికమానుషశక్తులునులోకోత్తరయోగ్యతయునుగల్గుట వింతకాదు.పాండవులయెడ నీశ్వరాంశము లేదు. అట్లయియు శక్తులయందును యోగ్యతయందును దాశరథులతో సాటివచ్చిరి. కావునఁ బాండవులే యెక్కువవారగుదు రని తనయాశయమును రాయలు తుదకువెల్లడించెనట! అది విని రాయలప్రక్కను జామరము విసరుచున్నచాకలి యొకఁడు కేలుమోడ్చి "దేవర జన్మాంతరమున నున్నను బాండవుల

మీఁది యభిమానమును మానలే" దనె నట! రాయ లత్యానందము నెంది యాచాకలివాని నేది కావలయునో కోరుకొమ్మనెనట! వాఁడు దేవరకోట యేలవలెనని కోరిక కలదనెనట! అప్పుడే యక్కడ వానికి దేవరకోట సీమ నేలుకొమ్మని యనుజ్ఞ నొసఁగెనట; నేఁ డా దేవరకోట సీమను గమ్మజమీందారులు పాలించుచున్నారు. కాని నేఁటివఱకును నా సంస్థానమునఁ జాకలిచేఁ బల్లకి మోయింపకుండుటయు సీలు మొహర్లు వానియొద్ద నే యుంచుటయు నాచారముగా వచ్చుచుండె నందురు. కృష్ణరాయలపై ననేకకవులచేఁ జెప్పఁబడిన చాటువులు...

ఉ. శరసంధానబలక్షమాదివివిధైశ్వర్యంబులుం గల్గి దు
ర్భరషండత్వబిలప్రవేశకలనబ్రహ్మఘ్నతల్ మానినన్
నరసింహక్షితిమండలేశ్వరుల నెన్నన్వచ్చు నీసాటిగా
నరసింహక్షితిమండలేశ్వరుల కృష్ణా రాజకంఠీరవా!

మ. కలనం దావకఖడ్గఖండితరిపుక్ష్మాభర్త మార్తాండమం
డలభేదం బొనరించి యేఁగునెడఁ దన్మధ్యంబునన్ హారకుం
డలకేయూరకిరీటభూషితుని శ్రీనారాయణుం గాంచి లోఁ
గలఁగం బాఱుచు నేఁగె నీవ యనుశంకన్ గృష్ణరాయాధిపా!

ఉ. ఏపునఁ గృష్ణరాయజగతీశ్వరుఖడ్గము మింట మార్గముం
జూపిన భానుమండలము సొచ్చి హుటాహుటి శత్రు లేఁగుచో
రేపటిబాపనయ్య పగలింటిమహోగ్రపుజంగమయ్య! యో
మాపటిదాసరయ్య? మము మన్ననసేయుము మటంచు రెంతయున్.

ఉ. కాశియు నీకరాసిసరిగాదు నృసింహునికృష్ణరాయ! యా
కాశిని జచ్చువారికిని గల్గును జేతికిఁ బుఱ్ఱె నీమహో
గ్రాసిని గండతుండెములుగా మృతిఁ బొందిన వైరికోటికిన్
భాసురరాంభకుంభకుచభారము లబ్బెడు నేమిచిత్రమో!

మ. రాయగ్రామణి కృష్ణరాయ భవదుగ్రక్రూరఖడ్గాహిచేఁ
గాయం బూడ్చి కళింగదేశనృపతుల్ కానిర్ఝరీపోషణీ
మాయాభీకమటూరులోటఃకుహుటూమాయాసటాజాహరే
మాయాగ్గేయమడే యటంద్రు దివి రంభాజారునిన్ యక్షునిన్.

మ. సమరక్షోణిని కృష్ణరాయలభుజాశాతాసిచేఁ బడ్డ దు
ర్దమదోర్దండపుళిందకోటి యవనవ్రాతంబు సప్తాశ్వమా
ర్గమునన్ గాంచి సెబా సహో హరిహరంగాఖూబుఖూడాకి తే
తుముకీ బాయిలబాయి దేమలికి యందు ర్మింటికిం బోవుచున్.

మ. గవఁకుల్ బల్లిదమయ్యె ఢిల్లికిని మక్కా కోటమేలయ్యెఁ బం
డువకుం గ్రొత్తిగఁ గ్రొత్తడంబు లమరెన్ బోలేరుచందేరులన్
దపసం బెక్కె బెడందకోటపురకాంతాగర్భనిర్భేదన
ప్రవణం బైనభవత్ప్రియాణజయవార్తన్ గృష్ణరాయాధిపా!.

ఒకప్పుడుకృష్ణరాయలకు గృష్ణడగ్గఱఁ దురుష్కులతోఁ బోరువాటిల్లెను. రాయలసేన కృష్ణ కిద్దరిని దురుష్క సేన యద్దరిని నుండెను. నదిదాఁటి రాయలసేన పైకి రావలయునని యేన్గులతో దురకలు నదిలోనికిఁ జొచ్చి కృష్ణ వెల్లువగాఁ బాఱుచుండుటచేఁ జెల్లాచెదరై కొట్టుకొని పోయిరి. ఏన్గులుమాత్ర మీదరికి వచ్చి రాయలసేనలోఁ జిక్కెను. అప్పుడొక కవి చెప్పిన పద్యము:—

క. నరసింహకృష్ణరాయా
దురమున నీపేరిటేలు తురకలఁజంపెన్
గరిరాజవరదుఁ డంచును
గవిఘుట లట మిమ్ముఁ జూచి గ్రక్కునవచ్చెన్.

ఉ. శ్రీలీలాత్మజ! కృష్ణరాయ ! సమరోర్విన్ నీదువైరిక్షమా
పాలు ర్వేఁగి హయాధిరూఢులగుచుం బాఱన్ వనీశాఖిశా
ఖాలగ్నాయతకేశపాశులయి యూఁగన్ గేకిస ల్గొట్టి యు
య్యాలో జొంపలో యంచు బాడుదురు భిల్లాంభోజపత్రేక్షణల్!

మ. బలభిన్నాగము చెంపఁగొట్టి గిరిజాప్రాణేశునట్టెక్కి వా
గ్జలజాతేక్షణకొప్పువట్టి శశిపత్త్రం బెక్కి ధట్టించి యా
బలరాముం బోలఁబట్టి నీ యశము భూభాగమ్మునన్ మించె నా
లలనామన్మథ! కృష్ణరాయనరపాలా! రాజకంఠీరవా.

క. నరసింహకృష్ణరాయని
కరమరుదగుకీర్తి యొప్పెఁ గరిభిద్గిరిభి
త్కరికరిభిద్గిరిగిరిభి
త్కరిభిద్గిరిభిత్తురంగకమనీయంబై.

గీ. పద్మనాట్యస్థలంబునఁ బక్కలోనఁ
బైరుపైఁ బవ్వళించినపరమమూర్తి
అనుదినంబును గృష్ణరాయాధిపునకుఁ
జక్కజగడాలవేలుపు శుభము లొసఁగు.

చ. పెనిమిటిచేయు పుణ్యజనపీడనవృత్తియుఁ దండ్రిభంగముం
దవయునవంగభావమును దమ్మునికార్శ్యముఁ జూచి రోసి స
జ్జనపరిరక్షు శౌర్యనిధిఁ జారుశరీరుఁ గళాప్రపూర్ణ న
వ్యవనిధికన్య చేరె జితవైరినికాయునిఁ గృష్ణరాయనిన్.

ఉ. అబ్జముఖీమనోజ! నరసాధిపనందన! కృష్ణ! నీయశం
బబ్జకరాబ్జజాబ్జనయనాబ్జవిలాసము నీవితీర్ణముం
బబ్జకరాబ్జజాబ్జనయనాబ్జవిలాసము నీపరాక్రమం
బబ్జకరాబ్జజాబ్జనయనాబ్జవిలాసము చిత్ర మిద్ధరన్.

ఉ. కాయము వంగి తా ముదిసెఁ గన్నులునుం బొరగప్పెఁ గాలు పే
దాయె నటంచు రోసి నరసాధిపనందన! కృష్ణరాయ! యీ
భూయువతీలలామ నినుఁ బొందిన నాదిభుజంగభర్తకుం
బాయనిచింతచేతఁ దలప్రాణము తోఁకకు రాకయుండునే!.

ఆంధ్రవాఙ్మయమున శ్రీకృష్ణరాయలవిఖ్యాతి యవిన
శ్వరమును బ్రధానమును గావున నామహారాజునుగూర్చి

సంస్కృతమునఁ జెప్పఁబడినచాటుపద్యములఁగూడనిందుఁ జే ర్చుట సముచితమని యట్లు చేయుచున్నాఁడను—

శ్లో. వీరాగ్రేసర! కృష్ణరాయనృపతే! త్వద్వైరికాంతా వనే
ధావంత్యః కుచయావరోమలతికావ్యాహారలీలాభృతః,
ప్రాప్తాన్ శోకమహేభపన్నగశుకాన్ రుంధంతి వక్త్రేందునా
మధ్యేనాపి కచేన కంకణలసద్దైవమూర్యరత్నైరపి.

శ్లో. భో భో భూవర! భూరివిక్రమ! భవద్ధాటీషు విద్యాధరై
ర్నిస్సాణేషు ఘణం ఘణంఘణఘణం ఘాణం ఘణాధ్వానిషు,
త్వత్కృత్తప్రతిమల్లవీరవరణే దేవాంగనానా మభూ
న్నృత్తేభ్యో ధిమిధిమ్మి ధింధిమి ధిమిం ధింధిం ధిమింధింకృతిః.

శ్లో. దృగ్భిత్యా నరసక్షమాపతిసభస్త్రీణాం మృగేణాశ్రితో
రాజా తన్ముఖతర్జిత స్స్వయమపి త్యక్త్వాఽఽత్మనో మండలమ్.
దుర్గేశస్య జటాటవీ ముపగతః పాణౌత మేణం దధౌ
సన్మార్గప్రవణో నిజాశ్రితతమం క్షీణోఽపి నోపేక్షతే.

శ్లో. వీరాగ్రేసర! కృష్ణరాయ! భవతా కృత్తారణప్రాంగణే
ప్రౌఢాః కేచన పారసీకపతయః ప్రాప్తాః పురీ మామరీమ్,
పీరుత్తేతి గురౌ, వలద్విషి సురత్తాణేతి, శచ్యాంపున
ర్బిబ్బితి, ప్రణతౌ సలామితి, సురాన్ స్తైరాననాన్ కుర్వతే!

శ్లో. కృష్ణరాయ! స్తువంతు త్వాం కవయో న వయం స్తుమః,
నరసింహకిశోరస్య కియాన్ గజపతే ర్జయః?.

శ్రీకృష్ణదేవరాయలు లావణ్యగణ్య మగు నొకస్త్రీరత్నము ను బహుయత్నమున సాధించి యవరోధవధూసవిధమునఁ దన యుల్లాసమును వెల్లడించెనట! అంత నాయంతఃపురిక "యింత కే ఇంతయుప్పొంగవలెనా? యిదియేమి గజపతికుమార్తెనుసాధిం చుటయొక్కొ!" యని తేలనాడెనట! రాయలడెందమున చుఱుకు

మని తాఁకెను. గజపతికుమార్తెను సాధింపఁ దలంపొదవెను. ఒకనాటిరాత్రి యుపశ్రుతి పరిజ్ఞానమునకై చాకివానియింటిదరి కొకయాప్తభృత్యుని, దిమ్మరునును బంపెనట! ఆయింటి చాకి వాఁడు సుఖశయితుఁడై యిట్లు పాడుచుండెనట!

"కొండవీడు మందేరా కొండపల్లి మందేరా
కాదని యెవ్వఁడు వాదుకు వచ్చిన కటకందాఁగా మందేరా.

విజయసూచకమగు నాయుపశ్రుతిని గొనియే రాయలు దాడివెడలి కటకమువఱకును గలదేశమును వశపఱుచుకొనుట యేకాక గజపతికుమార్తెను గూడ దక్కఁగొని యంతఃపురమున జరిగిన యవమానమును బాపికొనెనట!

శ్రీకృష్ణదేవరాయల నిర్యాణకాలము—

ఉ. బోరన యాచకప్రతతి భూరివిపద్దశ నందుచుండఁ గా
నారయ శాలివాహనశకాబ్దము లద్రియుగాబ్ధిసోములం
దారణవత్సరంబున నిదాఘదినంబున మాఘశుద్ధష
ష్ఠిరవివాసరంబున నృసింహునికృష్ణుఁడు చేరె స్వర్గముక్
ద్వారక నున్నకృష్ణుఁ డవతారసమాప్తిని జెందుకైవడిన్.

రాయలనిర్యాణానంతరము కొన్ని సంవత్సరములు పెద్ద నామాత్యుఁడు జీవించి స్వావస్థ నిట్లు చెప్పుకొనెను—

సీ. ఎదురైనచోఁ దనమదకరీంద్రము నిల్పి
కేలూఁత యొసఁగి యెక్కించుకొనియె
మనుచరిత్రం బందుకొనువేళఁ బురమేఁగఁ
బల్లకిఁ దనకేలఁ బట్టి యెత్తె
గోకటగ్రామాద్యనేకాగ్రహారంబు
లడిగినసీమలయందు నిచ్చె

బిరుదైనకవిగండపెండేరమున కీవ
తగుదని తానె పాదమునఁదొడిగె
గీ. ఆంధ్రకవితాపితామహ! అల్లసాని
పెద్దనకవీంద్ర! యని తన్నుఁబిల్చునట్టి
కృష్ణరాయలతో దివి కేఁగలేక
బ్రదికియున్నాఁడ జీవచ్ఛవంబనగుచు.

రాయల నిర్యాణానంతరమే గజపతిరాజు కన్నడరాజ్యముపైకి దండెత్తిరాఁగాఁ బెద్దనామాత్యుఁ డీ సీసపద్యమును రచించిపంపెను. సిగ్గిలి గజపతిరాజు తిరిగిపోయెను.

సీ. రాయరాహుతమిండరాచయేనుఁగు వచ్చి
యారట్లకోట గోరాడునాఁడు
సంపెటనరపాలసార్వభౌముఁడు వచ్చి
సింహాద్రి జయశిలఁ జేర్చునాఁడు
సెలగోలుసింహంబు చేరి ధిక్కృతిఁ గందు
తల్పులఁ గరుల డీకొల్పునాఁడు
ఘనతరనిర్భరగండపెండెర మిచ్చి
కూఁతు రాయల కొనగూర్చునాఁడు
గీ. ఒడ లెఱుంగవొ చచ్చితో యుర్విలేవొ
చేరఁజాలక తలచెడి జీర్ణమైతొ
కన్నడం బెట్లు సొచ్చెదు గజపతీంద్ర!
తెలిచినిలు వక్క సొచ్చినతెఱఁగు దోఁప.

——

## తురగా రామకవి.

---

ఈతఁడు పెద్దాపురపుఁ బ్రభువగు వత్సవాయ తిమ్మజగపతి మహారాజులుంగారి నాఁటివాఁడు. ఈతనిచాటుపద్యములే గాని గ్రంథములు తెలియరా లేదు. వత్సవాయతిమ్మనృపాలు నీతఁడు తిట్టెను.

క. అద్దిర! శ్రీభూనీలలు
ముద్దియ లాహరికిఁ గలరు ముగు రందఱిలోఁ
బెద్దమ్మ నాట్య మాడును
దిద్దమ్మని వత్సవాయతిమ్మనియింటన్.

మఱియు నీపద్యమును వినుఁడు.

ఉ. పెండెల నాగికొప్పుపయిఁ బెద్దికటిస్థలి గంగిగుబ్బచ
న్గొండలనుండురామకవికుంజరుహస్తము క్రిందుఁజేసె హా!
పండక బంటు మిల్లి యది పండిన నీ కసుమాలధారుణీ
మండలనాథుఁ బోలు నొకమానవమాత్రుని వేఁడఁబోవునే?

వింతయొక్కటి వెల్లడియయినది సింగారము చెలరేఁగుచున్న పద్యములన్నియు శ్రీనాథునితలకుఁదగిలింపఁబడుచున్నవి. పెండెలనాగి, గంగి, పెద్ది యనువిలాసినులు రామకవిగారికింగామినులని పై పద్యము పలుకుచున్నది. కాన యావెలఁదుకలపేర నున్న పద్యములు రామకవికృతములే యగును.

ఉ. చూడఁగ నల్పుగాని పరిశోభితదివ్యకురంగనాభమే
జాడను......

అనుపద్యమును,

ఉ. భూతలమందు ధాతను నపూజ్యత గల్గెను రెంట మూట భా
గోతులబుచ్చి గానికొకకొంచెము:—

అనుపద్యమును, శ్రీనాథకృతులు గాఁ దలఁపఁ బడుచున్నవి. రామకవిగ్రామణిపని నిజము నేఁటఁ దేటపడినది. ఈపద్య మీరామకవి దగునో కాదో!

గీ. విప్రుతలమునంది తల్లి వివేకిగాదు
ఎన్నిదిట్టిన నాభార్య యేభ్యరాశి
అన్నిటికిఁ దోడు నాకాలు నవటికాలు
రామకవిగాని బ్రదుకు శ్రీరామరామ!

---

## నృసింహభారతి.

ఈయన శృంగగిరిపీఠాధికారి కాఁబోలును. ఎవరో వీరిని బొగడినారు.

మ కరహాటాంధ్రమరాటలాటవిలసత్కాంభోజనేపాళికా
కురుకాళింగవిదర్భచేదియవనాఘూర్జావనీనాయక
స్ఫురితానేకసభాంతరాళములలో భూషింతు వాక్ప్రౌఢిచే
నరసింహోత్తమభారతీందుగురునిన్ నాస్వామినిన్ వేడుకన్.

ఈయన తనపీఠమునకు వచ్చుద్రవ్య మంతయును మేడలకును మిద్దెలకును వ్యయించెడువాఁడట!

శ్లో. కారుణా మపి దారుణా మశ్మనాం వేశ్మనా మపి
నృసింహభారతే ర్దృశ్య మయ్యో అయ్యో వృథావృథా.

---

## పింగళి సూరకవి.

ఈతఁడు కళాపూర్ణోదయము, ప్రభావతీప్రద్యుమ్నము, రాఘవపాండవీయము, ననుకృతులను రచియించిన చతురకవి. ద్వ్యర్థి కావ్యములలో నీతని రాఘవపాండవీయ మగ్రగణ్యము. ఈ క్రిందిపద్యము తద్గ్రంథరచనమును శ్లాఘించుచున్నది.

క. విశదంబౌకపక్షంబున
విశయము వేఱొకట నిట్లు విలసిల్లిన యా
శశి యెట్లు సాటియగుఁ గవి
శశియగురఘుపాండుకావ్యచణసూరనకున్.

---

## అడిదము సూరకవి.

క్రీ. శ. 1750 ప్రాంతములం దీకవిరత్నము విశాఖపట్టణపు మండల ...దలి విజయనగరసంస్థానపుం బ్రభువగు పూసపాటి చినవిజయర... రాజుగారియొద్దఁ గవీశ్వరుఁడుగా నుండెను. ఆంధ్రచంద్రాలోకము, కవిసంశయవిచ్ఛేదము, కవిజనరంజనము మొదలగునవి యీతనికృతులు. ఈతని చాటువులు.—

చ. గడియకు నూఱుపద్దెములు గంటములేక రచింతుఁ దిట్టఁ గాఁ
దొడఁగితినా పతాలుమని తూలిపడుం గులశైలరాజముల్
విడిచి యనుగ్రహించి నిఱుపేద ధనాధిపతుల్యుఁ జేతు, నే
నడిదము వాఁడ! సూరనసమాఖ్యుఁడ నా కొకరుండు సాటియే!

చ. గరిసెలు వ్రాఁతగాని మఱి గంపెఁడెఱుంగము మన్యదేశముల్
తిరిగి యభీష్టవస్తువులు తెచ్చి భుజింతుము సర్వకాలమున్

సురుచిరసత్కవిత్వనిధి సూరకవీంద్రునకేలకల్గెఁ గం
చరమును రేగ మేక మెడచన్నులవంటివి రెండుమాన్యముల్!.

ప్రశ్నోత్తరరూపముగాఁ దనవృత్తాంతముఁ జెప్పుకొన్న పద్యము.—

క. ఊరెయ్యది? చీపురుపలె
పేరో? సూరకవి; యింటిపే? రడిదమువార్ ;
మీరాజు ? విజయరామ మ
హారా; జతఁ డేమి సరసుఁడా? భోజుఁడయా?

రాజునుబొగడిన పద్యములు.

శా. ఢిల్లీలోపల గోలకొండపురి నిండెన్ నీప్రశంసల్ గుజాల్
బల్లాలం బొడిపించి హుమ్మన యరబ్బా నెక్కి పైకొంచు బా
దుల్లాఖానునిఁ బాఱఁదోలితివి నీకోశ్శక్తి సూబాలకున్
మల్లింపం దరమా నె శ్రీవిజయరామా ! మండలాధీశ్వరా !

ఉ. పంతము నీకె చెల్లె నొకపాటియవీరుఁడు నీకు సాటియా ?
కుంతముఁ గేలఁబూని నినుఁ గొల్వనివాఁడు ధరాతలాన భూ
కాంతు డొకండు లేఁడు కటకంబు మొదల్కొని గోలగొండప
ర్యంతముఁ జూడ శ్రీవిజయరామనృపాలక! మండలాధిపా !

విజయరామరాజుగా రేదో కారణమున సూరకవిగారి యెడ నాగ్రహమూని యాస్థానమునుండి తొలంగించి రట! బాదుల్లాఖానుతో నొకసారియుద్ధము సేయఁబోయి పరాభూతులై యారాజుగారు తిరిగి వచ్చుచుండఁగా సూరకవితనగ్రామము ప్రక్కత్రోవలోఁ బనసచెట్టెక్కి విస్తళ్లకై యాకులు గోసికొనుచుఁ జూచి యెదురుపోయి పల్లకీ నాపి తనకసి తీఱునట్టు చుఱుకుగా నీపద్యము జెప్పెనట,—

సీ. మెత్తనై యున్న యరటాకుమీఁదఁ గాక
మంటమీఁదను జెల్లునే ముంటివాఁడి
బీదలై యున్న సర్దార్ల మీఁదఁ గాక
కలదె క్రొవ్వాఁడి బాదుల్లఖానుమీఁద?

పానుగుపాటి వేంకటమంత్రి యనునియోగిమీఁద సూరకవి చెప్పిన పద్యములు —

క. ఘనకులమునఁ బొడమిన దు
ర్జనుఁ డిల నింద్యుఁడగు ననన మూర్ధ్వముఖం
బున వెడలి మంచిదగునా
విను మనహిత! పాన్గుపాటి వేంకటమంత్రీ!

క. కినుక మెయిఁ దన్నులాడఁగ
మొనకట్టిన సరియె గుఱ్ఱముల్ గాడిదయుల్
ఘనుఁ డల్పుఁడు సరి యగుదురె
విను మనహిత! పాన్గుపాటి వేంకటమంత్రీ!

సామజము చెఱకు మేసిన
దోమలు పదివేలు చేరి త్రోలఁగలవా?
గ్రామపతి తగవుదప్పిన
గ్రామములో నున్నవారు కాదనఁగలరా!

క. ఇత్తడి పుత్తడి యగునా?
తొత్తది నగ లెన్నియిడిన దొరసా నగునా?
యుత్తమకులుఁ డౌనా దొ
లత్తునఁ దాఁ దిరిగినను గులాము గులామే!

క. బలవంతుఁడు బలహీనుఁడు
పాలియెదు రిదితప్పు? నల్లపూసలు ముత్యాల్

దొలఁగుఁగద! మగఁడుపోయిన
వెలఁదుకకున్ బొన్నుపాటి వేంకటమంత్రీ !

క. జలచరము లబ్ధిఁ బొడమవె?
జలరాశిఁ మోదకరుఁడు చంద్రుం డొకఁడే
కుల ముద్ధరింప నొకఁడే
విలసద్యశ! పొన్నుపాటి వేంకటమంత్రీ !

క. పలరాచపనికిఁ గాదా
వెలవెలఁదుక పాన్పు నెక్క విటుఁడు సహించున్
జల మేల కార్యవాదికి
విలసద్యశ! పొన్నుపాటి వేంకటమంత్రీ !

పూసపాటి సీతారామరాజుగా రొకప్పు డేకవచనమున సంబోధించినందులకుఁ గుపితులు కాఁగా సూరకవి చెప్పినది--

క. చిన్నప్పుడు రతికేళిక
నున్నప్పుడు కవితలోన యుద్ధములోనన్
వన్నె సుమీ రాకొట్టుట
చెన్నుగ నోపూసపాటి సీతారామా !

దంతులూరి యన్నమరా జనునాతఁ డీ యడిదమువారి రేగమాన్యమునుండి యెక్కడిచెఱువు ముఱుగునీరు పోనీక యడ్డుకట్టి చిక్కులు పెట్టుచుండఁగా నీ సూరకవికిఁ దండ్రి వరుస వాఁడగు రామకవి మోకాలిబంటిలోఁ దనమాన్యమున నిలుచుండి యీ క్రిందిపద్యములఁ జెప్పెనట! అంతట నారాజు కట్టినయడ్డుకట్ట తెగి పల్లమునకు నీరు వంచుకొని పోయెనట !

సీ. బ్రహ్మాండభాండసంపత్తి కుక్షినిగల్గు
పద్మనాభునిపదాబ్జమునఁ బుట్టి

సకలరత్నాకరస్థానమై యుప్పొంగు
    నంబుధీశునిచరణంబు ద్రొక్కి
పరమతత్త్వజ్ఞుఁడై పరఁగుశంతనుమహీ
    రమణువామాంకభాగమునఁ జేరి
అఖిలలోకాధ్యక్షుఁడై మించి విహరించు
    శివుజటాజూటాగ్రసీమ నిలిచి
గీ. తనరునీవంటిధన్య కుత్తమము గాదు
ఘాసపాటిమహాస్థానభూమియందుఁ
గాలు ద్రొక్కంగ నోడుఁ జండాలుఁడైనఁ
గదలు మిటమాని దివిజగంగాభవాని!

సీ. ఆదిభిక్షుం డీతఁ డని రోసి విడియూను
    గొనివచ్చి యిట నిల్వఁ గోరితొక్కొ
జగడాలచీలివై సవతితోఁ బోరాడి
    వీఁగివచ్చి యిచట డాఁగితొక్కొ
నిర్జరాంగన లెల్ల నీయంను వెలిపుచ్చ
    దూఁబవై యిచ్చోట దూఁటితొక్కొ
భీదబాఁపలఁ గష్టపెట్టుటకై మిన్ను
    డొలఁగి యిచ్చోటను నిలిచితొక్కొ
గీ. పలుకు ద్విజభూమిఁ గాల్నిల్వ వరుసగాదు
రవ్వ నీ కేల తగ దంబురాశి కరుగు
నాతి యతఁడె కాఁడటె పిన్ననాఁటిమగఁడు
కదలు మిటమాని దివిజగంగాభవాని!

సీ. భావింప నిలువెల్ల భంగంబులే కాని
    భంగము ల్దొలఁగు టెప్పటికి లేదు
తిరుగుచో వంకరతిరుగు డింతియ కాని
    తిన్నగాఁ దిరుగుట యొన్నఁడెఱుఁగ

మొనసి రేయుఁ బవళ్లు మొరయుచుండుటె కాని
మొరయ కూరకయుంట యెఱుఁగ మెపుడు
పరులకల్మిని రోసి పల్చనగుటె కాని
పలుచనిగతి మాని మెలఁగు టెఱుఁగ
గీ. మనుచు నీలోన నీపైన యవగుణంబు
లరసి లజ్జించి దివినుండ కరుగుదెంచి
నిలువునీరైన నీ విందు నిలిచితొక్కొ
కదలు మిట మాని దివిజగంగాభవాని !
సీ. పచ్చిమాంసము కల్లు భక్షించి మత్తెక్కి
రాణించు తిరుగుపరాంసులైన
గంజాయి గుండ హుక్కాలుడికెడి నీళ్ళు
త్రావి మాన్పడెడుతురుష్కులైన
గోవులఁ బడమొత్తి కోసి ముక్కలు మెక్కు
సముదాంధు లగుకొండసవరులైన
తెరవాట్లు గొట్టి కత్తెరదొంగలై చాల
వాలించు తిరుగుచండాలురైన
గీ. భూసురక్షేత్ర మిది యన్నఁ బోఁ డొకండు
చిన్నపొలములు బ్రాహ్మణక్షేత్రమునకు
ఘాతుకత్వంబు సేయుముష్కరులుగలరె ?
కదలు మిట మాని దివిజగంగాభవాని !
సీ. కృత్తికాద్రు లాయె నా కీలోగ్రఫణిఫణా
నేకపూత్కారవల్మీకచయము
విరిదోఁట లాయె నా కఱుకుకంటకకంట
కాంకురవిస్ఫురితాగచయము
పువుఁబాన్పు లాయె నా నవమంజులశ్వేత
లవణాలవాలమౌ చవుటి నేల

బొమ్మరిం డ్లాయెనా భూరిభేకాండజా
ధారమైతనరుకేదారచయము
గీ. నీవు విహరింప ఐసతులై నివ్వటిలెనె
చిన్ని పొలములు; బ్రాహ్మణక్షేత్రమునకు
ఘాతుకత్వంబు చేయుముష్కరులు గలరె?
కదలు మిట మాని దివిజగంగాభవాని!

అడిదము రామకవి పైవిషయమునుగూర్చి పూసపాటి
విజయరామరాజుగారి కిచ్చుకొన్న యర్జీ పద్యములు—

సీ. అవధారు! దేవ! మహాప్రభూ! విన్నపం
బాశ్రితోత్తముఁడ శుద్ధాంధ్రకవిని
పేరు రామన యింటిపే రడిదమువారు
మాజాగ భూపాలరాజురేగ
నల్లకృష్ణక్షమానాయకాగ్రేసరుఁ
డెఱ్ఱకృష్ణక్ష్మాతలేంద్రు లచటఁ
గరణికధర్మంబు గల్పించి మాన్యంబు
దయచేసి రది యాస్పదంబు మాకు
గీ. నదియు నీయేఁడు దంతులూరన్ననృపతి
సత్తముఁడు గ్రామమెల్లను గుత్తచేసి
చెఱువు బిగఁగట్టి ప్రజలు జేజేపడంగ
ముంపుగట్టించె పరిపాట్టు ముంపఁదలఁచి.
సీ. విన్నవించెద నాదువృత్తాంత మది కొంత
చిత్తగింపు పరాకు సేయకుండఁ
బొలములో నొకఁడేరుపూన్పంగఁ జాలఁడు
గంగాభవానిఢాకకును జడిసి
దుక్కిటెడ్లను గొని దున్నుకుంద మటన్న
బదులియ్యఁ డెవ్వఁడు పాఁతనేబు

ఏజోలియును లేక యింట నుండెద మన్న
సాలుదు నచ్చు గంటాలపన్నుఁ
గీ. దేశమునవారు పొన్నూరుతెన్నుగాదు
పంట పస లేదు గంటాలపన్ను పోదు
మీకు దయరాదు మునుపటిమిసిమి లేదు
అతులగుణదీప! విజయరామాననీప.

సూరకవి ప్రపౌత్త్రుఁడు బాలభాస్కరకవి చల్లా పట్టాభి రామయ యనువానిఁగూర్చి చెప్పినపద్యము.

సీ. విజయరామక్షమావిభు మెచ్చి భాసిల్లె
ధరణిలో మాప్రపితామహుండు
గంగాభవానిని గడుదిట్టరై తిట్టి
ఖ్యాతిఁ జెన్నొందె మాతాత యొకఁడు
వెలయంగమగటిపల్వెంకనుబడఁ దిట్టి
తగఁదెగటార్చె మాతండ్రిగారు
ఆరీతిగాఁదిట్టి యమపురంబునకును
నిన్నుఁ బంపఁదలంచి యున్నవాఁడఁ
గీ. గాచుకొ మ్మిటు మీఁద నఖండచండ
దారుణోద్దండకవితాగభీరశక్తి
నీతరముగాదు కలహించి నిర్వహింప
చల్లపట్టాభిరామ! నీచగుణధామ!

---

## అహోబలపండితుఁడు.

ఆంధ్రశబ్దచింతామణి సూత్రములకు భాష్య మొనరించిన గాలి యహోబలపండితుఁడు మైదవోలున నుండఁగా గుండ్లకమ్మ వఱదవచ్చి కొంపలు కూలి పంటలు పాడ్వడి తిన నన్నమును గట్ట గుడ్డయు లేనిదుర్దశ వాటిల్లెను. అపుడు నరసారావుపేట మల్రాజువారి సంస్థానమున కరుగుదెంచి యీ క్రిందిసీసపద్యమును జెప్పి వారివలన నొకయగ్రహారముం బడసి యాతఁడచ్చటకు నివాసము మార్చుకొనెనట!

సీ. జానకీపతి లేఁతసజ్జరొట్టెలపాలు
కొంపలకప్పెల్ల గొడ్లపాలు
సంవాసములు దొంగజాగిలంబులపాలు
నయనముల్ జాగరణంబుపాలు
కలపుస్తకపుఁద్రాళ్లు కట్టెమోపులపాలు
పొలుపైనచేతులు ముండ్లపాలు
భూరిసంధ్యావిధుల్ బురదనీళులపాలు
నాలుక దీనోక్తినటనపాలు

గీ. ఘనతరస్నేహ మతినీచజనముపాలు
చిత్త మేవేళ నతిదీర్ఘచింతపాలు
హరిహరీ! దేహ మంతయు నలఁతపాలు
మైదవోలున నుండుట మాకుఁ జాలు.

ఆతనిప్రతిజ్ఞ.

క. నెట్టన నభినవనన్నయ
భట్టాచార్యాభిధానపటుబిరుదాంకం

బి ట్టట్టనక ఐహించిన
దిట్టఁడ! ననుఁ బోలఁగల సుధీవరు లేరే?

నక్కలపాటి బాలసరస్వతి యనుకవీశ్వరుఁడు కడపరెడ్ల నుగూర్చి చెప్పినది—

ఉ. రెడ్ల మటంచుఁ గ్రొవ్వునఁ జరించి వరాలు గడించె యూరకే
బుడ్లకొలందిఁ ద్రావి కడుపు ల్కడుఁ బెంచి వివేకహీనులై
యొడ్లవలెన్ ఐసించు గుణహీనుల కెక్కడి కీర్తు లోరి వి
ద్వడ్లయకాల! గోళ్ల చినతిమ్మతనూభవ! తాతభూవరా!.

దేవలూరి కేశవరెడ్డియను నాతఁ డొకకవీశ్వరుఁడు త్రోవ నరుగుచుండఁగా—ఓహో! కవీశ్వరులా! యని గేలిచేసెనట! కోపము పేడెత్తి యాకవీశ్వరుఁ డీ పద్యముఁ జెప్పెను.

క. పీ పట్టినట్టు నోరను
పీ పట్టవదేమినీకు! పీ, పీ, లందున్
దీపయి రుచిపుట్టెనొ నీ
కీపట్టున దేవలూరి కేశవరెడ్డీ!

నారయప్పారావువారి సంస్థానమున జమాబందీకిఁ గరణములు వచ్చి చిరకాలము నూజివీట వసింపవలసివచ్చుచుండెడి టద! ఒకప్పు డాపరస్థలవాస క్లేశమును సైఁపలేనికరణమొకఁడు నారయభూపాలు నొద్దఁ జెప్పిన పద్యము—

క. శీతజలస్నానంబును
భూతలశయనంబు నొంటిపూటశనంబున్
నాతిగల బ్రహ్మచర్యము
నాతరమా! పూటగడప నారయభూపా!

---

## భృంగపంచకము. శ్రీనాథకృతియందురు.

---

సౌందర్యశాలినియగు నొకనరపాలుని దేవేరి యమాత్యునకుఁ జనవుపడియుండెను. ఒకప్పు డాభూపతి కార్యవశమున స్థలాంతరమున కరుగుడు నామంత్రి యంతిపురమునఁ జేరుకొని రాజమహిషితోఁ గేరింతలాడుచుండెను. పుడమితేఁడును నాఁటిరేయికే మరలఁ దిరిగివచ్చుటయుఁ గోటలోనికి వచ్చినతోడన కవాటములెల్ల బంధింపఁబడుటయు నెఱిఁగి దూతికయొకర్తీవృత్తాంత మమాత్యునకుఁ దెలిపి దాఁకొనుటకు భృంగాపదేశమునఁ జెప్పినది—

ఉ. మాయురె భృంగమా! వికచమల్లికలన్ విడనాడి తమ్మిలో
నీయెడఁ బూవుఁదేనియల నింపుజనింపఁగఁ గ్రోలి సొక్కియున్
బోయెద వన్నభ్రాంతి నినుఁ బొందదు రా జుదయించె నిప్పుడీ
తోయజపత్త్రముల్ వరుసతో ముకుళించెఁ జలింపకుండుమా!

పుడమితేఁడు శయనాగారమున కరిగినపిదపఁ గొంతదడవునకు మంత్రి యిఱుకటమున దాఁగియుండఁజాలక యిటునటుఁ గదలఁగాఁ జప్పుడగుట విని మఱల నాదూతి చెప్పినది—

చ. అళికులవర్య! పద్మముకుళాంతరమందు వసింప నేరమిన్
జలనము సెందెదేమి నవసారసమిత్త్రుఁడు రాకయుండునా?
తొలఁగక యందె యుండు మిఁకఁ దోయజవైరి తిరంబె రాత్రియీ
కలవరమేల? తమ్మితుద గావక తూఱక యూరకుండుమా!

సాధ్వీమణియగు నామంత్రిభార్య తేఁ డంతిపురమునఁ జేరుట విని రేయి రెండుజాములు కడచినను దనభర్త యిలు

నేరమిచేఁ దిగులవ్వడి యేమికీడు వాటిల్లెనో యని కనుఁగొన రాఁగా నామెనుగూర్చి దూతి చెప్పునది—

చ. అలినీ! తత్తఱ మేలె నేఁడు నిదె నీయాత్మేశుఁడాభ్యంగముల్
జలజాసక్తమరందపానవిళతిన్ సానందుఁడై యున్నవాఁ
డులు కింతేనియు లేక నీ విరుగుమా! యొప్పార నిప్పాట నీ
చెలువుండుం బఱతెంచుఁ దేకువను రాజీవంబు పుష్పించినన్.

తా మింక వెలఁపలకు దయచేయుం డని మంత్రికిని బోధించుచుఁ జెప్పునది—

చ. పతినిద్రించినవేళ రాఁదగున యోపద్వారి యీకేళికా
యతనంబందు రతిశ్రమన్ విభుఁడు నిద్రాసక్తుఁడై యుండె నీ
శతపత్రేక్షణ మోమువాంచినది నీసామర్థ్యమున్ జూపఁబో
కతివేగంబున నేఁగుమా! తొలఁగి మాయాత్మల్ సుఖం బందఁగన్.

రేయి రాజమహిషి తనకంఠహారమును మంత్రికంఠమున వైచెను. అతఁడునదిమఱచి మఱునాఁడు దానిఁదాల్చియే రాజసభ కరుదెంచెను. అదిగాంచి రాజు గుఱుతించునేమో యని భీతిలి నిపుణయగునాదూతి వందివేషమున నరుగుదెంచి యీక్రిందిపద్యమును జదువ నందలి "మానపరిపాల" యను విశేషణముఁబట్టి మంత్రి తెలిసికొని తనకంఠమందలిహారమును బైపచ్ఛడమునఁజుట్టి పారితోషికముగా నొసంగెను.

చ. అతులసభాంతరస్థితబుధావళికెల్ల జోహారు వీరరా
హుతులకు మేల్జొహారు సతతోజ్జ్వలవిక్రమసార్వభౌమసం
తతికి జోహారు నై భవవితానపురందరుఁడైనయట్టి భూ
పతికి జోహారు మానపరిపాల! జోహారు ప్రధానశేఖరా!

——

## కందుకూరి జనార్దనాష్టకము.

1. సిరులు మించిన పసిమిబంగరు జిలుగు దుప్పటి జారఁగా
చరణపద్మముమీఁద దేహము చంద్రకాంతులు దేరఁగా
మురువుమూపఁగ వచ్చినావో మోహనాకృతి మీరఁగా
గరుడవాహన! దనుజమర్దన! కందుకూరిజనార్దనా!

2. ఆన పెట్టిన రాకపోతివి ఆయెబో అటుమొన్ననూ
పూనిపిలువఁగ వినకపోతివి పొంచిపోవుచు మొన్ననూ
నేనుచూడగ గడచిపోతివి నీటుచేసుక నిన్ననూ
కానిలేరా! దనుజమర్దన! కందుకూరిజనార్దనా!.

3. నిన్నరాతిరి చవికలోపల నీవు చెలి కూడుంటిరా
ఉన్నమార్గము లన్నియును నే నొకతెచేతను వింటిరా
విన్నమాత్రము గాదురా నిను వీథిలో కనుఁగొంటిరా
కన్నులారా దనుజమర్దన కందుకూరిజనార్దనా!.

4. దబ్బులన్నియు తెలుసుకొంటిని తప్పుబాసలు సేయకూ
మబ్బుదేరెడికన్నుగవతో మాటిమాటికి డాయకూ
ఉబ్బుచేసుక తత్తరంబున నొడలిపై చెయి వేయకూ
గబ్బితనమున దనుజమర్దన! కందుకూరిజనార్దనా!

5. చిత్తరంబున మొలకకెంపులు పెదవి నెవ్వతె ఉంచెరా
గుత్తమైనమిటారి గుబ్బలగుమ్మ యెవ్వతె మెచ్చెరా
చిత్తగించక జీరువారను చెక్కులెవ్వతె నొక్కెరా
కత్తిగోరుల దనుజమర్దన! కందుకూరిజనార్దనా!.

6. అండబాయక కూడియుంటిని ఆమె బోయెను నాటికి
ఖండిమండిపడంగ నేటికి కదలు మెప్పటిచోటికి
ఉండరా నీమాటలకు నేనోర్వఁజాలను మాటికి
గండిదొంగవు దనుజమర్దన! కందుకూరిజనార్దనా!.

7. అలుకలన్నియు దీర నివు నాఅండ కెప్పుడువస్తివి
పిలిచి నవరత్నాలసొమ్ములు ప్రేమతో నెపుడిస్తివి
వలచి ఖలపించియును గూరిమి వదలకెప్పుడు మెస్తివి
కలసి వేడుక దనుజమర్దన! కందుకూరిజనార్దనా!

---

## వలపు.

చ. అలరులు సూదులై మలయజాదిసువస్తువు లగ్నికల్పమై
మలయసమీరముల్ విషసమానములై హిమభానుఁడైన యా
కలువల ఱేఁడు చండకరుకైవడియై కనుపట్టె నయ్యయో!
వలపనుపాప మెట్టిపగవారలకున్ వల దింక దైవమా!

చ. చెలువగుమించుటద్దములు చెక్కులటంచుఁ దలంచి మెచ్చుచున్
కలువలఁజూచి కన్నులని కైరవమిత్రునిఁజూచి మోమటం
చలరుచు నీగతిం దరుణియందము లెంచి విరాళినొందితిన్
వలపనుపాప మెట్టిపగవారలకున్ వల దింక దైవమా!.

చ. కులుకుమిటారి గబ్బిచనుగుబ్బలసొంపు చెలంగఁ దళ్కుఁగ
న్నులుదయివాఱఁ జూచుచు వినోదముగా మృదులీలఁ బాడుచున్
వలనగుహంసయానమున వచ్చినయట్టులె తోఁచె నింతి; హా
వలపనుపాప మెట్టిపగవారలకున్ వల దింక దైవమా!.

---

## శృంగారము.

సీ. సారమా నీశరాసార మానింత వ
సారమా విరహిణీమార మార
రాకమా నీ వీచిరాకు మాటుగ నేచ
రాకు మారాకుమాద్యాకుమార

పంతమా నీదురుసంత మాయెడల ప
సంతమాధవ మీపసంత మార
చెందిరా దుర్గుణమందిరా సత్కార
మందిరాకృతి ముకుమంద రార

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No.

గీ. యనుచు పగమీరి కను దూరి మనసు జారి
శౌరి మారిఁజేరి దరితారి తారి మనికి
గోరి తనబారి గడూన వేసారి నుడుప
నోరుచే దూరి కేరి మురారి నారి.

గీ. అడుగున ధరించు మాణిక్య మబ్ధిరాజు
కణఁగి శిరమునఁ దాల్చును గడ్డిపోఁచ
వనధిదేగాని దోష మెవ్వరిదిగాదు
మణి మణియె పూరి పూరియె మందగమన.

శా. ఎంచన్ మించుగ నెత్తిమాడుదుగదా యేప్రొద్దుబంగారపుం
బంచల్ తీర్చినరత్నమందిరములన్ బారాగుగా దచ్చి తీ
ఐం చా లొక్కటి తొమ్మి దేడు పది చవ్వం చిత్తిగంచుం జెలుల్
ప్రాంచల్లీలల నీకు నాకు సరితో డైపల్కు బింబాధరా!

మ. ఎనయు న్నీజిగిమేనిక్రొంజెమటచే యేప్రొద్దు సుస్నానమున్
నినువర్ణించుట సంధ్యయున్ జపవిధుల్ నిత్యంబు నీపాదవం
దనమే యెప్పుడు దేవపూజనము నీవాత్యధరానూనచుం
బనమే మాకనిశం బనర్గళసుధాపానంబు బింబాధరా!

శా. కానా పేదలకెల్లఁ బేద పలుకా కర్పూరఖండంబు నె
మ్మేనా పైఁడిసలాక ముద్దుమొగమా మేలైనక్రొత్తమ్మి కొ
ప్పా నీలంబులకుప్ప గప్పునెఱిచూపా కంతుచేతూపు ని
న్నే నా నుతియించువాఁడఁ దగవా యీమాట బింబాధరా!

మ. వనజాతాంబకుఁ డేయుసాయకములన్ వారింపఁగారాదు నూ
తనబాల్యాధికయౌవనంబు మదికిన్ ధైర్యంబురానీయ ది

ట్లనురక్తిఁ బిముఁబోంట్లకుం దెలుప నాహా సిగ్గు మైకోదు పా
వనవంశంబు స్వతంత్రమీయదు సఖీ వాంఛల్ తుదల్ ముట్టునే!

ఉ. అక్కరో! నీదువల్ల భుఁడహంకృతిఁ జేసినచేఁత వింటివా ;
యొక్కఁడ నెక్కఁడే మఱియు నెవ్వరి నెవ్వరి? నన్నె నన్నె; నీ
వక్కడి కేల పోవలయు? నంపవ; యంపితిఁ గూడుమంటి నా?
మ్రొక్కితి వేఁడుకొంటి ననుముట్టకుమంటి నిఁ కేమిచేసెదన్.

క. ఔరా! యేమనిచెప్పుదు
నారీమణిచక్కఁదనము నాణెము చేరన్
జేరెఁడుకన్నులు బారన్
బారెఁడు నెఱికురులు పట్టుపట్టెఁడుకుచముల్.

ఉ. ఎన్నఁడు నేరిచెన్ బెళుకు లీచెలి కన్నులు కార్ముకమ్ముల
న్నన్న! కురుల్ పిఱుందు పటువై ఘటువై ఖరిఁ గైకొనెంగదే
మొన్నఁ గదమ్మ పిన్న మొనమొల్కలు నేఁడివె ముద్దులాఁడి లేఁ
జన్నులు మిన్నలై పయఁటసందున డాఁగుడుమూఁతలాడెడున్.

చ. పడిగము తమ్మలం బుమియుపల్లవకోటికి నోరు వేణి యం
గడిసవరంబు సంతసొరకాయ లురోజము లచ్చరచ్చసా
వడి యొద యూరువుల్ గమిడినాతియనంటులు మోవి జిడ్డిగి
జ్జిడి నెలయాలిజీవనము జీవనమే తలపోసిచూచినన్?.

సీ. సాటివాతెఱమీఁద గాటు లేర్పడియుండ
వేఱె యింకొకసాక్షిఁ గోరవలెనె?
చక్కఁ జెక్కుల గోటినొక్కు లేర్పడియుండ
మించి నీ వింతవాదించ నేల?
ఉరముపై హారముల్ గుఱుతు లేర్పడియుండ
సత్యాన కింకఁ గేల్ సాఁచవలెనె?
పసపంట చలువదుప్పటి కేటపఱుపంగఁ
దెలియఁ దార్కాణముల్ పలుకవలెనె ?

గీ. కేటగన్నులు నిద్దురతేలఁ చూపు
కందు నెమ్మేను వేకువచందమామ
కొలఁది వెలవెల నగుముఖకళలతీరు
చూడ బయలాయె నడతలీజాడలేల?

భక్తిపరవశుఁడై పోతన్నగారు భాగవతమునందు—

శా. లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యెఁ బ్రాణంబులా
ఠావుల్ దప్పెను భ్రాంతివచ్చెఁ దనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్
నీవేతప్ప నితఃపరం బెఱుఁగ మన్నింపందగున్ దీనునిన్
రావే! యీశ్వర! కావవే! వరద! సంరక్షించు భద్రాత్మకా!

అనుపద్యమును జెప్పగాఁ గామపరవశుఁడై వేఱొక కవి.—

శా. పూవిల్కానిసరోజబాణముల నంభోజారిమైచాయలన్
ప్రాణం బెంతయు డస్సె మేనుబడలెన్ దాపంబు రెట్టించె నే
నీవాఁడన్ మధురాధరం బొసఁగవే! నిక్కంబు నన్నేలవే!
రావే మానిని! కావవే తరుణి! సంరక్షించు చంద్రాననా!

అనుపద్యమును చెప్పెను.

చ. ఆయెం బోయె నిఁకేల నావలనఁ దప్పేమాట సైరింపవా
తాయో కానము నీమనంబు; దయమీఱం బల్కవింతైన నీ
ప్రాయం బేటికి నిన్నుఁ బాసినఁ దృణప్రాయం బయో "కొమ్మరో
కో" యంచుం దొలికోడి కూయుదనుకం గోపంబె బింబాధరా!

శా. మృదుతల్పంబు వికారలీల దిగి ధమ్మిల్లంబు చేఁబూని రా
గదదృగ్జాలముతోడఁ గాను నులియంగా మోము మార్వెట్టుచున్
పదలంబాఱిననీవిఁ బట్టుకొని కన్యారత్న మడ్డేఁగెఁ ద
త్సదనభ్రాజితరత్నదీపకళికాస్తంభంబు క్రీనీడమన్.

ఉ. ఏమనె? నేమిపల్కె? నిను నేమనిపంపెను? నన్నుదూఱెనో?
రామనెనో? పరాకిడెనో? రాజులయేలిక కృష్ణమూర్తినా

స్వామి ముకుందుఁ డచ్యుతుఁడు వారిజనాభుఁడు శేషశాయి న
న్నేమనె? నేమిపల్కె? నిను నేమనిపంపెను? దెల్పు నెచ్చెలీ!

ఉ. ఆతఁడు దూరదేశమున కల్కనెపమ్మునఁ బోయిరాఁడు నే
నాతనిఁ బాసి మన్మథశరాగ్నిఁ దపించుచున్నదాన నీ
వాతని నన్ను జూచితి వియత్తలమెక్కి సుధాకరుండ! నే
నాతనికంటెఁ జిక్కితినొ యాతఁడె చిక్కెనొ నాకుఁ దెల్పవా!

శా. లోకాలోకపరీతభూభువన మాలోకించుపుణ్యుండ వో
రాకాచంద్ర! భవత్సమానముఖి మత్ప్రాణేశ్వరిం బాసి నే
నాకందర్పశరాగ్నికీలలకు లోనై యున్నచందంబు నీ
వేకాంతంబునఁ దెల్పవయ్య! దయతో నేలాలతాతన్వికిన్.

సీ. పరిణామ మేమయ్య! ప్రాణనాథునివార్త
విందునో యని యుందుఁ జందమామ!
విరహాగ్ని చల్లగా విభుని యాకారంబు
కందునో యని యుందుఁ జందమామ!
పతి కాకుఁ జుట్టిచ్చి మతికాంక్ష దీరంగ
నందునో యని యుందుఁ జందమామ!
వల్లభుఁ డేవేళ నిచ్చు నప్పూడె మోవి
విందు సేతల యుందుఁ జందమామ!

గీ. చక్కఁదనమున నీసరి చందమామ!
యాతఁ డున్నట్టియూరిపైనయ్య! మీరు
పోతిరా నాదువివరంబు పొసఁగఁ జెప్పి
సాహసాంకుని రమ్మను చందమామ!

సీ. భామాలలామకు క్షేమమా తెల్పుమా
సకలకళాధామ! చందమామ!
పల్లవపాణికి భద్రమా పల్కుమా
సర్వకళాధామ! చందమామ!

కోకపక్షోజముఁ గుశలమా చెప్పుమా
చక్రవాకప్రేమ! చందమామ!
పద్మాయతాక్షికిఁ బరిణామమా ధర
సంపూర్ణగుణధామ! చందమామ!

గీ. పద్మలోచన యున్నట్టిపట్టణంబు
త్రోవగాఁ బోదువా నీవు తోయజారి!
సకియ మేలిమి యంతయు సరవిఁ దెలిసి
యంద మందంగ రమ్మ యోచందమామ!

మ. కలిగేనా యొకనాఁటి కైన మదిలోఁ గాంక్షారతుల్ దీరఁగా
దలపుం బాసినవెండ్రుకైతి మదనాస్త్ర జ్వాలచేఁ జిక్కితిన్
బలుకుం బంతము లొక్కటాయె విధిచేఁ బ్రాణంబు లెట్లో కదే
నెల నాళ్లాయెను మోముఁ జూచి యకటా నీరేజపత్రేక్షణా!

మ. కలలో నైనను బాయఁజాల నకటా కాంతుండ! నన్ బాసితే
తలపూవాడక పోయి రమ్మనుచుఁ జెంతంజేరి హస్తాక్షతల్
తలపైఁ జల్లఁగఁ బూనఁ జేచెమట సంతాపాగ్నిఁ గూడయ్యె న
చ్చెలి ప్రాణేశుని చుట్టు రాఁ దిగిచి వైచెన్ సిగ్గు రెట్టింపఁగన్.

శా. *బాలా! రేయి విభుండు నాకు రతిసంపర్కం బెఱింగింపరా
నాలాగాట యొఱుంగనమ్మ! సదయుం డచ్చిరకోం గూడ్చినన్
ఆలోఁ జంచల మంది దివ్వెపుఁ జెఱం గడ్డంబు గావింప హా
రాలే దివ్వెలు గాఁగ నే నతని నేత్రద్వంద్వమున్ మూసితిన్.

సీ. భామామణీ! వాఁడు పైన మయ్యేడువేళ
నిమ్ముల నొకఁడైనఁ దుమ్మఁ డాయె
ముద్దుగుమ్మా! వాఁడు చద్ది గట్టెడువేళ
పకపక నొకగాలి పలుక దాయె

---

* బాలా నాకు విభుండు రేయి సుఖసౌభాగ్యం బెఱింగింపరా.

నిందుముఖీ! వాఁడు నిలువెళ్లి పోవుటఁ
బంచను బి ల్లడ్డగించ దాయె
జలజాక్షి రో! వాఁడు పొలిమేర దాఁటుచోఁ
గడఁగి గొబ్బునఁ బాల గట్ట దాయె

గీ. ఏల యూరక యలిగెనో నీలవేణి!
యెన్నఁ డిటు మళ్లి వచ్చునో సన్నుతాంగి!
† వేడ్క రతికేళి సలుపునో వెలది! నేఁడు
ఆసపడువారి నెఱుఁగఁడో అబ్జవదన!.

చ. మమతను దాను నొక్క చెలి మానిని! నీవిభునామ మేమనన్
గమలజగంధి పల్కెఁ గరికంధి ప్రజాపతిచంద్రికాతప
త్రములు త్రివర్ణయుక్తముగ వ్రాసియు నందులమధ్యవర్ణముల్
క్రమమునఁ గూర్చి చూడ గజగామిని! నావిభు నామ మయ్యెడిన్.

మ. అరవిందానన! నీమనోహరుని పే రాహ్లాదిగాఁ బల్కు మా
మరుఁడున్ దామరసంబు కాంచనము భూమ్యాకాశముల్ గేశముల్
గరిమన్ మారుతపుత్రిచంద్రులను వేడ్కన్ మూడువర్ణంబులన్
బరఁగన్ వ్రాసినమధ్యవర్ణములు సత్ప్రాణేశ్వరుం డయ్యెడిన్.

మ. పొరుగూరన్ విభుఁ డుండి వేడ్క లలరన్ బుత్తెంచునాభూషణో
త్కరముల్ నెచ్చెలి తెచ్చియిచ్చుటకుఁ గాంతారత్న మీక్షించి య
బ్బురమందెం గొనియాడెఁ దిట్టె నగచెన్ బోఁద్రోచె దీవించె నా
భరణంబుల్ వివరించుఁడీ సరసులై భావోదయస్థానముల్.

చ. రమణునిఁ గూర్చి యొండొకకరండము నంపుచు దానిమీఁద నొ
క్కముగుద సర్పముల్ బిదపఁ గామవిరోధినిఁ బైనమీరపుం
గొమరునిఁ జంపకంబు ననుఁగుంజెలిచే లిఖియింపఁజేసె భా
వము నిట మల్లినాథకవివర్యుఁడు కోరెడు వెల్వరింపఁగన్.

---

† వేడ్క నానందపఱుచునో వెలఁది! నేఁడు.

ఉ. కన్యకు నైదు జంఘలును గన్యకు నాఱు కుచంబు లెన్నఁగాఁ
గన్యకు నాల్గు కన్బొమలు కన్యకు నేడు విశాలనేత్రముల్
కన్యకు ద్వాదశంబు నులికొనును గల్గుసులక్షణాఢ్య కా
కన్యకు నీకు నింకఁ బదికావలెఁ గస్తురిరంగనాయకా!

సీ. శృంగారవనమునఁ జెలులతోఁ గ్రీడించు
తొయ్యలిఁ గాంచెను ధూర్తుఁ డొకఁడు
తొడ కేలఁ జఱచుచుఁ గడనుండి తనుఁ జూడ
మొలనూలు సవరించె ముద్దుగుమ్మ
విటుఁ డొక్క జాజిచెంగటఁ జేరి పరికింప
రేలచెంతకుఁ జేరె నీల వేణి
కంఠమాలిక సంజ్ఞగా జారుఁ డంటినఁ
గొమ్మయెఱ్ఱనిపూవుగుత్తి విఱిచె
గీ. వెలఁదిలీలలుఁ గని వాఁడు విన్నఁబోవ
సుదతికర్ణాగ్రమున నున్న సొమ్ముఁ జూపె
స్థలముఁ గులమును నామంబు నెలవు నెఱిఁగి
హితవు గలిగించె నప్పు డయ్యతివ కతఁడు.

క. ఎంచఁగఁ జతుర్థజాతుఁడు
పంచమమార్గమున నేఁగి ప్రథమతనూజం
గాంచి తృతీయం బచ్చట
నుంచి ద్వితీయంబు దాఁటి యొప్పుగ వచ్చెన్.

సీ. రాముఁ డెవ్వానితో రావణు మర్దించె?
పరవాసుదేవుని పట్ణమేది?
రాజమన్నారుచే రంజిల్లుశర మేది?
వెలయఁ గానుకపంట విత్తు నేది?
ఆలరంభకొప్పులో నలరుపూదం డేది?
సభవారి నవ్వించుజాణఁ డెవఁడు?

సీతపెండ్లికి నోలి చేసినవిల్లేది?
శ్రీకృష్ణుఁ డేయింటఁ జెలఁగుచుండు?

గీ. అన్నిటికిఁ జూడ నై దేసియక్షరములు
ఈవలావలఁ జూచిన నేకవిధము
చదువునాతఁడు భావజ్ఞచక్రవర్తి
లక్షణోపేంద్ర! ప్రాఘరాయక్షితీంద్ర!

తోకమూకతో, రంగనగరం, లకోలకోల, జంబీరబీజం, మందారదామం, వికటకవి, పంచాస్యచాపం, నందసదనం.

చ. నలశశిబింబలీలల నణంచుసతీమణిపాణిపల్లవం
బులు నగుమోము నారు జిగిమోవి యిం వాక్యములుక్ బిసాళివి
నులగిరిమం బణంచునరుణోష్ఠికుచంబులు మందయాన మ
య్యలకలు నాసికంబు తగువక్షులు నిబ్బరపుబ్బుగుబ్బలున్.

సీ. ఆద్యంతమధ్యమాంతాదిమధ్యంబుల
తేటిరక్కసిరాజు తెలియఁ దల్లి
ఆద్యంత ... ...
శివునిల్లు విఱిచెను క్షీరధార
ఆద్యంత ... ...
భార్యయు ఖడ్గంబు పరఁగఁ జెట్టు
ఆద్యంత ... ...
మార్వన్నె యీ కై ధూమంబు మఱియు

గీ. అన్నిటికిఁ జూడ మూఁడేసియక్షరములు
మొదలుతుదలును నడితుద మొదలునడుము
ప్రాణరక్షను లతలను బాదపములఁ
బరికరములందు నీపదా లరయవలయు.

ద్విపద అంబలి గుమ్మడి యావాలు పొగడ
డంబుగా వీని కడం బరికించు.

---

# పొడుపుఁ బద్యాలు.

---

క. పండగ నెండినదొక్కటి
పండకమతిపచ్చిదొకటి పడిఁ గాలినదిన్
దిండికి రుచిరై యుండును
మండలమున జనుల కెల్ల మహిలో వేమా! — తాంబూలము.

ఆ. వ్రేలిమీఁదనుండు వెండుంగరము గాదు
వ్రేలిమీఁదనుండి నేలఁ జూచు
అంబరమునఁ దిరుగు నదియేమిచోద్యమో
విశ్వదాభిరామ వినుర వేమ!.

క. ముక్కున పైనమునడచును
పక్కను నోరుండు గాలిపారణ సేయున్
గ్రక్కున వేసిన కూయును
మక్కువతో దీనిఁ దెలియుమనుజులుగలరే?. — బొంగరము.

క. శిలవృక్షలతలఁ బుట్టిన
చెలువలు ముమ్వురును గూడి శుభలగ్నమునన్
తలవాకిటరమియింతురు
చెలువలరఁగ దీనిఁ దెలియు సుగుణులుగలరే! — తాంబూలము.

ఆ. చీరగట్టి రాత్రి సిగ్గున నొదిగుండు
పగలు చీర విడిచి పనులు సేయు
చేయివాఁడి కత్తె చేడియ గాదయా
సమ్మెటాంక సోమ! జాణరాయ!. — పగడసాలకాయలు.

ఆ. ఆడఁబోవు చోట ఆయిండ్ల వారెల్ల
సారెసారె కొట్టిచంపిరనుచు

పుట్టినిల్లుచేరు పొలఁతితాఁగాదయా
సమ్మెటాంకసోమ! జాణరాయ!.

ఆ. పక్షిరాజుపేరఁ బరఁగిన మ్రానిపై
వెలుగుపిట్టజనులు వేడ్కతోడ
ఆవునిచ్చెదమని అందఱు మ్రొక్కుదుర్
దీనిభావమేమితిరుమలేశ!. —గరుడగంబం.

ఆ. మ్రానునందుపుట్టి మక్కువకాయలై
యిండ్లలోనఁబెరిగిపండ్లునవును
తీపురసములేదు తినరాదు చెప్పుమా
సమ్మెటాంకసోమ! జాణరాయ!

క. చెక్కులపసగలిగుండును
చక్కనిగుబ్బలనెసంగి సౌరై యుండున్
చిక్కనొకగడియలోపల
మక్కువసతిగాదు చూడ మహిమండలిలోన్. —జోడుతలుపు.

---

## సమస్య.

శంఖంబుల్ దివినుండిజాఱిపడియెన్ జంబూఫలప్రక్రియన్.

శా. ప్రేంఖత్పుష్పకచంపకాటవులదారిన్ వ్యోమమార్గంబునన్
రింఖద్వాయువశంబునం దగిలి యా నెత్తావికిం జొక్కి త
త్సంఖ్యాకంబులు తేంట్లమొత్తములు లక్షల్ కోట్లు పద్మంబులన్
శంఖంబుల్ దివినుండి జాఱిపడియెన్ జంబూఫలప్రక్రియన్.

ఉ. అంటనిమ్రానిపండు కరియంటనికాముశరంబు తేఁటిము
క్కంటనిపువ్వుహంసముఖ మంటనితూఁడు పయోధినివ్వనీ
రంటనిరత్న మన్యభృతమండలికందలిరాకు రాహుతా
నంటనిచంద్రబింబ మన నానృపకన్య వెలింగెన త్తఱిన్.

---

# చలి.

మ. చలి! మమ్మీగతి బాధపెట్టెదవు నీసామర్థ్యముల్ పట్టిబీ
దలపైఁ గాక ధగద్ధగాయితమణిస్తంభోన్నతాంతఃపుర
స్థలసంవాసితకామినీదృఢపరిష్వంగానుసంయుక్తిని
శ్చలులౌ భోగులమీఁద లేశమును నీజంజాటముల్ సాగునే?

చ. చలిగా! నీశోకవార్త తెల్పెదను నిశ్శంకోద్భటుల్ దంపతుల్
గలయాయిండ్లకుఁబోకు దంపతులమేల్ కౌఁగిళ్లమధ్యంబునన్
నిలువన్ దార్ఢ్యము లేదు; మిట్టిపడినన్ నీప్రాణముల్ గొంకు; రే
చెలి లేకుండెడు బ్రహ్మచారులపయిం జెల్లించు నీదర్పమున్.

చ. తరణిసుకాంతభిత్తిమయతల్పగృహాంతరహంసతూలికా
స్థిరశయనస్థలీశయకుశేశయకుట్మలకోమలస్తనీ
పరమశరీరసంగపరభాగ్యలపాదనఖైకదేశమున్
బెలుకఁగ లేవు నీవు నిఱుపేదల నేఁచెద వేమి యోచలీ!

మ. చలి నీవెందుకు సందడించెదవు? నీశౌర్యంబు మూన్నాళ్లె గా!
కలకాలంబును నిల్వలేవు గదవే! కాకున్నఁ బాకోజ్జ్వల
జ్జలజాక్షీకుచకుంభమధ్యమునఁ బెల్చన్ జొచ్చి గోరాడలే
కిలలో బాలుర రోగులన్ విరహులన్ వృద్ధాళి బాధింతువా?

శా. స్థూలద్విత్రిపటావకుంఠనము కస్తూరీరజఃపాళికా
కాలాగుర్వనులేపనంబును వధూగాఢోపగూహంబులున్
గేళీగర్భనికేతనంబులును గల్గెం గాక లేకున్న నీ
ప్రాలేయాగమ మేవిధంబున సహింపన్ వచ్చునెవ్వారికిన్?

క. అహములు సన్నము లాయెను
దహనుఁడు హితవయ్యె దీర్ఘతరలయ్యె నిశల్
బహుశీతోపేతంబై
యుహుహుహూ యన వణఁకె జగము లుర్వీనాథా!

## వేసఁగిని మందమారుతము లేమి.

శా. ఆ కల్హాడ దదేమొ నేఁడు పవనుం డాకాశవాపీతటా
శోకానేకవనాలిఁ గ్రుమ్మఱుచు నచ్చో డాఁగెనో; లేక గం
గాకల్లోలవతీప్రవాహముల నూఁగఁ బోయెనో; లేక కాం
తాకర్పూరకపోలపాళి కలనిద్రాసక్తుఁడై యుండెనో!

---

## పొగాకు.

ఇది పోర్చుగీసువారిచే మన దేశమునకు మూఁడువందల సంవత్సరములకు మున్ను కొని తేఁబడినది. అంతకుఁ బూర్వమిచ్చట లేదు.

సీ. దంతలూటీఘోరదంతిహర్యక్షంబు
కుష్ఠరోగాచలకులిశధార
[illegible]నసాండజభూరివైనతేయస్వామి
వాతాటవీదావవహ్నికీల
జలదోషహిమపూరచండార్కకరరోచి
బహుళకాసాంభోధిబాడబంబు
ఉరుతరాజీర్ణైణగురుతరవ్యాఘ్రంబు
ముఖరోగనిఖిలజీమూతపవన
గీ. మనఁగ వార్తకు నెక్కితి నఖిలజనుల
జీవరక్షణదివ్యసంజీవి వగుచుఁ
బ్రస్తుతింపంగ సకలదిక్పతులసభల
నూర్జితం బగునీరాక యోపొగాక!
సీ. ఆఁకొన్నమనుజుల కమృతంపుసేవయై
యుండుగా నీరాక యోపొగాక!

మతిహీనులకు సరస్వతిని బ్రసన్నగా
నొనరించు నీరాక యో పొగాక!
అతిపథిశ్రమమెల్ల నణఁపఁ గర్పూరమై
యుండుగా నీరాక యో పొగాక!
రతికాంక్ష లూరింప రసపాకగుళికయై
యుండుగా నీరాక యో పొగాక!

గీ. అవని వార్తకు నెక్కితి వఖిలజనుల
జీవరక్షణదివ్యసంజీవి వగుచుఁ
బ్రస్తుతింపంగ సకలదిక్పతులసభల
నూర్జితంబగునీరాక యో పొగాక!

సీ. నీమహత్త్వము మును నిర్జరు లెఱిఁగినఁ
దరితోడ నమృతంబు తెలుపఁబోరు
నీవిధంబును మును పావని యెఱిఁగిన
సంజీవివెదకెడిజాడఁ బోడు
నీవార్త మును దేవతావైద్యు లెఱిఁగిన
నౌషధావళికిఁ బ్రయాసపడరు
నీరీతి మును మానినికరంబు లెఱిఁగిన
బలుతపోనిష్ఠలు సలుపఁబోరు

గీ. సంతతోత్తిష్ఠజీవరక్షణములకును
రోగముల్ పాపమోక్షంపురూఢి దెలుపఁ
బుడమిలోపల జనులను బ్రోవ నీవు
ఒనరజనియించితివో గాక! యో పొగాక!

సీ. పైగోవసరముగాఁ బ్రార్థించి నినుఁ దెచ్చి
నిమ్మపంటిరసాన నీడనార్చి
పుడకలులేకుండఁ బొడిసన్నముగఁ జేసి
సిరిగోల్డి ధూమ్రంపుఁ జిట్టినించి

లలి నొక్కనిడుదనాళపుఁగ్రోవి సంధించి
చిన్నారిపటుకారి చేతఁబూని
జాతిరత్నమువంటి చంద్రనిప్పుఘటించి
నిజధూమలహరిచే నెగడుఘనుల

గీ. కెంతఘన మెంతదీపన మెంతసొగసు
సంతతోద్రేకలాహిరిసార్వభౌమ!
సకలగుణశీల! యెటువంటిసుకృతవేళ
నుదయమందితివో కాక! యోపొగాక !

సీ. బంధురామోదప్రభావిభ్రమంబుల
నెనయుకెందమ్మికే కీపొగాకు
పరిమళాంచితకళాప్రావీణ్యవిభవంబు
లెనయుగేదంగికే కీపొగాకు
ఘనతరానూనసుగంధప్రదీప్తుల
నెనయు చెంగల్వకే కీపొగాకు

గీ. జలధిపర్యంతధారుణీవలయనిలయ
పాంథసందోహమోహసంపత్కరంబు
నగుచు ధారుణి విలసిల్లె నందమైన
యించువిలుకానిచేతిబా కీపొగాకు.

క. మీరుం బొగ ద్రాగుదురా
వారిజభవ ! వామదేవ ! వైకుంఠ ! హరీ !
ఓరీ నారద ! వినురా
యీరేడుజగంబులకును నిది ముఖ్యమురా !

క. భుగభుగమని పొగ లెగయఁగ
నగణితముగ నాజ్యధార లాహుతి గాఁ గా
నిగమాదిమంత్రయుతముగఁ
బొగ ద్రాగనివాఁడు దున్నపోతై పుట్టున్

క. పొగగ్రోవికి సతిమోవికి
నగణితముగ నూరబావి కమృతంబునకున్
దగ నుచ్ఛిష్ఠత లేదని
ఖగవాహనుతోడఁ గాలకంఠుఁడు పల్కెన్.

చ పదపడి ధూమపానమునఁ బ్రాప్తములౌఁ బదుమూఁడు చేటులున్
మొదల ధనంబువోవుట నపుంసకుఁడౌట విదాహమౌటయున్
వెదకుచుజాతిహీనులను వేఁడుట తిక్కట చొక్కటల్ రుచుల్
వదలుట కంపువేయుట కళల్ దొలఁగించుట రిమ్మపట్టుటల్
పెదవులునల్లనై చెడుట పెద్దకులోఁగుట బట్టకాలుటల్.

---

## మూషకచక్రవర్తి.

సీ. నిర్ఛిద్రవిషయుక్తనిశితదంష్ట్రిలఁ బూని
భేదించు నెటువంటి గాదెలైన
దారుణోద్యద్దంతతతిచేత ఖండించు
గుఱుతుగా నెటువంటికోఁకలైన
పటుసురంగాగారఖరితంబుగాఁ ద్రవ్వఁ
బొంకాన నెటువంటిభూమినైన
కీచుకీచుధ్వని ప్రాచుర్యమహిమచే
వర్ణించు నెటువంటివారినైన
గీ. అతఁడు సామాన్యుఁడే నరేంద్రాలయాంత
రంతరానేకపేటికాక్రాంతవస్తు
హరణసురధాణి యవ్వినాయకుపత్రాణి
చారుతరమూర్తి మూషకచక్రవర్తి.

## మార్జాలచక్రవర్తి.

సీ. క్షీరఘటాంబుధిస్థితికుంభసంభవ
బహుమూషకోరగపక్షిరాజ
శునకకులమత్తేభనికరకంఠీరవ
శలభసంకులవనజ్వాలికీల
వృశ్చికదానవవిష్ణుసుదర్శన
వాయసమేఘదుర్వారపవన
కుక్కుటపర్వతఘోరవజ్రాయుధ
రౌద్రాంధకారమార్తాండతేజ
గీ. వ్యాఘ్రకులమాతులస్వామిశీఘ్రగమన
పైనములదొత్తి దొత్తులపాలిమిత్తి
రమ్యతరమూర్తి నఖరసంప్రాప్తకీర్తి
సకలగృహవర్తి! మార్జాలచక్రవర్తి.

---

## ఫుల్లకవి.

సీ. కోణంగి నాట్యముల్ క్రోఁతు లాడించఁగా
నూరఁబందులు సభ నున్నయట్లు
గూఁబకూఁతలు విని గువ్వలు తలలూఁచి
పోయి కాకులయొద్దఁ బొగడినట్లు
కాలువదరినుండి కప్ప లంకించఁగా
నెండ్రకాయలు తలలెత్తినట్లు
ఎనుబోతుబిరుదులు మనుబోతు పొగడంగ
మేలుమేలని గొఱ్ఱె మెచ్చినట్లుఁ

గీ. ఓగుదగిడీలు తమలోన నొకరి కొకరు
మెచ్చుకొనుచుందు రెటువంటి పిచ్చితనమొ!
మేలుమే లెట్టిగుణము నిర్మించినాఁడు
పుల్ల కవి నేలు గోపికావల్లభుండు.

సీ. దొరకైనకరణముతో విరోధము సెబ్ర
అతిలోభిమొండికి నర్థి సెబ్ర
పార్థివోత్తమునకు బహునాయకము సెబ్ర
పెనుఱంకుటాలికిఁ బిల్ల సెబ్ర
దాతకు రాజుకుఁ దామసంబులు సెబ్ర
వసుధ నిల్లాలికి వగలు సెబ్ర
ఘనుఁడైన విద్యాధికున కహంకృతి సెబ్ర
యరయ దుర్బుద్ధి యెవ్వరికి సెబ్ర

గీ. మిమ్ముఁగొల్వమి యన్నింట మేటిసెబ్ర
సెబ్రలెవ్వియు మిముఁ గొల్వఁ జేర వెఱచు
శైలకోదండకాండ! నిజాముకొండ
బాలగోపాల! రాధికాప్రాణలోల.

సీ. నరనాథవంశకాననము దహించుట
కవనీసురులవిత్త మగ్నికీల
జననాయకుల నిజైశ్వర్యాబ్ధి నింకింప
బ్రాహ్మణక్షేత్రంబు బాడబంబు
పార్థివోత్తములసంపచ్ఛైలములు గూల్ప
భూసురధనము దంభోళిధార
జగతీశ్వరులకీర్తిచంద్రిక మాప వి
ప్రోత్తమధనము సూర్యోదయంబు

గీ. విప్రతతిసొమ్ముకంటెను విషము మేలు
గరళమున కుర్విఁ బ్రతికృతి కలదుగాని

దానిమాన్పంగ నిల నౌషధములులేవు
కాన బ్రహ్మాస్వములు పట్టఁ గాదు పతికి.

---

## రాజ్యతంత్రము.

సీ. బ్రాహ్మణభూములపై నాస యుంచకు
దేవతాద్రవ్యంబు తెరువు పోకు
తగలంచగొండిని దగవరి సేయకు
కపటికి సత్త్రాధికార మియకు
గుడిపారుపత్తెంబు కడుభోగి కియ్యకు
చెనఁటికి నిండినసీమ యియకు
విత్తహీనులకును గుత్తలుకట్టకు
మఱి జారచోరుల మఱుఁగనియకు
గీ. నీచజాతులవారి మన్నింపఁబోకు
దుర్మదాంధుల వాకిలి ద్రొక్కనియకు
*　　*　　*
తలఁపు ధర్మాభివృద్ధి కావలయు నేని.
సీ. గాంభీర్యపరులను గడిదుర్గమున నుంచు
చతురుని సేనాధిపతినిఁ జేయు
పాయక సరసుల రాయబారులఁ జేయు
ముచితజ్ఞు దగ్గఱ నుంచికొనుము
మఱిధనాఢ్యత్ఖుల మణియగార్లను జేయు
మతిమంతుఁ గరణికమార్గుఁ జేయు
పరఁగ విశ్వాసులఁ బరిచారకులఁ జేయు
కరుణాన్వితుని గార్యకర్తఁ జేయు
గీ. సతతవిధ్యుక్తమతిఁ బురోహితునిఁ జేయు
నవరసాలంకృతుని మహాకవిని జేయు

షణ్మతజ్ఞానవంతు నాచార్యుఁ జేయు
వార్త కెక్కినకీర్తి కావలయు నేని.

సీ. శరణన్నశత్రునిఁ జనవిచ్చి రక్షించు
దీనులమనవులఁ దెలియ వినుము
విష్ణుభక్తులజోడు విడువక వర్తించు
మాధవుపై చింత మఱవఁ బోకు
పేదసాదుల నేలఁ బిలిచి రక్షింపుము
పలుచనిపలుకులు పలుకఁ బోకు
అన్నదమ్ములసొమ్ము లపహరింపఁగఁ బోకు
తలిదండ్రిహితవును దప్పఁబోకు

గీ. దయయు సత్యంబు మదిలోనఁ దఱుఁగనీయకు
పరసతులమీఁద భావంబు పాఱనీకు
భగవదర్పణకానిది పట్టఁబోకు
వెలయ మోక్షాభివృద్ధి కావలయు నేని.

సీ. నమ్మినవారల నమ్మి వర్తింపుము
నమ్మనివారల నమ్మఁబోకు
మఱి శత్రువులమీఁద మఱపించి దండెత్తు
కై జీతగాండ్రను గలుగ నేలు
పొడిచి గెల్చినవారిఁ బోనీక మన్నించు
వంచించు మన్నీల గొంచెపఱుచు
వెరపుమాలినవాని దొర సేయఁ బోకుము
పందను సేనాధిపత్యమియకు

గీ. చేరి చనవిచ్చి దాయల మీఱనియకు
నిక్కమైనట్టి రాణువలెక్క లెల్ల
నెలమి నశ్రద్ధ చేయక తెలియ వినుము
వెలయు భాగ్యాభివృద్ధి కావలయు నేని.

## అష్టకష్టములు.

---

సీ. ఆరయఁ బరదేశయాత్ర సేయుట యొండు
తనకుఁ దానే వండుకొనుట రెండు
కులసతి నెడఁబాసి తొలఁగిపోవుట మూఁడు
వెలయంగ యాచకవృత్తి నాల్గు
తనసరివారిపంచను జేరుకొను టైదు
గుఱుతెఱుంగనిరాజుఁ గొల్చు టాఱు
చదువు నేరకయుండి సభకుఁ బోవుట యేడు
నెన్న దారిద్ర్యంబు నెనిమిదవది
గీ. అష్టకష్టంబు లనియెడునవ్వి యివ్వి
గాన యిటువంటి వెవ్వరికైన వలదు
చారుతరమూర్తి! దేవతాచక్రవర్తి!
రమ్యగుణధామ! కావేటిరంగధామ!

క. ఆడిన మాటలు దప్పిన
గాడిదకొడుకంచుఁ దిట్టఁగా విని యయ్యో!
వీఁడా నా కొడుకని
గాడిద యేడ్చెం గదన్న ఘనసంపన్నా!

క. అసమాన దానవిద్యా
రసికత లేనట్టివరుని బ్రదుకేటికి నీ
కస వేఱుక తిని బ్రదుకదె
పసరము తనకడుపు నిండఁ బర్వతకొండా!

క. సమశీలశ్రుతియుతులకు
సమధనవంతులకు సమసుచారిత్రులకున్

దములోన సఖ్యము వివా
దము దగుఁగా కసములకును దగునే యెందున్?.

క. కోటానకోటు లిచ్చినఁ
గూటికి సరిరాదు దేవకోటులు రారా
పాటించి యజ్ఞవాటికిఁ
గూటికి మారెళ్లకొండ! గుణరత్ననిధీ!.

క. అనిఁ బాటిన విధి నవ్వును
ధనసంపద నవ్వు నుచితదానవిహీనున్
దనయుని ముద్దాడంగాఁ
బెనిమిటిఁ గని జార నవ్వుఁ బిచ్చయశేచా!

క. పదివేలమంది కిచ్చియుఁ
దుద కొక్కని కీయకున్న చౌరకవు కీర్తుల్
పదివేలు నోము నోఁచిన
వదలదె యొకఅంకు వంక ఎన్నియసుంకా!.

క. ఇప్పటియన్నము కొఱకై
త్రిప్పలఁ బడి కుంద నేల? దేవుఁడు శిలలోఁ
గప్ప కొసంగెడు హారము
కుప్పలుగ మహేంద్రవాశ! గోకర్ణేశా!.

క. చెప్పినపని యొనరించిన
యప్పణఁతుక గల్గుగహన మది సదనముగున్
జెప్పినపని యొనరింపని
యప్పణఁతుక కల్గుసదన మది గహనముగున్.

## గువ్వలచెన్ననిపద్యములు.

క. అడుగఁ దగువారి నడుగక
బడుగుల నడుగంగ లేమిఁబాపం గలరా!
వడగళ్లఁ గట్టువడునా
గుడి రాళ్లను గట్టుకున్న గువ్వలచెన్నా.

క. సారాసారము లెఱుఁగని
బేరజమును బుద్ధిసెప్పఁ బెద్దలవశమా?
నీరెంత పోసి పెంచినఁ
గూరౌనా నేలవేము! గువ్వలచెన్నా!.

క. కలిమిగలవాఁడె మనుజుఁడు
విలసితసత్కీర్తిచేత వెలయఁగవలదా?
కలిమేమి యెల్లకాలము
కులగిరులా కదలకుండ? గువ్వలచెన్నా!.

క. కలిమిగలలోభికన్నను
విలసితముగఁ బేద మేలు వితరణియైనన్
జలిచెలమ మేలుగాదా
కులనిధి యంభోధికన్న? గువ్వలచెన్నా!.

క. విలువరుస దానగుణములు
గలవారికిఁ గాక లోభిగాడ్దెలకేలా!
తలు పేల చాఁపగుడిసెకుఁ?
గులపావనకీర్తిసన్న! గువ్వలచెన్నా!.

క. వెలివిద్య లెన్నియైనను
గులవిద్యకు సాటిరావు కుంభినిలోనన్
వెలకాంత లెందఱున్నను
గులకాంతకు సాటిరారు గువ్వలచెన్నా!.

క. తల లెంతపెంచుకొన్నన్
కులధర్మము విడిచి కన్నకూళ్లుం దిన్నన్
గలుగదు మోక్షము చిత్తము
విలయము గాకున్న బిజనవేములచెన్నా!.

క. ఎన్నఁగల జీవరాసుల
నన్నిటిగర్భమునఁ బుట్టి యట మనుజుండై
తన్నెఱిఁగి బ్రదుకవలెరా
కొన్నాళ్లిఁక నెచటనున్న! గువ్వలచెన్నా!.

ఉ. వారక యీశ్వరుండు తలపై ధరియించినయంతమాత్ర న
న్వారిజవైరి తోడ సరివత్తువె యుష్మితప్రావ! నీపసన్
వారిధు లుబ్బునో దెసలు వన్నెలఁ దేరునొ చంద్రకాంతముల్
నీరవునో చకోరముల నెవ్వగ దీఱునొ తాప మాఱునో!.

ఉ. పీనసరోగి నిన్నుఁ దిలపిష్టసమానము చేసినంత నే
వానివివేకహీనతకు వందుఱ నేల కురంగనాభమా!
మానవతీకపోలకుచమండలమండితచిత్రపత్రికా
నూనవితానవాసనల నొందుట లోకము నిన్నెఱుంగదే!.

ఉ. ఎవ్వఁడ వీవు కాళ్లు మొగ మెఱ్ఱన? హంసమ; నెందు నుందువో?
దవ్వుల మానసంబునను; దాన విశేషము లేమి తెల్పుమా?
మవ్వపుఁగాంచనాబ్జములు మౌక్తికముల్ గల వందు; నత్తలో?
యవ్వి యెఱుంగ; మన్న నహహా! యని నవ్వె బకంబు లన్నియున్.

మ. ధర నత్యుత్తముఁ డైన ధీరునిమనస్తాపంబు దీర్పంగ స
త్పురుషానీకమ యోపుఁగాని యొక యల్పుం డోపునే తీవ్రదు
స్తరనైదాఘవిదాహతాప మడఁపన్ ధరాధరాంచద్రసో
త్కరధారావళి గాక యర్హ మగునే గండూషతోయంబులున్?

ఉ. చేతికి వచ్చుకార్య మెడసేసితి వర్థులు శత్రులైరి యిం
కేతరినైనఁ గార్యము ఘటించెదనన్న ఘటింపనీవు నీ

చేఁతగునట్టిచెయ్దమును జేసితి వింతియకాక యింక నా
వ్రాఁతో కయింత మార్పఁ గలవా గ్రహచారము! దుర్విచారమా!.

ఉ. కా దనిపించుకోఁదగదు కానిగుణంబు వహించి లోభిచే
లే దనిపించుకోఁదగదు లేనిదురాశకుఁ బోయి యిందురా
రా దనిపించుకోఁదగదు రట్టడియై కరి నెక్కి దిడ్డిదూ
ఱే దదియెంత? తుంపెరపురీహనుమంత! నితాంతవైభవా!

చ. ఎనయఁగ హీనుదంట జలమింతయు నిల్వని పాడుగుంట నీ
చునకుఁ బదార్థ మంట తనుఁ జూచి సహింపనియూరనుంట లే
దనియెడు చేనిపంట వెసనాఁకటికందనిపంట మంటకా?
జనకసుతాభిరామ! బుధసన్నుత! శ్రీపెనుమళ్లరాఘవా!

చ. కరిగమనల్ దురాత్ములనె కాని రమింపరు హీనజాతి కా
పురుషులఁగాని భూభుజులు ప్రోవరు కానలఁగాని మేఘముల్
కురియవు సత్యశౌచములకుం బెడఁబాసినవానిఁగాని యిం
దిర వరియింప దుర్వ్యయవినీతులఁ గాని భరింప దెంతయున్.

చ. పిలువనికూటికిన్ వెతలఁబెట్టుధరాపరుఁ డేలువీటికిన్
జలములు లేనియేటికిని సారెకు బందుగు లున్నచోటికిన్
బలువురతోటిపోటికి నృపాలురసాటికిఁ బోవరాదయా
బలవదరీ! దరీకుహరభాస్వదరీ! యదరీదరీహరీ!

ఉ. తంత్రులులేనివీణయును దానమురాగము లేనిగీతమున్
మంత్రములేనిసంధ్యయును మానములేనితపంబు వేదవి
ట్తంత్రములేనియాగముఁ బదజ్ఞతలేనికవిత్వతత్త్వమున్
మంత్రులులేనిరాజ్యము సమానము లియ్యవి దుష్ప్రియోక్తముల్.

ఉ. గంధపుఁ జెట్టుక్రింద నురగంబు పయోనిధి బాడబాగ్ని మా
కందఫలంబుక్రింద నొకకంగురుదుంప జగద్విలోకనా
నందము మేఘునందుఁ బవి నాఁచినమాడ్కి నకారణంబుగా
నుందురు దాతసన్నిధి నయోగ్యులు కొందఱు మల్లికార్జునా!

ఉ. చూతఫలావతంస! నినుఁ జూచిన గన్నులపండు వయ్య! లో
పాతిశయంబునన్ బరిమళాన్వితమయ్యె దిశౌఘమెల్ల వి
ఖ్యాతియొనర్చె నీగుణము లైనను గల్గదు నాకు నెమ్మదిన్
గౌతుక మెప్డు నీహృదయకర్కశభావము జూడఁజూడఁగన్.

---

## శరభాంకలింగమా

చ. పెనిమిటికిం దలారికిని బిమ్మటివారికి బంధుకోటికిన్
వనరుహనేత్ర తా వెఱచి వాకిటి కేఁగదు గాక! యాత్మ నె
వ్వని మఱి పొందరాదె బలవంతపుఁ గాఁపులు వెట్టి కామినీ
జనముల నేలువారు నెఱజాణలయా శరభాంకలింగమా!

చ. పోరిఁ బోరి మేఁకమాంసములు బొక్కుచు నిక్కుచు సోమయాజియై
సురపురి కేఁగి రంభకడఁ జొక్కుచు సోలుచుఁ గామయాజియై
ధరణికి డిగ్గి యిండ్లఁబడి తండులమెత్తుచుఁ గర్త యాజియై
పోరిఁదిరుగాడుకాని మిముఁ జూడఁడయా శరభాంకలింగమా!

ఉ. గారుడమంత్రసిద్ధుఁ డురగంబులచేఁ గఱపించుకొన్నఁ ద
ద్ఘోరవిషంబు లెక్కవఁట కుంభినిలో శివమంత్రసిద్ధుఁడై
జారవినోదియై విషయసంగతిఁ జెందినఁ జెందుఁగాక యా
పూరితమోహపాశములఁ బొందఁడయా శరభాంకలింగమా!

ఉ. కండలు వహ్నిదేవునకుఁ గాలినయెమ్ములు భూమిదేవికిన్
పండినకూడు కాకులకు వాతిహిరణ్యము చీరమాలకున్
నిండినసొమ్ము భూపతికి నిత్యము ప్రాణము మృత్యుదేవికిన్
మిండతెయాలు వన్యలకు మేదినిలో శరభాంకలింగమా!

ఉ. వండెడువాని సత్కవిని వైద్యుని మంత్రిని దంత్రవాదినిన్
గొండెముపల్కువాని రిపుఁ గూడినవాని ధనేశునిన్ మహీ

మండలమేలువానిఁ దనమర్మ మెఱింగినవాని నిష్టునిన్
ఖండితమాడునే నదియు గండమయా శరభాంకలింగమా

---

## భైరవా.

చ. కలిగినవానియింట శుభకార్యముగల్గినఁ గీడుగల్గినన్
బిలువకమున్నె బాంధవులు పెల్లుగఁ బోయితదంగమంతయున్
దెలుపుచునుందు రాతనికి దీనునియింట శుభంబె కల్గినన్
బలుమఱుఁ బిల్చినప్పటికిఁ బల్కరుగా రెవరైన భైరవా!

చ. పరువుగ్రహింపనేర కొకపాటిదురాత్ముఁడు మించనాడినన్
సరసు లెఱింగి మాఱ్కొనక సైఁచినయంతట నైచ్య మేలగున్?
అరుదుగవచ్చుమార్గమున కడ్డముగా నొకకుక్క వచ్చినన్
గఱచినఁ గోపగించి కరి కర్వగరాదుగదయ్య భైరవా!

గీ. ఇఱుకరాదు చేతి నిసుమంత నిప్పైనఁ
గొఱుకరాద యినుము కొంచెమైన
నఱుకరాదు నీళ్లు నడిమికి రెండుగా
తెఱుకరాదు బావి పెళ్లగిలఁగ.

ఉ. ఎక్కడి కేఁగెదో వడుగ! యేఁగెద బెండ్లికి; మాడ లేవిరా?
నిక్కము నాల్గు చేఁగలవు; నీకటరా యవియేవి చూపుమా;
యొక్కటి త్రోవలోఁ గనెద నొక్కటి కొక్కరిఁ బూటపెట్టెదన్
ఒక్కటి తప్పనెంచెద మఱొక్కటి లే దని కొక్కరించెదన్.

సీ. పోఁకలు నమలుచు నాకులు చేకొని
సున్న మడ్గినవాఁడు శుద్ధవిధవ
ఇద్దఱు నొకచోట నేకాంతమాడంగ
పద్ద జేరినవాఁడు పట్టివిధవ

ఆలితోఁ గలహించి యాఁకలి కాదని
పస్తున్నవాఁ డొక్క పంజివిధవ
వారకాంతలయిండ్ల వాసంబుచేయుచు
మగువకేడ్చెడువాడు మడ్డివెధవ
చదువుచెప్పినజీత మదనులో నీయక
మిటకరించెడువాడు మేటివిధవ
త్రోవబోయెడు స్త్రీలతో మొగంబిగిలించి
ముచ్చటాడెడువాఁడు ముష్టివిధవ
కట్న మిచ్చెద నని కాలమందీయక
గోళ్లు గిల్లెడువాడు కొంటెవిధవ
ఇంటి అంకెఱుఁగక యిరుగుపొరుగుఅంతు
వెంటాడువాఁ డొక్క యంటవిధవ
దారిద్ర్యములనుండి తనపూర్వసంపద
లూరకతలఁచువా డుత్తవిధవ

... ... ... ... ... ...

ఉ. శ్రీకరమూర్తి! హరిగుణశేఖర కొమ్మయమంత్రి తిక్క! నీ
రాకలుగోరుముగ్ధ కనురాగము మీఱిన మన్మథాగ్నిచేఁ
బ్రాకటమైనపుత్త్యములు భస్మములాయెను వేగ రావనా!
యాకులుపోఁకలుం గలుగ నంతియె చాలును సున్న మేటికిన్?.

చ. అసదృశగంధబంధుర మటంచు వడిన్ జనుదెంచి కేతకీ
ప్రసవమునందుఁ జెంది మకరందము పెంపమిఁ గ్రోలలేమికిన్
దెసచెడి కుందనేమిటికిఁ దేఁటి! యరాళకరాళకంటక
ప్రసవముచే భవత్తనువు వ్రయ్యక వచ్చిన మేలు చాలదే!

మ. తవణింతున్ నుతి కాలకంఠమకుటాట్టాల ప్రతోళీమిళ
త్స్రవమానామరసింధుబంధురపయస్సంభారగంభీరవా
గ్వ్యవహారైకధురంధరత్వమున జిహ్వాలోలము త్తల్లికిన్
జవికిం దల్లికిఁ గారవెల్లికధనుర్జ్యావల్లి నీరుల్లికిన్.

మ. రవణింతుర్ నుతి దైవతప్రమదదార్ఢ్యబిన్నోహినీసీరభృ
చ్ఛ్రవమానామృతశీకరాఘనవబీజప్రాంతరౌపమ్య స
ద్భవనాజాండను షడ్రసప్లుతసముద్యత్సాన్వాదుమత్ఖండకున్
అవితుంగోద్భవకాండకున్ బ్రబలరేఖాదండ కాదొండకున్.

ఉ. తూరుపునాఁటికుత్రియులతోఁ రపుబాంధవలీల యద్భుత
స్ఫారవిలాసమంగును వివాహమహోత్సవముల్ నిరన్నస
త్కారపరిగ్రహంబు లవిభాయకకల్పితవిద్విషత్క్రియా
హారము లన్యవర్ణజనవర్ణితహాస్యరసాలవాలముల్.

---

## అత్తింటి కోడలు.

సీ. పొరుగిళ్ళఁ గూర్చుండి ప్రొద్దు పుచ్చఁగనేర్చు
 నీలాటిరేవున నిల్వనేర్చు
అత్తాఁడుబిడ్డల నాడిపోయఁగ నేర్చు
 గూర్చుండి నట్టింట గొణుగనేర్చు
పనివేళ మూల్గుచుఁ బండుకుండఁగ నేర్చు
 జెంపను సున్నంబు నింపనేర్చు
పసిబిడ్డ లేడ్వంగ విసరి కొట్టఁగ నేర్చు
 నొకరెండుపస్తులు నుండనేర్చు
గీ. పెల్లుపెల్లన మెటికలు విఱువనేర్చు
సెవ్వరును నాకు లేరని యేడ్వనేర్చుఁ
బుట్టినింటికిఁ జెప్పకోఁ బోవ నేర్చు
నవుర! యత్తింటికోడలి యవగుణములు!

సీ. వాలము నులిచియు నేలఁ గాళ్లణఁచియు
 ధాత్రిపైఁ బొరలియుఁ దాల్మి విడిచి

వదనంబు తెఱచియు నుదరంబుఁ జూచియుఁ
బెక్కుపాటునఁ బడ్డఁ గుక్క కొక్క.
కడిమాత్రమన్న మాఁకలిదీఱ నిడఁబోరు
నాగంబునకుఁ బ్రార్థనంబుతోడ
కబళశతంబులు కరమున కందీయ
నాఁకలిదీఱఁగ నదిభుజించు

గీ. ఎంతవేఁడిన హీనున కివ్వ రీరు
ఇచ్చిరేనియుఁ గడుఁ గొంచె. మెచ్చులేదు
ఘనున కూరక యుండినఁ గాంక్షదీఱ
గురుతరార్థంబు లిత్తురు ధరణిపతులు.

గీ. పౌరుషజ్ఞానకీర్తులఁ బరఁగనేని
వానిజన్మంబ దొక్కపూ సైనఁ జాలు
నుదరపోషణమాత్ర మీయుర్వి మీఁదఁ
గాకి చిరకాలమున్న నేకార్యమగును?.

---

## నియోగులు.

గీ. భాగ్యవశమున బుద్ధిసంపన్నుఁ డగును
బుద్ధిబలమున నృపులకుఁ బూజ్యుఁడగును
నృపులు మన్నింప నయకళానిపుణుఁ డగును
పూని రాజ్యము నడుపఁ బ్రధానుఁడగును.

ఉ. వ్రాలివిగోఁ గనుంగొనుము పన్నియమీఱఁగ వ్రాలకేమి నా
వ్రాలు సుధారసాలు కవిరాజులకెల్ల మనోహరాలు వ
జ్రాలు సరస్వతీవిమలచారుకుచాగ్రసరాలు చూడఁ జి
త్రాలు మిటారిమోహనకరాలు నుతింపఁ దరంబె యేరికిన్?.

ఉ. మేదినినాథుఁ డల్గినను మించినకార్యము చక్కసేయ స
మ్మోదమెలర్పఁగా గణకముఖ్యునిసఖ్యము లెస్స యెట్లనన్

ఆదటఁ గాలుఁ డల్లియు గతాయు ఐటన్నను జిత్రగుప్తుఁ డా
'గా' దొలఁగించి 'శా' మొదట గ్రక్కునవ్రాసి సజీవుఁ జేయఁడే.

చ. హరిహరి! యేమి సాంబశివ! అయ్య! భయంపడి పల్కనోడదన్
అరమరలేల పల్కు; భవద గ్రపురంధ్రి పెదక్క యేదయా?
సిరికిని దానికిం బడక చీఁదరయె త్రిఁగఁ జింతపల్లెలో
వరకరణాలయిండ్లకడ వారక యున్నదయా యుమాపతీ!

క. అధికార మబ్బినప్పుడు
బుధులు ప్రమోదించి వీఁడె పురుషోత్తముఁ డం
చధికంబుగ గొనియాడెదు
విధమున వర్తింపఁ దరమె వేల్పులకైనన్?.

మ. విధిసంకల్పముచే నొకానొకఁడు తా విశ్వంబుపాలించుచో
బధిరం బెక్కువ చూపు తక్కువ సదా భాషల్ దురుక్తుల్ పనో
వ్యధతో మత్తతతోడ దుర్వ్యసనదుర్వ్యాపారతం జెందు న
య్యధికారాంతమునందుఁ జూడవలదా యాయయ్యసౌభాగ్యమున్.

క. ఉద్యోగ మొదవినప్పుడు
సద్యోమదమొదవి పూర్వసరసత లుడుగున్
విద్యావంతున కైనను
విద్యాహీనునకు వేఱె వివరం బేలా!

సీ. బళిబళీ! మాతాతబల్లెంబుచేఁబూని
పుల్లాకుతూటుగాబొడిచినాఁడు
ఎద్దుచ్చపోయంగ జేఱులై పాఱంగ
లంకించి లంకించి దాటినాడు
కలుగులోనూ కప్ప గబ్బుగబ్బు మనంగ
కట్టారి తీసుక గదిమినాడు
నాగలాపురికాడ నక్క తరుకురాగ
తిరువళూరూకాడ తిరిగినాడు

ఎలుక యెదురుకురాఁగ నీవె చేతనుబూని
యేడాఱుబాగులు యెగిరినాఁడు
గీ. ఔర! వీనిపరాక్రమం బద్భుతంబు
* * *
* *చిన్నపత్మాతలేంద్ర!

---

## భారతకథనుగూర్చి చాటువులు.

ఉ. ధీరతతోడ నీరథము దీవ్రగతిన్ గురురాజుసేనపై
శూరతఁ బోవనిమ్ము ననుఁ జూడుము పేర్చి తదీయయోధులన్
బేరడఁగించి యాపసులఁ బెంపెసలార మరల్పకున్న నా
పేరు కిరీటియే నినదభీషణశంఖము దేవదత్తమే!
ఉ. సారథిగమ్మి యుత్తరుఁడ! చాలు జయించెద నింద్రునైన నా
బారికి నడ్డమైన మును బ్రహ్మలిఖించిన వ్రాలు తప్పునే
ధీరత శంఖనాదమున దిగ్విజయంబును జేయకున్న నా
పేరు కిరీటియే నినదభీషణశంఖము దేవదత్తమే!
ఉ. నీరజనాభ! నీవు చని నెయ్యముతో మనపాలు వేఁడఁగాఁ
గౌరవు లీకతక్కినను గాఢనిరంతరచండముండితో
దారదురంతదంతురశితాస్త్రిపరంపర లేయకున్న నా
పేరు కిరీటియే నినదభీషణశంఖము దేవదత్తమే!
ఉ. వారిజనాభ! యొల్లి చని వాసవుఁ డక్షము ఇచ్చి నిల్చినన్
వారిజబాంధవుం డపరవారిధిఁ గ్రుంకకమున్న సైంధవుం
జేరి శిరంబు ద్రుంచి ధరణీస్థలికిం బలిసేయకున్న నా
పేరు కిరీటియే నినదభీషణశంఖము దేవదత్తమే!

ఉ. పాఱెడుభీముఁ బట్టుకొని పట్టి శరంబున నూని నవ్వి ని
ష్ఠూరము (?) లాడినట్టి రవిసూనుని ధర్మజ! నీవు చూడఁగా
ఘోరరణంబులో నెదిరి గుండెలు వ్రక్కలు సేయకున్న నా
పేరు కిరీటియే నినదభీషణశంఖము దేవదత్తమే!

ఉ. పా లడుగంగఁ గౌరవులపాలికిఁ బోవ నతండు లోభియై
పా లది యేడదో యనినఁ బాలుతెఱం గెఱుఁగంగ భీమభూ
పాలునిపాలు తాను తనపాలిటిరాజ్యము నన్నపాలు నా
పాలు సమస్తసైన్య మని పల్కుము పంకజనాభ; యచ్చటన్..

సీ. చరణారవిందము ల్స్మతి మది నెంచి
ముమ్మాఱు రాజును మ్రొక్కెరనుము
వచ్చినవైరంబు వారింప నూహించి
మాభూము లిమ్మను మనుజవిభుని
ఆరీతి నృపతికి హర్షమ్ము గాకున్న
నేవురి కైదూళ్లనీయు మనుము
పుడమీశుఁ డామాట కొడఁబడకుండెనా
నడవడి యొజ్జఁగించి నడుపుమనుము
గీ. పనులు సేయంగ నేదేనిఁ బంపు మనుము
పంపు పనిసేయ సేవకభటుల మనుము
ధర్మమార్గంబు వినబుద్ధి దనర దేని
కదలిరమ్మను కలనికిఁ గమలనాభ!

మ. పదరుల్ పల్కక ధర్మశాస్త్రగతి భూభాగమ్ము మారాజ్యసం
పద మా కిమ్మను మీయకుండిన మహాబాహాబలస్ఫూర్తి మై
యొదురై రమ్మను వచ్చి మద్బలము దా నేపారఁగాఁ జూచుచో
గదఘాతంబుల నూరువుల్ దెగిపడున్ గంజాక్ష! యింతేటికిన్?

మ. కలహం బేటికి పెద్దపెద్దను మిటుల్ గర్వాంధుఁడై మమ్ముఁ దా
జాలకం జూచుట నీతిగా దనుమ యీ క్షోణీతలంబందునన్

నిలుపన్నేరఁ డధర్మవృత్తి ననుమా నీ విన్నియుం బల్కితిన్
బలవద్వైరమె ఘోర దుర్మరణముల్ ప్రాపించు నంచాడుమా!.

శా. పాండవులన్న దైవమును పౌరుషముం గలవారు వారికిం
గొండొక కీడుచేసి నిలఁగూడదు కూడనిలోభ మూని వీ
రిండితనంబునన్ ధర హరింపనె చూచెద వేని వారు నిన్
బిండలివం డొనర్తు రని పేర్చి యథార్థ మెఱుంగఁ జెప్పుమా!

ఉ. మచ్చరమేల కర్ణ! విను మానవు లర్జునితోడివారలా?
రచ్చల మెచ్చు లాడెదవు రాజును దమ్ములు నిచ్చ మెచ్చఁగా
వచ్చినవాఁడు ఫల్గునుఁడు వాని నెదుర్కొను యోధఁ జూడుమా
చెచ్చెర నూర జోగులకు శేషునికంఠము లంటవచ్చునే!

క. వరమునఁ గుంతికి సుతుఁడై
వెరవెఱుఁగక యేటివరద విడిచినపిదపన్
ధరయెల్ల నేలెఁ గర్ణుఁడు
దరిఁ జేర్పను గూడుపెట్ట దైవము గాదే!

గోలకొండ మాలముండ పూలదండ కొత్తకుండ అనుపదములతో భారతకథకు సంబంధించునట్లు చెప్పఁబడినపద్యము

గీ. ఓయికురురాజ! నీకొడు కుత్తగోల
కొండవలెనుండు తృణ మాల ముండ డిఁకను
భండనంబున గెల్తురు పాండుసుతులు
ఉదరమునఁ బూలదండ రే కొత్తకుండ.

## పాండవు వర్తనము.

సీ. ఇభపట్టణంబున కేగునాఁటికి ధర్మ
రాజు పదాఱువర్షములవాఁడు
వాయుజుండు పదేను వత్సరంబులవాఁడు
పదునాలుగేండ్లు విశ్వమ్మునకును
పరికింపఁ గవలకుఁ బదుమూఁడు వర్షముల్
జననీసమేతులై సౌఖ్యముండి
విద్యలు నేర్చిరి వెసఁ బదుమూఁడేండ్లు
లక్క-యింటాఱు నెలలువసించి
రిరవుగా నార్నెల లేకచక్రమునందు
నేఁడాది ద్రుపదుని యింటనుక్క-
విదువత్సరములు యౌవరాజ్యంబున
నిరువదిమూఁడేండ్లు నింద్రపురిని
వనము నజ్ఞాతంబు చనెఁ బదుమూఁడేండ్ల
నటమీఁద ముప్పదియాఱునేండ్లు
రాజ్యాభిషేకంబు రాజు లెల్లను గొల్వ
ధర్మంబుతో మించి ధాత్రిఁ బ్రోవు
శ్రీకృష్ణుకృపకల్మి సిద్ధసంకల్పత
నష్టోత్తరశతహాయనము లుర్విఁ

గీ. జెలఁగి పట్టంబు తుదఁ బరీక్షితున కొసఁగి
సోదరులు సతి జతగూడి సారిది దివికి
నరిగి వేడుక స్వర్గసౌఖ్యంబు గనిరి
పాండవులు వారియశ ముర్వి నిండివెలసె.

గీ. కర్మ మెవరికైనఁ గడఁ ద్రోవఁగారాదు
ధర్మరాజుఁ దెచ్చి తగనిచోటఁ
గంకుభట్టుఁ జేసెఁ గటకటా! దైవంబు
ఏమిచేయవచ్చు నీశ్వరాజ్ఞ!.

గీ. కష్టవేళలందుఁ గమలాసనునకైన
ననుభవింపవలయు ననిలసుతుని
వంటపూటివానివలెఁ జేసె దైవంబు
ఏమిచేయవచ్చు నీశ్వరాజ్ఞ!.

గీ. పాటు తప్పదు సుమి బ్రహ్మాదులకునైన
నీడుగానిచోట నింద్రతనయుఁ
బేడివానిఁ జేసి పెట్టఁడా దైవంబు
ఏమిచేయవచ్చు నీశ్వరాజ్ఞ!.

గీ. అనువుగానివేళ నధికుల మనరాదు
కాల మెఱిఁగి రీతిఁ గడపవలయు
విశ్వమేలునతులుఁ డశ్వశిక్షకుఁ డాయె
నేమిసేయవచ్చు నీశ్వరాజ్ఞ!.

* * * *

గీ. పూర్వజన్మకృతము పోవ దెవరికైన
మాన్పరాదు దైవమాయచేత
ద్రౌపది యొకయేఁడు తగనిబాములఁ బడె
నేమిసేయవచ్చు నీశ్వరాజ్ఞ!.

---

## తెలుఁగుభారతము.

సీ. ఆదిపర్వము వసు, నరయంగ సభ నేత్ర
మారణ్య మద్రి, విరాట శరము

నుద్యోగ వారిధి, యొనరంగ భీష్మాగ్ని
శరద్రోణ, కర్ణాగ్ని, శల్య నేత్ర
సౌప్తిక మిథునంబు, సతిబాహు, బుతుశాంతి
యానుశాసనిక మే, వశ్వమేధ
మునునాల్గు, యాశ్రమంబును యుగళంబునౌఁ
బరఁగ మౌసల మొండు, ప్రస్థ మొకటి

గీ. స్వర్గ గమనంబు చంద్రుతో సాటివచ్చు
వలయ నీరీతి సర్వంబు వెరసిసేయ
వరుస వర్వదిమూఁట నాశ్వాసములను
దెలుఁగుభారత మలరు విస్తీర్ణ మగుచు.

క. వ్రాలా తప్పులు సెబ్రలు
చాలంగల వేనుశబ్దసంగతు లెఱుఁగఁ
గేలింబెట్టక తిట్టక
పోలంగా దిద్దరయ్య బుధజనులారా!.

క. చేతప్పు నెఱుకమఱపును
నేతెఱఁగునసైనఁ గల్గు నెవ్వరికైనఁ
వ్రాఁతం దప్పులుగల్గిన
బాఁతిగదిద్దుకొనుఁడయ్య పండితులారా!

గీ. వ్రాతతప్పువలన వాచకు లలుగక
తప్పుగల్గెనేని తగినయెడల
వలయునక్షరములు వర్ణించి నిలుపుఁడీ
సుకవులయినవారు సురుచిరముగ.

చాటుపద్యమణిమంజరి

సమాప్తము.

---

చెన్నపురి: 'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము. 1924

చక్కగ పరిష్కరించి అనేక నూతనవిషయములు, భూగోళచరిత్రాంశములు, పటములుఁ జేర్చి మంచికాగితములపై పెద్దక్షరములతోఁ జక్కఁగఁ బ్రకటించియున్నాము. సాధారణ ప్రతి రుప్య. 0-8-0. మేలు ప్రతి రుప్య. 0-12-0.

# చాటుపద్యమణిమంజరి. 1, 2, భాగములు.

శ్రీ వేటూరి. ప్రభాకరశాస్త్రిచే సమకూర్పఁబడినది. ఇయ్యది ప్రాచీనాద్భుతచాటుపద్యరత్నమాలకూర్పు. కథా వృత్తాంతములు చక్కఁగా వ్రాయఁబడినవి నీతి శృంగార హాస్యయుక్తిచమత్కారగర్భితము లయినవి; చాటుధారలు, ఒక్కొక్కపద్యము లక్షవరహాలు!! శ్రీకృష్ణదేవరాయలు చాకలికి జవిూరొసఁగుట మొదలగు చరిత్రవిశేషములును గలవు. ప్రథమభాగము మొదటికూర్పుప్రతులన్నియు చెల్లి పోయినందున ఇంకను అనేక నూతనచరిత్రాంశములు, 750 క్రొత్తపద్యములఁ జేర్చి పునర్ముద్రణము చేసినారము. ప్రతి 1-కి రుప్య. 1-4-0. రెండవభాగము ప్రతి 1-కి రుప్య. 1-10-0.

# శ్రీ మహాభక్తవిజయము.

ఇదివఱకు మన ఆంధ్రభాషలో సర్వాంగసుందరమైన ...ము ప్రకటింపఁబడియుండలేదు. శ్రీపాద సుబ్ర...గారిచే వ్రాయించి ఈ మహాభక్తవిజయమును ... శ్రీ శాస్త్రిగారి ముద్దులు మూటగట్టు ...రమగు వర్ణనాక్రమము ఆంధ్రదేశీయులకు ... రెండవకూర్పున అనేకుల భక్తులచరిత్రలు ...త్తగ చేర్చినారము. ప్రతి 1-కి రుప్య. 4-0-0

216

## వేమనపద్యములు, 3060.

## తాత్పర్యసహితము.

ఆబాలగోపాలము తెలియునట్లు తేటతెల్లపు భాషలో తాత్పర్యముతో మంచికాగితములమీఁద ముద్రించి ప్రకటించినారము. చక్కనికూర్పు. ప్రతి 1-కి రు. 3-8-0.

## భారతరమణీమణులు, 1, 2, భాగములు.

ఇది శ్రీ శ్రీపాద. సుబ్రహ్మణ్యశాస్త్రిగారిచే వ్రాయఁబడినది. స్త్రీవిద్య నాదరించువా రెల్లరును గౌరవింపఁదగినగ్రంథము. ఇందు సావిత్రి, శకుంతల, దమయంతి, వీరాబాయి, చంద్రమతి, దుర్గావతి, లోపాముద్ర, అనసూయాదేవి, అరుంధతి, మీరాబాయి, సంధ్యావళి, కర్మాబాయి, సుముఖి, సురభి, అసామాన్యమున్నగు స్త్రీరత్నముల చారిత్రములు చక్కఁగ వర్ణింపఁబడియున్నవి.

ప్రథమభాగము 0-12-0. రెండవభాగము 0-8-0.

## యజుర్వేదకథాసంగ్రహము.

ఇందు యజుర్వేదము (సంహిత, బ్రాహ్మణము) వైదికములగు కథలన్నియు సంగ్రహముగ తేటతె
వివరింపఁబడియున్నవి. గొప్పవిద్వాంసులుగూడ
లెన్నియోకలవు. వినుటకు సొంపుగ నుండును. ఎ
దగినది. వెల ప్ర

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు 

292, ఎస్ప్లనేడ్

5

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపత్రిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA103B105 |
| పుస్తకం పేరు | ధాతుపద్యమణిమంజరి |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | NO |
| వెనుక అట్ట | NO |
| మొత్తం పేజీలు | 225 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | NO |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | Bargavi |
| పేజీలు విడదీసినది | Lakkiya |
| స్కాన్ చేసినది | U Nagesh |
| పరీక్ష చేసినది | SARANYA |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |